UNIVERSAL LIBRARY
OU_204647
UNIVERSAL LIBRARY

OUP—556—13-7-71—4,000.

**OSMANIA UNIVERSITY LIBRARY**

Call No. T83/L19K Accession No. T1452

Author లక్ష్మీనరసింహము నాచిలకమ్మ గారు,

Title కర్పూరమంజరి, మొదటి భాగము

1954

This book should be returned on or before the date last marked below.

# కర్పూరమంజరి

## మొదటి భాగము

ఇది

చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే

రచియింపఁబడినది

పునర్ముద్రణ 1000 ప్రతులు

పబ్లిషర్సు:

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు

పబ్లిషర్సు అండ్ బుక్ సెల్లర్సు

రాజమండ్రి

1954

కాపీరైట్ రిజిష్టర్డు] [వెల 2—0—0

రాజమహేంద్రవరమున
శ్రీ కొండపల్లి ముద్రాశాలయందు
ముద్రింపబడియె.

# కర్పూరమంజరి

## మొదటి ప్రకరణము.

"అహాహా! జన్మస్థానవియోగదుఃఖము దుస్సహము గదా! ఆలుబిడ్డల, నన్నదమ్ముల, నాప్తబంధుమిత్రుల, విడుచుట యెంత కష్టమో, స్వదేశమును విడుచుటయు నంతకష్టమె. వేదాంతశాస్త్రజ్ఞులీ యనురాగ మజ్ఞానజనిత మనియు, మమత్వము లేనివారలే విజ్ఞానులనియుఁ జెప్పుదురు. కాని యదియొప్పుకొనఁదగినమాట కాదు. ప్రపంచమున నరుఁడు జీవించునంతకాలము మమత్వాదులు లేక యుండుట యసంభవము. స్వాభిమానము బంధుజనాభిమానము, గృహాభిమానము దేశాభిమానము, మతాభిమానము, మొదలగునవి శ్లాఘ్యములే యగును గాని గర్హ్యములు గావని నా యభిప్రాయము. నే నెంత ప్రయత్నించుచున్నను నా మనసునుండి యీ యభిమానమును బాఱఁదోలఁ జాలకున్నాఁడను. కటకటా! మూఁడుతరములనుండి మా కుటుంబమునకుఁ గాపురమై, నాకు జన్మభూమియై, సకలసంపదలకుఁ బుట్టినిల్లయి ముక్తిప్రదాయకము లగునగరములలో నొకటియై, విలసిల్లు నుజ్జయిని మహానగరమును నే నిఁక నెన్నఁడైనఁ గన్నులపండువుగఁ జూడఁ గాంతునే? వసంతకాలమున సాయంసమయంబుల శిప్రానదీతీరమునకుం బోయి యా యేటినీటిబొట్టులఁ గలిసి వీచుమంద మంద మలయానిలంబులు నెమ్మేను సోక నెన్నఁడైనఁ సౌఖ్యమనుభవింతునే? ప్రదోషకాలమున నాలయంబునకుఁ జని, సకల భువనరక్షకుఁ డగు విరూపాక్షు, మహాకాళేశ్వరు నింక నెన్నఁడైనఁ జేతులారఁ బూజించి, మనసార ధ్యానింపఁగలుగుదునే. వత్సరాజు ప్రద్యోతమహారాజనందన యగువాసవదత్తాదేవినిబితృగృహమునుండి దీసికొనిపోయి

సచిత్రకథను పల్లియలనుండి వచ్చుచుట్టములకు నెన్నఁడైన వీనులవిందుగ వినిపింతునే? అంతభాగ్యము నావంటియదృష్టహీనునకుఁ గలుగదు. నే నెక్కడ? యుజ్జయిని యెక్కడ? పరమసాధ్వి యగునిల్లాలిని ప్రపంచ మెట్టిదో యెఱుఁగని పసిబిడ్డసయితముగఁ బుట్టినింట నునిచి దిక్కుమాలినపక్షివయి కానిదేశములఁ జరయింపు మని పద్మగర్భుండు నా నెన్నుదుట మూఁడుబంతుల వ్రాసి యుండ నేను సుఖించు టెట్లు? ఓమహాకాళేశ్వరా! నా కిట్టిదుర్భర మగునవస్థ గలుగుటకు నా చేసిన దోస మేమి? అతిథులకు నభ్యాగతులకు మునుమున్ను పెట్టక మూఁడు ప్రొద్దులుం గుడువ; వైశ్వదేవంబు సేయక యిల్లు వెడల; నీ పాదారవిందధ్యానము చేయక నిదురవోవ: అబ్రాహ్మణకర్మంబుల నాచరింప నట్లు మెలఁగుచున్నను నా కిట్టిగతి ప్రాప్తించుటకుఁ గారణ మేమి? భవతారకంబు లగునీయడుగుఁదామరల నొకసారియైన ధ్యానింపని ఖలులు, కలకండంబులకన్నఁ దియ్యనగు నీనామంబు నెన్నండును స్మరింపనికష్టులు, మంగళప్రద మగు నీకోవెలగడప నొకతూరి యైనఁ ద్రొక్కి చూడనిమొక్కలులు, విశ్వమోహనం బగు నీసుందరవిగ్రహంబు మఱపున నైనఁ గనుంగొననియధములు, ధనధాన్యములు నాయురారోగ్యములు; నిత్యకళ్యాణంబులు గలిగి వర్ధిలుచుండ నా జన్మశుద్ధుఁడనై, విప్రుడనై, ఘనాంతస్వాధ్యాయవేత్తనై, వేదాంత శాస్త్ర పరిజ్ఞాతనై, విశేషించి నీచరణారవిందసేవకుఁడనై, నలుపురిలోఁ దలయెత్తుకొని గౌరవముగాఁ గాలక్షేపము సేయుచున్న నే నిట్లు దుస్తరదుఃఖసముద్రమునం బడియుండ నుపేక్షించుటకు నీకున్యాయమే? అయ్యయ్యో! నిష్కారణముగాఁ గర్మసాక్షి యగు భగవంతుని దూఱ నేల? పూర్వజన్మకృతమగు కర్మమే దీనికిఁ గారణము. ఆ కర్మయే కారణము గాదేని, కాశ్మీర నేపాళ విదర్భ దేశములను గోబ్రాహ్మణ పక్షపాతు లు, వైదికమార్గప్రవర్తకులు నయి, ధర్మస్వరూపు లయిన

రాజులు పరిపాలించుచుండ మాళదేశమునకు బ్రాహ్మణద్వేషియు వేదబాహ్యుఁడు నసంగతుఁడు నగు పరమనాస్తికుఁడు బౌద్ధరాజ సుదర్శనుఁ డేల దాపురమయ్యె? నావలె నాసుదర్శనుఁ డెన్నఁడైన నుజ్జయినీనగరంబు విడిచి, మనస్తాపంబుఁ జెందునే? నావలె నెన్నఁడైన నాదురాత్ముఁడు తనయాలుబిడ్డలఁ బాసి యేకాకియై చరించునే? నాయుసు రెన్నఁడైన వానికి వానికుటుంబమునకుఁ దగులునే? ఏల తగులకపోవు? సాధులగు నగ్రజన్ము లొక్కనిమిషము ననుభవించు చిత్తక్షోభము నూఱుమడుంగులై, వేయిజన్మములనైనఁ దత్కారకులకు ఫలము గట్టికుడుపకపోదు. పాఁడియుఁ బంటయు, సిరియు, సంతతియుఁ గలిగి, పండువలెనున్న నాకాపురము గూలంద్రోసిన యా రాజాధముని దైవంబు సెరుపకుండునే. ప్రాణంబులు కంఠంబుననుండు నంతకాలమును నే నాతనితో పగసాధించి నాయావచ్ఛక్తి వినియోగించి పరరాజుల వానిపై దండువిడియఁ బంపి, యాతని రాజ్యభ్రష్టునిఁ గావించి యుజ్జయినీనగరము పాడుచేసి, యాలుబిడ్డల నెడబాపి, వాని నమ్మినప్రజల నిడుమలఁ గుడిపి, వేధింపక పోయితినేని నేను బ్రాహ్మణుఁడను గాను. ఇదియే నాశపథము దేవసింహుఁడు హిరణ్యమిశ్రుడు సత్యమిహిరుఁడు మొదలగు బౌద్ధపండితు లాదఱు తమ రాజునుం గూడి నాకొనర్చిన యపకారమునకుఁ బ్రతిఫల మనుభవింతురుగాక! మాళవదేశస్థు లందరు పరమవైదికుఁడగు ఛాందసబ్రాహ్మణుఁడు రుద్రభమహాత్వట్టు మించుక యెఱుంగుదురు గాక! సరే! అది యటుండనిమ్ము. ఇప్పుడు నే నేదేశమునకుఁ బోయి వసింతును? తక్కిన విషయంబులకన్నఁ గాశ్మీరంబు సుభిక్షంబని విందు. దానికి రాజధాని యగు శ్రీనగరము సార్థకనామమై సిరులకు నివాస మని విందు దానిం బాలించు హేమచంద్రమహారాజు బ్రాహ్మణపక్షపాతి యని వాడుక కలదు. కావున నా నగరంబునకుం బోయి తలదాఁచు

కొనుట యుచితము అచ్చట నే నెవ్వరి నెఱుంగుదును? క్రొత్తవారి నెవ్వ రాదరింతురు? ఏమయినను సరే! దైవముపై భారము వైచి పోయెదను. అదిగో నా యెట్టయెదుట నొకపల్లియ కానవచ్చుచున్నది. చీఁకటి పడకుండ నాగ్రామము చేరవలయును. ఇది యరణ్య మగుటచే దైవోపహతుఁడ నగు నేను మఱికొన్ని యుపద్రవముల పాలుగావలసి వచ్చును. భాస్కరుఁడును నావలెనే తన తొంటి తేజము డీలుపడి యొక మూఁటమూల తలదాఁచుకొను చున్నవాఁడు'' అని తనలోఁ దాను వితర్కించుకొనుచు నొక బ్రాహ్మణుఁడు వేసవికాలమున నొకనాఁటి సాయంకాలము సింధునది తూర్పుటొడ్డునఁ గల యొక యడవిలో నుండి ముందరిపల్లెకుఁ జీఁకటి పడకుండఁ బోవలయు నని విసవిస నడచుచుండెను.

అతఁ డేబదిసంవత్సరములు దాఁటినవాఁడు. శరీరము దబ్బపండు వంటి పచ్చనిచాయ గలిగి స్థూలమై యుండెను. అతఁడు పొడుగరి యనవచ్చును గాని స్థూలముగ నుండుటచేఁ జూచువారి కించుక పొట్టిగఁ గానఁబడుచుండును. మెడలో బంగారుతీఁగెనుజుట్టిన రుద్రాక్షతావళమును, దలకుఁజుట్టిన విలువగల పచ్చనికాశ్మీరశాలువ, చెవుల నలంకరించు కనకకుండలములు, చుట్టఁజుట్టి వీఁపుపై నిడుకొన్న కృష్ణాజినము, వ్రేలనున్న కాశికాముద్రయుంగరమును దద్బ్రాహ్మణుఁడు శిష్టుడనియు, విద్వాంసుఁడనియుఁ దెలుపు కాని కన్నులు మేడికాయలట్లు పెద్దవై యెఱ్ఱజీరలగలవై చూపఱ కించుక వెరపు గొలుపు చుండును. స్వభావముచేత నా విప్రుఁడు ధూర్తవర్తనుఁడు కోపకాఁడు నై నట్లు వాని మొగము జూచువారు మునుముంద యూహింప వచ్చును. ఆ మహీసురుఁడు మధ్యాహ్న మంతయు నెండలో నడచుటచే వాని మొగ మెంతయు సూర్యకిరణ సంతప్తమై జేవురించి చెమ్మటలు గారుచుండెను. దీర్ఘప్రయాణంబున నతఁ డతిశ్రాంతుఁడై యెడనెడఁ

చెట్లనీడల నించుక విశ్రమింప నిచ్ఛగించెను. కాని ప్రొద్దుకుంకు చుండుటయు మార్గము నిమ్నోన్నత మగుటయుఁ, జిఱుచీఁకటులు గ్రమ్మ నారంభించుటయు, నెంచి సాధ్యమయినంత వేగముగఁ బోవలసివచ్చెను. పథికు లెంతవిసుఱుగ నడచినను శ్రాంతులగునప్పుడు వారికి గమ్యస్థానము గడుంగడు దవ్వున కరిగినట్లు తోఁచునుగదా ! ఎంతనడిచినను బ్రాహ్మణుఁడు చీఁకటిపడునప్పటికి గ్రామము చేర లేకపోయెను. నిర్జన మగు నా ప్రదేశము, సహజముగ ధైర్యశీలుఁ డగు నాతనికి భయము గొలుపఁజొచ్చెను. రాత్రి యనునంగన తల వెండ్రుకలవలె కాఱుచీఁకటులు నలుదెసలఁ గ్రమ్మెను. ఘాతక మృగంబులు దుష్టసర్పములు, చోరకిరాతులు, భూతపిశాచములు బ్రాహ్మణుని తలఁపున నిలువ నతఁడు భయకంపితుఁడై మాటిమాటికి వెనుకకుఁ దిరిగి చూచుచు హరినామస్మరణము చేయుచు చేతి కఱ్ఱతో నేలఁ దట్టుచు తాఁ జేయుచున్న పనిఁ దా నెఱుంగక యెటెటో నడుచు చుండెను.

ఇట్లు విహ్వలచిత్తుఁ డగు నాజన్నిగట్టు చేసినదోసంబు మూర్తీభవించెనో యన నొక కిరాతుఁడు నల్లమేనివాఁడు వాని వెనువెంటనే వచ్చి చేతిదుడ్డుకఱ్ఱతోఁ దలపై నొక్కపెట్టు పెట్టెను. వెంటనే బ్రాహ్మణుఁడు గొడ్డలిపెట్టునం బడు చెట్టులాగున హర హరాయనుచు నేలంగూలె.

# రెండవ ప్రకరణము

ప్రపంచమునందలి కొండలలో హిమాలయపర్వత మే మహోన్నత మయినది. ఇది నిరంతరమును మంచునకు నెల వగుటచే దీని కా పేరు గలిగినది. ఈమంచుకొండ యార్యావర్తమున కుత్తర దిగ్భాగమునఁ దూర్పునుండి పడమరకు వ్యాపించి భగవన్నిర్మితమగు రాతిగోడ చందంబున దుర్భేద్యమయి యుండు ఆధిక్యతను బట్టి మన పూర్వులీనగరమునకుఁ బర్వతరాజ మను బిరుదము నిచ్చిరి. ఆ వైశాల్యము, నా యౌన్నత్యము, నా గాంభీర్యము నొక్కమారు గన్నవారు శైలచక్రవర్తి నామము దానియందు సార్థకమయ్యెనని తలఁపకపోరు. ఏ శైలంబు తలదాచుకొనుట కిల్లులేక వల్లకాడులఁ గాపుర ముండుఁ మూఁడుకన్నుల వేల్పునకు నిలువనీడయయ్యెనో, ఏ నగాధిరాజుకడుపున నుదయింప వలయునని దాక్షాయణి కోరి పార్వతియయి జన్మమందెనో, ఏకొండరాజు తనయనుంగుఁగూతురును గాళ్ళు కడిగి కన్యాదానమిచ్చి చిరబ్రహ్మచర్యముచే వెతలఁబడు మహేశ్వరునొకయింటివానిఁ జేసెనో, ఏ మహీధరగుహాంతరంబులు ప్రమథగణంబుల కోలాహలంబులకును, పిడుగులచప్పుడు వోలె, వినంబడు నందీశ్వరుని ఱంకెలకును బ్రతిధ్వను లిచ్చుచుండునో, ఏ భూధరకూటములు తమ ప్రియులం గలసిమెలసి యెడలేని మమతల విహారంబు సలుపు కిన్నరవిద్యాధరబాలికల కాటపట్టులయ్యెనో, ఏకుధరంబును తపోనిష్ఠులగు రాజర్షిఁ బ్రహ్మర్షి, దేవర్షి, గణంబులకు యజ్ఞభూమియై దేవతల కన్నసత్ర మయ్యెనని పురాణంబుల వినుచుందుమో, యేగుబ్బలి భువనపావనము లగు సింధుగంగా ప్రముఖ నదీమతల్లికలకుఁ గన్నతల్లియై విలసిల్లునో, యేగట్టులదొరకటిప్రదేశమునందె మేఘమండలములు చరియించుచుండునో, యాహిమవంతము

దీర్ఘశృంగములతో, దుర్గమారణ్యములతో, నమూల్యరత్నములతో, సువర్ణాదిలోహములతో, నుత్తమ దివ్యౌషధులతో, గైరికాది ధాతువులతో, బహుసత్వములతో, నెల్లపుడుం బాఱుసెలయేళ్ళతో, సొబగు మీఱుచరియలతో, నిండి యుండి చూపఱకుఁ గనులపండువు సేయుచు నాశ్చర్యమును సంతోషమును భయమును గొలుపుచు బరమేశ్వరుని యనంత మహిమంబును బ్రకటించుచు నుండును. ఈచలి కొండకుత్తరభాగమున కైలాసంబున సింధునదిజనించె. సింధుశబ్దము నకు సముద్రమర్థ మగుటచే నీనదిపొడవు వెడల్పులం జూడ చిన్నసము ద్రమో లేక సముద్రునిబిడ్డయోయని సందియము తోఁచును ఈమహా నది పుట్టినచోటు వదలి కొండదనుక టిబెట్టుదేశమునఁ బ్రవహించి యనంతరమునఁ గాశ్మీరదేశంబు జొచ్చి తన్మధ్య భాగమునఁ బాఱి యవ్వల పాంచాల సింధుదేశంబులు ప్రవేశించి, యనేకోపనదులం గలిసి చవుటిపఱ్ఱల రత్నగర్భములుగఁ జేసి, పట్టణంబులఁ బల్లియల నుండు జనంబులకు జీవనంబు లొసంగుచుఁ బలుపాయలై పశ్చిమ సముద్రమునఁ బడుచున్నది. ఈ నదియొడ్డున నిప్పటికిని దట్టంబులగు కారడవులు కొన్ని కొన్ని తావులం గలవు. ఈ గ్రంథమునఁ జెప్పఁ బడుకథ శాలివాహనశక ప్రారంభమునకును విక్రమార్కశక ప్రారంభ మునకును జాలమున్ను జరిగినదగుటచే నాకాలంబున నిప్పటికన్న దుష్టమృగకిరాతశరణ్యంబులగు నరణ్యంబులు విశేషంబుగ నుండెను. కాశ్మీరదేశ మిప్పటియట్లు చిన్నదిగ నుండక యాకాలమున, మిగుల, బెద్దదై యిప్పుడు పంజాబనఁబడు దేశమును జాలవఱ కాక్రమించెను. చీనాబ ను నుపనది సింధునదితోఁ జేరుప్రదేశమున కుత్తర మున నొకయామడదూరమున సింధునది పరిసరంబున నొకయడ విలో నొకచిన్నపల్లెయుండె. ఆపల్లియందు బోయలు మొదలగు నాటవికులేగాని బ్రహ్మ, క్షత్రియ, వైశ్యులెవ్వరును గాఁపుర ముండుట లేదు.

నాగరకులమొగ మెన్నఁగను గనుంగొనని యాగ్రామవాసుల నడుమ గాఁపుర ముండుటకును నూరుపే రెవ్వరికిఁ దెలియనిపురుషులు కొందఱువచ్చి యెందుచేతనో నచటఁ గాలముఁ బుచ్చు చుండిరి. వారిలో నాఁడువాండ్రెవ్వరును గానఁబడరు, తెలివిమాలిననౌకరులు వారి పూర్వవృత్తాంతములఁ గూర్చి తలఁచి యడుగక, వారివేషభాష లంగనుంగొని సందియపడక వారికిం దమచేతనైనసాయంబునెఱపుచు వారితోఁ గలసిమెలసియుండిరి. ఒకనాఁ డానగరకులలో నొక సేవకు లిరువురితో మధ్యాహ్నము వేటకుంజని యెం దేని జరియించి కొన్ని పులుఁగుల మృగములఁజంపి చచ్చినవానినిసేవకులిరువురు మోసి తేగా సాయంకాలమున కెప్పటియట్లిల్లు సేర లేక చీఁకటులు గ్రమ్మిన వెనుక నదియొడ్డున నడిచి వచ్చుచు వెంట వచ్చుపరిచారకురలో నొకనితో నిట్లనియె ‘‘కరటకా! మనమీవేళఁ జాల యాలస్యముఁ జేసితిమి. వేఁట మొదలగు దుర్వ్యసనములం దగిలినవారికి నాఁకలియుఁ దప్పియుఁ బ్రొద్దును దెలియవని పెద్దలు సెప్పుమాటలు నిశ్చయము లే యని నేను దలంచెద. మనము నడచుచున్న దరణ్యప్రాంతము; క్రమ్మినది కాఱు చీఁకటి; కావున జాగరూకతతో నడువుఁడు’’అని పలుకఁగరటకుండు వానితో ‘‘స్వామీ! కొంచెము పొద్దు పోయిన నేమి! కావలసినన్ని మృగములు పక్షులు లభించినవి. మన మింక కొంతసేపటికైన నిల్లు సేరక పోము. మనము మువ్వుర మున్నాము గనుక నంతగ భయపడ వలసినది లేదు’’ అని పలికి వాఁ డింక నేదియో యనఁబోవు చుండ నయ్యయ్యో! కటకటా! యేమిచేయుదు’’ ననియొక యార్తనాదము వారిచెవులం బడె ఆ పురుషులు మువ్వు రాశబ్దము విని నిశ్చేష్టు లయి నిలిచి యది యేమయి యుండునని తమలోఁదాము మెల్లగ విచారించుకొని, క్రమ్మర నట్టిశబ్దము వినఁబడక పోవుటచే మరల సాగి నడచుచుండిరి. వారు కొన్నిగజములదూరము నడుచునప్పటికి ముందునడచు

చున్న కరటకుని కాలి కేదియో తగిలెను. వెంటనే వాఁడు పీనుఁగ పీనుఁ
గయని యఱచుచు వెనుకకుం బఱుగెత్తెను. వాని యజమానుఁడైన
నాగరకుఁడు కరటకా! భయపడకు; భయపడకు; పీనుఁగునకంత
వెఱువవలెనా? ప్రాణమున్న జంతువులు హానిసేయఁగలవు గాని
మృతజంతుకళేబరములు కీడొనరింపఁ జాలవు గదా. దగ్గఱకుఁబో
యి చూతము రమ్మనిపిలిచి దృఢమనస్కుఁడయి ముందుకు నడచుట
యు యజమానివెంటఁ గరటకుఁడును కరటకునివెంట రెండవ సేవకుఁ
డగు పింగళుఁడును నడిచిరి. అతఁ డాకళేబరమును సమీపించునప్ప
టికి పాదములు నెత్తుటం దడిసిన నేలం దాఁక వానిమేను పులకరించెను.
ఈయాశ్చర్య మే మయియుండు నని యాపురుషుఁడు విచారించుట
కారంభింప నంతలో "నయ్యా! నేనును బీనుఁగను కాను. భగవ
దనుగ్రహముచేత నిప్పటికి సజీవుఁడనే. నాయం దనుగ్రహముంచి
నాగాయములకుఁ గట్టుగట్టి నాకించుక సాయంబు సేయుదురేని నే
నాజన్మాంతము మీకుఁ గృతజ్ఞుఁడనయి విధేయుఁడనయి యుందు"నని
కొన్నిమాటలు హీనస్వరముగ వినంబడెను. ఆ పలుకులు విని యజ
మానుఁడును సేవకులును పడి యున్నవాఁ డాపదలోనున్న మనుష్యుఁ
డని యెంచి దగ్గఱకుఁ బోయి "అయ్యా! నీవెవడవు? ఏల యిట్లుపడి
యున్నవాఁడ" వని యడుగ నామనుష్యుఁడు గద్గదస్వరముతో వారి
కిట్లనియె. "అయ్యా! నేనొక బ్రాహ్మణుఁడను. నాపూర్వవృత్తాంత
మంతయు సవిస్తరముగ మీకెఱిఁగించుట కిది సమయము కాదు. నా
కిప్పు డోపికయు లేదు; ప్రస్తుతచరిత్ర మెఱిఁగించెద వినుఁడు. ఈరాత్రి
ముందుఁ గనంబడు పల్లెకుఁ బోవలయు నని వడివడి నీదారిని నడచు
చుండ దురాత్ముఁ డొక చోరుఁడు నాకుం దెలియకుండ నా వెనువెంట
వంటివచ్చి చేతిముద్దుకఱ్ఱతో నానడినెత్తి పగులమోఁదెను. ఆప్రహార
ముతో తలకుంజుట్టికొన్న నేలువయొక్క మూలంబడ నెత్తినుండి క్రొన్న

త్తురు జొటజొటగార గొడ్డట నఱికినతరువువలె నేను హరహరా యనుచు నేలఁగూలితిని. అంతట నాకిరాతుఁడు నారత్నకుండలములు సేలువ వ్రేలియుంగరము దొంగిలించుకొని యెందేనిం జనియె. నన్నుం గనికరించి యాయూరికిం గొంపోయి నాగాయములు మాన్పవేఁడెద" అని జాలి గదురఁ బలుకుటయు, వానిని లేవదీయు మని యజమానుఁడు సేవకులం బనిచి, బ్రాహ్మణునకు ధైర్యముజెప్పి మెల్లమెల్లఁగ నడిపించుచు నూరికిం దోడ్కొనిపోయి గాయంబులకుఁ దగుచికిత్సలఁ జేసి పాలుద్రావనిచ్చి పన్నుండుటకు మంచము వేయించి బహువిధంబుల నాదరించె. తరువాత నాలుగైదుదినములకు బ్రాహ్మణుని గాయము కుదుర నారంభింప వానికాయంబు క్రమక్రమంబుగ దృఢంబుగాఁ జొచ్చెను. ఆవిప్రుఁ డొక్కనాఁడు నిజప్రాణసంరక్షణకుఁ దగు నాపురుషుని నామధేయంబు నెఱుంగఁగోరి యడుగ నాతఁడు కొంచెము విచారించి "అయ్యా! నన్నిచటివారు సుమిత్రుఁ డందురు. ఏ పేరయిన నేమి? నన్ను మీయిచ్చవచ్చిన పేరంబిలుపుఁ" డని ప్రత్యుత్తరమిచ్చెను. తనపేరు చెప్పుటకతఁడు సందేహించినట్లుకనంబడుటయు వానియున్న తావు నునికియు వానిసుందరాకారంబునకును మృదుభాషణంబులకును దగని వై యుండుటయు, బుద్ధిం దలపోసి యతండు ప్రచ్ఛన్నవేషుఁడై యుండవచ్చునని బ్రాహ్మణుఁ డూహించి యడిగి తెలిసికొనఁ గోరి సమయము నిరీక్షించుచుండెను. సుమిత్రుడు సేవకులును బ్రాహ్మణునియెడ భయభక్తులు గలిగి యుపచారములు సేయుచుండిరి.

## మూఁడవ ప్రకరణము

ఆపద లిల్లు గట్టుకొని కాఁపుర ముండ వని తెల్పుటకో యనఁ జీఁకటులు గడచిపోయె. దుఃఖానంతరమున సుఖంబు లిల్లు వచ్చునని యెఱుంగఁ జేయుటకో యనఁ గృష్ణపక్షంబు గడముట్టుటయు మాపులు వెన్నెలలు గాయఁ జొచ్చెను. దుఃఖానుభవంబునఁ గలుషంబు లగు మొగంబులు సుఖానుభవంబునఁ గళావంతములగు నని వెల్లడిచేయుటకో యన దిశాముఖములు నిగలఁ దెలివి నొందె. దేశ మజ్ఞానాంధకారమయమగునప్పుడు మిగులం దేజరిల్లు కించిద్జ్ఞులు దేశము జ్ఞానదీప్తిమంతం బగునాఁడు తమ యూరు పేరు లేక యుందు రను నీతి లోకంబునకుఁ జాటుటకో యన మున్ను జీఁకటిరాత్రులఁ దళదళమని మెఱసిన నక్షత్రంబులు వెన్నెలలో వెలుఁగు డిందుపడి కానఁబడవయ్యె. రాజు లొకవేళ జనుల కార్తికరు లయి మఱియొకవేళ నానందకరు లగుదురనుమాట నిజమని ప్రకటించుటకో యన నిశారాజగు చంద్రుఁడు హేమంతఋతువున జగజ్జనులను జలిచేత వడకించిన చల్లనికిరణములచే తనే యా వసంతరాత్రులలో జనుల నానందాబ్ధిఁ దేలించుచు కునల యానందప్రదాయకుఁ డయి యుండెను. ఎంతటి స్వచ్ఛమూర్తులకయిన నెంతటి కళావంతుల కయిన, నెంతటి సన్మార్గవర్తనుల కయిన వెదకిచూచిన నించుకలోప ముండకపోదను పలుకు నొక్కి వక్కాణించుటకో యన స్వచ్ఛమయి, షోడశకళాపరిపూర్ణమై యాకసంబు నలంకరించు చంద్రమండలమున మచ్చ చూపఱకుఁ గానఁబడఁ జొచ్చెను. నిండుచందురుండు పండువెన్నెలలుగాయు పున్నమనాఁటిరేయి సుమిత్రుఁడుఁ నడివాకిట నొకచాప వేయించుకొని వెన్నెలలో బ్రాహ్మణుఁడుఁ దానునుగలిసి కూరుచుండి పురాణకథలు, పూర్వరాజుల చరిత్రములు నాతనివలన వినుచుండెను.

కరటకుఁడు పింగళకుఁడు మొదలగు సేవకులు పగలెల్ల నొడలువంచి పనిచేయుటచే మేనుమఱచి గాఢముగ నిద్రించుచుండిరి. గ్రామమంతయు మాటుమణఁగి నిశ్శబ్దమైయుండె. కొంతసేపు పురాణగాథలు విని సుమిత్రుఁడు బ్రాహ్మణునిజూచి "యార్యా! మీ ముఖవర్చస్సును బాండిత్యప్రభావమును జూడ మీరు సామాన్యులు గారని తోఁచుచున్నది. మీ రెవ్వరో యేదేశమునుండి యెం దరుగుచున్నవారో, యట్లరుగుటకుఁ గారణ మెద్దియో నాకెఱుంగఁజేయ వేఁడెదను. నేను మీకు విధేయుఁడనగు శిష్యుఁడను గాని యన్యుఁడనుగాను, మీ చరిత్రము గోప్యమగునేని నేనది యిచ్చటనే మఱచిపోవఁ గలవాఁడనని శపథంబు జేసెద. మందభాగ్యుఁడనగు నేను నాచరిత్రమును మీకు విన్నవింపఁ దలఁచు చున్నాఁడను కాని మునుముందు మీరు నన్ను నమ్మి మీకథ నెఱింగింతు రేని యవ్వలఁ దెలిపెదను. కావున ననుగ్రహించి సెలవిండని ప్రార్థించె. ఆవేడికోలు విని మహీసురుఁడును కొండొకవడి యాకసంబునంక దలయెత్తి చూచి విచారించి, యెట్టకేలకిట్లు తనవృత్తాంతముఁ జెప్పఁ గొడంగె. "ఓసుమిత్రా! మిత్రదర్శనము లేమిచే శోషిల్లి నామనఃపద్మము మిత్రుఁడ వగు నిన్ను జూచి మరల వికాసవంతమైనది. ఆప్తబాంధవుల నందఱ విడిచివచ్చిన నాకు దైవము దయాళువై లోకబాంధవుఁడవగు నిన్నుంజూపె. భాగ్యహీనంబగు నాచరిత్రమును జెప్పెద వినుము. ఆర్యావర్తమునకును దక్షిణాపథంబునకును నడుమను మాళవదేశముగలదు. ఆదేశంబున కలంకారమగు నుజ్జయినీపురంబు నాకాఁపురంబు. నాపేరు రుద్రభట్టు; నాతండ్రి కుమారభట్టు. మంత్రశాస్త్ర పారంగతుండై పేరువోసినవాఁడు. మాతాత మహాదేవభట్టు. నిరతాన్నప్రదాత యయి మడిమాన్యంబుల విక్రయించి బ్రాహ్మణ సంతర్పణములు జేసి కుటుంబమునకుఁ

బేదరికముఁ దెచ్చినను వంశమునకుఁ గావలసినంతకీర్తిధనము సంపాదించి యిచ్చిపోయెను. కూటికి పేదయయినను గులమునకు సంపన్నుఁడగుటచే మాతండ్రి యొరుల నాశ్రయింపక నీచవృత్తులకు నింద్యకర్మలకు నొడఁబడక, తన కున్నంతలోఁ గడుపుకొని తనివి గలిగి పదిమందిలో నింతవాఁడు లేఁ డనిపించుకొనిగౌరవంబుగఁ గాలక్షేపము జేసె. నేనును మాతండ్రి నడచిన తెన్నున నడువఁదలచి కులగౌరవములకు భంగమురాకుండ దినములు గడపుచుంటి. నాపూర్వపుణ్యవశమున నాజనకుఁడు నా కనపహార్యం బగువిద్యాధనంబు నొసంగి పోయెను. నాప్రజ్ఞాదికములు నేను జెప్పుకొనుట యనుచితమే యగును గాని క్రొత్తవాఁడ నగుటచే నించుక నుడువ వలసి వచ్చెఁగావున మీరుక్షమియింతురుగాక! చతుర్వేదము లధిగమించితి. షడ్దర్శనములు నేర్చితిని. చతుష్షష్టికళలు నలవఱచుకొంటి నాపాండిత్యప్రభావముకక్కజపడి యాదిశేషునకైన జతుర్ముఖునకైన వంకలు దిద్దఁగలకాశీకానగరపండితులు నాకువిద్యానిధి యని బిరుదొసంగిరి. శాస్త్రచర్చలయందెంతెంతదిగ్దంతుల నైన నేనవలీలనోడించి పుచ్చుటం జేసిలోకులు నన్ను బ్రతివాదిభయంకరుఁడని చెప్పుకొనుచుందురు. అత్తకోడఱికపుంబగచే లక్ష్మియు సరస్వతియు నొకదాపున నుండ నిచ్చగింపరు గావున నాకడ విద్య యెంత యతిశయముగా నుండెనో నాయింటఁ బేదఱిక మంతయతిశయముగా నుండెను. మాళవదేశస్థులభాగ్యదోషమున నుజ్జయినీనగరంబు రాజధానిగఁ జేసికొని సుదర్శనుఁ డనుబౌద్ధమతస్థుఁడొకరాజు పాలించు చున్నవాఁడు. అతఁడు పండితపక్షపాతి యగుటచె నాకీర్తి కర్ణాకర్ణిగ విని తన కొలువుకూటమునకునన్నుం బిలిపించి,యుచితాసనంబిడి తనదేశీయు లగుకొందఱు పండితులతో నన్ను వాదింపఁబనిచి నాప్రసంగంబుకుఁ గడుమెచ్చి యానాఁడు మొదలు నన్ను దన యాస్థానపండితులలో నొకనిగాఁ జేకొని సభ

బహుమానముగ సగౌరవముగ నన్నాదరించె. అతని యాస్థానమున హిరణ్యమిశ్రుఁడు ధర్మగుప్తుఁడు దేవసింహుఁడు సత్యమిహిరుడు మొదలగు బౌద్ధపండితు లనేకులు విద్యాధనులు గలరు. వారికి నాకు వేదవేదములఁగూర్చి యభిప్రాయభేదములు గలిగి వాదములు సంభవించుచుండుటం జేసి మనస్పర్థలు వొడముచు వచ్చినవి. రాజు బౌద్ధుడగుటచే మతవిషయములనాతో నేకీభవింపక వారితోఁ గలియుచుండు. ఇట్లు సుదర్శనుం గొలిచి జీవయాత్ర నడపుచుండ విదర్భారాజునకు మాయేలికకు నెల్లలఁగూర్చి పొరపులు వొడమినవి. ఆవివాదంబులు పరిష్కరింపుమని తన మంత్రులలో నొకఁడగు కేసరి యను నాతని నియోగించి వానికిం దోడుగ నన్నుంబొమ్మని మారాజానతిచ్చె. మేమిరువురముం జని వివాదహేతువు లగుప్రదేశంబులఁ జూచి విదర్భరాజు పక్షమే న్యాయమని యెంచి మాఱేనికి విన్నవించి యాప్రదేశంబు వైదర్భుల కిప్పించితిమి. మాపైఁ గిట్టనివారు కొందఱు మేము విదర్భేశ్వరునివద్ద లంచములు గ్రహించి తత్పక్షమునఁ దీర్పులు చెప్పితిమని మానృపునితోఁ గొండెములఁ జెప్పి కినుకఁ దెప్పించిరి. రాజును మొట్టమొదట వారిమాటలు విశ్వసింపక కొంతకాలంబు బోయినవెనుక సాక్ష్యంబు విచారించి మమ్ము నేరస్థులుగా నెంచి దండ్యుల మనినిశ్చయించి మమ్ముం గొఱఁతవేయుమని పలువురు పురికొల్పిన నెందుచేతనో యట్లు సేయక మాసర్వధనంబులు దాను గైకొని మమ్ము దేశంబునుండి వెడలనడిపె. నావిద్యయు నాగౌరవంబునకుఁ దగనిపని నేను జేసితినని నమ్మి ప్రజలును, "యథారాజా తథాప్రజాః" యనుమాట నిశ్చయముగ రాజుతోపాటునాపై నలిగిరి. భార్యను బుత్రసమేతముగఁ బుట్టినింటికనిపి పైబట్టతో నిలు వెడలి కాశ్మీరదేశమున వసియింపవలయు నని బోవుచు, మీపాలఁ బడితి. నాయనా! రాజులు విశ్వసనీయులు గారు. వారితోఁగూటములు

పాములతోఁ జెలగాటములు; భారిపోరాటములు, కత్తులమీఁది సాములు; వారినెయ్యములు పులులతోడి వియ్యములు, వారియనుగ్రహంబులు నీటిబుగ్గవోలె క్షణవినశ్వరంబులు వారియాగ్రహంబులు చిరస్థాయికంబులు, వారిచ్చుసంపదలు మెఱపుఁదీఁగలట్లు చంచలంబులు. వారొనరించు నపకారంబులు, శాశ్వతంబులు; వారియాకారంబులు కోడెత్రాఁచులట్లు దర్శనీయంబులు. అంతరంగంబులు విషాశయంబులు, వారిమొగంబులు పుష్పసుకుమారంబులు, మానసంబులు వజ్రకఠినంబులు, వారిదయావృష్టు లెవ్వరిపైఁ గురియుచుండునో వారిమీఁదనే బిట్టలుకలను పిట్టపిడుగులు వడుచుండును. వారి కేల యాగ్రహంబు గలుగునో యేలయనుగ్రహంబు వొడమునో యెఱుంగనలవికాదు. సహజదుర్గుణంబులకుఁ దోడు మారాజు బౌద్ధమతావలంబకుఁడు. వానికి దైవంబు నాస్తి, గురువునాస్తి, దయనాస్తి, ధర్మమునాస్తి, సర్వమునాస్తి, అట్టి పాపకర్ముఁడగుటచేతనే నన్నింతచేసె; పిల్లలుగలవాఁడను, పెద్దవాఁడను, పేదవాఁడను, కుటుంబభారము మోయలేక కడుపుకక్కుఱితిచే నాల్గువరాలసొమ్ము దింటినే యనుము, ఇంతమాత్రమున నన్నింతక్రూరశిక్షపాలు సేయఁ జెల్లునే! నాభార్య భూలోకమాత, పరమసాధ్వి గోలుగోలునని యేడ్చుచు నిలువెడలి పుట్టినింటికిం జనియె. ఆయుసురు వానికిఁ దగులక పోవునే? వాఁడు ధర్మాత్ముఁడట, మంచి రాజఁట, మహాశాంతుఁ డఁట, వానిధర్మము మండిపోను, వానిరాజరికము కడతేరిపోను; ఆదురాత్ముని వానియాస్థానపండితులను నేమిచేసినను దోసము లేదు. దైవానుగ్రహమువలన నేను బ్రదికియుంటినేని వారిపాట్లు మీకండ్లనే చూడఁగలరు. వేదములు పౌరుషేయములఁట; తత్కారణమున నప్రమాణములఁట; వసిష్ఠాది మహర్షులు మనవంటి సామాన్యమనుష్యులే యఁట గోమాంసభక్షకు లఁట; దేవాలయములోని విగ్రహములు రాఱు

రాళ్ళఁట; పూజానర్హములఁట, పురాణము లన్నియుఁ గల్పనాకథ
లఁట, విశ్వసనీయులుగా వఁట; భగవంతుఁడు లేఁడఁట; పరమభాగవ
తోత్తములు దొంగలఁట; ఇట్లు ప్రేలువారినోళ్ళెన్నఁడేని పడిపో
వునో; వారి నాలుక చీలికలు గావలసినదే. అయినను నీపరుషవాక్య
ముల నానోట రానీయనేల? భగవంతుఁడే పాలించు చున్నాఁడు;
కలిప్రభావ మతిశయ మయిన యీదినములలో దురాత్ములకే సమ
స్తకళ్యాణములు లభించుచున్నవి. సద్ధర్ములే దురవస్థలఁ బడుచున్న
వారు. పరమఛాందసుఁడ నగు నేనేమి రాజద్రోహము సేయుటయేమి.
ఇంతమాత్ర మారాజాధమునకుఁ దోఁచినది కాదు. వానికొలువున
నున్న బౌద్ధపండితులు నాకుఁ దమకుం గల దొంటి స్పర్ధల మనం
బులఁ బెట్టుకొని నేను లంచగొండి నని రాజుతోఁ జెప్పి నన్నింత
చేయించి యుందురాయని యనుమానమును నామనస్సునఁగలదు.
పాపపుణ్యములు భగవంతుఁ డెఱుఁగు. ఇంతకన్న నేజెప్పవలసినది
లేదు. ఇదియే నావృత్తాంతము'' అని చెప్పి యాబ్రాహ్మణుఁడుకన్ను
లనీరుపెట్టుకొని యూరకుండెను. ఆతని పలుకులు వినినవెనుక సుమి
త్రు మనసు జాలిచేఁ గరగి వికలమగుటయు నాతఁడు తనయుత్తరీయ
పుచెంగుతో విప్రునికన్నీరుతుడిచి యిట్లనియె. ''భూసురోత్తమా!
నీకథవినినపిదప నీవు నిర్దోషివని నాకుం బొడకట్టినది. నీవు వెఱవన
క్కఱలేదు. నీ వెందరిగిన నచ్చట నభ్యుదయంబు గలుగు; నీవు కా
శ్మీరంబునకుఁ బోవుదునను చుంటివి. అదియే యవశ్య మాచరణీ
యము. నామేనం బ్రాణంబులున్నంతకాలము నేను నీ కాప్తమిత్రుండ
నయి యుండెద. ఈమాటఁ దప్పితినేని విశ్వేశ్వరునిపాదంబు లాన''
అనుటయు బ్రాహ్మణుఁడు సుమిత్రుని గౌగలించుకొని సంతోషపార
వశ్యము నంది ''నాయనా! నాపాలిదైవంబవు; చింతామణివి'' యని
స్తోత్రముఁజేసి వానిగుణంబులు పలువిధములఁ బొగడఁజొచ్చెను.

---

## నాల్గవ ప్రకరణము.

అంతశ్శోకమును బాహ్యోపచారములు మాన్పజాలవు. చక్కని వెన్నెలలు జల్లనిజలములు మంచిగంధపుఁబూతలు శరీరమునకు సౌఖ్యమొసంగ నేర్చును గాని శోకాగ్నిచే మఱుఁగుచున్న మనస్సునకు శాంతి కలుగఁజేయ జాలవు. ఎండవేఁడిమిచే మలమల మాఁడిన నేలను గుంభవృష్టి గురిసి చల్లఁబఁడ జేయునట్లు దుఃఖానలసంతప్తమగు మనస్సును కృపారశీతలంబు లగునాప్తునివచనంబులే శోకపువేఁడిమి నడఁచి శాంతి నొందింపఁ గలవు. నాఁటిరాత్రి బ్రాహ్మణుఁడెంతసేపు పండువెన్నెలలోఁ గూరుచున్న నెంతసేపు చంద్రకరస్పర్శనంబున వానిమేను జల్లపడినను, సుమిత్రునినోటనుండి చల్లనిమాటలు బయలు వెడలువఱకు మనస్సు శోకమునుండి ముక్తిఁ జెంద దయ్యె. అత్యాదరమును జూపు సుమిత్రునివచనములు వినినతోడనే రుద్రభట్టు తనదుఃఖము నంతను మఱచి వాని నించుకసేపు కొనియాడి యిట్లనియె. "మిత్రనిధీ! నాయవస్థ సవిస్తరముగ విన్నవించితిని. నీ పరిచయంబు గలుగుట మొదలు నీవృత్తాంతంబు విన నాకుం గుతూహలము వొడమియున్నది. నాయుదంతము నీ కెఱింగించిన వెనుక నీ చరితంబు నాకుం దెలుపునట్లు నీవువాగ్దానము చేసియుంటివి. నా కథ నే ముగించితినిగాన, నింక కొఱఁత నీయదియ! నిన్నుం జూచునప్పటి నుండియు నదియేమో కాని నీవు ప్రచ్ఛన్నవేషుఁడ వనియు గోప్యమగు కారణాంతరమున నీవీ కుగ్రామమున వసింప వలసె ననియు నాకు గట్టిగఁ దోఁచుచున్నయది. నీముఖవిలాసంబును నీ మాటల పొందికయు నీప్రజ్ఞయుఁజూడ నీవుత్తమ రాజకులంబునఁ బుట్టినవాఁడ వనియు మహిమండలంబును బాలింపసమర్థుఁడ వనియు సులభముగఁ దెలిసికొనవచ్చును. నీమనస్సు దీర్ఘవిచార భారముచేతఁ గ్రుంగియున్న

డని నీ వెంతదాఁచినను నీ మొగంబున స్పష్టముగఁ జదువ వచ్చును కుండలో నిడినదీపములాగు నీ పల్లియ నుండుటం జేసి జగంబునకు నీ సహజతేజము గానఁబడుచుండుట లేదు. గడ్డిలోఁ గప్పఁబడి యుండు కాయయట్లు మేఘములచాటున మఱుఁగుపడి యుండు సూర్యబింబ మట్లునివురుగప్పిన నిప్పులట్లు నీ విట్లుండుటకుఁ గారణమేమి? నీవు నాకు సుమిత్రుఁడ వగుదువు కాని నీపేరు సుమిత్రుఁడు గా దని నా మనస్సు చెప్పుచున్నది. నీచరితంబు పరమరహస్యంబుగ నుండ వలయు నని నీవు కోరుదు వేని నే నది యెవ్వరికిని వెలిపుచ్చ. నీకథవినినపిదపమన స్నేహబంధంబు మఱింతదృఢ మగు నని నాకు నమ్మకము కలదు. అందుచేఁ జతురంగమున రెండుగుఱ్ఱము లొకదానినొకటి కాఁపుగ నుండి యన్యోన్యసంరక్షణమును జేకొనినట్లు నాకు నీవును నీకు నేనును సహాయము గావించుకొని సుఖింపవచ్చును. నా ప్రజ్ఞాదికములు నేను జెప్పుకొనఁ గూడదు కాని యీ రుద్రభట్టు పరమఛాందసుం డట్లు నీ కగపడుచున్నను లోకవ్యవహారములఁ జక్కఁగ నెఱిఁగిన దిట్టరి సుమీ! బూడిద బూసికొని తావళముఁ ద్రిప్పుచు జపము జేసికొను నీవైదికుఁడు నాకేమిసాయము చేయఁగలఁడని నీవు తలఁప వలదు. శాస్త్రాభ్యాసముచే బుద్ధినిపుణత యతిశయించిన లోకజ్ఞుఁడను గాని వేదజడుఁడనుగాను. రాజనీతిం దెలుపు శుక్రనీతి మొదలగు సద్గ్రంథ ముల నామూలాగ్రముగఁ జదివినవాఁడ. కత్తిచేఁబూని పగతుర గొంతులు కోయఁజాలనుగాని యింటివద్దనుండి మిత్రుల కుపాయం బులు జెప్పి యపాయంబులు గడిపి శాత్రవుల నిర్మూలింపఁ జాలు దును. కావున నింక సందియంపడక నీయుదంతము నెఱిఁగింపుము అని రుద్రభట్టు పలుకుటయు సుమిత్రుఁడు బ్రాహ్మణుఁడు విశ్వాస ముంచ దగినవాఁడనియు నేకార్యము సలుపుట కయిన సమర్థుఁ డనియు నెఱిఁగి తనవృత్తాంతముఁ జెప్పఁదగునా తగదాయని రెండుమూఁడు

పారులు తనలోఁదాను వితర్కించుకొని కొంతకాలమునుండి తన హృదయమును బీడించుచున్న శోకభారమునకుఁ గారణము వెలి పుచ్చుటయే యుత్తమమని యెట్టకేలకు నిశ్చయించి యిట్లని చెప్పఁ దొడంగె. "విప్రపుంగవా! నీ చెలికారంబు గలిగినది మొదలు బహుశాస్త్రంబులు కరతలామలకంబుగ నీ వెఱుంగుటయు రాజనీతి విశారదుఁడ వగుటయు నీ సంభాషణంబులం దేటబడియె. నాచరిత్రంబు నిన్నుఁబోలు సజ్జనుం డెఱింగినచో నాకందువలనఁ గొంతలాభమే యగును గాని నష్టంబుగలుగదు. మనస్సు శోకపూరిత మగునపుడు మనుష్యుఁడు తనదుఃఖమును నొరుల కెఱింగించినచో నది కొంత యుపశమించును. శుభవార్తలితరుల కెఱింగించినకొలఁది యానం దము హెచ్చు కావున నాకథ నీకెఱిగించుటకు మున్ను నాకుం బర మాప్తుండగు నొకనికథ దెలుపనలసియున్నది. తెలిపెద వినుఁడు భూమండలమునఁ గల దేశము లన్నిట భరతఖండమె ప్రశస్తతమము. అందార్యావర్తము శ్రేష్ఠము. అందు హిమవత్ప్రాంతము పుణ్య ప్రదము. అందుఁ గాశ్మీరము దర్శనీయము. ఆ దేశంబు కుంకుమపువ్వు నకుం బుట్టినతావు. కాశ్మీరమునం దది యుదయించుటచేతనే దానికిఁ గాశ్మీరమని పేరు గలిగె. మంచిగంధంబును బచ్చకప్పురంబును జాజి పూవులు నచ్చట సమృద్ధిగా లభించుటం జేసియు నేల సకలసస్య ములు సమృద్ధిగఁ బండుటం జేసియు నచ్చటియేఱు లెడతెగక పాఱుచుఁ బొలములకుఁ దోటలకు జీవనము లొసంగుటం జేసియు, నచటి యంగనలయుందర వేల్పుటువిదలు దిగదుడుపన కయినఁబనికి రాకుండుటం జేసియు నది భూలోకస్వర్గ మని కొందరు కవులు వర్ణించి యుండిరి. వేయేల? అచ్చటి పూదోఁటలు నందనవనంబులు అచటి కాంత లప్సరసలు. అచటియేఱు లమృతస్రవంతులు. ఆ దేశమునకు రాజధాని శ్రీనగరము. కామధేనువు కల్పవృక్షము లేని వెలితి

యొక్కటియె కాని దానికి నమరావతంబునకు భేద మించుకయు లేదు. ఆవిషయంబునకు విక్రమసేనుఁ డనురాజు నాయకుడయి చిరకాలము మహీభారముం బూని ప్రజలఁ గన్నబిడ్డలట్లు కాపాడి ధర్మస్వరూపుఁ డనిపించుకొని కొన్ని యేండ్లక్రిందట కీర్తిశేషుఁ డయ్యె. వానికి రెండు కన్నులంబోలె నిరువురు కుమారులు హేమచంద్రుఁడు చిత్రభానుఁ డనువారలున్నవారు. తండ్రి పరోక్షమున జ్యేష్ఠుఁడగు హేమచంద్రుడు రాజ్యమున కభిషిక్తుఁడయి గద్దెయెక్కి ప్రజాపాలనంబు జేయుచున్న వాఁడు. హేమచంద్రుఁడు చిత్రభానునియెడఁ బుత్రస్నేహము నిలిపి వానికిం దండ్రి లేనివెలితి లేకుండఁ గాపాడుచువచ్చెను. పితృసమో జ్యేష్ఠః" యను లోకోక్తి ననుసరించి చిత్రభానుడు సోదరునియడుగులు గడుభక్తి భజియించుచు నన్నమన్ననలకుం బాత్రుఁడై యువ రాజై యుండె. ఇట్లుండ గాంచాలదేశాధీశ్వరుం డయిన మహేంద్ర దేవు గారాబుకూఁతు రగు నరవింద యను కన్యకు స్వయంవరంబు ప్రవర్తిల్లె. ఆస్వయంవరంబునకు నిఖిలదేశంబులనుండి రాజకుమారు లందరు బోయియుండిరి. అరవిందాదేవి తామరపువ్వుకన్న సుకుమార మగు మేనిజిగిందాల్చి యొప్పు. హేమచంద్రుఁడు చంద్రునకు వంకలు దిద్దగల సోయగమువాఁడు. హేమచంద్రుని గుణరూపంబుల నరవిం దయు నరవిందగుణరూపంబుల హేమచంద్రుఁడును వినుచున్కి వారి కొండొరులపై వలపులు నిలిచె. ఆకారణంబున నాబాలిక స్వయం వరమున హేమచంద్రునే వరియించె ఆయెలనాఁగను బాణిగ్రహణము జేసికొని హేమచంద్రుఁడు తనయంతిపురంబునకుం దోడ్కొని వచ్చిన దాదిగ నేఁటిదనుక నాబోటి గీచినగీటు దాఁటఁడు. ఆమె మాట కెదురు వలుకఁడు. ఆమె యాన శిరసావహించు. వేయేల? ఆతని కామె పట్టినదే భిక్షము. ఆ నెలఁత యేమిమాయలు పన్నెనో యేమి మందులుబెట్టెనో యెట్టివలపులు గొలిపెనో యెట్టికొంటెములు సెప్పెనో

కాని యామె యంతఃపురమున నడుపెట్టినది మొదలు రాజునకుఁ దమ్మునిపైఁ దొంటియనురాగము నిలువదయ్యె. బ్రాహ్మణోత్తమా! ఒక్క నెలవునఁ బుట్టినను రాజునకుం దమ్ములకు సహజవైర మగుట లోకప్రసిద్ధము గదా? తమ్ములు వికాసము గలిగి విలసిల్లునప్పుడు రాజు చూపోపమిచే నచట నుండక యావలికిం బోవు. అతఁ డట్లుండుటచేఁ దమ్ములును హావివర్తనం బనుసరించి రాజు సంపూర్ణుఁడయి శోభిల్లునప్పుడు మొగంబులు ముడుచుకొని యుంట యాశ్చర్యము గాదు. రాజు మహోన్నతపదమున నుండుటయుఁ దమ్ము లడుగంటి యుండుటయు సంభవించుచుండును గాన వారి కైకమత్యము సాధారణంబుగాఁ గుదురదు. దానికిం దోడు ప్రియురాండ్రు సోదరుల విడువుమని చెవినిల్లుగట్టుకొని పోరుచు విసమునూరి పోసినట్లు నేరములు జెప్పుచు రవ్వంత పొరపు గలిగిన దానిదోహదము జేసి పెంచుచు గోపాగ్ని రవులుకొనునట్లు సమిధలవంటి మాటలు ప్రయోగించుచుందు రేని యింకఁ జెప్పవలసిన దేమి? మహాత్మా! ఆఁడుదానిచేతి బొమ్మవలె నుండి యది యెట్లాడించిన నట్లాడు మగవాఁడు తనవారి కపకారంబు జేయఁడే? అదిగాక స్త్రీలు భర్త మనస్సెఱిఁగి సమయోచితంబుగాఁ గీలెఱిఁగి వాతఁబెట్టినట్లు కిట్టనివారిపైఁ బగలు బొడమించుటలోఁ గడుం బ్రోడ లనుట నీవెఱుంగుదువు. అందుచే నన్ను దమ్ములకు స్పర్ధలు జనించెను. ఆ యదనెఱిఁగి కొండెగాండ్రు తమ్మునిపై నేరముల నన్నుతో, నన్నుపై నేరములు తమ్మునితో నున్నవి కొన్ని లేనివికొన్ని చెప్పి వైరంబువర్ధిల్లజేసిరి. అయ్యో! మీతోడం జెప్పమఱచితి. హేమచంద్రుని వివాహమైన కొన్నిదినములకు చిత్రభానునకును బరిణయఁ బయ్యె. విదర్భేశ్వరుం డగు రాజవాహనుని గాదిలికూఁతురు సౌభాగ్యవతి యిందుమణి వానిభార్య. ఈలలనవలనఁ జిత్రభానునకు జగన్మోహనాకార యగు నొకకూఁతురు చక్కఁదనంపు

దీవి యగు నొక్కకుమారుఁడు నుద్భవించిరి. అరవిందాదేవివలన హేమచంద్ర మహారాజునకును సోయగంబున మదనుని బాపి పుట్టిన కుమారు లిరువురు గలరు. హేమచంద్రునకు కొడుకులె కాని యాఁడు బిడ్డలు కలుగనందున నతఁడు సోదరునిపై ద్వేష మున్నను వాని కూఁతురును తనకూఁతు రట్లు మిక్కిలి గారాబమునం బెంచుచుండె. ఆబాలిక యల్లారుముద్దుగా నుండుటనో మగఁడు గారాము జేయుటనో యరవిందయు మఱందికూఁతును మక్కువమెయి బెంచుచుండె విదర్భ రాజపుత్రి చిత్రభానుని భార్యయగుటచే నాదేశస్థులు కొందఱు శ్రీనగరమునకు వచ్చి చిన్నరాజు నాశ్రయించి జీవించు చుండిరి. ఇట్లు దినము లొకవిధమునఁ గడచు చుండ యువరాజు భాగ్యదోష మున నానగరమున రాజును విషప్రయోగముచేతఁ గడ తేర్పవలయు నని దురాత్ములు కొందఱు గుట్ర పన్నిరి. రాజద్రోహులు తమలో దా నైకమత్యము లేని మొఱకు లగుటచే నొండొరులతోఁ బోరాడి సంకల్పమును గొనసాగింపలేక పోయిరి. ఒకరి నొకరు చెఱుపఁ దలఁచి యాదురాత్ములు రహస్యములను మెల్లమెల్ల జారవిడువ గ్రమ క్రమంబునఁ గుట్ర బయ పడియె. అందున్నవారిలో గాశ్మీరదేశస్థుఁ డొక్కఁడును లేక యందఱు విదర్భనుండి వచ్చిన చిత్రభానుని యాశ్రితులే యగుటం జేసియు బ్రజలెల్లఁ జిత్రభానుఁడు పరమదుర్మార్గుఁడు. వాఁడే యిది పన్ని యుండఁబోలునని యైకకంఠ్యముగఁ బలుకుట బట్టియు రాజునకు సోదరునిపై గట్టియనుమానము తగిలెను. దానికిం దోఁడుగ నరవిందాదేవియు నందు దొరకెనని లోకప్రవాదమున కనుగుణముగఁ దాళము వేయుటంజేసి రాజున కాగ్రహం బుదయించె. అతనియనుమానము స్థిరపడునట్లు వైదర్భులలోఁ బ్రధాన పురుషులు కొందఱు నదిరేయి పాఱిపోయిరి. అంతట హేమచంద్రుఁడు దక్కిన వైదర్భులం బట్టి తెప్పించి కారాగృహంబుల బెట్టించి

తగు శిక్షలం జేయించి తమ్మునిం బిలిపించి 'వత్సా! నీవు కష్టచరిత్రుం డవై విషము బెట్టి నాయనుసుతుల నపహరింపం దలంచితివి భ్రాతృ వాత్సల్యమున నీ ప్రాణంబులు తీయుటకు నాకుం జేతులాడకున్న యవి. మనజనకుండు దీటిన దాంక నీవు దుస్సహవాసముల్ జేసి చేయరానిపనులం గావించి యకార్యములు చేయవల దని మందలించి నందులకు నన్ను నిందించి నీవు మాతృసమాన యగు నరవిందపై నపవాదంబులు మోపి కూళవై వర్తించితివి. కడుపు చించినం గాళ్లపై బడునన్నట్లు నిన్ను శిక్షించిన నాయప్రతిష్ఠ నాకే కదా యని దూరము యోచించి నీచేతలు బయలుపుచ్చక కడుపులోం బెట్టికొని సైచితిని. ఇంక నీతో నేను వేగంజాల. నిన్నింట నుండనిచ్చుట పక్కలోం బాముచు బెట్టికొనుట. కావున నీ వింక నాకుబిడ్డలు గో నే దేశంబున కైనం జని యచట నుండుము. నీకుం గావలసిన విత్తము నే పంపు చుండెద. ఇంతకన్న నే నీకుం జేయునది లేదు విశ్వంభరుం జని నీ యత్తవారియింట నుంటయు నీకును అక్కడనైన బుద్ధిగలిగి సుగుణ నిధానమగు విక్రమసేనునకు గొడుకు నైనందుకుం దండ్రిని దుర్యశో ప్రాప్తునింగ జేయక జాగరూకతతో మెలంగునది'' అని పలికి కన్నీరు పెట్టుకొనుచు వాని నావలకుం బనిచె.

---

## అయిదవ ప్రకరణము.

సుమంజుడు చింతాక్రాంతుం డగునప్పుడు నిముసములు గడియలై గడియలు జాములై నిశలు దీర్ఘములై తోచు. నరుండు బంధుమిత్రులతోం బ్రసంగించునప్పుడు జాములు గడియలై గడియలు నిముసములై మాపులు కురచలై కనంబడును. అందుచే మనుష్యు లొండొరులతోం జెప్పుకొనుకథలు ముగియకపోవుటయు రాత్రులు మాత్రమే గడచి పోవుటయు సంభవించు చుండు. ఆరాత్రి సుమిత్రుండు

బ్రాహ్మణునితోఁ గాశ్మీర రాజతమ్ముని వృత్తాంతముఁ గొంతవరకుఁ జెప్పునప్పటికి మూఁడు యామములు గడచె. తెల్లవార వచ్చుచున్నది గావున జార చోరులు మొదలగు నిశాచరులు తమ తమ సంచారంబు లిక ముగింపవలసినదో హో యని కాలపురుషుఁడు వేయు కేకవలె 'కొక్కు రోకో' యని జాముకోఁడికూసె. అదివరకు వెన్నెలలు వ్యాపించిన తావులందుఁ గ్రమక్రమంబున నీడలు వ్యాపింపఁ దొడంగె. తఱిపి వెన్నెల లంతకంతకుఁ బలుచన కాఁ దొడంగె. అప్పుడు బ్రాహ్మణుఁడు సుమిత్రునితో "అయ్యా! తెల్లవాఱవచ్చుచున్నది. మనప్రసంగంబు లింక ముగింపవలయు. నీచరిత్రంబు నే వినఁ గోరనీ వది చెప్పక మఱియొకని వృత్తాంతము వినిపింపఁ దొడంగితివి. ఆతనికిని నీకును గలసంబంధ మెట్టిదియో నే నీవఱకు నెఱుంగజాలనైతి. కావున కాలయాపనము చేయక నాకెఱిగింపఁ దగినయంశములన్నియు సాధ్యమయినంత శీఘ్రముగ నెఱిగింపుము. 'ఆలస్యాదమృతం విష'మ్మని బుధులు వలుక వినవే" యనిపలికి వేగిరపెట్టె. అప్పుడు సుమిత్రుఁడును రుద్రభట్టుతో నిట్లనియె. "ఆర్యా! కాశ్మీర రాజు సోదరునకును నాకును గలసంబంధ బాంధవ్యములు కొన్ని కారణములచేత మీకిపుడు నేనెఱింగింపకున్నను ముందు ముందు మీ రెఱుంగక పోరు. మీకనులు గప్పి నే నేకార్య మొనరింపను. కావున నా విషయమై మీసందేహము విడిచి మిగిలినకథవినుఁడు. హేమచంద్రుడు సోదరుఁడగు తన్నిట్లు స్వదేశమునుండి పాఱఁదోలునని చిత్రభానుఁ డెన్నఁడుఁ గలనైన ననుమానించి యెఱుంగఁడు గావున తన యన్న పలుకులు విని యతఁడు నిశ్చేష్టుఁడయి తాను నిర్దోషినని రాజుతో విన్నవింప మనసులోఁ దలంచియు నోట మాటరాక నిలువంబడియె. అతఁడు కొంతవడికి ధైర్యముఁ దెచ్చుకొని యేవియో పలుకఁ బోవునప్పటికి రాజాతావు విడిచి పోవుటయుఁ బరిజనులు

చిత్రభాను నచటనుండి యావలకుం దోడ్కొనిపోవుటయుసంభవించె. గంగిగోవున కలుకపుట్టినట్లు గుణరత్నాకరుఁడగు హేమచంద్రునకు గినుక వొడముటచే నది యనివార్య మని యొంచి మంత్రులు సామంతులు రాజబంధువులు మిత్రులు యువరాజుపక్షమున నొక్కమాటయుం జెప్పక యూరకుండిరి. అనంతరము చిత్రభానుఁడు తనయంతిపురమున కరిగి పాన్పుపైఁ బండుకొని చింతాక్రాంతచిత్తుండయి తన భావిస్థితింగూర్చి తలపోతలకుం జొచ్చె. భార్యయగు నిందుమతి మగని డాసిదురపిల్లుటకుం గారణం బడిగి యాతనిచే నుత్తరంబు వడయ నేరక యావలకుం జని పరిచారకు నొక్కనిం బిలిచి యడిగి వాని వలన భర్త మనస్తాపకారణంబు నెఱిఁగి భయశోకవిహ్వాల యయి యొకచోటఁ గూర్చుండి బాష్పాకులితనేత్ర యయి వగవసాగెను. తలిదండ్రుల ముఖదైన్యము నవలోకించి కొడుకుంగూఁతురు తమ ముద్దుమొగంబులు చిన్నవోవ నాటపాటలు మాని కన్నులు నీరు నించుకొనిరి. భార్యాభర్తలయు బిడ్డలయు దెసఁ గనుంగొని పరిచారకులు గ్రుడ్లనీళ్ళు గ్రుక్కుకొనజొచ్చిరి. అప్పుడు యువరాజు తన మనంబున నిట్లని వితర్కించుకొనియె. "అకటా! అగర్భశ్రీమంతుఁడ నయి మహారాజు కుమారుఁడ నయి యభిమాన ధనుఁడ నయి సౌఖ్యంబులవ్వారిగా నందిన నేనింక నే దేశంబుల నేవిధంబునఁ గాలంబు బుచ్చువాఁడ అనేక రాజకుమారులచే సేవింపబడిన నేను వేఱొకని సేవింపఁ గలనే? నాకేమి? మగవాఁడ. ఎవనింగొలిచి యయిన బట్టె డన్నముఁ దెచ్చికొని పొట్టఁబోసుకొని కాలము గడపుకొనఁ గలను. విదర్భరాజపుత్రియు లావణ్యవతియు మానవతియు నగు నీ పరమసాధ్వి నిల్లాలి నెట కనుపువాఁడ? సంప్రాప్తయావనయై వివాహయోగ్యమైన యనుగుఁ గూఁతురు నెందు దాచువాఁడ? సుకుమారుఁడగు కుమారుని మాట యేమి? విదర్భకుం బోయి యాల్బ

బిడ్డలతో నత్తవారియింట నుందునా ? ఛీ ! అంతవాని కడుపునఁబుట్టి యింత బ్రదుకు బ్రదికి తుట్టతుదకు గతిలేక మామగారిపంచకుఁ జేరుట నావంటి మహాభిమానికిఁ దగినపని కాదు. ఆపత్సమయమున ధైర్యముఁ జిక్కఁబట్టి కాలోచితముగఁ బ్రతిక్రియలు చేయువాఁడె పురుష శబ్దమున కర్హుఁడు. హేమచంద్రుని కోటలో నే నొక్కదినమయిన నిలువరాదు. నా కులకాంతను బిడ్డలను విదర్భాపురమున కంపి నా కష్టములు గట్టెక్కువఱకు నెందేని బ్రచ్ఛన్నవృత్తిఁ జరియించి పగఁ దీర్చికొనియెద. ఇంతకంటెఁ గర్తవ్యము కానఁబడదు.'' అని దృఢ నిశ్చయుఁడై శయ్యాతలమునుండి దిగ్గున లేచి పరిచారకు నొక్కనిం బిలిచి ''యోరీ ! దేవియుం బిడ్డలు నీదినంబున విదర్భకుం బయనమయిపోవలయు. వారికిం బయనమెఱఁగించి తత్ప్రయత్నము గావింపు'' మని యానతిచ్చె. సేవకు లందఱు భయభక్తులతో యజమానుని యాజ్ఞ శిరసావహించి ప్రయాణసన్నాహముఁ జేసిరి. హేమచంద్రుఁడు తమ్మునికూఁతు నెడలేని మక్కువం బెనుచుటఁ జేసి పాయలేక యామెను దనవద్ద విడిచి పొమ్మని యువరాజునకు వర్తమానమంపెను. ఆమాటలువిని యువరాజు 'పాము విరోధియుఁ బడగ చుట్టము నగునా ? నేను బగవాఁడ నయినపుడు నాకూఁతురు నీకెట్లు చుట్ట మగును ? కావున నిట్టిసందేశంబులు పంపవల' దని రాజునకుఁ బ్రత్యుత్తరమంపి కతిపయ పరిచారకులతో నిజకుటుంబమును వెంటబెట్టుకొని శ్రీనగరము విడిచెను. చిత్రభానుఁ డనుభవించిన నాఁటి వియోగదుఃఖము నాఁటి మనోవేదనము నాఁటి హృదయసంతాపము నెవ్వఁడు వర్ణింపఁగలఁడు ! గంభీరభావంబుగల పురుషుం డగుటచే నతఁడు లోలోపలం గుళ్ళుచు బేలవడకపోయినను వాని మొగము కత్తివాటువేసిన నెత్తురు లేక యాంతస్తాపమును బ్రతిఫలింపఁ జేయు వద్ధఘువలె నుండెను. ఇందుమణియుఁ గూఁతేసు గంటికి నేలకు

నేకధారగాఁ గన్నీరు విడుచుచు నందలంబుల నెక్కిరి. తదవులంబట్టి వారలం గొలుచు సేవకులు వావిడిచి యేడ్చిరి. ఆసమయమున యువరాజుం బలకరించిన రాజున కాగ్రహము వచ్చు ననియుఁ బలుకరింపకుండిన చిత్రభానునకు నలుక వొడము ననియు భయంపడి యమాత్యులు దండనాథులు మొదలగు నియోగులు పలుకరించుటయుఁ బలుకరింపకుండుటయుఁ జిరునవ్వులు నవ్వియుఁ జేతులు సాచి సెలవులం గొనియు నూరక నమస్కరించియు నోట మాట రానియ్యక భక్తి నభినయించిరి. హేమచంద్రుఁడు జాలి గుండె కలవాఁ డనిపించుటకుఁ గాబోలు నేనుంగులు గుఱ్ఱంబులు నరదంబులు వలయు నన్ని గొంపోవు మనియుఁ గావలసిన రొక్కంబు బొక్కసంబుననుండి కైకొమ్మనియు నానతిచ్చె, కాని మహాభిమాని యగుచిత్రభానుఁడు వానిమెరమెచ్చుల యౌదార్యమును నిరాకరించె. వానిపరివారమంతయు నిరువదిమంది కంటె దక్కువగనుండె. చిత్రభానుఁడు నగరంబునుండి వెడలిపోవు ననుమాట నగరమునఁ బొక్కటంజేసి వానిపయనముం జూడఁగోరినపౌరులు వీధుల నిరుగెలంకుల బారులు గట్టి నిలిచిరి. చిత్రభానుఁడు గుఱ్ఱంబుల నందలంబుల నెక్కక కాలి నడకం బోయెను. క్రోధమును గ్రక్కువానికన్నులును నిశ్చల చిత్తమును దెల్పు నల్లని కనుబొమలును దుఃఖమున వైవర్ణ్యమును జెందిన మొగంబును జూచి వివేకులగు పౌరులు వానివలన దమ కెన్నఁడో యొగ్గు కలుగక పోదని యొండొరులతో రహస్యంబునఁ జెప్పుకొనసాగిరి. నగరంబు వెడలినతరువాత వృత్తాంతము నే నిపుడు చెప్పనక్కఱలేదు. చిత్రభానుఁ డాలుబిడ్డల నప్పుడ విదర్భాపురమునకు బంపి తా నొంటిగ నీవనప్రాంతముల సంచరించు చున్నవాఁడు హేమచంద్రుఁడు తనకు నాఁడు చేసిన యుపకారంబు మఱువక కడుపు నిండ నక్కసు బెట్టుకొని పగఁదీర్చుకొనుటకై సమయము నెదురు

చూచుచున్నాఁడు. మీరు కాశ్మీరనగరమునకుం బోవ నిశ్చయించు కొనుటచే మీసహాయము నపేక్షించు చున్నవాఁడు. వినయము గల వాఁడు విక్రమము గలవాఁడు, మీ యాశీర్వచనమున నభివృద్ధికి రాఁ దలంచినవాఁడు. సోదరుఁడు తన్ను దేశమునుండి వెడలనడచి నందు కతఁడంతగా వగచుట లేదు. మున్ననుభవించు మహదైశ్వ ర్యంబు దొలంగి పేదతనము వచ్చినందుకు విచారించుటయు లేదు. రాజద్రోహము భ్రాతృద్రోహము నతఁడు సేయఁబూనినవాఁడని యప నింద వానిపైఁ బడినందుకుఁ జిత్రభానుఁడు రేయింబవలు పడియెడు మనస్తాప మింతింత కాదు. యశఃకాములగు సత్పురుషులు నింద నొందుటకన్న మరణ మొంద నిచ్ఛగింతురు గదా? ఈయపనింద మోపక రాజు వాని నూరక పురినుండి వెడల నడచిన బాగుండును. చిరకాలమునుంచి తమ్ముని నెట కేనియుఁ బాఱదోలఁ దలంచి యే యుపాయంబునుదోచక నందు విచారించి యెట్టకేల కీనెపము బన్ని చేయఁదలంచిన దంతయు హేమచంద్రుఁడు చేసె వచ్చినయపనింద రానేవచ్చినది. కలిగిన మనస్పర్ధలు కలుగనే కలిగినవి. చిత్రభానుఁ డెంతసద్వర్తనుఁడయినను హేమచంద్రుఁడు వాని నింక మన్నింపఁడు. తాను నిర్దోషినని తమ్ముఁడెన్నియొట్లు పెట్టుకొనిన నన్న యవి విశ్వ సింపఁడు. రాచపగ త్రాఁచుపగ వంటిది. ఐశ్వర్యంబునఁ జిత్రభానుఁ డు హేమచంద్రునకుఁ దీసిపోయిన నిరువురు నొకతండ్రిబిడ్డలేయగు టంజేసి పంతమునఁ బౌరుషమునఁ దీసిపోఁడు. కావున వానిప్రతిజ్ఞ వినుండు. రాజనక ప్రజలనక శత్రులనక మిత్రులనక బాలురనక వృద్ధులనక స్త్రీలనక పురుషులనక ఘనులనక నీచులనక పండితు లనక పామరులనక కాశ్మీరదేశస్థులలోను శ్రీనగరవాసులలోను దన కయి యపకారంబునఁ దగిలియున్న వారిని రాజున కాలోచనలు చెప్పిన వారిని కుట్ర విని తన కెఱిఁగింపక యూరకుండినవారిని లో

కులు గడగడ వడకునట్లు స్త్రీలగుండె లవియు నట్లు తొల్లి యశ్వత్థామ యర్ధరాత్రమున నుపపాండవులం గడతేర్చిన కథలు జ్ఞప్తికి వచ్చునట్లు చాటుగనో బహిరంగముగనో స్వయముగనో పరసహాయమునవో న్యాయముననో యన్యాయముననో శస్త్రముననో విషాన్నలనో హేమచంద్రుని సకళత్రముగ ససంతానముగ సబాంధవముగ సమిత్రముగ సపరివారముగ భూతబలి యిచ్చి రాజ్యలక్ష్మిని జేపట్టి చిత్రభానుఁడు క్రొత్తనెత్తుటిగంధముతో భూదేవి నలంకరించు. ఈ ప్రయత్నమ్మున నెఱవేఱఁజాలక నొకవేళ తాను జచ్చినం జచ్చు సంపూర్ణముగఁ బ్రతి గొనసాగింపఁ జాలకున్నను గొంతవఱకైన నతండు నిర్వహించు. నిర్వహింపఁజాలకున్నను బ్రయత్నించు. ఆ చిత్రభానుఁడు నాకు బరమాప్తుఁడు. వానికి నాకుఁ బ్రాణ మొక్కటియ. వానికి మీరు గావించిన మేలు నాకు గావించుట వానిని సంతోషింపఁజేయుట. నన్ను సంతోషింపఁజేయుట వేయేల? నన్నే వానిగా భావించి యన్నిపనులం జేయుఁడు, అతనికోరిక పండిన మీ యదృష్టము పండును. అతఁడు రాజైన మీరు మంత్రులగుదురు. మీకుఁ బరమశత్రుఁడగు మాళవరాజు సుదర్శనుఁడు హేమచంద్రునకుఁ బ్రాణమిత్రుఁడు. వారిరువురు బాల్యకాలమునఁ గాశికానగరమున శారదానందస్వామియొద్ద శాస్త్రాధ్యయనము జేయుటంజేసి సహపాఠులు. మీపగతుఁడ నతఁడు చెలికాఁడగునని యైన నాయందలి వాత్సల్యముననైన నీకూరీపనిఁ జేయఁబూనవలయును. అచటినుండి నేను చిత్రభానున కేమి చేయఁగలవాడ నని మీరడుగవచ్చును. వాని సేవకులలో నమ్మఁదగిన వారిరువురు మీవెంట వత్తురు. వారి నిరువుర రెండుకన్నులుగాఁ జేసికొని యెల్లవిషయములం జూచుచు వారిరువురఁ జేతులుగాఁ జేసికొని యెల్లపనులం జేయుచు మీరు శ్రీనగరమున నేవేళ నెయ్యది జరగునదియెల్ల వానికిం దెలియునట్లు

వేగు నడుపవలయును. మీరు కాశ్మీరంబునకు బోవునప్పు డచ్చటి ప్రజలు హేమచంద్రుడు సుగుణనిధి యనియు ధర్మరాజనియు వాని రాజ్యంబు రామరాజ్య మనియు వేనోళ్ళం బొగడుచుందురు. మీరది నమ్మి చిత్రభానుని మఱచిపోయెదరుసుడీ. హేమచంద్రుడు ప్రసన్న ముఖుఁడు ఆ కారణంబున మీరొకసారి వానితో మాటలాడిన మీ రాతనిపక్ష మగుదురు. వానిహృదయము బెబ్బులి. నోరు రామచిలుక' మనస్సు విషపుంజము. నోరు తేనెకుండ. కావున వాని వలలోనం బడకుండ గడు జాగరూకతతో మీరు మెలంగవలయు. నాచెప్ప వలసిన కథ ముగిసినది. ఇంక మీయనుగ్రహంబునకై ప్రతీక్షించు చున్నవాఁడ దుష్టవార్తలను బీరెండలు సోఁకుటచే శోషిల్లియున్న నా వీనులపై నీవెన్నెలల కన్నఁ జల్లనై కృపారసగర్భితములయి సుఖ ప్రదలగు మీవాక్యామృత వర్షంబులు గురియింపరే''యని సుమిత్రుడు రుద్రభట్టు నడుగులపైఁ బడి నమస్కరించె. రుద్రభట్టు చిత్రభాను నెన్నండును గని యెఱుఁగకున్నను సుమిత్రుడు వానిపక్షమును బూని పలుకుటకును విశేషించి యతఁడు తన 'కాపత్కాలమున సాయముఁజేసిన మిత్రుండగుటను వానిమాటలు ద్రోసిపుచ్చ లేక తనపై మోపినది మహాభారమని యపాయసంభృతి వాని యెఱిఁగియు దాని కియ్యకొనదలంచి కృతనిశ్చయుఁడై యడుగులపైఁ బడిన సుమిత్రు లేవనెత్తి కూర్చుండఁబెట్టి యిట్లనియె. నాయనా! నీవు నాకుఁ బరిత్రాతవు. నీమాట నాకు రాజశాసనంబు. చిత్రభానుఁడు నీకాప్తుఁ డగుటంచేసి నాకాప్తుఁడు. నామిత్రుని మిత్రులు నాకు మిత్రులు. శత్రునిశత్రులు నాకు శత్రులు. మిత్రునిశత్రులు నాకు శత్రులు. శత్రునిమిత్రులు నాకు శత్రులు. కావున హేమచంద్రుడు నాకు శత్రుఁడు. చిత్రభానుఁడు మిత్రుడు. చిత్రభానుఁ డింక కాశ్మీర దేశాధిపతి యయ్యెనని నమ్ముము. అదిగో తమ్ముల కపకార మొన

ర్చినరాజు వెలవెలఁబోవుచు పడమటికొండలలో నేకాకియై యస్త మించుచున్నవాఁడు వాని మరణంబుకై పిలపించునాప్తుల వచనం బులుఁబోలె పులుఁగులు మొఱయుచున్నవి. వానిసంపద లెగిరిపోయి నట్లు వెన్నెల లెక్కడివక్కడ యంతరించు చున్నవి. వాని బంధుల సంఖ్య సన్నగిలునట్లు చుక్కలగుమి యంతకంతకు క్షీణించుచున్నది. హేమచంద్రుని యధికారము పోయి చిత్రభానుని యధికారంబు దేశంబున నెలకొను నని తెలుపుటకో యనఁ జంద్రాస్తమయ మగు చున్నది. ఒక్కఘడియలోన భానుఁడుదయింపఁ గలఁడు" ఆపలుకులు విని సుమిత్రుఁడు ప్రహృష్టహృదయుఁ డయ్యె. అంతలో భల్లున తెల్లవాఱె.

---

## ఆఱవ ప్రకరణము.

కృష్ణపక్షపాడ్యమిదినమునఁ బ్రాతఃకాలమునఁ బడమట నస్త మింపఁబోవు చంద్రమండలమును దూర్పునఁ బొడుపుగొండపై నుద యించు సూర్యమండలమును గగన మను నింద్రనీలమాణిక్యపుటరు గుపై నతికిన వజ్రపుబిళ్ళయుఁ గెంపుబిళ్ళయు ననఁ దేజరిల్లుచు జూ పరకు నీశ్వరమహిమాతిశయములు జాటుచు డును. ఉదయమున నారెండు బింబములు గనుఁగొనువారికి జీవయాత్ర ముగింపఁబోవుచు నవసానదశలో నున్న వృద్ధునియు, జన్మమంది మహాభివృద్ధిఁ గాంచఁ బోవు బాలునియు నవస్థలు మనసునకుఁ దట్టు. రాత్రి యొండొరుల చిత్రచరిత్రములు జెప్పుకొనుచు జాగరము చేసి సుమిత్ర రుద్రభట్టులు తెల్లవారినపిదపఁ గాలకృత్యములఁ దీర్చుకొనఁబోయిరి. గాయము తగులుట మొదలు రుద్రభట్టు నదివఱకునడువలేక పల్లియలోని చెఱు వులో స్నానము చేయుచుండెను. ఇల్లు వెడలినది మొదలు తన

కబ్రాహ్మణ సంపర్కము విశేషముగా సంభవించుటచేతను గాయము కతమునఁ గొన్ని దినములు స్నానముమాని యపరిశుద్ధుడయి భోజనము చేయవలసివచ్చుటచేతను బ్రాహ్మణోత్తములు చేయవలసిన నిత్యకృత్యములు ననుష్ఠానము సరిగాఁ దానప్పుడు నిర్వర్తించకపోవుటచేతను బ్రాహ్మణుఁడు పవిత్రమయిన సింధు నదీస్నానము సకల దోషాపహారమనియుఁ దనుగావించిన తప్పునకుఁ బ్రాయశ్చిత్తమని యు నిశ్చయించి యయ్యేఁటికిఁ బోయెను. పోయి యచ్చట యఘమర్షణస్నానము జేసి భాస్కరునకు యథావిధిగ నర్ఘ్యప్రదానముఁ జేసి యనంతర మిసుకతో లింగముఁ జేసి పార్థివమును జేసికొని మరల నింటికి వచ్చుచు ద్రోవలో సుమిత్రునికోరికయుఁ దాను కావించిన వాగ్దానమును దనతలపైఁబడిన కార్యభారమును దలంచుకొని తనలోఁ దా సిట్లని విచారింపఁజొచ్చె. ఈసుమిత్రుఁడు నావృత్తాంతము నంతయు మెల్లమెల్లగి నావలనవిని తనవృత్తాంతము జెప్పుమని నేనడిగినప్పుడు దాని జెప్పక వేరొకరాజకుమారుని చరిత్రము నాకెఱిఁగించె. ఆరాజనందనుఁడు కనపడఁడు. వానిం జూపు మని వేఁడిన నితఁడు చూపఁడు. ప్రపంచమున నట్టిరాజకుమారుఁడు కలఁడా యని యొకమాఱును నిజముగా నుండెనేని సుమిత్రుఁడే యతఁడై యుండునా యని యొక మాఱును నామనంబునకు సందియంబులు బొడము చున్నయవి. సుమిత్రుఁడే యారాజకుమారుఁడయినచో నతఁడారహస్యము నెఱిగింపక యేలదాఁచుఁ? కానియెడల నావలన మహోపకారమును గోరుచున్న రాజకుమారుని నాకుంజూపక దాఁచ నేల? నొక్కయుడుగుచున్న నతఁడేమియనుకొనునో యను భయముకలదు. అడుగకున్న సందేహము మనస్సును బాధించుచున్నయది, అది యటుండ నవస్థాభేదముచే నేనిప్పుడు రాజకార్యములలోఁ బ్రవేశింపవలసివచ్చె సుమిత్రుఁడు నాతలపై మహాభారము మోపినాఁడు. అతఁడు

నా కుపకారి యగుట వానిమంచితనము దలఁచి యేదియుం జెప్పఁ జాలక మొగమోటమిచే వాని చెప్పినతెఱఁగున నడచువాఁడ నని వాగ్దానముఁ జేసితిని. స్వర్గమునకుఁ బోయినను విడియాకులు దప్ప వన్నట్టు రాజద్రోహమునకై దేశమునుండి బహిష్కరింపఁబడిన నేను మరల రాజద్రోహులకే సాయము జేయవలసివచ్చు. కాశ్మీరమునకు నేనుబోయి ప్రజారంజకుఁ డయిన హేమచంద్రునిపైఁ గుట్రలు పన్నినచో నా గుట్టుమట్టు వెల్లడికి వచ్చునేని నాకు సేమమగునే? సుదర్శన మహారాజువలె హేమచంద్రుఁడు నన్ను బ్రాణంబులతో నిలువ నిచ్చునే? ఇదివఱకే యాలుబిడ్డల నెడఁబాసి యేకాకినై కష్టములు గుడుచు చున్ననాకు గోరుచుట్టుపై రోఁకటిపోటన్నట్లు మునుపటి కంటె నెక్కువ వెతలు సంభవింపకుండునే? ఏబది సంవత్సరములు సెల్లుటచే జీవయాత్రలో సగము గడపి యవసానకాలమును సమీపింపఁబోవు చున్న నేను గామక్రోధాదుల జయించి యేనదీతీరమున నైన నే యగ్రహారమునన్నైన నొక కుటీరంబు గావించుకొని కృష్ణా రామా యనుకొనుచు శిష్యులకుఁ బాఠములు చెప్పుకొనుచు దనివి గలిగి సుఖముగ నాలుబిడ్డలం గలిపి కాలక్షేపము జేయక తలకు మీఱిన పనులకు రాజ్యవ్యవహారంబులం బ్రవేశించుట యుచితమా యనుచితమా! యని యాలోచింపవలసియున్నది. సుదర్శనుఁ డెగ్గచేసెనని రాజసేవను నిందించిన నేను వెండియు రాజసేవ గైకొనుట యేటితెలివి. చిన్ననాఁటనుండియుఁ బరిచయము గల సుదర్శనుఁడె యంతసేయ నెన్నఁడు మొగమయినఁజూచి యెఱుఁగని చిత్రభానుఁడు నన్ను బువ్వులం బూజించునే? ఒక రాజును విడచి మఱియొక రాజు నాశ్రయించుట తోఁడేలు బాఱినుండి తప్పించుకొని పులిచేఁ జచ్చుటకాదే? నన్నెన్నఁడు నెఱుంగనివానికి నాకపకార మెప్పుడు చేయనివానికి హేమచంద్రునకు బుద్ధిపూర్వకముగా నెగ్గు జేయఁ

తలఁచుట కొఱవిఁ జేఁగొని తల గోఁకికొనుట కాదే? మహావైభవ
ముతో నవని నేలుచున్న హేమచంద్రు నాశ్రయింపక యేలుటకు
బెత్తెడునేల యైన లేక కార్యసాధనమునకు గావలసినధనమును లేక
తినుట కన్నము నుండునిల్లు లేక సేవించు పరివారము లేక నా కన్న
హీనుఁడై దీనుఁడై సంచరించు చిత్రభానుని గొల్చి దేహయాత్ర
నడపఁ దలఁచుకొనుట శిలాప్లవముఁ జేసికొని యీఁద నేటఁ బడుట
గాదే? ఇవియన్నియు సమయానుకూలంబుగ నాకుం బొడమఁదగిన
సందియంబులే యైనను పౌర్వాపరంబులు చక్కఁగ విచారించి విషయ
మును బాగుగఁ దఱచి చూడ నా కిప్పుడు చిత్రభానుని సేవించుటయే
కర్తవ్యమని తోఁచుచున్నయది ఏమన నాకుం బరమశత్రు వయిన
సుదర్శనుని సాధించుటయే నా పురుషార్థము గదా? సుదర్శనునకు
మిత్రుఁ డగుటచే హేమచంద్రుఁడు నాకుం బగతుఁడే కదా. ఆకార
ణంబున హేమచంద్రునికి సోదరుఁడు బగతుఁడు నగు చిత్రభానుఁడు
నా కవశ్యము మిత్రుఁడే కదా. అందుచే చిత్రభానుని సేవ నంగీకరించి
వానిపక్షమును బూని పనిచేసి వానిసుఖదుఃఖముల నే ననుభవించెద.
అట్లు వానిని సాధించి కృతార్థుఁడనైన పిదప శౌర్యమును విడచి
బ్రాహ్మణోచిత మగు శాంతము నవలంబించి ముక్కు మూసికొని
తపస్సుచేయుచు శేషించినకాలము గడపెదను. ఇరువదియొక్క
మాఱు రాజకులంబు లనువృత్తంబులఁ దన గండ్రగొడ్డలితో నఱికి
నూఁకటివేళ్ళతోఁ బెల్లగించి తద్రక్తమును పితృదేవతలకుఁ దర్పణము
జేసి యనంతరము తపోనిష్ఠ స్వీకరించిన పరశురాముఁ డట్లు,
నేనును బౌద్ధరాజకులమును నిర్మూలించి చరితార్థుండనయ్యెద. నడుమ
నెన్నియంతరాయములు వచ్చినను దలపెట్టినకార్యంబు కొనసాగిం
చుట యుత్తమపురుషలక్షణం బని పెద్దలుచెప్పఁగా విందు. కావున
నేనింకఁ గాశ్మీరంబునకుఁ బోయి సుమిత్రుఁడు చెప్పిన చొప్పున

నడచుట ముమ్మాటికి నిశ్చయంబు." ఈ వితర్కము సమాప్తమగు నప్పటికి రుద్రభట్టు తన వాసస్థానమునకు వచ్చి తడిబట్ట లారగట్టి వంట జేసికొని భుజించెను. సుమిత్రుఁడును భోజనానంతరమున రుద్రభట్టుం గనుంగొని "దేవా! మీరు పయనమయిపోవుటకు ముహూర్తము నిర్ణయింపుఁడు. మీరు జ్యోతిశ్శాస్త్రమున జాతకసిద్ధాంత భాగములయందే కాక ముహూర్తభాగమునందును గడు కృషి చేసినవారగుటచే మీరు పెట్టినముహూర్త మమోఘముగ శుభప్రదాయకమయి యుండవలయు. పోవునప్పుడు కరటకుని బింగళకుని మీ వెంటఁ గొనిపొండు. వారు మీ జెప్పినచొప్పున వర్తించువారు. వాండ్రిరువురు మీకు కుడియెడమ చేతులట్లు సంచరింతురు. అందు కరటకుండునక్కవోలె జిత్తులుపన్ని ప్రజలం బేలపుచ్చనేర్చు. పులి వలెఁ బొంచుండి మంచిసమయమునఁ బగతుని పైఁబడి చెరుపనేర్చు. అవసర మగునప్పుడు లేడి యట్లు నేల నడుగు లంటకుండ బఱుగెత్త నేర్చు. పోతుటీఁగకుం జొరరాని రహస్యపుఁ దావులకుఁ బోయి తన జాడ నొరులెఱుంగకుండ నెంతటిరహస్యము లయిన నెఱిఁగిరానేర్చు. పింగళకుఁడును వాని సాటివాఁడు. వారల ప్రజ్ఞాదికములు ముందు ముందు మీర లెఱుంగుదురు. మీరింక పయనమై సత్వరమునఁ బోవలయు. కాలహరణంబు శత్రువులకు లాభకరమును, మనకు నష్టకరమును జుండీ" అని పలుక రుద్రభట్టు కొంచెము విచారించి "నాయనా! తేఁపుదయమునఁ బ్రయాణమునకుఁ దగిన శుభముహూర్తమున్నది. కావున నేనీ ప్రదేశము తేపు విడిచెదను. నీవు చెప్పిన చొప్పున నడచువాఁడ. నీవు చెప్పిన దంతయు నామనంబున జ్ఞాపకమున్నయది." అని పలికి సుమిత్రుని మనంబునకు సంతోషముఁ గూర్చెను.

# ఏడవ ప్రకరణము

భరతఖండమునఁ బుణ్యదాయకము లగు నగరములలో నుజ్జయిని యొకటి. శివుఁడు మహాకాళేశ్వరుఁ డను పేరుదాల్చి యచ్చోట వసియించుచుఁ దన్ను సేవించు భక్తజనంబులకు ముక్తిఁ గరతలామలకముగఁ జేయుచుండునని యార్యులు వక్కాణింతురు. ఆ దేవునకుజనుగు నిరుపమానవైభవంబులను నిత్యకళ్యాణంబులను గనుగొనువారు, శంకరుఁడు చిరకాలమిల్లులేక వల్లకాటఁ జరియించి కట్టగుడ్డ లేక కొంతకాలము దిగంబరుఁడై యెట్టకేలకు పులితోలు దాల్చి భిక్షాటనమున జీవించుచుఁ జేత నొక పుంకమైన లేక మానిసి పుర్రె పాత్రగఁ జేసికొని చిరకాలమిబ్బందులు పడి పడి తనదురవస్థ భరింపనోపక జన్మమధ్యమున నొకసారియైనఁ గడుపునిండఁ గూడు తిని యొడలినిండ బట్ట గట్టుకొని చల్లనితావునఁ దలదాఁచుకొన నిశ్చయించి తనయాలితోఁగూడి విదేశములపాలై పోయి తుదకు సర్వవిధముల యోగ్యమయి సుభిక్షమయి వెలయునుజ్జయినిం జేరెనో యని తలంపవలసి యుండును. ఈనగరము పూర్వకాలమునుండియుఁ బురాణములయందును దేశచరిత్రముల యందును బ్రసిద్ధిగాంచి నాగరకతకును విద్యలకును సంపదలకును నిలయమై యెన్నిక వహించెను. ఏ రాజు పేరు భరతఖండమునఁ బ్రతిభాగమున బ్రతిగ్రామమునఁ బ్రతి గృహమున బ్రతిమనుష్యునిచేత స్మరింపఁ బడుచుండెనో యే రాజు మన దేశముపై దండెత్తిన మ్లేచ్ఛుల నోడించి పాఱఁదోలి వైదిక ధర్మంబులఁ బ్రతిష్ఠించి భరతఖండము నేకచ్ఛత్రముగఁ బరిపాలించుటంజేసి వానికీర్తి యాచంద్రతారార్కముగ నవనిలో నుండునటులు వానిపేర శకము ప్రారంభింపఁబడియెనో యే రాజు చిత్రకథల విననఁ జదువుకొనిన నెవ్వగ లన్నియు నడంగ మనుజు

లానందాబ్ధి నోలలాడుదురో యాసాహసవిక్రమార్క భూపాలుండు పాలించిన దీయుజ్జయినీనగరమే. ఈపురమున కధిపతియై ప్రద్యోత మహారాజే తొల్లితనకుఁ బగతుఁడును పాండవవంశజుఁడును గౌశాంబి పురాధిపతియు వత్సరాజునగు నుదయసేనమహారాజును మాయో పాయమునం బట్టితెచ్చి తనకోటలో బంధించె. ఈప్రద్యోతమహా రాజుకూఁతురగు వాసవదత్తాదేవి నే కోటలోబంధింపఁబడిన వత్సరాజు మోహించియంతఃపుర పరిచారికల చేత రాయబారమునఁ బంపియామెకు దనపై వలపు గలిగించి యెట్టకేలకుఁ దండ్రికన్నులుగప్పి యామెను వెంటఁబెట్టుకొని సోవలకుం బోయి వివాహంబు జేసికొనియె. సకల కవికులగురుఁడనివిఖ్యాతిఁగాంచి నాటకరాజమని యెల్లరచేవినుతి గాంచిన యభిజ్ఞానశాకుంతలమును రచియించిన కాళిదాస మహాకవి యుఁ బాణినివ్యాకరణమునందును బతంజలి మహాభాష్యమునందునుగల కొఱఁతలబూరించి గీర్వాణ వ్యాకరణములకు వార్తికముల వ్రాసిన వరరుచియు జ్యోతిశ్శాస్త్రసారమునుజూచి బృహజ్జాతకాదిమహాగ్రం థముల నిర్మించినవరాహమిహిరుఁడును నిఘంటువులలో నెల్ల శ్రేష్ఠమై సంస్కృతపదపారిజాత మనిచెప్పఁదగిన నామలింగానుశాసనమును రచియించి మృతజీవుఁడైన యమరసింహుండును దక్షునికోరలవిషం బుచే భస్మపటలమైనవృక్షమును గ్రమ్మరబ్రదికించి వైద్యశాస్త్ర మును భూలోకమున నవతరింపఁ జేసినధన్వంతరియు సుభాషితరత్నా వళియను పేర నీతిశృంగారవైరాగ్యములఁ గూర్చి మూఁడు శతకంబు లంజెప్పి జగజ్జనులకు మహోపకారంబుగావించి కీర్తి శేషుండైనభర్తృ హరియు నీపట్టణమునం దేవసియించిరని పూర్వకథాకోవిదులగు పెద్దలు పలుకుచుందురు. కాళిదాసుని చేత మేఘసందేశమునందు మిగుల హృదయంగమంబుగ వర్ణింపఁబడిన దీపురతిలకమే జ్యోతిష్కులచే గణితములనిమిత్తము మధ్యస్థానముగ నంగీకరింపఁబడినదీనగరరాజ

మే. అవంతి యనియు విశాల మనియు నామాంతరములు గలిగి వ్యవహరింపఁబడిన దీపుటభేదమే.

ఈకథ జరిగినకాలమున నుజ్జయినీనగరము సుదర్శనుఁ డను రాజశేఖరునిచేఁ బరిపాలింపఁబడుచుండె. ఆసుదర్శనుఁడు సార్థక నామధేయుఁడని చెప్పుట యతిశయోక్తి కాదు. వానిచక్కఁదనము ముందు మన్మథునిమేనియందము కనంబడదని పలుకుట పొగడ్తగాదు. విలువిద్దియయందు నేరిమింగనినయర్జునుఁడు తెల్లఁబోవవలసివచ్చుననుట వర్ణనముగాదు. అతనియైశ్వర్యము నెదుట నష్టైశ్వర్యములు గల మహేశ్వరుఁడు దరిద్రుఁడై తోఁచు ననుటకవిసమయము గాదు. మేఘుఁడో కానొకప్పుడు వృష్టులం గురియక వట్టిగర్జనంబుఁ జేసి పోవచ్చునుగాని యాఘనుఁ డాశ్రితజనంబులకుఁ గావలసివచ్చినప్పుడు భూరివృష్టుల నొసంగక పోఁడు. ఆరాజు బౌద్ధమతావలంబకుఁడు. అట్లయ్యు బౌద్ధులయెడఁ బక్షపాతమును బ్రాహ్మణులయెడల నిరసనమును లేక సర్వసమానుఁ డయి లోకరంజకముగఁ బ్రజాపాలనము జేయుచుండు. అతఁడు దుర్జనులకు భయంకరుఁడు. సజ్జనుల కభిగమ్యుఁడు. దీనులకు మందారము. పండితులపాలిటి పారిజాతము దయాసాగరుఁడు. నోరెఱుఁగనిజంతువుల గొంతులు పరపరఁగోసి మనుష్యులకడుపు నిండించుకొనుట మహాపాతకమని తలఁచి యానరనాథుఁడు మాంసభక్షణము మానెను. మనుజులకుఁ గీడుచేసినవార లెత్తెఱంగున దండనలకుం బాత్రులగుదురో జంతువులకు హానిజేసిన వారు నత్తెఱంగున శిక్షార్హులె యని యతడు శాసించె. అతని మనసెంతమెత్తనిదియో కాని పాము తేలు మొదలగు విషక్రిములనైనఁ దనయెదుటఁ జంపుచుండ నాతఁడు జూచి సహింపఁజాలఁడు. ప్రజాక్షేమమునిమిత్తము తనశాసనముందప్పి నడిచినతులువల దండించుచుండును. కాని శిక్షలు తప్పుచేసినవారలనడతల దిద్దుటకై యేర్పడిన

వని యెఱింగినవాఁడు కావున దండనలు క్రౌర్యరహితము లగునట్లును సాధ్య మగునంతవఱకుఁ గృపామిళితము లగునట్లును జేయుచుండును. వేయేల? ఆ మహారాజు సద్గుణంబులపారంపుముద్దయని ప్రకృతిజనంబు లెల్ల వానిం గొనియాడుచుందురు. ఆ భూకాంతుని కులకాంత యానాఁడు గలకాంతలలో నెల్ల లావణ్యవతి. కోసలేంద్రుఁ డగు శుకధ్వజుని యనుంగుఁ గూఁతురు. ఆమె పేరు చంద్రప్రభ. గొనముల దొంతి అగు నాయింతి యానాటి కాంతల కెల్ల మేలుబంతియై యామహారాజున కెల్లవిధములఁ దగియుండె. ఆదంపతుల పరస్పరానురాగపు మొదటిపంటయో యన్నట్లు వివాహ మైనయచిరకాలమున కే కువల యానందవర్ధనుఁడొకఁ డుదయించె. రమాకుమారునికన్న సుకుమారుఁడగు నా కుమారునకు సుదర్శనుఁడు తండ్రిపైఁ దనకుం గల యనురాగమును గౌరవమును జూపుటకై మకరందుఁ డని పేరు పెట్టెను. ఈ గ్రంథమున వర్ణిత మగుకథ జరుగునాటికి మకరందుఁడు పదునెనిమి దేండ్లప్రాయమువాఁడు.

వెనుకటి ప్రకరణములయం దుఁ జేర్కొనఁబడినరుద్రధ్వజుఁడు జయసేనగరమునుండి వెడలిపోయిన కొన్నిదినములకు నొక్కనాఁడు ప్రాతఃకాలమునఁ దనయంతిపురమున నొకగదిలో సుదర్శననరేంద్రుఁడు తల్పమయ్యంబున నుదయించుప్రభాకరుని చందంబున సుదర్శనుఁడై యెద్దియో యోచించుచు నొకపీఠమునఁ గూర్చుండె. అప్పుడు ప్రతీహారి మార్గంబు జూపఁ బ్రధానమంత్రి యగురత్నసేనుఁడు మెల్లమెల్ల రాజసన్నిధి కరుదెంచి వినయంబున జోహా రొనరించి యిట్లనియె. "దేవా! కేసరి దేవరపాదసందర్శనార్థమయి క్రమ్మర వచ్చియున్నవాఁడు. ముదల యయ్యెనేని వానిం దోడి తెచ్చెద" అనవుడు సుదర్శనుఁడు సచివుని గనుంగొని "రత్నసేనుఁడా! వాని నేల నీవెంటఁ గొని రావైతివి? సత్వరంబ చని తోడ్కొని" రమ్మని సెలవిచ్చి వాని నా

వలనుం బనిచె రత్నసేనుం డవ్వాలకుం జని యొక్క ముహూర్తంబున గేసరిని వెంటబెట్టుకొని రాజసమ్ముఖమ్మున కేగుదెంచె. కుఱంగటకు వచ్చిన కేసరీరత్నసేనులం గనుంగొని రాజు వారి నిరువుర నుచితాసనంబులం గూర్చుండుం డని యానతిచ్చె. రాజానుమతంబున రత్నసేనుం డుచితాసనంబున నాసీనుం డయ్యె. కేసరి కూర్చుండక మహారాజు నడుగులపయింబడి బాష్పాకులితనయనుండై కన్నీట సుదర్శుని పాదముల నభిషేకించుచు గద్గదస్వరంబున నిట్లనియె. "ఓ దయామయా! నేను మహాపాతకుండను రాజద్రోహిని, దేశద్రోహిని, దేవర సన్నిధిని పీఠముపై గూర్చుండుట కర్హుండంగాను. చిన్ననాటనుండియు మీయడుగులం గొలిచి మీమన్ననలఁబడసి మీయన్నము దిని మీ బట్ట గట్టి మిత్రులకుం గనులపండువుగను శత్రువులకుం గన్నెఱ్ఱగను జుట్టంబులకు మనః ప్రమోదకరముగ నుండునట్లు మహదైశ్వర్యంబుల ననుభవించు మీయంతవాఁడనై యుండియుఁ దుదకు మీపాదసేవఁ జేయుచుఁ గుడిచికూర్చుండలేక యొడలు క్రొవ్వి లంచగొండినయి కృతఘ్నుండ నయి చెనటియగు రుద్రభట్టు పలుకులు విని మీకును వైదర్భులకును బొడమిన వివాదంబు న్యాయముగు పక్షము విడిచి యన్యాయంబుగ మీ గ్రామంబులం గొన్నిటిఁ బరులకు విక్రయించి యాపాపపుధనంబు సంగ్రహించితిని. స్వామిద్రోహముఁ జేసిన నీచుని గొఱతవేయించక ప్రాణదానంబు గావించిన మహానుభావుల రగు మీ దయారసంబు నేమనికొనియాడుదు ? దేవా! మీగ్రామంబుల వైదర్భులకు విక్రయించిన నాఁడె చిరసంపాదిత మగు నాప్రతిష్ఠ విక్రయించితి. ధనముకన్న నుత్కృష్టమగు గౌరవంబును విక్రయించితిని. పూర్వసంచిత మగు పుణ్యము విక్రయించితిని. పాపమున కొడిగట్టి మెట్టిటో మూటగట్టుకొన్న యాధనంబును తుదకు నాకుం దక్కదయ్యె. నరులెంతెంత చాటుచాటునఁ జేసినదోసంబులును బయలు

వడకపోవు; కావున నాయొనర్చిన పాపంబును బ్రద్దలై వెల్లడియయ్యె. నాకావించిన యకార్యంబునకు నేనిప్పుడ నరకము ననుభవించుచున్నాఁడను. ఎట్లన, దేవరకు నాయెడఁ గల యాదరం బడుగంటె. ప్రజలకుం గల గౌరవము గంగఁగలిసె. నెయ్యురకుఁ గల మక్కువ నేలపాలయ్యె. గంపెడు బలగముండినే నిప్పు డేకాకినైతి. ఎట్టిటో పొట్టబోసికొని తినుచుండియు దుర్బలుఁడనైతిని. పూర్వపరిచితుల కందఱకు దొంగనైతిని. వేయేల? గౌరవహీన మయిన యీ బ్రదుకు బ్రదికించుటకంటె నాడు మీరు శిరచ్ఛేదము జేయించిన నా కెక్కుడుపకారంబై యుండు. తుచ్ఛప్రాణంబులపైఁ గల తీపిచే బలిమిని నాయంతట నేను జావలేకసుఁడీ యీ మొండిదేహంబు నింతకాలంబు నిలుపఁగలిగితిని. నిర్ధనుఁడనై నిర్యశుఁడనై నిర్బంధుఁడనై నిష్పుణ్యుఁడనై చుట్టములకు నెయ్యురకు నాలుబిడ్డలకు లోకులకు భూమికి బరువుగ నున్న నేనీ పనికిమాలిన బ్రదుకింక బ్రదుకజాల. ముందు వెనుక లరయక దొరకెఁగదా సందని సంతోషంబున నాఁడు లంచము గ్రహించిన నామనసు పశ్చాత్తాపమున నేఁడు మఱుఁగుచున్నయది. శిరచ్ఛేదంబు చేయక నన్ను విడుచుటయే నాకు శిక్ష విధించుట. ఇంక నేనీ మనోవ్యథ భరింపఁజాల. మీచిత్తంబువచ్చిన ప్రాయశ్చిత్తంబు విధించి నన్ననుగ్రహింపుడు. కృపాతరంగితంబు లగు మీ యపాంగావలోకనంబుల నాపైఁ బరపినంగాని నాతాపం బుపశమింపదు. నన్ను మకరందునిగా భావింపుఁడు కటకటా! కష్టచరిత్రుఁడ నగు నేను సుగుణరత్నాకరుఁ డగు మకరందుని వంటివాఁడ నని పలుకుట యనుచితముగదా మకరందునియందువలె నాయెడను పుత్రవాత్సల్యము జూపి నన్ను రక్షింపుఁడు. ఇంతకన్న నెక్కుడు విన్నవింపఁజాల''నని మనుజేంద్రుని పాదయుగళంబు గట్టిగఁ బట్టుకొని యనివార్యమయి వచ్చు నెవ్వగ నాపలేక బాలకునిచందంబున బిగ్గఱగ

నేడ్చెను. సహజముగ మృదువయి కృపానిలయమయి సుదర్శనుని మనస్సు దీనములగు కేసరివచనములకు మఱింత మెత్తనై వానియెడ బ్రసన్నమయ్యె. నేరస్థుడయి పాదాక్రాంతుఁడైన సేవకుని కన్గవ నుండి యెట్లు బాష్పంబులు తొరంగెనో దయామయుం డగు యజమానుని నేత్రములనుండియు నట్లే బాష్పములు గారఁజొచ్చె. అట్లు కేసరిదైన్యంబును వినుటవలనం గలిగిన బాష్పబిందువులు మెల్లమెల్ల నుత్తరీయాంచలంబునఁ దుడుచుకొని సుదర్శనుఁడు కేసరిని దనయడుగులపై నుండి లేవనెత్తి ప్రక్కనొక పీఠంపైఁ గూర్చుండజేసి కనికరంబు మెఱయ నిట్లనియె. "కేసరీ! నీవిందు సిగ్గుపడ వగవం బని లేదు. మానవజన్మమెత్తిన వారిలోఁ దప్పు చేయనివాఁ డెవ్వఁడు? గొప్పవారు గొప్పతప్పులు చేయఁ గొలఁదివారు కొలఁది తప్పులు గావించుచుందురు. నరుఁ డొకవేళ మనోదౌర్బల్యమున నొకానొక సమయమున దోసంబు జేసినను గాటం బగు పశ్చాత్తాపంబున వాని యాత్మ నిర్మలమై పరిశుద్ధంబగును. నీవు మా మకరందుని వంటి వాఁడవు, నీ కేభయంబును లేదు. నీవు గావించిన తప్పులన్నియు క్షమించితిని. నీ వెప్పటియట్ల దారపుత్త్రాదులతో నుజ్జయినిం గాపురముండి నా కిష్టసచివుండవయి మెలంగుము. రుద్రభట్టు మహాపరాధంబు గావించినందుకు సిగ్గుపడి యొదిగి యుండుటకు మాఱు తాను నిరపరాధినని వాదించి పంతగాఁడై ప్రతినలు బలికెఁగా; నీవలె నేరంబు నొప్పుకొని కావుమనిన వానిని క్షమింపకుందునా! ప్రజాక్షేమము నిమిత్తము దేశసంరక్షణార్థము దండ్యులను శిక్షించుచుందును గాని వాండ్రు నాకుఁ బగతురుగారు. నీవు వ్రాసి యంపిన లేఖ నా కందినది. ఆ జాబు చేరిన నాఁడె నే నిన్ను క్షమియించి నిన్నిటకు రావింపుమని రత్నసేనునితోఁ జెప్పితిని. నీవింక విషాదంబు దక్కి పొమ్ము" అని భూపాలుఁ డానతిచ్చుటయుఁ గేసరి మహానందభరితుఁడై తేనియతుగులకు, బునః ప్రణామంబు

గావించి తనపై నాతనికిం గలిగిన యపార కృపారసంబునకుఁ గడు కృతజ్ఞుఁడయి యవ్వలకు చనియె.

అతఁడు చన్న వెనుక సుదర్శనుఁడు రత్నసేనుని గనుంగొని "పాపము కేసరి కడుచిన్నవోయి యున్నవాఁడు. వానికి గాఢపశ్చాత్తాపము గలిగెనని తోఁచుచున్నది. ఇఁకనైన నతఁడు సత్ప్రవర్తనము గలిగి మనయెడఁ గృతజ్ఞుఁడయి వర్తించునని తోఁచెడిని నీయభిప్రాయమే" యని యడిగెను. రత్నసేనుఁ డాపలుకులు విని వెంటనే ప్రత్యుత్తర మొసఁగక యనుమానించుచు మెల్లమెల్లఁగ "దేవా! కార్యంబులంబట్టి మనుష్యులకృతజ్ఞత నెఱుంగ వలయుఁ గాని మాటలంబట్టి కాదు. కుటిలచిత్తు లాపత్కాలమున నొదిఁగియుండి యైక్యముం జూపుదురు గదా" యని పలికెను. మంత్రిమాటలకు చిఱునవ్వునవ్వి "మొన్నఁడో యొకసారి పొరపాటున నతఁడు తప్పుచేసెఁ గదా యని కలకాల మతఁ డట్టివాఁడే యని నిశ్చయించుట పాడియగు గదా? తన యకార్యంబున కింతవగచినవాఁడు వెండియుఁ గృతఘ్నుఁ డగునని నేఁ దలఁపను. కావున నీమనంబున సందియ పడనక్కఱ లేదు సుమీ" యని పలికెను. మంత్రి కేసరివిషయమున, దనయభిప్రాయమును మార్చికొన లేదు గాని రేనిమాటల కెదురాడ లేక యూరకుండవలసివచ్చె. అనంతరము రాజును మంత్రియును మఱికొన్ని రాజకీయవ్యవహారములఁ గూర్చి ప్రసంగించుచుండ మంత్రి యిట్లనియె. "విదర్భరాజునకుఁ గల వివాదమున మనచే నంపఁబడిన కేసరియు రుద్రభట్టును వివేకహీనులయి ప్రవర్తించిరి గావున మనము మఱల నెవ్వరి నయిన వైదర్భులయొద్దకంపి వ్యవహారముఁ బరిష్కరించికొనుట కర్తవ్యమని నాకుఁ దోఁచుచున్నయది. రాజవాహను యొద్దకుఁ బోయి "మీరు రాయబారులకు లంచమిచ్చి మా గ్రామంబుల నన్యాయముగ నాక్రమించిరని యెట్లు మనము నొక్కిపలుకఁగల"

మని మీ రందు రేమో. అట్లు మీరు శంకింపనక్కఱలేదు. ఈ సందేశము నడపుటకు నన్నును మకరంద కుమారుని బరుపుఁడు. విదర్భేశ్వరుని మనసు నొవ్వకుండ ననృతంబులు బలుకకుండఁ గార్యంబు సెడఁకుండ నెట్లు పలుకవలయు నట్లు పలికి మనయూళ్ళు మఱల మనకు వచ్చునట్లు చేసెద'' అనుటయు రాజించుక విచారించి సకలకళాపరిపూర్ణుఁ డగు మకరందుఁడును, లోకజ్ఞుఁడు రాజనీతి విశారదుండు నగు రత్నసేనుఁడును, జనిన గార్యంబు సేకురు నని నిశ్చయించి వారిపోక కనుమతించె.

---

## ఎనిమిదవ ప్రకరణము

'పుత్రాదిచ్ఛేత్పరాజయ' మ్మను నార్యవచన మొక్కటి కలదు. తండ్రి కొడుకువలనఁ బరాజయము నొందుట కిచ్ఛగించునని దాని యర్థము. సుగుణములలోఁ గుమారుఁడు దన్ను మించవలయునని తండ్రి నిరంతరమును గోరుచుండునని దాని భావము. జనకుఁడు గుణహీనుఁడై దుష్టుఁడైనను దన తనయుఁడు సుగుణవంతుఁడు సన్మార్గుఁడు గావలయునని కోరుటయుఁ దాను సుగుణవంతుఁడే యయ్యెనేని తన కొడుకు కంతకన్న సుగుణాఢ్యుఁడు గావలయునని కోరుటయు లోకానుభవసిద్ధమని మన మెఱుంగుదుము. ఆ న్యాయము తక్కిన వారియందు కంటె సుదర్శన మకరందులయందు నెక్కుడుగ సార్థకంబయ్యె.

తెల్లనిపాలవెల్లిలోఁ జల్లనిచంద్రుఁ డుదయించిన చందమున దయాసముద్రుఁ డగు సుదర్శనుని కడుపున సర్వకళాపరిపూర్ణుఁ డగు మకరందుఁ డుదయించుటచే మాళవదేశస్థులు తమ భాగ్యములు పండినవని మహానందభరితులైరి. మకరందునియం దొకశుభలక్షణ ముండి యొకశుభలక్షణము లేక పోలేదు. ఒక సద్గుణ ముండి యొక సద్గుణ

ముందఱ కో లేదు. ఒక్క చక్కఁదనంబునకే వాని మెచ్చవచ్చు. ఒక్క భూతదయకే ప్రశంసింపవచ్చు. ఒక్క విద్యకే కొనియాడవచ్చు, ఒక్క పరాక్రమమునకే పొగడవచ్చు ఇన్నిగుణము లొక్కనియందె గుమిగూడి కానఁబడినప్పుడు ప్రజ లారాజకుమారు నెట్లు గారవింతురో యిచ్చట వర్ణింపవలయునా? పలుమాట లేల? ఆ రాజనందనుఁడు పది యెనిమి దేండ్లప్రాయము వచ్చునప్పటికి గుణములగనియై చదువుల సరస్వతియై బుద్ధికి బృహస్పతియై మదవతీమన్మథుఁడై శ్రితజన చింతామణియై పండితజనపారిజాతమై పరాక్రమసింహమై జన్మకారణ మగు వంశమునకుఁ గడుపారఁ గన్నతల్లిదండ్రులకుఁ బాలింపఁబడు ప్రకృతిజనులకుఁ గ్రమంబున గౌరవంబు యశంబు నానందంబు నొడఁగూర్చుచు నతని కతండె సాటియని విలసిల్లె. మకరందుఁడు నిండుజవ్వనమును బ్రాపించినందునఁ దల్లిదండ్రులు వానికిం దగిన కన్నియను దెచ్చి వివాహంబు జేయవలయునని రాజపుత్రికలకయి వెదుకఁజొచ్చిరి. కన్నియ మెచ్చుప్రాయమును దల్లి మెచ్చుసంపదయుఁ దండ్రి మెచ్చు మగఁటిమియుఁ జుట్టముల మెచ్చు కులగౌరవమును మకరందునిపట్ల నుండుటచే నప్పటిరాజు లనేకులు తమతమకన్నియలఁ గానుకలతోఁ గూడ మకరందుని కాళ్ళపైఁ బడవేయుటకుసిద్ధముగ నుండిరి. చక్కఁదనమున్న కన్నియకు విద్దియ యుండదయ్యె. చక్కఁదనమును విద్యయుఁ గలపడంతికి సత్కులప్రసూనత గలుగదయ్యె. చక్కదనమును విద్యయు సత్కుల ప్రసూనతయుఁ గలయొలనాఁగకు నైశ్వర్యము లేదయ్యె. చక్కఁదనము విద్యసత్కులప్రసూనము నైశ్వర్యము గలమగువ బౌద్ధమతద్వేషి యగు క్షత్రియునికన్యకయగుచు వచ్చె. క్షత్రియకన్యను దనకుమారున కిచ్చి పెండ్లిఁజేయుటకుఁ జంద్రప్రభాదేవికిని సుదర్శనునకు నిష్టమే; కాని యారాజులు తమతమకూఁతుల నెఱిఁగియెఱిఁగి బౌద్ధరాజనందనున కిచ్చుట మంచి

దగునా కాదా యని శంకింపఁజొచ్చిరి. అదియునుంగాక మకరందుఁడు విద్యావ్యాసంగముగలిగి తన కాలమంతయుఁ బండితగోష్ఠియందును గ్రంథపఠనమందును గడపుచుఁ దన పెండ్లిమాటఁ దలపెట్టక తలపెట్టినవారికుత్తరమీయక రాజకన్నియల చిత్తరువులఁజూచిమెచ్చక మెచ్చు నట్లొరులకుఁ జెప్పక చదువుపై విసువు దోఁచినపుడు సాములం జేయుచు సాములపై విసువు దోఁచినప్పుడు చదువుచుఁ దనహృదయ మెవ్వరికిం దెలియకుండ వర్తించుచుండెను. అందుచేతఁ దల్లిదండ్రులుకుమారునివివాహవిషయమునగర్తవ్యము నిశ్చయింపఁజాలరైరి

ఇట్లుండ మకరందుఁడు ముఖ్యమంత్రియగు రత్నసేనునిగూడి రాజకార్యములమీఁద విదర్భకుం బోవలసివచ్చె. చంద్రప్రభాదేవికి మకరందుని వెనుక నిరువురుబిడ్డలు పుట్టి బాల్యముననె మృతినొందుటం జేసి యామె గారాబుకొడుకు నెడబాసి యుండలేనిదయ్యు భర్తృప్రేరణమున నియ్యకొన వలసె. సుదర్శనుఁడును దనయునుంగుఁ గుమారు నదివఱ కెన్నఁడును విడిచి యుండకపోవుటచే వదల లేక వదలలేక బిగ్గఁ గౌఁగిలించి ముద్దాడి మంత్రిచేతిలోఁ జేయివైచి యప్పగించి సమరముల ముక్కాకలఁ దేఱిన మెఱియలవంటిబంట్లు నూరుగురను గుఱ్ఱంపురౌతుల నేఁబదుగురును మదపుటేనుఁగులఁ బదింటిని వెంటఁదోడ్కొనిపొమ్మని కళ్యాణనిధి యను భద్రజాతిగజముపై గొడుకును మంత్రి నెక్కించి యాశీర్వదించి పనిచెను.

---

## తొమ్మిదవ ప్రకరణము

మానవులకు జ్ఞానాభివృద్ధి కేవలగ్రంథపఠనంబువలన మాత్రమేకాక ప్రయాణము వలన నయితమగును శాస్త్రజ్ఞానవాసన లేని మూర్ఖునకైన దేశాటనము మిక్కిలి లోకానుభవమును గలిగించు నన

శాస్త్రజ్ఞానముఁ గల పండితుల కది చేయు మేలింతింత యని వర్ణింప వశమా! కూపస్థ మండూకమువలె నున్నచోటు విడువక తామున్న చోటె సర్వప్రపంచ మనియుఁ దా మెఱిఁగినదే సర్వజ్ఞాన మనియు విఱ్ఱవీగు కించిద్జ్ఞులొక్కసారి దేశాటనము జేసిన వారియభిప్రాయము లన్నియు వింతగ మారకపోవు. ఈశ్వరుని యౌన్నత్యముఁ దెలుపు కొండలను, పరమేశ్వరుని మహిమనుమువలెనే గట్టములై దుర్గమము లగు మహారణ్యములను, సర్వేశ్వరునిదయ రసమువలె ప్రవహించు నదులను, క్రమంబున నెక్కి కడచి దాఁటి పయనములు సేయువారి మనోవికాస మెంతవిస్తారముగ నుండునో యది పయనములు జేయని వా రెఱుంగుట కష్టము. నరుఁడు విదేశంబులకుఁ బోయి యచ్చట జనుల యాచారంబులు వేషంబులు భాషలు మతములు నచటి రాజుల పరిపాలనాపద్ధతులు శాసనంబులు గ్రహించి తమ దేశంబున నున్నవాని తోడం బోల్చి చూచికొనునెడలఁ దనవారలయందలి దోసంబులం రెండవవానియందలి గుణంబులం బద్ధమునందువలె మనంబునను విస్పష్టముగఁ బొడకట్టు. అందుచే దేశాటన మవశ్య కర్తవ్యము.

మకరందుఁడు తండ్రిచే వీడ్కొని యుజ్జయినీ నగరంబు వెడలి పరివారసమేతుఁడయి విదర్భకుం బోవుచు మార్గమధ్యమున సృష్టి వైచిత్ర్యములఁ గని యచ్చెరువందుచు నాటవికుల యనాయకత్వమునకుఁ బల్లియలనుండు జనంబుల వెంగలితనంబునకుఁ జింతిల్లుచు నెడ నెడఁ జెట్లనీడల విడిది సేయుచు నచ్చటి సెలయేళ్ళ తియ్యనినీళ్ళం ద్రావి నిష్కలుషములైన వాయువులం బీలిచి చెట్లం దమయంత పండిన పండ్ల దిని సుఖించి మహానగరములలో నంతఃపురములలో వసియించు జనంబులకన్న జనపదంబులఁ గుటీరంబుల నుండు జనంబులె యెక్కుడు సుఖము ననుభవించు నని మనంబున దలంచుచుఁ బయనముం జేసి పదునైదు దినంబులలో విదర్భాపురంబు జేరె. చేరి తనరాక రాజ

వాహనున కెఱింగించి పుచ్చుటయు నతఁడు వారి గారవింపఁ దన జ్యేష్ఠకుమారుఁడగు మేఘవాహనునిం బనిచె. మేఘవాహనుండును సముచితపరివారముతో మకరందు నెదుర్కొని గారవించి యొక్క రమ్యసౌధంబు విడిదిగా నేర్పరచి వారి యుపచారార్థము తగు సేవకుల నియమించి చనియె. మాళవకులు పయనపుం బడలికలఁ దీర్చుకొనుచు మూఁడుదినంబులు గడపిరి. నాలవనాఁడు రాజవాహనుని మంత్రులలో నొక్కఁడు జయంతుఁ డనువాఁడు మకరంద రత్నసేనులం గనవచ్చి యిట్లనియె. "రాజవాహన మహారాజుగారు మీరాకకుం గత మెయ్యదియో యెఱింగి రమ్మని నన్నుం బుత్తెంచిరి. అది నాకు వినుపింపఁ బోలునేని వినుపింప వేఁడెద. అంతిపురమున రాజుగారికి గడుంగూర్చు బాలిక యొక్కరిత జ్వరపీడిత యయి యున్నది. ఆకారణంబున నృపాలుఁడును బంధుగులును మనస్స్థిమితము లేక యున్నవారు. అందుచేఁ బ్రస్తుతము రాజుగారు మీసందేశార్థముల విని తగినయుత్తరంబుల నొసంగఁజాలమని మీతో మనవిచేయు మనిరి. ఆబాలికకు దేహారోగ్యము గలుగునంతవఱకు మీరు మాయిచ్చుసత్కారంబుల గ్రహించి యిందుండవలయు నని ప్రార్థించు చున్నారము." అనవుడు రత్నసేనుఁడు జయంతునితో నిట్లనియె. "అయ్యయ్యో ! మీమహారాజుగారికి మనస్స్థిమితము లేనిసమయమున వచ్చి మే మపరాధంబు గావించితిమి. సిద్ధార్థుని యనుగ్రహముచే రాజపుత్రిక యచిరకాలంబున స్వస్థచిత్త యగుగాక. మావచ్చినపని మీ కెఱిఁగింపరానిది కాదు. ఎల్లలంగూర్చి మాకును మీకునుం గల వివాదమును దొల్లిఁటి యట్లు కాక మరలఁ బరిష్కరించుటకై వచ్చితిమి. ఇది యసమయమగుటచే సమయమగువఱకు మే మిచ్చటనే యుందుము. ఈనడుమ మారాజకుమారుఁడు విదర్భాపురంబునంగల వైచిత్ర్యంబులఁ గనుంగొనుచుఁ బ్రొద్దులం బుచ్చుచుండు. వ్యవహారముం గూర్చి ప్రశంసిం

చుటకుఁ గాక యూరక మీమహారాజుగారిని సందర్శించుటకు మేము మూఁడు దినములలో వత్తుమని మనవిచేయుము.'' అని పలుక జయంతుఁడు ''సరే మంచిదట్లే సేయుఁ'' డని రాజకుమారునియొద్దను రత్నసేనునియొద్దను సెలవుగైకొని చనియె.

మఱునాఁడు మకరందుఁడు నగరంబు జూడవలయునని రత్నసేనుం గూడి యొక్కయరదంబు నెక్కి బయలుదేఱి విదర్భరాజసేవకులు దారి జూపఁ బలుతావులకుఁ జని యాపురవైచిత్ర్యంబులం గని సంతసించి సేవకులతో ''భీమరాజు తొల్లి పాలించిననగరమిది యేకదా ఆనాటిచిత్రంబు లేవైన నిప్పుడున్నయెడల వానిం జూపఁ గలరా!'' అని పలికెను. అట్లే చేయఁగలమని యాసేవకులు వారిని గొంతదవ్వు దోడ్కొనిపోయి యొక యుద్యానవనమునం బ్రవేశపెట్టి ''దేవా! యిదియే విదర్భరాజపుత్రి యగుదమయంతి విహరించినయుద్యానవనము. ఇచ్చటనే నిషధరాజు పాలినుండివచ్చిన రాయంచతన చుట్టపుటంచలతోఁ గలసి వ్రాసిన దట. ముద్దులు మూటగట్టునాయంచపలుకులు విని నలునిపై గాటంపువలపు నిలిపి దమయంతి పువ్విలుకాని హాళాహాళికి వెఱచి యీపుష్పవాటీరముననే చిగురుసెజ్జలపైఁ బన్నుండి వెన్నెలరేలు నిదుర లేక గడపిన దఁట. చెలికత్తెయలం గూడి యీ దమయంతి జలకేళిసలిపినకొలనిది యఁట.'' యని యాయాంతావులఁ జూపి వారికి మనః ప్రమోదంబు గలిగించిరి. ఆనెలవులం జూచి మకరందుఁడు భారతంబునఁ దాను జదువుకొనిన నలదమయంతుల చరిత్రంబుల జ్ఞప్తికిఁదెచ్చుకొని సమ్మోదితుఁడై విడిదికిం జనియె.

రత్నసేనుఁడు మఱునాఁడు మకరందసమేతుఁడై రాజవాహనమహారాజును జూడ నరిగి దౌవారికులచేఁ దమరాక దెలిపి కౌఱేఁగింప జయంతుడువచ్చి వారిని గారవించి ''బాలిక దేహస్థితి సరిగలేదు. మహారాజుగారు చింతాక్రాంతులై యచట గూర్చున్నవారు రండి చూతురు గాక'' యని లోనికిం గొంపోయి యిరువురపేర్లు రాజునకుఁ

దెలిపెను. రాజును మెల్లఁగఁ బీఠమునుండి లేచి వారి నెదుర్కొని నేమంబడగ యుచితపీఠములపైఁ గూర్చుండ నియమించెను. అచట నున్నవారంద ఱొండొరులతోఁ బలుకక యూరకుండిరి. రాజు దీనాననుఁడై యెద్దియో చింతించుచుండె. ఆయవస్థంజూచి రత్నసేనుఁడు మకరందునితో రహస్యముగ "కుమారా! నీవు వైద్యశాస్త్రపారంగతుఁడవని ప్రసిద్ధిగలదు. ఈబాలిక కేదేని యగుచికిత్స నీవు చేయఁజాలవా?" యన, మకరందుఁడును "వారు నాకాపెం జూపిన పక్షమున నాయోపిన చికిత్స యొనర్చెద" నని పలికెను. అప్పుడు రత్నసేనుఁడు రాజవాహనున కభిముఖుఁడై యిట్లనియె. "దేవా! యీ బాలకుఁడు గట్టివైద్యుఁడు ఈతనికి రానివిద్దియ లేదు. అందాయుర్వేద మితనికభిమానవిద్య. 'పరోపకారార్థమిదం శరీర'మ్మను న్యాయమును బట్టి తాను రాజనందనుఁ డయ్యు గరువంబు లేక తెగులుగొంటు లగు నిరుపేదల యిండ్లకుఁ బోయి వారల కుచితంబుగ మందులిచ్చి పథ్యపానంబులకై వారలకు ధనముసయితి మిచ్చి వారి రోగంబుల మాన్పుచుండును. మీబాలిక నీతనికిఁ జూపిన నితఁ డోపినసాయంబు జేయఁగలఁడు. ఎంతలెంతలు జాడ్యంబుల నైన నితఁడు చేతితోఁ దీసివేసినట్లు కుదుర్చుప్రజ్ఞగలవాఁడు. అనుటయు రాజుం బరివేష్టించి యున్నసభ్యులందఱు సాటిలేని చక్కఁదనంబునుం జక్కఁదనంబునకుం దగినప్రజ్ఞయుఁ బ్రజ్ఞకుం దగినపరోపకారచింతయుఁ గల యాపురుషసింహునివంకకుఁ దమకనులం ద్రిప్పిచూచి యచ్చెరువందసాగిరి. రత్నసేనునిపలుకులు రాజవాహనునిచెవులకు నమృతధారలట్లుపచరించి యెంతో యాస గొలుపుటం జేసి వానిమొగము వికాసవంత మయ్యె. మన స్సుత్సాహసమేత మయ్యె. దేహంబుమరల దార్ఢ్యవంతమయ్యె. జయంతుఁడు మొదలగువారు బాలికను మకరందునకుఁ జూపు మని త్వరపెట్టిరి. అప్పుడు రాజవాహనుఁడు పీఠము నుండి లేచి మకరందునిచేతులు పట్టుకొని "[illegible]యనా! వయసున

నాకన్న నెన్నియో యేఁడ్లు చిన్న యయ్యు బుద్ధిం బెద్దవు. అందుచే నిన్ను వేఁడుకొన్నం దప్పులేదు. నాబిడ్డకుం బ్రాణదానంబు చేసి మమ్మొకదరి జేర్పు"మని వేఁడుకొనియె. మకరందుఁడును వాని ప్రార్థనమున మనస్సు కరఁగ లేచి వినయమున "దేవా! నేను కించిద్జ్ఞుఁడ నన్నింత వేఁడికొనవలదు. నాయోపిన యుపకారంబు చేయుదు. జాడ్యంబు తెఱఁగెఱుంగఁ జేసి నాకాబాలిక జూపు"డని పలికె. అనవుడు రాజవాహనుఁడు "జ్వరమే దానిని బీడించుచున్న రోగము. దానిమేనిమీఁద వడ్లగింజ వేసిన పేలగింజ యగుచున్నది. దాహంబునకు మితియు మేరయు లేదు. మాపులు కంటికిఁగును కన్న మాటలేదు. రెండుదినములనుండి సన్నిపాతము ప్రవేశించినది ఒక్క మాఱు చూచితివయేని యన్నియు నీవ యెఱుంగఁగలవు. రాగమ్మ్రో పోద"మని యాతనిని రత్నసేనుని దనమంత్రియగు జయంతుని వెంటఁ బెట్టుకొని లోనికిం జనియె.

## పదియవ ప్రకరణము

"అమ్మా! నీనిమిత్తము క్రొత్తవైద్యులు వచ్చియున్నారు. కన్నులువిప్పి యొకసారి యిటు చూడుము తల్లీ" యని రాజవాహనుఁడు బాలికమంచమువద్దకుఁ బోయి పిలిచి చేతికొ ౕలేపెను. "నాకు రోగము లేదు వైద్యు లెందులకు? నేను మాయూరికిఁ బోవలయును, నన్నుం బోనిండు. నే నిఁక నిచ్చట నుండ"నని పలికి యబ్బాలిక సన్నిపాతవశమున నోడ లెఱుంగక శేవంబోయెను. అప్పు డిరువురు చెలికత్తెలు మెల్లగ నామె నూరడించి పండుకొనఁబెట్టిరి. పోతబోసిన బంగారుబొమ్మవలె నున్న యాసొగసులాడి చక్కఁదనంబును గనుంగొని మకరందుఁడు తనలో "నిది మనుష్యాంగన యగునా? ఈజగన్మోహనాకార కెంత పాడురోగము వచ్చినది. కటకటా! యీమె బ్రదుక దేని జగ మరణ్య మగును. మధ్యమలోక మలంకారశూన్య

మగును. ఇది నిజముగ బంగరుబొమ్మయే యనవచ్చు. ఏలయన నీయుష్ణముచేత మేను చిక్కినను వన్నె యించుకయుఁ దఱుఁగ దయ్యె'' నని తలంచి యామెస్థితిఁ గనిపెట్టుట కెడమచేయి పట్టుకొని నాడిం బరీక్షించి నాలుకయుం గన్నులు శోధించి రాజవాహనుని వెండియుం గొన్ని ప్రశ్నములడిగి స్థితిం జక్కఁగఁ గనిపెట్టి యౌషధము నంపెదనని చెప్పి విడిదికిం జని జామున కొక్కమాత్ర వేయుమని కొన్నిమాత్రలంపె. ఆమాత్రలయం దెంత పటుత్వమున్నదో కాని యవి ప్రయోగింపఁబడినది మొదలు బాలికమేను తేలికగ నుండెను. ఆమందు వేసిన మొదటినాఁటిరాత్రి నిదురపోవకున్నను బాలిక తనలోఁ దాను గొణుగుకొనుట మాని యూరక పండుకొనియె. రెండవ నాటిరేయి యించుక నిదురించె. మూఁడవనాఁడు తెలివిగలిగి యడిగిన మాటల కుత్తరములిచ్చె. నాలవనాటిరాత్రి నలుజాము లొడలు మఱచి నిదురించె. అయిదవనాఁ డాఁకలి యాఁకలి యని యాహారం బడిగె. ప్రతిదిన ముదయమందును సాయంకాలము నందును మకరందుఁడువచ్చి యాబాలికఁ గనుంగొని యనుపాన భేదంబులతో నాయౌషధంబునే నడుపుచుండె. ఆఁకలి మిక్కుటముగ నగుటచే నాఱవనాఁడు వైద్యుఁ డామెకుఁ బథ్యముపెట్టించెను. అనంతరము క్రమక్రమంబున నాబాలిక యన్నహితవుగలిగి యారోగ్యస్థితి నొందఁజొచ్చెను. వైద్యుఁ డుదయముపూట వచ్చుట మాని సాయంకాలమునందె రానారంభించెను. ప్రాతఃకాలమునందు వైద్యుడు రానందున కామె యించుక మనఃఖేదమునందుచు సాయంకాలమం దాయన వచ్చినప్పుడు తన దేహస్థితినిగూర్చి చెప్పిన మాటయే మరలఁ జెప్పుచు నడిగినప్రశ్నయే మరల నడుగుచు వాని నెంతసేపో నిలుపుచు వచ్చెను.

ఒకనాఁడు సాయంకాలము మకరందుఁడు బాలికను జూచుటకు వచ్చునప్పటికి రాజవాహనమహారాజు మంత్రులతో నేవిషయము

సనో కార్యాలోచనము చేయుచు నాతని వెంటఁబోనికిఁ రాఁడయ్యె. అప్పుడు బాలికవద్ద నలువురు చెలికత్తెలు మాత్రముండిరి. ఇరువురు పురుషసేవకులు మకరందుని బసకిం దోడ్కొనిపోయిరి. అతఁడా పూటఁ జాల తడవు వచ్చుటనుండి యొకమారు కుడిచేయియు నొకమాఱెడమ చేయియుఁ బట్టుకొని నాడి పరీక్షించి పథ్యపానములు గూర్చియు నిద్రాదివిషయములం గూర్చియు వినువారికి విసువు గలుగునట్లు ప్రశ్నలడుగఁ జొచ్చెను. బాలిక దాని కన్నిఁటికి విసువుగొనక యొక్కింత సిగ్గుపడుచుఁ బ్రత్యుత్తరము లిచ్చెను. సూర్యాస్తమయమయి చీఁకటులు గాఢముగఁ గ్రమ్ముటచే మకరందుఁడు తనవిడిదికిం బోవలయు నని పయనము కా నాముద్దుగుమ్మ చెలికత్తెలతో నొకదానిం బిలిచి "ఓసీ! కల్పలతా! ఇంకను గొంచెము సేపిచ్చట నుండి నా దేహస్థితిని సమగ్రముగఁ బరీక్షింపు మనుము. ఇట్లు విడిదికిం బోవ వేగిరపడుటకుఁ బ్రియజన మెవ్వరు లేరు గదా!" యని చెప్పనప్పలుకులు విని మకరందుఁడు సంతసించి "మాకు మీకన్నఁ బ్రియజన మెచ్చటను లేరు. ఎంత సేపున్నను మీ సన్నిధినుండ నేమన సగుచున్నది. ప్రొద్దుపోవుచున్నది. కావున నే నిఁక చనక తప్పదు. రత్నసేనుఁడు నారాక కెదురు చూచుచుండును. కాని యీమెకు దేహారోగ్యము సంపూర్ణముగ గలుగుటచే నేను రేపటినుండి యిక్కడకు రానక్కఱలేదు రావలసి యున్నపుడు వచ్చెద" నని లేచి యావలకుఁ బోయి పురుషసేవకులు మార్గముం జూప విడిదికిం జనియె.

ఆపలుకులు వినినతోడనే బాలికమొగంబున వైవర్ణ్యము తోఁచెను. చెలికత్తెలు మందు దెచ్చిపుచ్చుకొన్మని ప్రార్థింప నామె పుచ్చుకొనక యెవ్వరితోడం బలుకక పండుకొని కొంతసే పిట్టటుపాన్పుపై దొర్లి యెట్టకేలకు నిదురవోయెను. నిదురలో రెండుసార్లు మకరందుఁడా! మకరందుఁడా! పోకుపోకు మని పలవరించెను. మరునాఁడుదయమున రాజపుత్రిక నిదుర మేల్కొని చెలికత్తెలతో నిప్పటియట్ల

పలుకక విచారాక్రాంతయయి యుండె తల్లియు రాజవాహనుఁడు నాదినమున నామెం జూచి యట్లుండుటకుఁ గారణ మేమని నొక్కి యడిగిరి. ఏమియు లేదని బాలిక యుత్తరమిచ్చె. సఖీజనంబులనడుగ వారు తమ కేదియుం దెలియదని బదులు చెప్పిరి. బిడ్డ మఱునాఁడు న త్తెఱంగుననే యుండుటచే నెండియు మకరందుని బిలువనంపి యామె స్థితిం జూడుమని ప్రార్థించె. మకరందముఁ గనుంగొని తద్దయు సంతసించు తుమ్మెదవలె మకరందుని గనుంగొని యా యిందువదన మహానందము నొందె ఎక్కడిరోగ మక్కడ నంతరించె. మొగము వికాసవంత మయ్యె. అదిమొదలు మకరందుఁ డచ్చట నున్నన్ని నాళ్ళు రెండుపూటలు నామెం జూచుచుండె. ఎందుచేతనో యెంత కాలమున్నను మకరందున కాయూరు విడిచిపోవుట కిష్టము కలుగ దయ్యె. కాని రత్నసేనుఁ డుజ్జయినికిం బోవలయునని నిశ్చయించు కొనితమువచ్చిన వ్యవహారంబుబరిష్కరింపుమని రాజవాహనుని ద్వార పెట్టెను. రాజవాహనుఁడును సుదర్శనుని బలపరాక్రమాదులకు వెఱచియో మకరందుఁడు చేసిన యుపకారముఁ దలఁచియో యది న్యాయమని నమ్మియో వివాదకారణము లగు గ్రామముల సుదర్శ నున కిచ్చుట కొడంబడి రత్నసేన మకరందులం బిలిచి మెత్తయు గారవించి వారికిఁ బలుపసదనములిచ్చి యిట్లనియె. "నాయనా! మక రందుఁడా! నీవు మా బాలికను మృత్యుముఖమునుండి తెచ్చి మా కొప్పగించితివి. నీమేలు మేము మఱువజాలము. నా కృతజ్ఞతను మీ తండ్రికి విన్నవించి గ్రామములిచ్చితిననుము. మనరాజ్యములు రెండు నప్పచెలియండ్రవలెఁ బొరపులు లేక వర్ధిల్లుగాక!" యని యతఁడు వారల వీడ్కొన మకరందుఁడు బాలికయొద్దకుం బోయి తన పయ నంబు నెఱిఁగించి యామెను మరల దుఃఖసముద్రమున ముంచెను. అతఁడును వదలలేక వదలలేక యామెను విడిచి మఱునాఁడు రత్న సేనునిం గూడి సపరివారముగ నుజ్జయినికిం బోయెను.

## పదియొకండవ ప్రకరణము

''కర్పూరమంజరీ! కర్పూరమంజరీ! ఏమమ్మా యెన్ని పిలిచినను బలుకవు? నీస్థితి యేమియు బాగులేదు. అన్నము తిననేదినవు. తినిన నాలుగుమెతుకులు మునిపంటఁ గొఱికెదవు. రేలు కన్నుమూయనే మూయవు. మూసినఁ బలుతెఱుంగులఁ బలవరించెదవు. అడిగినదానికుత్తరం బొసంగవు. ఒసఁగిన నవ్యవస్థితముగాఁ బలికెదవు. ఏసుఖంబును గోరవు. ఏముచ్చట దలంపవు. నీ కీమరంతసంతాపము గలుగుటకుఁ గారణమేమి? ఇది దయ్యమో భూతమో పిచ్చియో దేహపీడయో మనోవ్యాధియో మేమెఱుఁగజాలకున్నాము. శరీరసంబంధమగు పీడ యయ్యేనేని దానికిఁ దగు చికిత్సలఁ జేయవచ్చు. మనోవ్యాధికి మందు లేదందురు కాని మనసిచ్చి చెలికత్తెలతోఁ జెప్పుకొన్న మనోవ్యాధులు నయితము మానును. కావున నీమనస్తాపము మాకెఱుఁగఁజేయుము అమ్మా! వడగాడ్పుల కెండిపోవులతఁగవలె నీ వెంతకాల మీతాపముచే సిరితివి శోషిల్లెదవు? వెన్నెలకు వడద నీమేనేమి? యివ్విధంబున నిద్రాహారములు లేక కృశియించుట యేమి?'' అని యనుంగుఁ జెలికత్తియ లిరువు రొకనాఁడు కర్పూరమంజరిఁ జేరి యడుగఁజొచ్చిరి. కర్పూరమంజరి మాఱుపలుకు పలుకనియు విననట్లె యూరకుండెను. ప్రియసఖులిరువురు నామె హృదయశల్యమగు నాయంశమేదియో విస్పష్టముగా వినఁగోరి తమతో నామె యావృత్తాంతము జెప్పుదుదాఁక విడువఁగూడదని నిశ్చయించుకొని మరల మరల తఱచి తఱచి యామె నడిగి యెంతకుం జెప్పకున్న నెట్టకేలకు విసువున నిట్లనిరి.

''ప్రియసఖీ! మేము నీకుం గడుదరివార మయినను నీ వది యేమో కాని మమ్ముం బెరవారిగఁ జూచుచుంటివి. నిన్నుఁ గనుటయే

మీతలితండ్రుల వంతయ్యెను గాని పెంచుట మాతల్లులవంతయ్యెను. నీవు పుడమిపైఁ బడినది మొదలు నిప్పటిదనుక నిన్ను మే మొకనాఁడు నెడఁబాసి యెఱుఁగము. ఆఁటలాఁడుకొనుట నేర్చిననాఁడు గోలెమన మొండొరులసుఖదుఃఖములఁ జెప్పుకొనుచున్నారము. మాకన్న నెక్కుడగు నాప్తులు నీ కుండరని నాయభిప్రాయము. తల్లి దండ్రులెఱుఁగకుండ మఱుఁగు చేయవలసిన చాటుమాటలు రాజకన్యకలుచెలిమి కత్తెలతోఁ జెప్పుకొందురని వినుచుందుము. ఒకవేళ నీమనోగతరహస్యంబుల నీవు మాకెఱిఁగించినచో నవి బట్టబయలు చేయుదుమేమోయని నీమనంబున నపనమ్మిక యుండవచ్చును. పసితనంబుననుండి మాస్వభావమును జక్కఁగ నెఱిఁగిన నీతో స్వవిషయమున మే మేమియుఁ జెప్పుకొన నక్కర లేదు. అయిన నవస్థాంతరము నొంది నీ విప్పుడు విమనస్కవై యుండుట నించుక చెప్పవలయును. మేమునోట నువుగింజదాగనివారము కాము. ఎక్కడిమాటలక్కడ మఱచువారము. మా చెవిలోఁ బడినమాట పెట్టెలోఁబెట్టినమాట. ఇంకను నమ్మిక చాలదేని నీగుట్టుమట్టులు వెలిబుచ్చుమని చేతిలోఁ జేయివైచి బాసలుచేసెదము." అని చెలికత్తియలగు మల్లికయుఁ జంద్రికయు నొక్కొక్కయెడుగ నాచక్కరబోఁడి ప్రత్యుత్తరంబొసఁగక యూరకుండుట యనుచిత మని మెల్లన నిట్లనియె.

"ఓసీ మల్లికా! చంద్రిక మొదటినుండియు వెఱ్ఱిబాగులదియని నీవెఱుంగుదువు. దానికి వెఱ్ఱియెత్తిన నీకు వెఱ్ఱియెత్తినదా? మీపై నాకపనమ్మిక యెన్నఁడు లేదు. ప్రపంచమున నాకు మనసు గలిగిన సంగడికత్తియలు మీరుదక్క వేఱొకరు లేరు. ఈ మాటమీ రెఱుంగుదురు. అడవిలోఁ బుట్టి యడవిలోఁబెరిఁగి యడవిలోనే జీర్ణ మగు పువ్వుల తెఱుంగున నాకోరికలు నామనంబునఁ బుట్టి యచటనే పెరిఁగి యచటనే జీర్ణము కావలసినవి; కాని యొరులకుం దెలియఁజేయఁదగి

నవి కావు. ఏమందురేని నాకుం దండ్రి దగ్గర లేఁడు. తల్లి యస్వతంత్రు రాలు. నాకు గారాపు చెలిమికత్తె లగుటచే నా మనోరథంబుల నొడఁగూర్పవలయు నని మీరు యత్నించెదరు. కాని యది మీకు స్వాధీనముగాదు. ఈఁగ వాలకుండ మీరు సంరక్షణ చేయఁగలరు. నా కెద్దియేని తెగులు వచ్చినప్పుడు ఱేయుంబవళ్ళు నిదురయుం గూఁడను మానుకొని యుపచారంబులు చేయుమన్న చేసెదరు. నాకై వగవమన్న వగచెదరు. కావలసిన పదార్థంబులఁ దెమ్మన్న దెచ్చెదరు. వేయేల? ప్రాణము లీయమన్న నిచ్చెదరు. అంతియ కాని దుస్సహంబులగు నాపదల నెట్లు సహింపగలరు? దుర్గమంబులగు తావుల కెట్లుపోఁగలరు? దుర్లభంబు లగు వస్తువుల నెట్లు తేగలరు? నాయలమట మీకుం దెలుపుట మిమ్మును జింతాపరవశలఁగఁ జేయు టయే; కావున నన్ను మీ రడుగవలదు. ఇట్లుంటినని నాపై మీ రలుకఁబూని మొగంబులు ముడువవలదు.

అనవుడు మల్లిక యామె దేహవల్లికపైఁ జేయివైచి "చెలీ! మేము నీకు సుఖదుఃఖ సమానమయిన జనముగదా! మాకన్న మీ కార్చువారును దీర్చువారు నుండరు. చెప్పకున్న మాతోఁ జేసరి" యని యొట్టుపెట్టుకొనియె. చంద్రికయుఁ జెప్పుదువా చెప్పవా యని పలుమా ఱొత్తియడుగఁ జొచ్చె. తనగుట్టును దానెంత దాఁచదలంచినఁ జెలిమికత్తియలు దాఁచనీయరనియుఁ దనకుఁ జెప్పక తప్పదనియుఁ దెలిసికొని కర్పూరమంజరి ప్రాణసమాన లగు చంద్రికామల్లికలతోఁ దన వృత్తాంతముఁ జెప్ప నిశ్చయించియు నొకమాఱు సందేహించి యొకమాఱు సిగ్గుపడి యొకమాఱు తెన్నందును బీడించెదరే యని సఖులం గసిరి యొకమాఱు తనకథ చెప్పఁబూని నాలుక చివఱకు మాటరానిచ్చి పైకి వెడలనీయక యాఁచుకొని యెట్టకేలకు నెచ్చెలుల వేఁడుకోలు మిక్కుటం బగుడు నిట్లనియె.

"అమ్మయ్యా! నాదారిని నన్నుండనీయక పీడించుటకు నాకు మీరెక్కడ దాపురించిరే. నేనేమని చెప్పుదును? మీరు లోకజ్ఞాన మెఱిఁగిన జాణలు కదా! నేనేమో యనుకొంటి. మీ తెలివింతేనా? ఇంతకాలమునుండి చూచుచు మీరు నా యలసటకుం గారణ మూహింపరైతిరా? ఏలజవ్వనంబున నివ్వెఱ్ఱిపువ్వుబోండ్లకు మన స్సంతాపహేతువు లెవ్వియో యందఱెఱిఁగినవే. నెచ్చెలులారా! చల్లకువచ్చి ముంత దాఁచుటయేల? చెప్పఁదలంచియు సిగ్గుపడఁదగదు. మాళవరాజనందనుండగు మకరందుఁడు నా దేహరోగంబునకుఁ బరె మనోరోగంబునకును దగు చికిత్సలం జేయఁగలాఁడు. మీ చేతనగు నేని నా కెత్తెఱంగునైన నా సుదర్శన కుమారుని దర్శనము చేయింపుఁడు. ఆ రాజహంసముం గనుంగొనిన నా మానస సరోవరము శోభావంత మగు. అతని ముఖచంద్రబింబముం జూచిన నా నెమ్మనంబునఁ గ్రమ్మిన దుఃఖాంధకారంబు నశియించు. ఆఘనుని కృపావృష్టుల నీమేని పరి తాప మడంగు. సఖులారా వేయేల? నా కతనితోడిదియే లోకము. నా మనోవ్యథ సమగ్రముగ మీ కెఱిఁగించితిఁ గావున మీకుఁ బోలిన తెఱంగున నావగఁ బాపఁ బ్రయత్నింపుఁడు."

అని కర్పూరమంజరి సందియంబు విడిచి తనమనోవైకల్యకార ణమును మఱుంగులేక యనుంగుఁజెలులకు నెఱుఁగఁజేయుటయు నప్పు డాసఖు లిరువురుఁ గడుసంతసించి యామెకుం దమయందుఁ గల విశ్వాసమునకు మెచ్చి తమసఖికి మకరందునితోం దెవ్విధంబున సమ కూరునని యోచింపఁదొడంగిరి. అట్లు నాలుగైదు నిముసంబులువారు యోచించిన పిదపఁ గర్పూరమంజరికి వినంబడునట్లు చంద్రిక మల్లి కతో మెల్లన నిట్లనియె! "ఓసీ మల్లికా! ఈమె మనోరథము దుర్ల భముగాదు. ఏమంటేని యామకరందుఁడెంతచక్కనయ్యయైనను దానికిట్టి చక్కలాఁడి యెక్కడలభించును? మన చెలిని మనము మెచ్చఁ

గూడదు; కాని యింతటి యందకత్తియ యీనాఁటి రాచకన్నియల లోనెం దున్నదే? ఒకవేళ చక్కనిపడఁతు లున్నారనుకొనుము. వారి కీవిద్దియ జాణతనంబు లెక్కడివి? కావున మనచెచ్చెలి మనోరథంబు మకరందుఁ డెఱిఁగినచోఁ గన్నులఁ గప్పుకొని మహాప్రసాద మని యామెను బరిగ్రహించు. ఈమెం గాంచినది మొదలు మనసులోనతఁ డెంత మఱుఁగుచున్నవాఁడో యెవ్వఁ డెఱుఁగు? కావున దీనికిం దగు ప్రయత్నముఁ జేసిన మనము కార్యసిద్ధిఁ గాంచఁగలము." అనవుడు మల్లిక చంద్రికతో నిట్లనియె. ఓసీ! నీవు చెప్పిన దంతయు నిజమే. కాని నామనంబున నొక్కసందియంబు బాధించుచున్నయది. కర్పూరమంజరి సుక్షత్రియకన్య; మకరందుఁడు బౌద్ధుఁడు. వధూవరులు భిన్నమతస్థులగునపుడు వారి కలయికకుఁ దలిదండ్రు లనుమతింతురో లేదో యని శంకించుచున్నాను.

ఇట్లు నెచ్చెలు లిరువురు దమతమ యభిప్రాయంబులు దెలుపఁ గర్పూరమంజరి మల్లికాచంద్రికల నూరకుండుఁ డని యిట్లనియె. "మల్లికా నీవు చెప్పినది నిక్కంబు. తలిదండ్రులు మాసమాగమమున కనుమతింపరు. ఒకవేళ యెట్లయిన మొదలు విడిచి కాళ్ళవేళ్ళం బడి బ్రతిమాలి వారి నొప్పింతు మనుకొనుము మకరందుఁడు మనకు సులభుఁ డెట్లగును? మీ రేమనుకొంటిరో కాని యతఁడు సామాన్యుఁడు కాఁడు. ముక్కంటివింటల మ్రుగ్గనిమన్మథుఁడు! మచ్చలేనియచ్చపుఁ జందమామ. ఆతనితలిదండ్రు లనుమతించినమాత్రమున రాజాధిరాజులు వెల లేనికానుక లిచ్చి తమకూఁతుల వానిపాదారవిందములపైఁ బడవేయరే! అతఁ డొడంబడినమాత్రమున నీనాఁటి రాజకన్యలందఱు పరుగుపరుగున వచ్చి వానిపాణిగ్రహణంబు చేయరే? అతని బిగియారు కౌఁగిటం జెనఁగెడు భాగ్య మెన్నినోములు నోచినదానిఁ లభించు. అతనికి రాణియాపూఁబోఁడి యెంతయదృష్టవంతురాలు

కావలయు! అతనియనుగులను నూడిగంబు జేయుటకైన నేనుదగను. నేనెక్కడయతఁ డెక్కడ? నా మాసలువట్టివె. అయినమీరు నావలపులమాట మా పెద్దల కింతలోఁ దెలియఁజేయవలను.'' అని మఱియు నెద్దియో పలుకఁబోవు చుండ నచ్చటికి నంతఃపురపరిచారికలలో నొకర్తునచ్చి తల్లి రమ్మనుచున్న దని కర్పూరమంజరిం బిలిచెను. అప్పుడా ముప్పురుఁ దమ విస్రంభసంభాషణమును గట్టిపెట్టి లోనికిం జనిరి.

---

## పండ్రెండవ ప్రకరణము

''అది మొగమో షోడశకళాపూర్ణమగు చంద్రమండలమో తెలిసికొనుట ప్రయత్నసాధ్యమయ్యెఁ గదా! అది యంగనయోజాళువాపసిండిబొమ్మయో నిర్ణయించుట సులభసాధ్యముగాదు. అవి కన్నులో కృపాగసమకరందమ్మును జిమ్మునెత్తమ్మిరేకులో నిర్ధారణచేయుట యెంతకష్టము! అది చిఱునగవో నిండువెన్నెలయో నిశ్చయముగా నెఱుంగ నలవియగునే? ఆహాహా! ఆపడఁతుకను గడుపారఁ గాంచిన తల్లిదండ్రు లేమి పుణ్యము చేసిరో? అది మనుష్యాంగన యగునో కాదోయని నాకిప్పటికిని సందియంబు గలుగుచున్నయది. అది నిక్కముగ మానవాంగన యయ్యెనేని మానవజాతియు మధ్యమలోకమును ధన్యతనొందినవి. ఈవఱకు నేఁడెరినో సుందరాంగులను సందర్శించితిగాని యీ సుందరమానఁబోలు నిందువదన నెందును గనుగొని యెఱుంగ. అదియేమో కానికాంతలకును భోగములకును పరాఙ్ముఖంబైన నామనసా పడంతిని గనుఁగొనినది మొదలు దానియొద్ద నేయుండును గాని యెంతక్రమ్మరించిన వెనుకకుమరలను. చదువులు సాములుండక తక్కినగొడవలకుం బోని నేను నిద్రాహారములు విడచి తెగులులేనిభా

ధలంబడుటం జూచి నాలోనాకే సిగ్గగుచున్నది. గ్రంథపఠనముపై మనసుపోదు. పొత్తమునం దెరచి యొకపంక్తియైనం జదువంజాల. మోహపరవశుండ నగుటచే నాకిప్పుడు ప్రపంచమంతయు కర్పూర మంజరీమయమై తోంచుచున్నది. సువర్ణమయమగు నామె నామమే కాని యొండొక పేరు నానోటికి రాదు. మెఱుపుందీగబోలు నామె విగ్రహమే కాని మఱి యేపదార్థము నామనంబునకుం బొడకట్టదు. మధురములై మనోజ్ఞములై సూర్దనంబునకు తావులై వెలయు నా మానినిమాటలు ముద్దులమూటలై యిప్పటికిని వినంబడుచున్నవి. నీస్థితి యిటులున్న దేమని వేమాఱు తెఱచితఱచి యడుగు బంధుమిత్రుల ప్రశ్నంబుల కుత్తరంబు లొసంగలేక కడునిసికిపోవుచున్నవాండ. ఇది లోలోపల నెంత దాంచినను దాగునది కాదు. నేనిప్పుడేమి చేయుదు? మనసు నిలువదు. మన్మథుం డూరకుండడు. మానిని కడు దవ్వున నున్నది. దవ్వుననున్న దననేల? దాపుననున్న మాత్రమున నా కాయిందువదన సులభమగునే? మతభేదముచేతనే మా యిరువుర సమాగమము దుర్లభము. అది యట్లుండ నవనిలో నవతారమందిన చక్కదనంపు ముద్దయగు నాముద్దియ యెక్కడ నేనెక్కడ? నావంటివానిపై నామె వలపు నిలుపునే! ఆ రాజవదన యేరాజనందను ననుగ్రహించి యాస దంగార్ధి నోలలాడి మదలచి యున్నదో? ఆమెను చెట్టబట్టు భాగ్యము గలుగువానికి త్రిలోక సామ్రాజ్యాధిపత్యమేల? అతనికి నరలోకంబె నాకమగు నట్టడవి నందనంబగు. వేయేల! ఆమెయే నాప్రాణము. ఆమె తల్లిదండ్రు లనుమతింపకున్నను సరే; నాజననీజనకులు వారించినను సరే; యామె నన్ననుగ్రహించునేని నేనామె కేలుబట్టకమాన. నావెట్టియే గాని నన్నాబాలిక యనుగ్రహించునే? ఏల యనుగ్రహింపకపోవు? ఆమెకును నాకును జరిగిన కలయికల తెఱగు చక్కంగా నరసిచూచిన నాపై నామెవలపు నిలిపిన దనియే తోంచుచున్నది. నేనెంతసేపామె సన్నిధిని గూర్చు

న్నను నన్నింకం గూర్చుండుమని, యామె వేఁడుకొనుట, పథ్య పానంబు నకుఁగు నెపంబున నెడతెగక నాతో మాటలాడుట, నేను సమక్షమున నున్న కాలమున వికసిత ముఖారవిందయై సుఖంబుగ నుండుట, నేను నాడీపరీక్ష జేయుటకై కరస్పర్శనంబు చేసినపుడు కన్నును మూసికొని స్పర్శసుఖ మనుభవించుట, నేను రెండుదినంబు లంతిపురమునకుఁ బోవుట మానినపు డామె యెవ్వరితోడం బలుకక యస్వస్థయై యుండుట మొదలగు లక్షణంబు లన్నియుం బరికింప నాయుం దామె బద్ధానురాగయై యున్నట్టు సిద్ధాంతము చేయవలసి యున్నది. అయ్యయో ? మోహపరవశులగు పురుషులు తమ కామించిన కాంత యేపని జేసిన తమనిమిత్తమే చేసెనని తలంచుట లోకప్రసిద్ధమే కదా! మందిచ్చుటకు చికిత్సకుఁడు వచ్చినపుడు రోగి మాటలాడుట యరుదా ? దౌర్బల్యము చేత రోగులు కన్ను మూసి కొనరా ? పథ్యపానంబులఁ బలుమాఱడిగిన మాత్రమున నే యన్యథా తలంపవచ్చునా ? ఆఁడువాండ్ర మనోగతంబుల దెలియ నెవ్వరి వశము ? ఒక కారణంబున నామె చేసిన చేష్టలు పలికిన పలుకులు మఱియొక కారణంబున నయ్యెనని నేను సరిపెట్టుకొను టుచితము కాదు. అందుచేత నాసిద్ధాంతము నిప్పుడు పూర్వపక్షము చేసికొన వలసియున్నది. ఇంతయేల ? అంతంతచనువిచ్చి నాతోడ నాగాలిక పలికినప్పుడు నా మనోరథంబు నెఱుఁగుననైన విన్నవింపక యూర కుండుట నాతప్పు. ఆమె చెలికత్తెలలో నెవ్వతెనైన నంజేరి నామనో రథంబు జెప్పనైతి. నాటిరాత్రి నన్నింకఁ గొంతసే పుండమని యామె యడిగినప్పుడు వల్లెయని యచ్చట నుండనైతి. ఉండిన నేమి చెప్పునో కదా ? ఆమె రాజవాహనున కెట్టిచుట్టమో యడిగి తెలిసికొననైతి. మొగమోట గలవానికి మోక్ష మెట్లు లభించు ? లేనిపోని గాచగోటులకుం బోయి యప్పుడూరకుండి యదను దప్పిన వెనుక నిట్లు విచారించిన నేమిఫలము ? నాసిగ్గునకుం దోడు నా

కేపనియుం దోఁచకుండునట్లు యత్నసేయుఁడు పురికిం బోవుద మని
నన్ను ద్వర పెట్టె.''

అని యొక నాఁడు సాయంకాలమున మకరందుఁడు తన లోనం
జింతించుచు మేడపై నొక్కఁడుఁ గూరుచుండె. అప్పుడప్పుడే యుద
యించిన చంద్రమామ తన చల్లనికిరణములఁ గవాక్షమునుండి మక
రందునిపైఁ బ్రసరింపఁ జేసి మదనతాపసంతప్తమైయున్న యాతని దేహము
నకు శైత్యోపచారము చేయం బూనుకొన్నట్లు కానఁబడెను. సీప్రానదీ
జలకణంబులతోడం గలసిన మందమారుతములు వానిమేను సోఁకి
యొక్కమాఱు హాయిహాయియనిపించెను. ఆ సమయంబున నతఁడు
కన్నులు మూసికొని దేవినుపాసించు పరమయోగి విధంబునఁ
గర్పూరమంజరీ దేవిసుందరవిగ్రహంబును మనంబున ధ్యానించుచు
నామె సంభాషణంబులఁ దలంచుచు భోగసమాధిలోనుండె. అప్పుడు
కాషాయవస్త్రములు కట్టుకొన్న యొక బ్రాహ్మణకుమారుఁడు మేడ
పై నెక్కి యడుగుల చప్పుడుగాకుండ మెల్ల మెల్ల నడచివచ్చి మకరం
దుని ప్రక్క నిలువంబడియె ఆ విప్రకుమారుఁడు వచ్చినజాడనైన
నెఱుంగక మకరందుఁడు సమాధిలో నేయుండుట జేసి యాతఁడు తన
చేతితో నల్లన మకరందుని వీఁపుపైఁ జఱచెను. తట్టుటయు నారాజ
కుమారుఁడు త్రుళ్ళిపడి లేచి యెవరు వాని పరికించి కన్నులు
దెఱచిచూచి ''ఓహో చంద్రచూడుఁడా! మిత్రుఁడా! యిటు
గూరుచుండు'' మని చెప్పి మరల గన్నులోయి మూసికొనియె
మున్నదా నెన్నఁడు వచ్చినను బలవనక తేఱువక సమయమునక
సమయమనక తన్నెంతయు గౌరవించి తన మాటల కత్యంతము
సంతసించు మకరందుఁడు తనరాక కలరకఁ గన్నులు మూసికొను
టయు వాని నెమ్మొగంబు నిట్టూర్పుసెగలచేఁ గలుషమగుటయు
మేను కృశత్వంబు నొందుటయు నవలోకించి చంద్రచూడుఁడు తన
మనంబున నిట్లు విచారించె.

"విదర్భనుండి వచ్చినవెనుక వీనికై ఖిగియింత మార్పు జెందుటకుం గారణమేమి? చక్కఁగాఁబోలిచిచూడ నీతనికి మన్మథగ్రహము సోఁకినట్లు దోఁచెడిని. చంద్రప్రభాదేవియు సుదర్శనమహారాజును వీనియునికిం గారణ మరయ లేక కళవళపడు చున్నవారు. కావున వీని నడిగి తత్కారణము దెలిసికొని సమయోచిత తగు కార్యము జరపించదను" అని విచారించి యతఁడు మరల మకరందునిపైఁ జేయి వైచి "చెలికాఁడా నీవిట్లుండుటకుఁ గతమేమి? తొల్లిటియట్లు మనసిచ్చి నాతోడం బలుక వేమి? చదువులపొంతఁబో వేమి? సాముల వంక జూడవేమి? పండితులతోఁ బ్రసంగింపవేమి? అచటి విశేషంబు లేను వినఁదగనా?'! యని చిఱునగవు నవ్వుచు నడిగెను. మకరందుఁడు వారిపలుకులు విని "మిత్రుఁడా? విదర్భాపురమందు జెప్పఁదగిన విశేషంబు లెవ్వియు లేవు. ఎవ్వియేనియున్న కాలక్రమంబున నీకుం దెలియకపోవు గదా" యని బదులు చెప్పి యూరకుండె.

తనచెలికాఁడు మనోగత వృత్తాంతమును దనకు తెలియఁ జేయుటకు సందియమునొందుచున్నవాఁడని గ్రహించి చంద్రచూడుఁడు తన వచోచమత్కృతి తేటపడ నిట్లనియె. "మిత్రుఁడా! విదర్భలో విశేషములు లేవని చెప్పినంతమాత్రమున నమ్ముటకు నే నంత వెంగలినా? పసివానినట్లు నన్నుఁగన్నుఁ బ్రామఁదలంచెదవేమి? విదర్భానగరము సంగతి నే నెఱుంగుదును? కానినిన్న మొన్న కన్నులు దెఱచిన పిన్నవాఁడవు నీవేమెఱుంగుదువు? నేను నీకన్న వయోజ్యేష్ఠుఁడనగుటచేతఁ గొంతవఱ కెఱుంగుదును. ఆనగరంబున స్త్రీలునిలిచియున్న మనుష్యులు నిలిచి యుండఁగనే నగమట్లుచేయఁగలరు. తలలు మార్చి తలలు పెట్టగలరు. వారిమాయ లెట్టివో యెఱుంగముగాని శరీరములోఁ బదిలముగ నున్నహృదయమునైన నపహరింపఁగలరు. అంతటినెఱజాణ లెందును లేరు సుమీ. స్త్రీలే యింతటిసాహసములు

చేయ నింక నచ్చటిపురుషు లెంతసాహసులోఁ జెప్పవలయునా'' అనుటయు మకరందుఁడు మందహాసము చేసి తనగుట్టుజాడ నెఱింగి చంద్రచూడుఁడు నర్మగర్భముగా నట్లు పలికి యుండఁబోలు నను కొని ''మిత్రుఁడా! నీమాటలయర్థము దృష్టాంతరములు చెప్పి ఋజువు చేయవలయునుగదా? ''యని పలికెను. అనవుడు చంద్ర చూడుఁడు దృష్టాంతముల కేమికొనుము. నాకు నీవే తార్కాణము. నీమేనుమునుపటియట్లు లేదు. నీవుచిక్కి సగమై నీశరీరార్ధమును విద ర్భలో విడిచి వచ్చితివి. నీతల మునుపటితలగాదు. అది క్రొత్తతలఁ పులతో నిండియున్నది. విదర్భనుండి వచ్చినవెనుక నీ హృదయము నీవద్దనే లేదు. నీవు ప్రకాశముగా నీసంగతుల నొప్పుకొనకపోయినను నాపలుకులు నిక్కవములో యనృతములో నీమనస్సే యెఱుంగు. నీ గుట్టు నీ వెంత దాఁచినను నీమోము వైవర్ణ్యము నీమేని కార్శ్యము నీవిమ నస్కత చెప్పుచున్నయవి. నీకు బహిఃప్రాణమునగు నాకారహస్యంబు తెలుపుదు వేని నేను నీకుం దోడ్పడియెద'' నని యుత్తరము చెప్పె.

అప్పుడు మకరందుఁడు సంతోషముతోఁ దనపీఠమునుండి లేచి చంద్రచూడుని కౌఁగిలించుకొని ''చెలువుఁడా! నీపలుకులు నిక్కవ ములు. విదర్భదేశస్త్రీలు నెఱజాణలె. అందొక్కరితె నాహృదయ మునపహరించినమాట సత్యము. సిగ్గు పెంపున నిన్నినాళ్ళు నాగుట్టు నీకు వెలిఁబుచ్చనైతి. అంతియె కాని నీవు పరాయివాఁడ వని కాదు. నీవు నాకు సాయమై నామనోరథసిద్ధి గావింపవలయు'' నని తాను విదర్భకరిగినది మొదలు వెండియు నుజ్జయినికి వచ్చువరకు వర్తిల్లిన యావద్వృత్తాంతము నెఱింగించి కర్పూరమంజరీసమాగమము గాని పక్షమున తన మేనం బ్రాణములుండవని దృఢముగా బలికెను. చంద్ర చూడుఁడు ప్రియవయస్యుని పలుకులు విని వానిచిత్త మూరడిల్లునట్లు

సమయోచితముగఁ బలికి వారిరువురి సమాగమమునకై యుపాయమును వెదకుచుండె.

చంద్రచూడుఁ డెవ్వరని చదువరులకు సందియముం దోఁచవచ్చును. అతఁడు మకరందునకు వేఁడుక చెలికాఁడు. వానిపూర్వులు నాలుగుతరములనుండియుజ్జయినీమహారాజుల యాస్థానమునందువిదూషకులుగనుండిరి. చంద్రచూడునితండ్రి యగు గంగాచూడుఁడు హాస్యరసముయొక్క యవతారమని యానాఁటిప్రజలు చెప్పుకొనుచువచ్చిరి. గంగాచూడుఁ డప్పటికి మూఁడేండ్లక్రిందట పరలోకగతుఁ డగుటచే సుదర్శనుఁడు వానికొడుకగు చంద్రచూడుని దనకొడుకునకు వేఁడుక చెలికానిగా నొనర్చి కుటుంబమునుబోషించుచుండె. మకరందుఁడును వానిచమత్కారవచనంబులకు పలుమాఱు గూరాయు రేయని మెచ్చుచు విద్యావ్యాసంగముల మీఁద విసువు దోఁచినప్పు డెడనెడఁ జంద్రచూడునిం బిలిచి మనంబునకుఁ బండువు చేసికొను చుండును.

—*—

## పదిమూఁడవప్రకరణము

శ్రీనగరము హిమాలయపర్వతమునకుఁ గడుదాపున నుండుటచే నది సూర్యోదయకాలమున మంచు నేలం గప్పఁబడి దవ్వులనుండి చూచువారికన్నులకు తెల్లని మేలిముసుంగుచాటున డాఁగియున్న రాజకన్యకయట్లు భాసిల్లుచుండెను. రాతిరి కురిసినమంచుకతంబున నేలయుజెట్లు కొండలు దడిసి దమకుఁ గలిగినదోషసంపర్కంబుఁ బాపుటకై ప్రభాతసమయమున సంపూర్ణ స్నానము చేసి నిలిచెనో యన్నట్లొప్పె. సిగ్గుపెంపున ముసుంగు మఱుంగున నడఁగి యున్నపడంతి ముఖారవిందమును జూచు తమకంబున నాయకుఁడువచ్చి తనకరంబున

గవిసెనఁదొలంగఁద్రోసినట్లు పద్మినీనాయకుఁడగు భాస్కరుఁడుపొడుపుఁ గొండపైఁ దోఁచి తన సహస్రకిరణంబుల తోరపుల తిమ్మినిమఱుఁగు [?] చేసినమంచుగవిసెనను గ్రమక్రమంబునఁ దొలఁగించుచుండు. మంచు ముసుఁగు జారినతోడనే లేయెండ యలముటయుఁ బురలక్ష్మికుసుంభ వస్త్రముం గట్టుకొని నిలువఁబడిన చెలువంబునఁగానంబడియె. సూర్యోదయానంతరమున నగమును బ్రత్యంతభూమియు నిర్జీవస్థితిలో నుండి జీవస్థితికి వచ్చినట్టులుండె. అట్టివేళ నొక్కనాఁడు కాశ్మీర రాజకుల తిలకమగు హేమచంద్రుఁడు కాల్యకృత్యముల నిర్వర్తించి యెప్పటి యట్లు సముచిత వస్త్రాలంకారములు ధరింపక కొలువుకూటంబునకుం జనక తనయంతిపురమున నొక్కగదిలో చింతాక్రాంతుఁడై యొక్క పీఠమునఁ గూర్చుండె. విషాదమెట్టిదియో యెఱుఁగక యెల్లప్పుడు కలకల నవ్వుచుండు హేమచంద్రుని మొగంబు విలాసంబుదప్పియుండుటఁ జూచి యంతిపురంబునఁగల పరిజనులు కారణము తమలోఁదారూహించియుఁ దెలియఁజాలక రాజును డాసి యడుగుటకు సాహసింపక వెలవెలఁబోవుచుండిరి. నరపాలుఁడు తొంటియట్ల యుదయకాలమునఁ గొలువుకూటమున కరుదెంచి తమ్మలరించు నని నమ్మి ప్రధానులు దండనాయకులు సామంతులు చుట్టములు రాయబారులు ననుజీవులు లోనగు నియోగిజనంబులు వానిరాకఁ బ్రతీక్షించుచుండిరి. రాజెంత సేపటికి రాకపోవుటయు వానివద్దనుండి వర్తమాన మేమియుఁ దెలియక పోవుటయు సభాసదులందఱు కారణమరయలేక కలవలపడుటయుఁ జూచి ముఖ్యమంత్రియగు మతివర్మ రెండవ మంత్రియగు మాధవ సేనుని వెంటఁబెట్టుకొని కారణమరయుటకై యంతిపురికిం జనియె.

వారిరువురుం జనునప్పటికి రాజప్రక్కఁ బురోహితుఁడగు నిగమశర్మ గూర్చుండి వాని నూరడించుచుండె. తేప [?] ముఖవైఖరి నవలోకించి మంత్రులిరువురు నతఁడు గాఢసంతాపముం దప్పుఁడయి [?]

యున్న వాడని గ్రహించి దురాత్ముఁడైన చిత్రభానుని కుట్రవలన వాని కేదేనపాయము వాటిల్లి యుండదు గదా యని తలపోసి వానిని సమీపించి నమస్కరించి యెట్టయెదుట నిలిచిరి. హేమచంద్రుఁడు వారిని జూచి కూరుచుండుమని చేసన్నఁ జేయ నమాత్యు లిరువురుం గూరుచుండిరి. అనంతరము నాలుగునిమిషము లూరకుండి మణివర్మ నిగమశర్మ నుద్దేశించి మెల్లఁగ "ఆర్యా! మహారాజుగారి విషాద కారణ మేమి?" అని యడిగెను. నిగమశర్మయుఁ దనపీఠము మణివర్మ సింహాసనంబునకుం దగ్గరగా జరపుకొని మెల్లగ నిట్లనియె.

"అయ్యా! మహారాజుగారి సోదరుఁడు చిత్రభానుఁడు కాలధర్మము నొందె నని తెలిసినది. విధికృతంబున నీనడుమఁ గొన్ని పొరపులు గలిగినను మహారాజుగారి భ్రాతృస్నేహ మతిశయముగనుండుటచే వారిప్పుడు మిక్కుటముగఁ గుందు చున్నవారు." అనవుడు మణివర్మ మిక్కిలి యక్కజంబున రిచ్చవడియె. మాధవసేనుఁడు నోట మాటలేక తెల్లబోయె. మహారాజు కన్నుదమ్ములనుండి బాష్పములు విడిచి నిట్టూర్పుపుచ్చె. అప్పుడు మాధవసేనుఁడు తనమనంబున 'నహహా! సోదరుఁడన నీమహారాజే సోదరుఁడు. తన ప్రాణంబులు తీయ దలఁచిన తమ్ముఁడు మృతినొందినప్పుడు మహోపకారమైనదని సంతసించుటకు మారుగ నతఁడిట్లు విచారించుచున్నవాఁడు. ఇతఁడు ధర్మము యొక్క యవతార మనవచ్చును గాని కేవల మనుష్యుం డనవచ్చునే' యని దలపోసి నిగమశర్మవంక మొగము ద్రిప్పి 'అయ్యా! ఇది యథార్థ మగునో కాదో మీరు చక్కఁగ నరసినారా? కుడిచి కూర్చుండి ప్రొద్దుపోవక యేరిపై నేని చెడువాడుకలు వేయు దురాత్ము లనేకు లుందురు. ఇదియు నట్టివారి పన్నుగడ కాదుగదా' యని పలికెను. వర్తమానమును దెచ్చిన మనుష్యుఁడెవ్వఁడో యెఱింగింతు రేని మనము దాని యథార్థము నిర్ణయింపవచ్చును" నని మణివర్మ నుడివెను.

ఆపల్కులువిని నిగమశర్మ యిట్లనియె. "అమాత్యులారా! యెఱుంగుదురుకదా మననగరమున కుత్తరదిక్కు సింహగిరి యను పేరం బరఁగుకొండయున్నదట. ఆకొండలోఁబడమటివైపున నొకగుహ కలదు. ఆగుహయందు ప్రస్తుతము హరిశర్మయను బ్రాహ్మణోత్తముఁ డొకఁడుశిష్యసమేతుఁడై తపంబుచేసికొనుచున్నవాఁడు. వానిపాండిత్య మే మని పొగడ? తనయిల్లాలువాణిలేని చతుర్ముఖుఁడు. ఎంతశాంతము. ఎంతదాంతము. ఎంతదమము. ఎంతశమము. అతని మొగంబు జూచిన సకలకలుషంబు లడంగు. అతఁడు రెండుమాసములక్రిందట వచ్చి యాగుహలో విడిసి యున్నవాఁడు. పాలు పండ్లు భక్షించును గాని యన్నముతినఁడు. అదియైన నెవ్వరేని సమర్పించి యారగింపుఁడని బ్రతిమాలినం గాని మెసవఁడు. జ్యోతిశ్శాస్త్రమున రెండవబృహస్పతి. జాతకసిద్ధాంతముహూర్తభాగంబులయం దతని కతఁడె సాటి. బ్రహ్మవ్రాలునకైనం దిరుగున్నది కాని వానిపెట్టిన ముహూర్తంబునకుఁ దిరుగులేదు. మంత్రశాస్త్రమున మహాపాదుకాంతదీక్షంబడసిన వాఁడు వరమిచ్చి చేపట్టినా సన్న్యాసిని సార్వభౌమునిం జేయఁగలఁడు, బిట్టలిగి తిట్టినా బిడౌజుని బిచ్చగానిం జేయఁగలఁడు. అతనివాక్శుద్ధి యెట్టిదియో కాని వైద్యులకు ధన మిచ్చి చికిత్సలు చేయించుకొనఁ జాలనినిరుపేదలు వేనవేలు మననగరంబునుండియు నీచుట్టుప్రక్కల నుండు పల్లియలనుండియు వచ్చి ప్రతిదినము వానియడుగులసేవించి తమ రోగంబులం గుదుర్పు మని ప్రార్థింప లోకానుగ్రహార్థమై యతఁ డించుకసేపుతపము చాలించి రోగులమొఱలువిని మంత్రతీర్థమించుక యిచ్చి మీజాడ్యంబు నిశ్శేషంబుగా హరింపఁబడుఁ గాక యని వారిం బంపుచుండు. ఆమాటలతోనే వారిపీడయంతయు నశియించు. అతనిమాట యటుండనిమ్ము. నాకీవర్తమానము వానిశిష్యులలో నొకఁడు చెప్పె. నిజము. దీని విషయమున మీరు సందేహింప బని

లేదు." అని పలుకుటయు మునిశర్మ "అతఁడే ప్రసంగవశమున మీకీదారుణవృత్తాంతంబు నెఱింగించె" నని యనుఁగ నిగమశర్మ తత్సందర్భము నిట్లెఱింగించె.

"హరిశర్మయొక్క మహామహిమలు కర్ణాకర్ణిగవిని యమ్మహాత్ముని సందర్శించి జన్మంబు చరితార్థంబు కావించికొనవలయు నని తత్సన్నిధి కరిగి రాజపురోహితు డనని విన్నవించికొన్న పిమ్మట నమ్మహాత్ముఁడు మీరా సెవ్వరని యడిగె. రామచంద్రసమానుఁ డగు హేమచంద్రుఁడు మారాజచంద్రుఁ డని నేను విన్నవించితిని. అప్పు డాయనశిష్యులలో నొక్కఁడు నావంకఁజూచి, పాపము మందభాగ్యు డగుచిత్రభానునిసోదరుఁ డితఁడే కాఁడా" యని నన్నడిగెను. నాఁడు హరిద్వారమందు గంగాతీరమున మారేడు చెట్టుక్రింద మృతినొందిన రాచకుఱ్ఱవానిసోదరుఁడేనా? యితఁ డని హరిశర్మయాశ్చర్యముతోఁ బలికెను. ఆమాటలు విని మేను గడగడవడంక నేను హరిశర్మను స్వామీ! యిది నిక్కమేనా యని యడుగ నతఁడొక్క నిమేషమూర కుండి యయ్యా నిక్కమే. ప్రపంచసంబంధములైనగొడవలెల్ల విడచి జనులరొదలతో నిండియుండు పట్టణంబులఁ బల్లియలఁ గాఁపురముం డుట మాని యంతరంగమున నంబరమేష్ఠిం బ్రతిష్ఠించి పర్వతగుహలలో గాలక్షేపము చేయుచున్న మేము ప్రజల కిట్టిదారుణవార్తల నెఱింగించి దుఃఖమును కలిగింపరాదు. మీమహారాజునకుఁ గాలక్రమంబున నీ వార్త దానంతటదియే తెలియఁ గలదు. నీవు మామాటలుగ మహా రాజుతో విన్నవింప వలదని నొక్కి వక్కాణించెను. కాని దేవరవారి యందు నాకుం గలపరమభక్తిచే మనసుండఁబట్టక నే నది నివేదించి తిని. అది నిజ మనియే నాకు నమ్మకము."

అని నిగమశర్మ యెఱింగింప నందబద్ధమేదియునుండదని మంత్రు లిరువురు విశ్వసించిం. హేమచంద్రుఁడు కన్నుదోయినుండియశ్రుజలం

బులు జోటఁజోటఁగాన వెచ్చనియూర్పులు బుచ్చుచు "సమాత్యులారా! నేను భ్రాతృద్రోహిని; నాచేసిన దుర్ణయంబునఁగాదె మహాగర్భశ్రీమంతుండైన విక్రమదేవునిగారాపుఁదమ్ముఁడై సౌఖ్యంబులవారిగా ననుభవించిన యువరాజు కానిదేశంబుల రెక్కలూడినపక్షియై యస్తమించె. ఎంతెంతలో నేరములు క్షమియించిన నేఁడు నాతమ్ము ప్రాణము పైఁ గలయభిమానముచే వాని నిల్లు వెడలఁగొట్టితిని. అవివేకి నన్న శాంతమంతయు దిగమ్రింగినట్టి యామహాకోపము నా కెటనుండి వచ్చెనోకదా? వేనవేలు సేవకులకు నియామకుండైన యువరాజు తన యవసానసమయంబున నెంత చింతించెనో! నన్నెంత దూషించెనో! విధి పరిపాకంబున కెంత వగచెనో యాపరమేశ్వరుఁడే యెఱుంగు! ఆదారుణ వచనంబులు వినినప్పుడు పరమపవిత్రయగు నీమహాదేవి నన్ను శపియింపకుండునే! బాలికయగు కన్యకను జరి పితృవియోగంబున గుందునెడ ముద్దులు మూటగట్టు నామె నెమ్మొగ మెంతచిన్నవోయెనో. మహారాజునకుఁ బుత్రుఁడై విక్రమసేనుని మనుమఁడై భూచక్రంబు పాలింపఁగలశుభలక్షణంబులు గూర్చుకొనిన విజయసేనుఁడు తండ్రిలేనిబిడ్డఁడయ్యెనే! ఆచిన్నవానికిఁ దండ్రి లేని వెలితి యెట్లుతీరు. మహీమండలాధిపత్యంబు సమర్పించిన, మేరుపర్వతంబు త్రవ్వి తెచ్చి ముందుబెట్టిని, వారితండ్రిని మరలఁ దేఁగలమే? అది యట్లుండెంట. నా యెదుట నుండి లేచిపోయి యేదేశంబుననైన సుఖంబుగ బ్రదికి యుండు నని తలంచితి గాని యింతలోఁ దమ్మునకిట్టి యిట్లగునని కలలోనైనఁ దలంపనైతి. మహానుభావుఁడగు హరిశర్మయొద్దకు నన్నుఁ దోడ్కొనిపొండు. నాయనుజుని చరమావస్థఁగూర్చి నేను స్వయముగా నడిగి తెలిసికొనియెద" అని యూరక వావిడిచి వగవఁ జొచ్చె.

---

# పదినాలుగవ ప్రకరణము

సింహాగిరి శ్రీనగరంబున కుత్తరముననుండెను. తొల్లి నారాయణుఁడు నరసింహావతారమెత్తి లోకకంటకుఁడగు హిరణ్యకశిపునిఁ దెగటార్చి ముజ్జగముల కభయప్రదాన మొసంగియు దుష్టదానవుని మరణానంతరమునఁ గూడ గోపావేశ ముపశమింపక పోవుటచే లోకముల నెల్ల భస్మపటలము గావింప నుంకించెననియు బ్రహ్మాది దేవతలు భయకంపితులై వాని పాదరాజీవములకు మ్రొక్కి యవతారము నుపసంహరింపుమని ప్రార్థింప నాతఁడు కృపాళుఁడై యాగిరివద్దనే తన యవతారమును జాలించెననియు స్థలమహాత్మ్యము నెఱిఁగిన కోవిదులా కాలమున జెప్పుచువచ్చిరి. అందుచేత నాగిరికి సింహాగిరి యనుపేరు గలిగె.

శ్రీనగరప్రాంతమున నిప్పుడు సింహాగిరి యనుపేరం బరఁగు కొండయు లేదు. చుట్టుప్రక్కలఁ గలకొండ కట్టిమహిమలుగలవని చెప్పుకొనువారును లేరు. ఆగిరిలో నొకగుహ కలదు. అది యెక్కువ నిడివియుఁ దక్కువ వెడల్పుఁ గలదై కారుచీఁకటులకు నెలవై భయంకరమైయుండును. ఆసొరంగమునఁ జొచ్చినజంతువు లన్నియు మృతినొందెనని జనులు చెప్పుకొనుటయే కాని బ్రదికివచ్చెనని యెన్నఁడు జెప్పుకొని నెఱుఁగరు. ఆబిలము మాపులు నక్కకూఁతలతో ప్రతిధ్వనులిచ్చుచుండును గాని పగలు నిశ్శబ్దమై యుండును. జనసంపర్కము రోసి యూరుబైటనే వసింప నిచ్ఛగించు దిగంబర యోగులు క్షపణకులు మొదలగు మహాత్ము లప్పుడప్పుడు దానియందు విడియుటయుఁ రెండుమూఁడు దినము లందుండి చెక్కుచెదరక యన్వాలకుఁ బోవుటయుఁ గలదు. మృత్యుముఖముఁ బోలు నాబిలము జొచ్చువారెట్లు బ్రదికి బైటఁబడిరని కొందఱు పౌరులకు సందియ మప్పుడప్పుడు తోఁచుచు వచ్చెను. కాని యందుఁ బ్రవేశించిన వారిమహిమయే వారిం గాపాడు

చు వచ్చెనని పెద్దలు తెలియఁజెప్పి యట్టి వారి సందియములఁ బాపుచు వచ్చిరి.

అట్లు హేమచంద్రుఁడు సోదరవియోగమునుగూర్చి కొండొక తడవు విలపించి తమ్మునినిజవృత్తాంతము స్వయముగ వినఁగోరి మంత్రి పురోహితసమేతుఁడై హరిశర్మవద్దకుఁ బోవఁ బయన మయ్యెను. అగుటయు నప్పుడు మణివర్మ పరిచారకు నొక్కనిం బిలిచి "యోగీ మహారాజుగారు సింహగిరికిఁ బోవుదురు. అరదమునాయత్తము చేయు మని సూతునకుఁ జెప్పు"మని పనిచె. ఆమాటలు విని నరపాలుఁడు మణివర్మను జూచి "ఆర్యా! పోవలసిన తావు మహాపురుషసమక్షము. మనల నచ్చటికిం గొనిపోవుపని భాత్ృమరణము. కావున నిది యరదంబులు నందలంబులు నెక్కి యూరేగఁదగిన సమయముగాదు"యని పాదచారియై మణివర్మయు మాధవసేనుఁడు, నిగమశర్మయు వెంటరా నిరువురుపరిచారకులు ముందునడచి మార్గంబునుండి జనులం దొలంగింప సింహగిరికిం జనియె. కాలినడకను జనుచున్న మహారాజునుగనుంగొని పౌరులచ్చెరువడి యందలంబు డిది యెఱుంగని యీగర్భశ్రీమంతుని నడిపించుచున్న మహాకార్య మేమైయుండు నని విచారించి కారణ మెఱుంగఁజాలక నిలువంబడి చూచు చుండిరి. అవ్విధంబునఁ గొంతసేపు నడచినడచిరాజు పరివారసమేతుఁడై సింహగిరిసమీపమునకువచ్చి గుహాద్వారసమీపమున మూఁగియున్న వందలకొలఁది జనులను జూచెను. ఆజనసమూహములో నొకఁడు మహాప్రభూ! నాకుఁ గుష్ఠవ్యాధి యనియు మఱియొకఁడు నన్ను రాజయక్ష్మము పిన్న నాఁటనుండియు బీడించు చున్నదనియు వేఱొకఁడు నాకుఁ గన్నులు లేవు దృష్టిదయచేయు మనియు, బ్రార్థించు చుండెను. ఆకేకలు విని రాజు మంత్రులతో "ఈమూఁగినజనంబులం జూడ లోకములో నున్న రోగుల కెల్ల నిచ్చటికె వచ్చినట్లుకనంబడు చున్నది. ఈకేక లామహా

త్ముని జపతపంబులకు నిశ్చయముగ విఘ్నముఁ గలిగించును. ఇతఁడు వీరితో నెల్లు వేగుచున్నాఁడో కదా'' యని పలికి యామందలో జొరఁబడి లోనికిఁ జనఁజాలక యచట నిలిచె.

ఇంతలో సేవకులు రోగుల నొత్తిగించి దారి చేయుటకు నిగమశర్మమునుముందు నడచి తెరువు జూప రాజు భృత్యామాత్యసమేతుఁడై గుహాద్వారమువద్దకుఁ జనియె. చని కృష్ణాజినముపై బద్ధపద్మాసనము వైచుకొని కూర్చున్నవాని, రవంతయు నెడము లేకుండ మేనెల్ల విభూతి పూసుకొన్నవాని, శతరుద్రాక్షమాలికలు వ్రేలుచున్న మెడ గలవాని, సగము నెరసిన వెండ్రుకలు గలగడ్డమువాని భక్తిమై 'ఓంహర ఓంహర' యని శివనామస్మరణము జేయువాని, శాంతరసమున మునకిపట్టుగువాని హరిశర్మ యనువానిం జూచి వెల్లివిరిసినభక్తిరసము పెంపున హేమచంద్రుఁడు బ్రాహ్మణునకు చాగిలంబడి మ్రొక్కెను. అమాత్యులు పురోహితుఁడును గూడ నమస్కరించి ''యథా రాజా తథా ప్రజా'' యను వాక్యము సార్థకము జేసిరి. హరిశర్మ కన్నులు మూసి మహేశ్వరధ్యానమున నుండుటచేత రాజు నమస్కరించుటయు మిత్రులు మ్రొక్కుటయు నెఱుగనే యెఱుంగఁడు. నిగమశర్మ హరిశర్మశిష్యులం జూచి ''మహారాజుగారి రాక నెఱిఁగింపవచ్చునేని మాగురువుల కెఱిఁగింపు'' డని కోరెను. రాజాపలుకులు విని వలదువలదు తపోనిష్ఠు లగువారికి విఘ్నములు గలిగించుట నుచిత మని వారించెను. అనంతరము కొంతవడికి హరిశర్మ తపస్సు చాలించి కన్నులు తెఱచి గుహానలుదెసలు పరికించి కట్టెదుట నిలిచియున్న యపూర్వపురుషులం జూచి వీ రెవ్వరని పూర్వపరిచితుఁడగు నిగమశర్మ నడిగెను. అతఁడును ''స్వామీ వీరు కాశ్మీరదేశాధీశ్వరులగు హేమచంద్రమహారాజుగారు. మిమ్ము దర్శింపగోరి యిచ్చటకు విచ్చేసి యున్నవా''రని ప్రత్యుత్తరమిచ్చెను. అదివిని హరిశర్మ ''ఓహోహో! ఇతఁడే

నాశ్రిత సుజనచింతామణి! పండిత జలకమలాకర ప్రభాకరుడు. సత్పురుషసందర్శన మగుటచే నీదినము కడు సుదినము సుండీ"యని కొండొక ప్రశంసించి వారికందఱకు వ్యాఘ్రచర్మములు వేయించి కూర్చుండఁబనిచి వెండియు నిట్లనియె. 'మీరు రాకరాక వచ్చి మా కతిథులైరి. మీకు మేమేమి సపర్యలు చేయఁగలము? రత్నకంబళములపై నాసీనులగువారికిఁ బులితోళ్ళు, మౌక్తికహారంబులు ధరించువారికి, రుద్రాక్షమాలికలు, మంచిగంధము పచ్చకప్పురము బూసికొనువారికిఁ బూడిదయు, మరువము దవనము దాల్చువారికి మారేడు దళములు సమర్పించుట మీవంటివారి నగౌరవించుటయే. కావున మాయ నాదరణమునకు మమ్ము మీరు మన్నింతురుగాక !"

అనవుడు హేమచంద్రుఁడు విప్రునకుం దనయెడఁ గల గౌరవమునకు సంతసించి వినయంబున భక్తియు మనంబున సందడింప నాతనితో నిట్లనియె "సరిసరి! మీవల్లనా మేము సపర్యల నపేక్షించుట. మీ పాదరజంబు మాకిరీటంబుల నంటనిచ్చుటయే మమ్ము గౌరవించుట. మీయనుగుదాసుల సేవింపనిచ్చుటయే మమ్మాదరించుట. మీవలన నమోఘంబు లగు నాశీస్సు నపేక్షింతుము గాని రత్నకంబళములు మౌక్తికహారంబులు హరిచందనంబులు నపేక్షింపము. మీ విబూతిపిండికట్లు మోక్షమార్గంబున కెత్తినసోపానంబులు, మీ రుద్రాక్షమాలికలు ముక్తికాంత వలచివైచిన దామకములు. మా మౌక్తిక హారంబులు స్వయముగాఁ గంఠమునకుఁ దగిలించుకొనిన యురులు. ఉదయము మొదలు సాయంకాలమువఱకు రాజనీతిపేర జగద్వంచనము చేయు రాజులు సంసారపుసంకెళ్ళు విడఁగొట్టుకొని జీవన్ముక్తులైన మీవంటి మునిరాజుల యెదుట నిలువనైన నర్హులె? మీదర్శనముచేత నేనును నాపితృదేవతలు పదితరంబులవారును నా వంశస్థులును బవిత్రులమైతిమి. మీ రాకలచేతఁ గాశ్మీరదేశమే యనుగ్రహింపఁబడినది" అని రాజు ప్రశంసచేయ నిమశర్మయు రాజు

బలికిన దంతయు సత్యమని చెప్పి తనకుం దోచినట్లు తానును బ్రాహ్మణుని కొంతసేపు కొనియాడి తన యేలికవచ్చినపని విప్రునకు విన్నవింపఁదలఁచి వినయమునతో "మహారాజుగారి సోదరుఁడు చిత్రభానుఁడు హరిద్వారమునద్ద కాలధర్మము నొందెనని విని యది నిక్కువమో లోకప్రమాదమో తెలియఁగోరి యాయన యిట వచ్చె"నని పలికెను.

ఆపలుకు చెవిని బడినతోడనే హరిశర్మ మొగము చిట్లించి కన్నులు మూసికొని "హరహరా! ఆమందభాగ్యుని దురవస్థ మరల జ్ఞప్తికిఁ దెచ్చికొనవలసివచ్చెనా?"యని రెండుకన్నులనుండి రెండు బాష్పబిందువులు విడిచి యొకనిముస మూరకుండి హేమచంద్రు నుద్దేశించి "రాజా! నీసోదరవృత్తాంతము స్వయముగ నా ముఖంబున వినఁగోరి వచ్చితి గావున నిదిగో చెప్పెద వినుము. సహజకోమలములగు మానసములు చాలాకాలముకిందట, జరిగినవృత్తాంతములు జ్ఞప్తికి వచ్చినను క్రొత్తగా నపుడు కన్నులయెదుట జరిగినట్లు భావించుకొని దుఃఖసంతప్తము లగును. నీయనుజుని చరిత్రము మిక్కిలి దయనీయమగుటచే వానిపేరు దలపెట్టినతోడనే నా కన్నుల నీరు వచ్చినది." అనిపలికి వెనుకటివృత్తాంతమును మరల జ్ఞప్తికిఁ దెచ్చుకొనుటకుఁ గొంతసేపు నాలుగైదు నిముసము లూరకుండి పైకి చూచి యిట్లని చెప్పఁదొడఁగె. నేను పరమశైవుడను. అందుచేత శివుని సాక్షాత్కరించికొనఁ దలఁచి బాల్యకాలమున నాకు నాగురువుపదేశించిన పంచాక్షరీ మహామంత్రమును బదిలక్షలసారులు పునశ్చరణచేసి యెంతకు మహేశ్వరుని ప్రత్యక్షము జేసికొనలేక తుద కొకనాడు మెడకుఁ గండకత్తెర వైచుకొని మహేశ్వరా! నీవు ప్రసన్నుఁడవు గావేని యిదే ప్రాణములు విడచెదనని ప్రతినఁజేసి భోజనము మాని కూర్చుంటి నాఁటి యర్ధరాత్రమున భక్తవత్సలుఁ డగు మహేశ్వరుఁడు చిచ్చు

కన్నులతోడను, చిలువపేరులతోడను, పులితోలుతోడను, బూఁచుల బలగముతోడను, పూపచందురునితోడను, బూదిరేకలతోడను, తెల్ల మేనితోడను, నల్లమెడతోడను నాకు సాక్షాత్కరించి నన్ను బుజ్జగించి కావలసినవరము లడుగుమనియె. ఐహికములగు ధనధాన్యాది సంపదలు గోరక కైలాసంబు జూడఁ గోరుచున్నాఁడ. నన్నటకుఁ గొంపొమ్మని ప్రార్థించితి. ఆతఁడును వల్లెయని నన్ననుగ్రహించి రెండు పసిడిపాదుకలిచ్చి కైలాసమును జూడఁగోరిక పుట్టినప్పుడు వీని నధిష్ఠింపుము. అవియే నిన్నటకుం దెచ్చునని చెప్పి యంతర్హితుఁడయ్యె. అనేక దివ్యసంవత్సరములు తపంబు చేసి చరితార్థులైన మహాయోగులకు దుర్లభుఁడగు మహేశ్వరుఁడు నాకుఁ బ్రసన్నుఁడగుటకు నాయందలి మహిమ గాని వేఱు కాదు. శ్రితజనపారిజాత మగు నమ్మహాదేవునకు నాపై బొడమిన నిర్హేతుకజాయమానకృపయే కారణము.

ఆమరునాఁ డుదయమున నేను గాల్యకృత్యముల నిర్వర్తించికొని పరమేశ్వరుఁ డిచ్చిన పాదుకలు దొడుగుకొని కైలాసంబునకుఁ బోవలయు నని మనంబు సంకల్పించి కన్నులు మూసికొంటి. ఆసంకల్పించుటయే యెఱుంగుదును గాని యవ్వల నేమైనదో యొక్క ముహూర్తమున కెఱుంగ. ఒక్కనిముసములో నేను గైలాసంబున నుంటి. అచ్చటి వైభవం బేమని వర్ణింప ? అందఱు మూఁడుకన్నులు గలవారె. అందఱు లేతచందురుని దాల్చినవారె. అందఱు పులితోలు గట్టినవారె. అందఱు పాముకడెంబులం బెట్టినవారె. పసిఁడిపావలు దొడిగి టక్కుటిక్కుమని నడచుచు నేను మహేశ్వర సన్నిధి కరుగుచుండ నమ్మహాదేవుఁడు నన్నల్లంతదవ్వులఁ గని సబహుమానంబుగఁ దోడ్కొని రమ్మని నందీశ్వరుం బుత్తెంచె. మధ్యలోకంబు నుండి వచ్చిన మనుష్యమాత్రుని మహేశ్వరునంతవాఁ డంత గారవించుటం జేసి నాయం దేదో గొప్పమహిమ మున్నదని శంకరుం బరివేష్టించిన

వేలుపు లందఱు తలంచిరి. నందీశ్వరుఁడు నన్నుదగ్గఱి కౌఁగలించి కొని చేయిపట్టుకొని దేవదేవుని సన్నిధికిఁ దోడ్కొనిపోయె. శంకరుం డును కృపారసపూరితంబులగు చూడ్కులతో నన్నుం గనుఁగొని సేమమరసి దేవసేనాపతియుఁ దనకు గారాపుకుమారుఁడు నగు కుమారస్వామిని బీఠమునుండి లెమ్మని యానతిచ్చి యాపీఠమున నన్నుం గూర్చుండఁ బనిచె.

అది ప్రాతఃకాల మగుటచే శంభుని సేవింప నచ్చటికి వచ్చిన మహేంద్రాది దిక్పాలకులు దక్కిన వేలుపులు ప్రమథగణంబులును నన్ను చూడ నారంభించిరి. అనంతరము భర్గుఁడు కైలాస మంతయుఁ జూచి రమ్మని యానతిచ్చి నందీశ్వరుని తోడిచ్చి నంపెను. నేను నం దుఁగల వైచిత్ర్యంబులనెల్ల మనసారఁ గనుంగొని మరలి వచ్చి భవు నకు మ్రొక్కి నిలువ నతఁడు వత్సా! నీ కేమి కావలయు నది కోరు మని యానతిచ్చె. అప్పుడు నేను భయసంభ్రమంబులతో దేవా! మరల నరకలోకంబున కరుగకుండ నిచ్చటనే యుండవలతు నంటి. అనవుడు చంద్రశేఖరుఁడు కుమారా! నరలోకంబు పాపభూయిష్ఠమై యున్నయది. నీవింకం గొంతకాల మందుండి పాపాత్ములఁ బవిత్రు లుగఁ జేయవలయు. అట్లుచేసి జీవన్ముక్తిఁ బొంది యిచట నుందువు గాక యని సాదరంబున బలికి వెండియు నన్ను నరలోకంబునకుఁ బొమ్మని యానతిచ్చె.

---

## పదియైదవ ప్రకరణము

"అయ్యా! ఈప్రసంగమునుబట్టి నన్ను నేఁగొనియాడుకొను చున్నవాఁడ నని మీరు తలంప వలదు. హరిద్వారము వద్దకు నేను

రావలసిన కారణంబును మీకెఱుంగఁజేయక తప్పదు. కావున దాని నానుపూర్విగ నెఱిఁగించితిని." అని హరిశర్మ పలుకుచుండ వాని మాట కడ్డమువచ్చి నిగమశర్మ "మేలు మేలు మిమ్మును మీరు బొగడుకొనుచున్నవారిని యెట్టిచెనఁటియైన ననఁజాలునే. జగంబులు మీ మహిమంబుల వేనోళ్ళం బొగడుచుండ మీరే కొండాడుకొన వలయునా? మేమట్లు తలంచుకొనువారము గాము సుఁడీ" యనివారించి చిత్రభానునివృత్తాంతము నెఱిఁగింపుమని వారిం గోరెను. హరిశర్మ చేసిన యాత్మప్రశంస విని మణివర్మ "ఏమిది? ఇతఁ డప్రస్తుతములయిన యంశములను మిక్కిలి పెంచి చెప్పుచున్నాఁడు. చిత్రభానుని వృత్తాంతము చెప్పుటకన్న తన మహిమలు చెప్పుకొనుటయే యీతనికిఁ బ్రస్తుతమని తోఁచెఁగాబోలు" నని తనలో విచారించి కొని యూరకుండెను. హరిశర్మ నిగమశర్మ పలుకుల నాలకించి తనయందు వారికి భక్తితాత్పర్యంబులు సందగింపక యెప్పటియట్లున్నవని తెలిసికొని చిత్రభానుని వృత్తాంతము నిట్లని చెప్పఁబొడంగె.

అట్లు భగవానుఁడగు నిందుశేఖరునిచేత నాజ్ఞాపితుడనై వెండియుఁ బసిఁడిపావలఁ దొడిగికొని బ్రహ్మలోకపాలంబువద్ద భూలోకముఁ బ్రవేశించితిని. ఆత్రోవ చేరినపిదప మహేశ్వరుఁ డిచ్చినపాదుకలకుఁ దొంటి యద్భుతశక్తిపోయినది. అందుచేత నేను పాదచారినై మార్గమధ్యమున నాశిష్యులగు భైరవుని గాలకంఠుని గలిసికొని యెడనెడఁ జుట్టుప్రక్కలనున్న పుణ్యక్షేత్రంబుల సేవించుచు దివ్యతీర్థముల మునుఁగుచు హరిద్వారము చేరితిని. నే నక్కడికిఁ బోయినను గ్రామమధ్యమున వసించుట కిష్టము లేనివాఁడ నగుటచే హరిద్వారమునకుఁగూడ నూరు వెలుపల నొక పెనుమఱ్ఱిక్రింద విడిసితిని. అది భాగీరథీతీరముననే యుండుటం జేసియు చాలనీడ నావరించుటం జేసియుఁ బాటసారులకు నత్యంతోపయుక్తముగ నుండును. ఆమఱ్ఱి

క్రింద విడిసి యచ్చట నొక శిష్యు నుండుమని రెండవశిష్యుఁడును నేనును గంగాస్నానమున కరిగితిమి. అప్పుడు త్రోవలో నొక మారేడు చెట్టుక్రింద మూలుగుచు వట్టినేలం బొరలుచు బాధపడుచున్న యొక మనుష్యుని గాంచితిమి. కౌపీనంబొక్కటిదక్క వాని మేనిమీఁద వస్త్రము లెవ్వియు లేవు. మంటిముంతయొండుదప్ప పాత్రములు లేవు. అతఁ డెప్పుడుమృతినొందునా యెప్పుడు పొడుచుకొని తినఁగలుగుదుమా యని కనిపెట్టుకొనియున్న కాకులు గ్రద్దలు తప్ప వేరుచుట్టములు లేరు. వాని ముఖలక్షణముల నవలోకింప నతడు సత్కులీనుఁడనియు మిక్కిలి గారాముసం బెరిఁగియుండఁబోలు ననియు మహారాజకుమారుఁ డైన నై యుండవచ్చుననియు నాకును నావెంటనున్న కాలకంఠునకును దోఁచినది. ఆపన్నుల సంరక్షణమునందును భగవత్కైంకర్యమునందును శరీరము వినియోగింప దీక్షఁబూనినవాఁడ నగుటచే నేనప్పుడ శివ్యసమేతుఁడనై యయ్యనదపజ్జకుం బోయి కూరుచుండి నీకేమి కావలయునని బిగ్గఱగ నడిగితిని. అతఁ డప్పుడు కన్నులు దెఱచి నావంక దేఱిపాఱ జూచి నోటమాట లేమిం దనకోరిక చెప్పలేక నోరు తెఱచెను. అతనికిదాహము గావలయుఁగాఁ బోలు ననుకొని నే నప్పుడు కాలకంఠుని బంచిగంగాజలమించుక తెప్పించి మెల్ల మెల్ల వాని నోటం బోసితిని. ఆజలబిందువులు త్రావి యతఁడించుక సేదదేఱినపిదప "నాయనా! నీవెవ్వరివాఁడవు? నీకింత గతి ప్రాప్తించుటకు గారణమేమి? నీకిప్పుడు గలబాధయెద్ది" యని యడిగి వాని దేహతాపము నుపశమింప జేయుటకై యుత్తరీయపుకొంగుతో నించుక విసరుమని కాలకంఠుని నియోగించితి. అతఁడు నటుసేయ నారోగి మఱింత సేదదేఱి మిక్కిలి హీనస్వరముతో సంగ్రహముగాఁ దనవృత్తాంతము నిట్లని చెప్పె. స్వామీ! మీరెవ్వరో నేనెఱుఁగను గాని నాపాలిదైవంబవని భావించుచున్నాఁడ.

నేనింక బ్రతుకుట యబద్ధము. అయినను నన్నిటనుండి నోరాఱుకొని పోవుచున్నది. కీళ్ళలోఁ బటుత్వము లేమి గంగకు బోయి జలంబు దెచ్చికొనఁజాల నైతి. దారిం బోవువారిఁ బిలుచుటకైన నోపిక లేదయ్యె. మీయనుగ్రహమున నిప్పుడు ప్రాణమించుక చల్లఁబడినది. నాకథ సంగ్రహముగాఁ జెప్పెద వినుఁడు. "నేను కాశ్మీరమహీపాలుఁడగు హేమచంద్రుని తమ్ముఁడను. చిత్రభానుఁడనువాఁడను. నేను తనకు ద్రోహము తలపెట్టితి నని మాయన్న నన్ను దేశంబునుండి వెడలనడిచె. అది మొదలు దారపుత్రుల విదర్భకంపి యేకాకినై యనేక దేశంబులఁ గ్రుమ్మరి కుడిచినచోటఁ బండుకొనక పండుకొన్న చోఁట గుడువక వ్యాధిగ్రస్తుఁడనై తుదికీగతికి వచ్చితిని. దైవవశమున మాయన్నను మీరు కనుఁగొందురేని తనయెడ నెన్నఁడు నేను ద్రోహము చేసి యెఱుంగ ననుఁడు. తాను చేసినజోగినై యాలుబిడ్డల నెడఁబాసి యొకచెట్టుక్రింద దిక్కు లేక మృతినొందుచుంటి ననుఁడు. మందభాగ్యలగు నాబిడ్డలఁ గరుణింపుమనుఁడు నాపైఁ గోపమున వారి నిరాదరింపవల దనుఁడు. ఒకవేళ నే నేయపరాధంబునైనఁ దన యెడఁ జేసితి నేని క్షమింపు మనుఁడు. తన పాదపద్మములకుఁ గడసారి మ్రొక్కితి ననుఁడు. తనకొడుకులు నిరువుర ముద్దాడితిననుఁడు" అని చెప్పి యొక్కనిముస మూరకుండి "స్వామీ! నాకాయాసము వచ్చుచున్నది. నేనింక మాటలాడఁ జాల" నని యూరకుండి కన్నులనుండి సంతతధారగా బాష్పమును విడువఁజొచ్చె. అనంతర మొకదిన మతఁడు జీవించెను. కాని మరల మాటాడ లేదు. మరునాఁడు మధ్యాహ్నమునతఁడు పరలోకగతుఁడు కా ననాథప్రేత సంస్కారము, మిక్కిలి పుణ్యప్రదమను నార్యోక్తియందు నమ్మికఁ గలవాఁడ నగుటచే నేను నా శిష్యులం బురికొల్పి వాని కగ్నిసంస్కారంబుఁ గావించితిని. మరణకాలమునందు నా కతఁడు చెప్పినపలుకులు విన్నవించి కృతకృత్యుఁడ

నైతిని. కాని మీ కఠినమనస్సంతాపము గలిగించితి కదాయనిచాల వగచుచున్నాఁడ. ఏకారణమునైన మనుష్యుల దుఃఖింపఁజేయుమాట యాశ్రమంబున ననుచితము. అదియునుఁగాక బంధుమరణముచేత దుఃఖపడుచున్నవారి సమీపమున నే నుండఁ జాల''నని హరిశర్మ పెండియు నేదో చెప్పఁబోవుచుండ హేమచంద్రుఁడు దుఃఖావేశపరవశుఁడై గోడకుఁ జేరబడి మొగంబున నుత్తరీయాంచలము వైచుకొని తమ్మునిగూర్చి బిట్టువగచెను.

మణివర్మయు మాధవసేనుఁడు రాజును బట్టుకొని దుఃఖోపశమనవాక్యంబులు బలికిరి. ధైర్యము విడిచి యంగలార్చురాజుదుఃఖమునుపశమింపఁజేయఁ దలఁచి హరిశర్మయు నిట్లనియె. ''రాజా! యీశరీరములు వినశ్వరము లని యెఱింగియు నీవింత విచారింపనగునె వినశ్వరంబు లగు పదార్థములఁగూర్చి విచారించుట వివేకులకు ధర్మము కాదని భగవంతుం డగు శ్రీకృష్ణుం డర్జున కుపదేశింపలేదే! భగవద్గీతలు పిచ్చికూఁత లని దుర్వాదములు చేయుబౌద్ధులు భగవంతుని మాటలపై విశ్వాస ముంచరుగాని యాస్తికులమగు మనము విశ్వాస ముంచి జ్ఞానవంతులము కావలదె. ఆత్మ నిత్యము; దేహమనిత్యము. ఇది యెఱిఁగి నడచుకొన్నవాఁడే వివేకి. అందుచేత నీవు విచారింపఁ జెల్లదు,'' అని పలుకుటయు హేమచంద్రుఁడు కన్నీరు దుడుచుకొని ''స్వామీ! నాతమ్ముని మరణకాలపుఁ బలుకులు ములుకులై నన్నుం బీడించుచున్నవి. వానిచరమావస్థం దలఁచుకొన్న నాకడుపుచుమ్మలు చుట్టుచున్నది. ''రాజ్యాంతే నరకం ధ్రువ''మ్మను మాట సత్యము. కటకటా! నిరపరాధుఁడగు సోదరుని నేలపాలు జేసికొంటిగదా. విమర్శించి కార్యంబులఁ జేయనివారికిఁ బ్రాపించుగతు లిట్టివియే కదా. ఈభ్రాతృద్రోహి మీవంటిమహాత్ముల పవిత్రచరణంబులను ముట్టఁదగఁడు. నాచేసినదోషంబునకు శాపం బేదేని నిచ్చి నన్ను దుదముట్టించి నాయులమట దీర్పఁగవలె'' నని ప్రార్థించి వాని మునుగుల పయింబడె.

అడుగుల వ్రాలిన నేలఱేని గ్రుచ్చియెత్తి నేలవేల్పు "చాలు చాలు రాజా! చాలు నీ బేలతనము! నీ గురువులు నీకు రాజనీతి నుపదేశించుటయే కాని బ్రహ్మజ్ఞానోపదేశంబు జేయరని తోఁచెడిని. నీ మనోవైకల్య మడఁగువఱకు నీకు మేము తత్త్వోపదేశంబు జేయఁ దలఁచుకొన్నారము. ఇది నీకు సమ్మతంబ యగునేని మాకడ కప్పుడప్పుడు వచ్చుచుండునది" అని మందలించి మంత్రి పురోహితులం జూచి "అయ్యా! ఈతని వైఖరి జూడ నాత్మహత్య జేసికొనువాఁడ పోలె కనంబడుచున్నాఁడు. తొల్లి యొక్క నరపాలుఁడు తద్దయు సొగసులాడి యగు తన రెండవ యిల్లాలు చెప్పినకొండెములు విని పట్టమహిషివలనఁ దనకుఁ గలిగిన జ్యేష్ఠకుమారుని నిరపరాధుని నిష్కారణముగ వధియించి పిమ్మట కొంతకాలమున కతఁడు నిర్దోషి యని విని యాదుఃఖము పట్టఁజాలక తన్నుఁ దాఁ బొడుచుకొని ప్రాణములు విడిచె. కావున నీతని దెస మీరప్రమత్తులై యుండునది" అని హితోపదేశంబు జేసి తన కనుష్ఠానకాలము మీఱుచుండుటచే వారి నివ్వలకుం జనుమని వేఁడుకొనియె. హేమచంద్రుఁడు హరిశర్మకుం బ్రణామంబు జేసి సెలవుగైకొని సపరివారముగ మరలఁ బాదచారియై మందిరంబునకుం జని సోదర వియోగమును గూర్చి పరిపరివిధంబుల విలపింపఁ జొచ్చె.

రాజునకు మాధవసేనునకు నిగమశర్మకు హరిశర్మపై నింతింత యనరాని భక్తి కుదిరెను. గాని మణివర్మకు మాత్ర మాతని సంభాషణంబులు వినినది మొదలు కొన్ని యనుమానంబులు పొడకట్టె. సందర్భము పొసఁగియుండకపోయినను హరిశర్మ తన ప్రశంస మెండుగఁ జేసికొనుటయు దుఃఖముచేత మనోవైకల్యము నొందిన మహారాజునకు నుదాహరణపూర్వకముగా నితిహాసం బను పేరుపెట్టి యొక దుష్కథ జెప్పుటయు మణివర్మకు వానిపైఁ గల గౌరవంబును గొంత

తగ్గించెను. తన మనంబునకుం బొడకట్టిన యనుమానంబులు రాజునకు విన్నవింపందలచియుం దగినయదను వచ్చినప్పు డట్లు చేయుదమని యతం డూరకుండెను.

హేమచంద్రుండు కరవిందాదేవియుం దక్క నంతఃపురిపరిచారకులు నెట్టెటో దుఃఖోపశమనంబు జేసిరి. వారి యుపచారవాక్యములవలన రాజునకు బాహ్యదుఃఖము కొంత యడంగిన నంతస్తాపము మానదాయె. అందుచేత నతండు దినమున కొక్కొకసారి యైన హరిశర్మ యున్న నెలవునకుం బోయి వారివలన వేదాంతవిద్య నుపదేశము నొందుచువచ్చె. తఱచుగ నతం డొంటిగం బోవుచుండుటం జూచి మణిశర్మ బ్రాహ్మణుం డెంత యోగ్యుం డైనను వానికడ కేకతంబుగం బోవుట రాజున కుచితంబుకాదని మందలించుచువచ్చె. హరిశర్మ భగవంతుండే యని మనంబున దృఢవిశ్వాసము నెలకొని యుండుటచే రాజు వానిమాటలు పెడచెవిని బెట్టెను. హరిశర్మయు రాజును మిక్కిలి గౌరవించుచు వాని మేనినిగ నైన బ్రాలనీయక చీకటిపడువఱకు వాని దఱికడ నుండనీక యొకవేళ నట్లుండెనా భైరవకాలకంఠులను సాయమిచ్చి పంపుచు కన్నబిడ్డనట్లుగా పాడుచుండె.

---

## పదియాఱవ ప్రకరణము

హేమచంద్రున కరవిందాదేవివలన నిరువురు కుమారు లుద్భవించిరని యీవఱకె చెప్పంబడినది. అందు జ్యేష్ఠుడగు హేమచంద్రుడు తనతండ్రియందుగలి భక్తి పెంపున పితృభక్తిసేనుండను నామమిడిరి. రెండవకొడుకు హర్షవర్ధనుండను పేరంబరంగుచుండె. ఆయిరువురుబిడ్డలయందుం దలిదండ్రుల యిరువురలావణ్యంబును నిరువుర సౌజన్యంబును నిరువుర మనీషావిశేషంబును సంక్రమించెనని ప్రకృతి జనంబులు

ప్రమోదభరితులు గా విక్రమసేనహర్షవర్ధను లల్లారు ముద్దుగఁ బెరుఁగుచుండిరి. విక్రమసేనుని యాకృతి తండ్రివిగ్రహమునుబట్టి యచ్చుగుద్దినట్లు వెలయుచుండు. హర్షవర్ధనుఁ డచ్చముగఁ దల్లిబోలిక నుడయుండె. అందుచే విక్రమసేనుఁడు దృఢకాయుఁడై గంభీరుఁడైతన యీడువారికిఁ దగని పరాక్రమంబుల నప్పుడప్పుడు చూపి సార్థకనామధేయుఁడయ్యె. హర్షవర్ధనుని మనస్సును వానిశరీరంబునట్లు కడుమెత్తనై యుండుటం జేసి యతండు సాహసంబునకుఁ బరాక్రమంబునకుఁ బేరువడక సంగీతాదివిద్యలకు భూతదయకుం బేరువడియె. తమ్ముని యందు భూతదయ సంగీతప్రౌఢిమ గలవనుటచే నన్నయం దాగొనములు కొఱవడియెనని చదువరులు తలంపవలదు. విక్రమసేనుఁడు భూతదయావిషయమునఁగాని వేణుగానప్రజ్ఞయందుఁ గాని తమ్మునకుం దీసిపోవఁడు; అయినను జను లాతనిసాహసంబులఁ బలుమాఱుగాంచి వానికి సాహసవిక్రమసేనుఁడనియుఁ దమ్మునకుసుకుమారహర్షవర్ధనుఁ డనియుఁ బేళ్ళు పెట్టిరి.

ఇప్పటికి విక్రమసేనుఁడు పండ్రెండేండ్లప్రాయము గలవాఁడు. హర్షవర్ధనునకుఁ బదియవయేఁడు. క్షత్రియునకుఁ బదునొకండవయేట నుపనయనము చేయవలసిన దని ధర్మశాస్త్రములయందు విధింపబడుటచే హేమచంద్రుఁడు పెద్దకొడుకున కొక సంవత్సరము క్రిందట వడుగుచేసి వేదాభ్యాసము చేయించుచుండెను. ఆయన్నదమ్ముల మైత్రి యిట్టిదనివర్ణింప నలవిగాదు. ఒకనివిడిచి యొకరు నిముసమయిన నిలువఁజాలరు. ఇరువు రొక్కచోటనే కూర్చుందురు. ఒకమాటె భుజియింతురు. ఒక్కపాన్పుననే పవ్వళింతురు. ఇరువురు తలిదండ్రులయెడ భక్తులు, గురుజనంబులయెడ విధేయులు! భృత్యజనంబులయెడదయాళురు, ప్రకృతిజనంబులయెడ ననురాగులు, సుగుణలోభులు, దుర్జనవిముఖులు, అయ్యిరువురుబిడ్డలు నరవిందా హేమచంద్రులకుఁ బున్న

ముల ప్రోవులై నోములపంటలై పుట్టి కన్నులచందమామలై ముద్దుల మూటలై పెరుగుచుండిరి. చదువులనేకాక యీఁతకొట్టుట; గజాశ్వంబుల నధిరోహించుట, మున్నగు పౌరుషక్రీడలను గడు మెలంకువతో నేర్చి బాలురు కాలక్రమంబున సమర్థులైరి. ఆకుమారసింహములలో సాహసుండని బిరుదు నందినవిక్రమసేనుని పరాక్రమంబుల నొకటిరెంటి జేర్కొని యతఁడాబిరుదమునకుఁ దగినవాఁడని చూపవలసి యున్నది.

ఒకనాఁడు హేమచంద్రుఁడు సేనాపతియగు దండపాణిని బాలుడగువిక్రమసేనుని గొంతపరిజనంబును వెంటఁబెట్టుకొనియడవికి వేఁటకుఁ జనియె, హేమచంద్రుఁ డొకమూల సింగపువేఁటసలుపుచుండె. దండపాణి యింకొక నెలవున పులివేఁట సలుపనెంచి మృగయాక్రీడలలోఁ దాను నేఱప్రోడ యగుటచేఁ దన కెట్టి యుపాయంబును లేదని మాటున నిర్భయముగ నొకమఱ్ఱినీడను నిలిచి పులిరాక కెదురుచూచుచుండెను. విక్రమసేనుఁడు వాని వెనుకఁ గొంతదవ్వున నొక మిట్టపైనిలుచుండి యీ వినోదంబుజూడ నుత్సుకుఁడై యుండెను. అంతట వేఁటకాండ్రు దప్పటలం జఱచుచు బెబ్బులిం దఱుముటయు నమొకము తనపొదవిడిచి సహజముగఁ జింతనిప్పుల వొప్పున మెఱయుకన్నులు మఱింత యారుణ్యమును బూని చూపఱకు వెఱపుగలిగింప దండపాణియున్న వలనునకుఁ బఱతెంచె. సేనాపతియుఁ బ్రత్యాలీఢపాదుఁడై వింటనమ్ముదొడగి గుఱిచూచిబెబ్బులినేసె. దైవవశమున వాని యేటు చారలమొగంబునకుఁ దగులక చెవిపొంతనుంచి దూసికొనిపోయెను. పోవుటయు నాశార్దూలము తొలుతకంటె నినుమడించిన యలుకతోడను మున్మడించిన వేగముతోడను బాణము వచ్చిదారింబట్టి గ్రవ్వున దండపాణిమీఁద నెగసిపడుటకు నేల యదురునట్లు పఱువెత్తి రాఁజొచ్చెను. మృత్యుదేవతఁబోలు దానియుగ్రరూపమును జూచిదం

టలుగుబంటులు ప్రాణభీతిని, యథాయథులై పఱతెంచిరి. వేఱొక్క యమ్మునదొడిగి వేయుటకు దండపాణికి, వ్యవధి, లేకపోయెను. ఆ యుపాయమ్మును దవ్వుననుండి చూచి సత్వరంబ తనవిల్లుం బూని విసము బూసినవాలుటమ్ముం దొడిగి యెక్కియున్న మెట్టదిగి వలదు వలదని సేవకులు మొఱలిడుచున్నను వినక దండపాణి వెనుకకువచ్చి బరి మీఁదఁ బఱతెంచు వ్యాఘ్రంబును గాటంబుగ నాటవేసె. ఆయ్యేటు దిని యాంక్రోలుపులి దండపాణికి రెండుబారల దూరంబునఁ జుట్టు ప్రక్కలకొండలు ప్రతిధ్వనులీయ వేఁటకాండ్రగుండె లవియ నొక్క యఱపఱచి నెత్తురుకండలు దొరఁగ నేలం గూలె. విక్రమసేనుఁడు పిఱికిబంటుల మాటవిని యొక్కనిముస మూరకుండిన యెడఁ దన బాణాగ్నియను కాఱుచిచ్చున శత్రుసైన్య మహారణ్యంబులం గాల్చు దుర్జయబాహుశాలి, దండపాణి, బెబ్బులినోటి కొక్కకబళమై యమ పురనిబ్రాఁతకాఁపై యుండియుండును. దండపాణియు మృత్యుముఖము నుండి వెలువడి బాలునకుఁ గడుకృతజ్ఞుఁడై వానిఁ గౌఁగిలించుకొని వాని కావించిన మేలు మఱువననియు వానిఋణ మెన్నఁడును దీర్చుకొను టకుఁ దన కలవి కాదనియుఁ జెప్పి యనేకవిధంబుల నుగ్గడించె. హేమచంద్రుఁడు పుత్రుని సమయజ్ఞతా చాకచక్యము పిఁబుపిద్దెయందలి నేర్పు విని తనకుమారుఁడు వంశప్రదీపకుఁ డగు నని సంతసించె. అరవిందాదేవియుఁ దన చిన్నపాపని మిన్న చెయువులు విన్న యప్పుడు కన్నుదమ్ముల నశ్రుజలంబులు కాఱఁ గన్నబిడ్డ నెత్తికొని ముద్దాడి జనుల దృష్టిదోషము దగులకుండ వానికి దృష్టితీయించెను.

మఱియొకసారి విక్రమసేనుఁడు హర్షవర్ధనుఁడు వైశాఖమాసమున నొకసాయంకాలమున నుద్యానవనమున నొక కొలనియొడ్డున విహరించుచు చల్లగాలి ననుభవించుచుండ దండపాణికొడుకు హర్షవర్ధనుని యీడువాఁడు తోడిబొట్టియలఁగూడుకొని యాకొలంకునజల

క్రీడలు చేయుచు నాటలసందడి నపాయ మెఱుంగక నోలయోల యని కేకలువేయుచు లోఁతునీళ్ళకుఁబోయె. ఆబాలకుఁడు సరిగ నీఁత నేరని వాఁడగుటచే మునుముందుఁ బోవుటయే కాని లోఁతునీళ్ళనుండి మరల నేలకు రానేరక యలసి నీట నొకటిరెండు మున్కలువైచె. అది గట్టున నుండి చూచి విష్ణుదత్తుఁడు మునిఁగెమునిఁగెనని హర్షవర్ధనుఁ డన్నతోఁ జెప్పెను. అప్పలుకులువిని వినినతోడనే విక్రమసేనుండు జాలినొంది తలమీఁది రతనాలకుళ్ళాయి నేలంబారవైచి విలువదువ్వాలువలు దడిసి చెడిపోవు నని నగవక తనచేత నప్పని యగునా కాదాయని విచారిం పక తనసాయంబున కెవ్వరిఁ జీరక గుభాలున నీటందుమికి వడివడి విష్ణుదత్తునియొద్ద కీఁదుకొని పోయి యామందభాగ్యుని జుట్టు బట్టుకొని యీవలకు లాఁగికొనివచ్చి బ్రతికించెను. తన నందనునకు వాటిలిన యపాయంబును రాజనందనుఁడు గావించిన సాయమునువిని దండపాణి సత్వరంబ యచ్చోటకువచ్చి కుమారునకుఁ గాలోచితము లగు నుప చారములు చేయించి యతఁడు తెలివొందినపిదప రాజకుమారుని బిగ్గఁగౌఁగిలించికొని "వత్సా! నాకును నాకుమారునకును నీవప్రాణ ప్రదాత వైతివి. మేమిరువురమును మాశరీరచర్మములు గోసి నీకుఁ బాదరక్షలుగఁ గుట్టించి యిచ్చినను మీఋణంబు తీరదుసుమీ" యని కొనియాడి తనపట్టిని వెంటఁబెట్టుకొని యింటికిఁ బోయెను. అస మాన మగు రూపంబునకుఁ దగినవిక్రమంబును విక్రమంబునకు వన్నె వెట్టు సుగుణసంపదయుఁగల విక్రమసేనునిజూచి రాజబంధువులుప్రకృతి జనంబులు మహానందమగ్నులయిరి. ఈప్రకరణంబునం జేర్పఁ బడిన ప్రథమసాహసకార్యము హరిశర్మ యప్పటికి వచ్చుటకు నాల్గు మాసముల క్రిందటను రెండవది నెలక్రిందటను జరగెను. పన్నెండేండ్ల ప్రాయమునాఁడె యింత మగంటిమిఁజూపిన యాబాలకుఁడు యుక్త వయస్కుఁడై రాజ్యమును వహించుపిదప వానిపేరు శత్రుమహీ

పాలురకు హృదయశల్యంబుగాక యుండునా యని తలంచి మణివర్మ మాధవసేనుఁడు మొదలగుమంత్రులు సంతసించి కాశ్మీరమున కంత కంతకును మంచిదినములు వచ్చుచున్నవని సంతృప్తహృదయులైరి.

హేమచంద్రుఁడు చిత్రభానుని దుర్మరణంబునకు విని దురపిల్లి నప్పుడు విక్రమసేనుఁడును బినతండ్రిచావునకు బిట్టువగచెను. కాని బాలుఁ డగుటచే వానిదుఃఖము తండ్రివగపుంబలె దీర్ఘకాల ముండక మఱునాఁడె యుపశమిల్లె. ఆదినముమొదలు హేమచంద్రుఁ డనుదిన ము సాయంకాలమున రాజకార్యములు ముగించి హరివర్మయొద్దకుం బోయి వేదాంతగోష్ఠినడుపుచుండుటచేవిక్రమసేనహర్షవర్ధనులుమహా మహిమములకు బేరువడియున్న హరిశర్మనొక్కసారి చూడఁగోరి యొకనాఁడు సంజకడఁ దండ్రికడకుఁబోయి నీ వడుగుము నీవడుగుమని యిరువురు వంతులుపోయిరి. బిడ్డలు తెన్నదియో కోరఁదలఁచి భయంబు పెంపున నడుగ సాహసింపఁజాల కున్నవారని హేమచంద్రుఁడు గ్రహించి వారిఁ జేరఁజీరి మేనులుదువ్వి "వత్సలార! మీ కేమి కావల యును. భయము లేదు చెప్పుఁ" డని హెచ్చరించెను. అప్పటికిని విక్రమసేనుఁడు తనకోరిక బయలుపుచ్చక యూరకుండె. తండ్రి బుజ్జ గింపుచే భయమువిడిచి హర్షవర్ధనుఁడు మెల్లన నిట్లనియె. మీవంటి యుత్తము లనుదినంబును బోయి కొలువఁదగిన మహిమలు గల హరి శర్మ నొక్కసారి చూడ నభిలాష పడుచున్నవారము. మాకోరిక కోర రానిది కాదేని మమ్ము మీ వెంట రాననుగ్రహింపుఁడు" అనవుడు చిఱునగవునవ్వి 'వత్సలారా! ఈపని కింత వేఁడవలయునే! మీకొక సారి యమ్మహాత్ముని జూపవలయు నని నేనుం దలఁచుచున్నవాఁడ ఇప్పుడ నే నచ్చటికింబోవుచుంటి. నా వెంటరండు. మునిం జూచివత్తురు గాక'' యని పలికి తన కొడుకులు వెంబడింప గుహకుఁ జనుమృగరాజు చందంబునఁ గాశ్మీర రాజు కుమారసింహములు వెంట రా మున్ని

యున్న గుహకుజనియె. మఱియు రాజును సూర్యచంద్రులంవోలె
వెలయు నక్కుమారులను గారవించి వారు నమస్కరింప నాశీర్వదించి
వ్యాఘ్రచర్మములపైఁ గూర్చుండఁ జేసి తనయొద్దనున్న బూడిదనించుక
వారి నొసళులఁ బ్రామి ఱేనినుద్దేశించి "మహేంద్రా! నీ వదృష్ట
వంతుఁడవు. నీకడుపునం బొడమిన యీరత్నంబు లమూల్యంబులు.
దైవము రక్షించిన నింక నైదా ఱేండ్లలోన పెద్దబిడ్డఁడు రాజ్యభార
మును వహించి నీకు విశ్రాంతి నొసంగఁగలఁడు." అని బహుకరించెను.
రాజు వాని బహూకరణమునకు లోనఁగడుసంబరి "దైవానుగ్రహం
బును మీ యాశీర్వచనమును జల్లఁగ నుండునేని మీరన్నయట్లు
కాఁగలదు. దానిమాట యటుండనిండు. నాచిత్తంబు తమ్మునిదెస
మరలింపఁ జాలకున్నవాఁడ. కుమారుడు యుక్తవయస్కుఁడు కాక
మున్న మహీరాజ్యమునకు వాని నభిషిక్తునిజేసి మీయనుజ్ఞ యగు
నేని నేను విరాగినై కాలము బుచ్చువాఁడ" నని చిత్తంబునఁ గల
యుత్తలంబు సంగ్రహంబుగఁ దెలిపె.

తండ్రిపలుకులు చెవులఁ బడినతోడనే బాలకులిరువురు తెల్ల
బోయి యొండొరుల మొగంబులఁ జూచుకొనసాగిరి. దానికిం దోడుగ
హరిశర్మ రాజునుద్దేశించి యిట్లనియె. "నీకంతవైరాగ్యంబు బూన
నిచ్ఛగలే దేని యడవులనుండ నక్కఱలేకయె రాజ్య మేలుకొనుచు
సకలోపభోగంబుల ననుభవించుచు నిఖిలనిలౌకిక వ్యాపారంబుల మెలం
గుచు జనకచక్రవర్తియట్లు శరీరసన్యాసంబు గాక యాత్మసన్యాసంబు
స్వీకరించి మంటిలో నుండియు మన్నునంటనికుమ్మరిపురుగు తెరంగున
సంసారంబునందుండియు లేనట్లు వర్తింపవచ్చును. నీవు తగియించుటకు
సాధకంబగు మంత్రమొకటి నీకుపదేశించెద. అది పుణ్యదినమున నర్ధ
రాత్రమున నుపదేశము కావలయును. దానిపునశ్చరణ మక్షరలక్ష
పునశ్చరణమును హితోపదేశమును మాపులు మాసహాయుఁడ చేయ

దగు. దీని నియలమట యఖిలంబుపశమిల్లు. భవరోగంబులకు మహా మంత్రంబులు దివ్యౌషధంబులు గదా!'' అని హరిశర్మ పలుకుటయు బాలురనెమ్మొగంబులు మఱింత దెలివితప్పి వెలవెలఁబోయెను. హేమచంద్రుఁడు హరిశర్మపలుకులకుఁ దద్దయు నలరి వానిచరణంబులకు సాష్టాంగ నమస్కార మొనర్చి'' స్వామీ! మీకు నాపై నింతమాత్ర మనుగ్రహ మెన్నఁడయినఁ గలుగునా యని మేలుసమయంబునకు, స్వాతివానకు ముత్తెపుచిప్పయట్లు, నామనంబున ప్రతీక్షించుచున్న యది. పుణ్యదినంబును సుముహూర్తంబును మీర యేర్పఱుపుఁడు. అర్ధరాత్రమందామంత్రరాజంబు నుపదేశంబునొందిమావు లిచ్చుటనే పునశ్చరణముచేసె. దసిరి రా మోకాలొడ్డువా రెవ్వరు?''అని నుడివి వానియొద్ద సెలవుంగైకొని కుమారద్వయసమేతుఁడయి యంతిపురికిం జనియె. అంతిపురిం జొచ్చినతోడనే బాలకు లిరువురు పరుగుపరుగున, దల్లికడకుం బోయి తండ్రికోరికలు, మునిఁ యిచ్చినవరంబులు పూస గ్రుచ్చిన ట్లామెకుం జెప్పిరి. అరవిందాదేవియు, దద్వచనముల నాల కించి మహారాజు విరాగియై, యేయడవులకుం జనునో, యెప్పుడు సన్యసించునో యేమి సాహసంబు గావించునో యని భయపడి యడు గుటకు నడుగకపోవుటకుఁ గూడ వీలు లేని యవస్థవచ్చినది కదా యని యెద్దియుందోఁచక విచారించుచుండె.

---

## పదియేడవ ప్రకరణము.

''కాలకంఠా! భైరవు నిక్కడ నుండు మని నీవు పొమ్మెదవో నీవిక్కడనుండి భైరవునంపెదవో యెట్లయిన సరియె. అనుకొన్నపని చాలవఱకు నెఱవేఱినదని నమ్మికమీఱఁబలికి దేవశర్మను సత్వరంబ నాకడకుం గొనితేవలయును. ఇక్కడకు వచ్చి మనతోఁగలిసియుండు

టకతఁ దొల్లఁగఁబోయిన నీప్రాంతములయందే మన కోర్కెఁ పూఁట పయ వములో నుండునదియని నొక్కివక్కాణింపుము. మునుముందు నన్నుం గలిసి మాటలాడి పొమ్మనుము." అని హరిశర్మ రాజు తన్ను వీడ్కొని పోయిన వెంటనె ప్రియశిష్యుఁ డగు కాలకంఠు నడిగెను. వాఁడును వినయమునఁ జేతులు గట్టుకొని విప్రుని యెట్టయెదుట నిలిచి స్వామీ! ఈపని మన భైరవునివలనగాదు. దేవశర్మ చీమలుదూఱని చిట్టడవులలోను, కాకులుదూఱని కాఱడవులలోను నున్నవాఁడు. వాని జాడలు నేను తీసినట్లు వాఁడు తీయఁ జాలఁడు. కావున నేను బోయెద' నని యూరేయి యచ్చటనుండి జాము రాత్రి వేళ లేచి యెందేని జనియె.

కాలకంఠుఁడు గుహవిడిచినపిదప భైరవుని బిలచి హరిశర్మ దాపునఁ గూర్చుండ నియమించి "భైరవా! నీతో నొక్కరహస్యమును జెప్పదలఁచితి. నా చెప్పినచొప్పున నీవు మెలంగుదువయేని మన కార్యం బతిశీఘ్రంబ యగు. ఇప్పటినుండియు నీవు యత్నంబుసలుపవలసిన సమయ మగుట యిది" అని నుడువ భైరవుఁడు భయభక్తులు మెఱయ స్వామీ! దేవర యాజ్ఞ శిరసావహించి యప్పని నెఱవేర్చెద. నా ప్రజ్ఞ మీ రెఱుంగరా? నా ప్రభువు నన్ను మీ కప్పగించినపుడు మీతోడ నెన్ని యుత్తరములు జెప్పె నన్ని యుత్తరములు నేను జరపువాఁడ" నని ప్రత్యుత్తర మిచ్చెను. పిదప హరిశర్మ వానిని మిక్కిలి దాపునకు బిలిచి చెవిలోఁ గొంతతడవు గుసగుసలాడెను. ఆవిస్రంభసంభాషణము ముగిసినతోడనే భైరవుఁడు తనపనిమీఁది కేఁగఁబోయె, అంతలోఁ దెల్లవారుటయు హరిశర్మ ప్రాతఃకాలకృత్యములం దీర్చి భక్తిమై తన్నుం గొలువవచ్చువారికి దర్శనము నిచ్చుటకు సిద్ధముగ నుండెను. అంతం గొంతసేపటికి వాని యెట్టయెదుట నేడడుగులపొడవు పొడవునకుం దగినలావు, లావునకనుగుణమగు బలము గలయొకపురుషుఁడు

వచ్చి నిలిచి "స్వామీ! నమస్కార" మని ప్రణమిల్లెను. హరిశర్మ యప్పురుషు నెన్నఁడుఁ గనియుండకపోవుటచే ముందుగ వాని నేమని పలుకరింప వలయునో యెఱుఁగక యాశీర్వదించి కూర్చుండు మని యూరకుండెను. అప్పురుషుఁడుఁ దాపున నున్న వ్యాఘ్రచర్మముపై నాసీనుఁడై హరిశర్మకుఁ దన్నెఱిఁగించుకొను తలంపున వినయమున నిట్లనియె. "దేవా! ఈనాఁటికి నేను మీదర్శనము చేసి ధన్యుఁడఁగాలేను. దిగంతవిశ్రాంతకీర్తులగు మిమ్మొకసారి గాంచి నాశరీరము పావనముగఁ జేసికొనవలయునని వచ్చితిని. కాశ్మీర రాజసైన్యమునకు నేను సేనాపతిని. నన్ను దండపాణియందురు." అని విన్నవించుకొనుటయు హరిశర్మ "నాయనా! నీయాకారమే నీయుద్యోగమును మునుముందు దెల్పుచున్నయది. పగతుర మూఁకలకు యముఁడవై యుండుదువు గావున దండపాణియను నీపేరు సార్థకమైనది. నిన్ను నా కడకుం దెచ్చినపని యేదియో నాకెఱిఁగింపు" మని వాక్రుచ్చుటయు దండపాణియిట్లని చెప్పఁదొడంగె "దేవా! దేవరవారు దీనులపాలిటికిఁ గాలుసేతులుగల కల్పవృక్షమనియు మాటలనేర్చిన మందారమనియు సంచరింపఁగల సంతానమనియు జీవముగల చింతామణియనియు కోవిదులు చెప్పుకొనుచున్నారు. కోవిదులకైన నసుగ్రముగ లోఁతు తెలియరాని మీమహిమాసముద్రము నెఱుఁగుటకు మాకు వశమా? మహాత్మా! మిమ్ము నేనొక్కచిన్నకోరికఁ గోరవచ్చితిని. అది యెఱిఁగించెద మన్నించి సావధానులరై విందురుగాక! హేమచంద్రమహారాజుగారి జనకులగు విక్రమసేన మహారాజుగారు నాతండ్రిని గడునల్పస్థితిలోనుండి యున్నతస్థితికిం దెచ్చి నన్నుదనపుత్రులగు చిత్రభాను హేమచంద్రులతో సమముగఁ బెంచిరి. చిత్రభానునకు నాకు మేనులు రెండుగాని ప్రాణమొక్కటియే యని చెప్పఁదగినంత మైత్రికలదు. హేమచంద్రుఁడును నాయందిప్పటికిని భ్రాతృవాత్స

ల్యము నిలిపి యున్నవాఁడు. చిన్నయుద్యోగములోనుండి క్రమక్రమంబున నన్నింత మహాపదవికి దెచ్చెను. నాకు మణిమాలిక యను పుత్రికయొకర్తు కలదు. నేననఁగూడదు. కాని మీయాశీర్వాచనమున నబ్బాలిక కడుఁజక్కనిదనియు రాజాంతఃపురముల నుండఁదగినదనియు మిముబోటి మహాత్ములు సెలవిచ్చిరి. తత్కారణమున నా ముద్దుకూఁతురు తన జ్యేష్ఠకుమారుఁడగు సాహసవిక్రమసేనునకుఁ బెండిలిజేసికొమ్మనికన్నియ పుట్టినది మొదలు హేమచంద్రుని వేఁడుకొనుచుంటి. మూర్ధాభిషిక్తులగు నరపాలురు పలువురు రతనాలకుప్పలు ధనసంచయములు దేశంబులు కానుకలుబెట్టి తమకూఁతుల విక్రమసేనున కిచ్చెద మని బాలకుఁడు జన్మించినది మొదలు హేమచంద్రునకు రాయబారముల నంపుచున్నవారు. అందుచేత నావంటి యల్పునితో వియ్యమందుట కిష్టములేక గాఁబోలు నతఁడీసంబంధంబు నొల్లక యెప్పటికప్పుడెద్దియోవంక చెప్పుచున్నాఁడు. బాలకుఁడు యుక్తవయస్కుఁడు గాకమున్న వివాహము చేయనని యొక్కమాఱు నరవిందాదేవి కిష్టము లేదని యొక్కమాఱు మేనరికమున్నదని మఱియొకమాఱు చెప్పుటచె నేను విసికి కొంతకాలము క్రిందట నాకుం బ్రాణమిత్రుండగు చిత్రభానుని వద్దకుఁ బోయి యాతనికొడుకగు విజయసేనునకు నాబిడ్డను జేసికొమ్మని ప్రార్థించితిని. ఆతఁడందుకు సమ్మతించె. ఇంతలో నాభాగ్యదోషమున నతఁడు బంధుమిత్రులకు దూరుఁడై కన్నులకఱవై పోయె. ఏదేశాంతరములనైన జీవించియుండక యలెఁడ స్తమించెననికూడ తెలిసినది. నామిత్రుఁడు చిత్రభానుఁడు జీవించియుండిన నామనోరథంబు సఫలంబగును గాని యిప్పుడు విజయసేనునకు నాబిడ్డనిచ్చుట యసాధ్యముకదా. కావున మీరు నన్ననుగ్రహించి నాకూఁతును విక్రమసేనునకుఁ జేసికొమ్మని హేమచంద్రునకు నొక్కి చెప్పవలయును. ఆతనికి మీ నోటిమాట వేదవాక్యము. మీయాన వానికి శిరోభూషణము

నాబిడ్డకిప్పుడు పదవయేఁడు. వాండ్రకిరువురకు నీడుజోడు తగియున్నది. కట్నములు కానుకలు కోరి నట్టిచ్చెద. వియ్యపుం దగవులు సరిగ నడపెద. ముద్దుముచ్చటలు దీర్చెద రాజు గౌరవంబునకుం దగినరీతినే వాళ్ళంపెద. సంకల్పసిద్ధుల రగు మీరు దీని జేయఁదలంతు రేని యిది నెఱవేఱుట నిశ్చయము.'' అని ప్రార్థించుటయు హరిశర్మ వాని వేఁడి కోలువిని యెద్దియుం బలుకక కొండొకసే పూరకుండి మనంబున నెద్దియో తలంచి చిఱునవ్వునవ్వుచు దండపాణితో నిట్లనియె.

''అహాహా! లోకుల యజ్ఞానమునకు మేర లేదుగదా! ధగధగ వెలుఁగుదీపము దివ్యసుందరపదార్థ మని భ్రమసి దానిపై వ్రాలి నశియించు పురుగులకును జ్ఞానసంపన్నులగు మనుష్యులకును నాకు భేదము గానఁబడకున్నది. క్షణములో ముక్కముక్కలగు గాజు ఱాలును సుస్థిరములగు మాణికంబుల యట్లు తళతళ మెఱయు చుండుటంజేసి లోకులు ప్రమాదవశంబున మణులఁ గ్రహింపఁబోయి వట్టిఱాళ్ళ గ్రహించుటయుఁ గలదు. ఎంతో ప్రాజ్ఞుఁడ ననుకొంటి గాని నీవింత పామరుఁడవని మొదటఁ దలంపనైతి'' అని హరిశర్మ పలుక నాపలుకులు దండపాణివీనులకుఁ గఠోరములై మనస్సున కద్భుతములై తోఁచి యొక్కనిమేషమువఱకు వానిం బిచ్చివానినట్లు చేసెను. దండపాణి తెల్ల తెల్లబోవుటయు నెద్దియుం బలుకఁజాలకుండు టయుఁ జూచి హరిశర్మ వానికిఁ దనమాటలయర్థము జెప్పఁదలఁచి యిట్లనియె. ''నీవు తెల్లబోవుచుంటి వేమి? నామాటల యర్థము నీ వెఱుఁగవా? మీరు రాజున కత్యంత ప్రియసేవకులు. మీతోడ మా వంటివారు ముందు రాగల యరిష్టంబులం జెప్పరాదు. చెప్పినచో నీసందేహంబు లన్నియు నడంగు'' నన దండపాణి సంభ్రమము విడిచి తెలివి దెచ్చికొని ''స్వామీ! మీరానతియ్యఁ దలంచిన దానతియ్య వచ్చు. మీనోట వెడలిన నుడువులు తేనికిఁగాని మఱియెవ్వరికిఁగాని యెఱిఁగింప నని మీరు సేయుమన్న ఘోరప్రమాణంబు జేయు

వాఁడ''నని చేతులు జోడించి మనవిచేసెను. ఆతనిమనవి చిత్తగించి హరిశర్మ వానిచే గొప్పయొట్టు బెట్టించుకొని చెప్పఁబోయి మరల చెప్ప సందేహించి యెట్టకేల కిట్లనియె.

''దండపాణీ!'' గతానుగతికో లోకో నలోకః పారమార్థికః యనునట్లు లోకు లొకరిని జూచి యొకరు నడచుటయే కాని పరమార్థ మెఱుఁగరు. నిన్న హేమచంద్రునితోఁ గూడ వానికొడుకు లిరువురు నాకడకు వచ్చిరి. ఆబాలకులఁ జూచినదిమొదలు రాగవిహీనమయ్యు మామనస్సెంతయు చింతాకులమై యున్నయది. అంత చక్కఁదన మున్నందుకు నట్టి తెలివితేట లున్నందుకు నంతటి వంశమునఁ బుట్టినందుకు నాబాలకుల కిరువురకు దీర్ఘాయుఃప్రమాణ మున్నపక్షమున నెంత బాగుండును? బ్రహ్మ యెంత చూపోవనివాఁడో కాని యీముద్దుకొడుకుల నిద్దఱ నల్పాయుష్కులఁ జేసెగదా! మా దివ్యదృష్టిచేత మేమెంత చక్కఁగఁ బరికించి చూచినను విక్రమసేన హర్షవర్ధనులు కొలఁదికాలములోనే తీఱిపోదురని తోఁచుచున్నది. వాని తలిదండ్రుల పుణ్యమేమో కాని విజయసేనుఁడు దీర్ఘాయుష్మంతుడని నాదివ్యదృష్టికిఁ బొడకట్టుచున్నది. ప్రస్తుతము వాఁడు పితృవిహీనుఁడై నిఱుపేదయై దిక్కుమాలినవాఁడై యున్నను గాలక్రమంబునఁ గాశ్మీరరాజ్యంబున కేలిక కాకమానఁడు కావున నా నీయు హితోపదేశంబు విని నీకూఁతును విజయసేనున కిచ్చి పెండ్లి చేయఁదలంచుకొనుము, విక్రమసేనునిమాట మఱచిపొమ్ము. మొదట విజయసేనునకె యీమెను గూర్పఁదలంచితివి గావున నీప్రథమ సంకల్పమే నెఱవేర్చుకొనుము. నీయల్లుఁడు మూర్ధాభిషిక్తుడై చిరకాల మవని నేలును. నీకూఁతురు కాశ్మీరదేశపురాణి యగును. లోకతంత్రసంబంధములు లేని మాకు విజయసేనుఁడు విక్రమసేనుఁడు నొక్కచందంబు ఉన్నదున్నట్టు తెలిఁగింపవలసివచ్చెఁ గావున మే మప్రియము జెప్పవలసిన వారమైతిమి.

భావికాలగతుల నుద్దేశించి దివ్యదృష్టిప్రభావమున హరిశర్మ నోట వెడలిన యానుడువులు దండపాణికి వేదవాక్యములట్లు దృఢ విశ్వాసమును గలిగింప నతఁడు భక్తితత్పరుఁడై లేచి నడుమున నుత్తరీయంబు జుట్టుకొని "స్వామీ! మీరు నన్ను బ్రదికించిరి. మీ రీ హితోపదేశంబు జేయకుంటిరేని నే నెట్లో మెడలు విఱిచి రాజు నొప్పించి నిష్కారణముగ నాకూఁతుగొంతు కోసికొన్నవాఁడ నగుదు; నాకు మీరు నేఁ డొనర్చినమేలు మఱువఁజాల" నని చాగిలంబడి మ్రొక్కి మఱల నిట్లనియె. "స్వామీ! విజయసేనుఁ డిప్పుఁ డెందున్నవాఁడో నే నెఱుంగను. ఇది సమకూరుట యెట్లు! ఇప్పుడు చిత్రభానుఁడు లేక పోయెగదా! హామిత్రమా! చిత్రభానుఁడా! నీవు జీవించియుండగఁ నీతోడ నేను వియ్యమందలేక పోయితిఁగదా! ప్రియదర్శనుఁడ వగు నీవు నీమనోహరాకారమున నొక్కసారి నాకన్నులు చల్లఁబడఁజేయ రాదె" అని పలుకుచుండగనే యిరు న్నులనుండి ముత్తెములవంటి బాష్పములు వచ్చుటయు నటమీఁద మాటలాడఁ జాలక యతఁడు గోడఁ జేరఁబడి మొగమున నుత్తరీయాంచలమును వైచికొని కూర్చుండెను. ఆతని సమాశ్వాసింపఁ దలఁచి హరిశర్మ మొగమునుండి చేలాంచలమును దొలఁగించి "యోయి! పామరుఁడువోలె నీవిటు చేయ దగునా? సజ్జనులు పుత్రవియోగము నైన సహింతురు గాని మిత్ర వియోగము సహింపరు. మిత్రుఁడు దుష్టుఁడైనను సజ్జనుఁడు వాని పక్షమునే పూనును. నీమిత్రుఁడు రాజద్రోహము చేసినందులకు దేశమునుండి వెడలఁగొట్టఁబడి జననింద్యుఁడయినను నీవు వానియెడ ననురాగంబు చెడకపోవుట నీయోగ్యతను బ్రకటించుచున్నది. ప్రపంచమునం గల జనులందఱు చిత్రభానునియెడ ద్వేషము పూనినను నీవుమాత్రము వానియెడ నెయ్యమును విడువకుము. అతని యాత్మ దీనికెంతయు సంతసించును. చిత్రభానుని నీవు నిజముగఁ జూడఁ

దలఁతు వేని వానిమూర్తి నీకన్నుల కొకసారి యగపడునట్లు నే చేయఁగలను. ఇది పరమరహస్యము సుమీ!'' యని పలికెను.

''చిత్రభానునిమూర్తి కన్నుల కగపడునట్లు చేయఁగల'' నని బ్రాహ్మణుఁడు పలికినపలుకులు మిక్కిలి యద్భుతావహములై దండ పాణి మనస్సునకు నాటెను. ''మృతినొందిన పురుషుఁ డేమి నాకన్ను లకు గ్రమ్మఱఁ గానఁబడుట యేమి. చచ్చినవారి నితఁడు చూపఁ గలఁడా? ఏమో? వీనియొద్ద నెట్టిమహిమ లున్నవో? ఒకవేళ చిత్ర భానుఁడు బ్రదికియే యున్నాఁడో'' యని దండపాణి మనంబున నప్పుడు వెంటవెంటనే కొన్నిసంశయము లుత్పన్నము లయ్యె. అడిగి తన సంశ యము దీర్చికొనుట మంచి దని యతఁడు బ్రాహ్మణునితో స్వామీ! చచ్చినవారు మఱలఁ గానఁబడుట సృష్ట్యాదినుండి యీావఱకు నెన్నఁడు వినలేదు. అది యైనచో మీప్రభావము వలనఁ గావలయు'' నని పలు. హరిశర్మ తనమాటల నతఁడు విశ్వసించుట లేదని తెలిసికొని తనయం దతనికి దృఢభక్తి నెలకొనునట్లు చేయఁదలఁచి యిట్లనియె. ''ఓ యవివేకీ యిటువినుము. చిరకాలము భూలోకంబున ననుభవించి వార్ధకముచేత ననయువపటుత్వము దప్పి జెట్టున ముగ్గినపండు నేల రాలునట్లు కాలముతీఱి మృతినొందు నతఁడు ముక్తుఁడయి భూలోక వాంఛలు విడుచును. నిండుప్రాయమున గంపెడాసలు లోనఁ బెట్టుకొని యొకదానియందును మనోరథసిద్ధి పొందక యకాలమున మృతినొందు నతని యాత్మ ముక్తినొందక సరప్రపంచమును విడువఁజాలక యిందే విహరించు చుండును. శరీరము కాలిపోవును గాని యాత్మ కాలదు గదా. దేహంబునకుఁ జావున్నది. కాని యాత్మకుఁ జావు లేదుకదా. ఇంకను నామాటలు నీవు విశ్వసింప వేని సోమవారమునాఁడు రాత్రి రెండుజాము లప్పుడు నీ వొక్కఁడవు మాగుహకు రమ్ము. చిత్రభానుని యాత్మ నీతోడ మాటలాడఁ గలదు. మృతినొందిన వారి యాత్మ

లను మాటలాడింపఁగల ప్రభావము నాకు బరమేశ్వరునియనుగ్రహ
మువలనఁ గలిగినది. అట్లు చేసిననాఁడె నీకు నామహాత్మ్యంబు దేటపడ
గలదు.'' అని ప్రతిజ్ఞాపూర్వకముగ హరిశర్మ నుడువుటయు దండ
పాణి మహాశ్చర్యరసనిమగ్నుఁడై యాదివసము కెన్నఁడు నెవ్వరుఁగనివిని
యెఱుఁగని యావింత జూచుభాగ్యము దనకు లభింప నున్నందులకు
మహానందభరితుఁడై బ్రాహ్మణుని యొద్ద సెలవుపుచ్చుకొని సోమ
వార మెప్పుడువచ్చునాయని యువ్విళులూరుచు గాలము గడుపు
చుండెను.

ఇది జరిగినమూఁడవనాటిరాత్రి బ్రాహ్మణుడు భైరవునితోఁ
గూడి గుహలోఁ గూర్చుండి యనేకవిషయములం గూర్చి ప్రసంగిం
చుచుండ నంతలో మనుష్యులు నడచినయలుకుడు వానికివినవచ్చెను.
ఆతనిమనస్సు నిత్యము శంకాకళంకలితమై యుండుటం జేసి యతఁడు
భైరవునిం బిలిచి ''వత్సా! ఆయలుకుడు మనుష్యుల దేమో కను
గొని మనుజుల దే యైనయెడ వా రెవ్వరో, యెందునిమిత్త మిచ్చటి
కరుదెంచినారో కనుఁగొనిరమ్మ''ని పంపెను. భైరవుండు గండ్ర
గొడ్డలి చేతఁబూని యావలకుంబోయి మెల్లగ నెవరువారనియడుగ
నేను గాలకంఠుఁడను. ఇక్కడున్న వారిమాట నడుగకు మనిప్రత్యుత్తర
ము వినఁబడెను. భైరవుఁడు కాలకంఠుని వానిననుసరించి వచ్చుమఱి
యొకమనుష్యుని దోడుకొని బ్రాహ్మణుని యొద్దకుఁబోయి ''స్వామీ!
కాలకంఠుఁడు దేవశర్మను దోడ్కొనివచ్చెను. ఆయలుకుడు మనవాం
డ్రదే; క్రొత్తవాండ్రెవ్వరునులే''రని విన్నవించెను. అమ్మాటలు విని
కడునలరి హరిశర్మ ''యోరీ! హోమగుండమును విసరిచక్కగ మం
టచేయుము. దేవశర్మనుజూచి చాలకాలమయినది. మనసార వాని
మొగ మొకసారి వెలుగునం జూడవలయు నన భైరవుఁడు కొన్నియెం
డుచితుకులు హోమగుండమున వైచి విసరి జ్వాలచేయ నారంభించె
ను. ఇంతలో హరిశర్మ కాలకంఠునిబిలిచి కుమారా! నీ వేగము వాయు

వేగమనోవేగముల మించెను. నీశరీర మినుములోఁ జేయఁబడినదని తోఁచుచున్నది. నీవి లేడికాళ్ళు. అందుచేత నే చెక్కు చెదరక నడవ రానినట్టడవులకు జొచ్చి సత్వరంబ దేవశర్మను దోడ్కొని వచ్చితి వని బహూకరించి యింతలో భైరవుఁడు చేసిన మంటవెలుఁగున దేవశర్మ మొగమును బరీక్షించి "మిత్రుఁడా! నీముఖదర్శనముచేత నేనిప్పుడు మిక్కిలి సుఖవంతుఁడ నైనాను. అహాహా! ఏమి నీ వచ్ఛముగ ఋషివలె నున్నాడవు! నిన్నానవాలు పట్టుట కేదుర్ఘటముగనున్నది. నీతలను మొలిచినవిగాకున్న నీకెంజెడలు సరిగ మొలిచినట్లే యున్నవి. నీవు తొల్లి నాకగపడినప్పటికంటె చిక్కియున్నాడవు. కాని నీకష్టములు గట్టెక్కు కాలము వచ్చినది. నీతోడ మాటలాడి చేయఁదగు కార్యము లనేకములున్నయవి. నీవీదినము మొదలిచ్చటనే యుండుము. పగలు నీవు ప్రజలకంటఁబడకుండఁ దగునేర్పాటులు గావించెద. నీకిచ్చట నుండుట యరిష్టము కాదుగదా" యని యడిగెను. అప్పలుకులు విని దేవశర్మ మిక్కిలి సన్నికంఠముతో "స్వామీ! మీయండ నుండుట నాకు మహేంద్రపీఠము నెక్కుట. మీపలుకులకును బ్రాఁజదువులకును భేదము లేదు. మీరు రమ్మనినవత్తు పొమ్మనినఁ బోవుదు. వీఁడు నిత్యము మీ దాసుఁడు సుఁడీ" యని బదులుచెప్పి నాకుఁ జేయవలసిన హితోపదేశ మేమో చేయుమని దానిని వేఁడెను.

వేఁడుటయు హరిశర్మ దేవశర్మను భైరవకాలకంఠుల సమీపమున నుండి గుహాగర్భమునకుఁ దోడ్కొనిపోయి చాలసేపు వానితో రహస్యములు మాటలాడెను. ఆసంభాషణము ముగిసినపిదప భైరవుఁడు హరిశర్మతో "నేను మీసెలవుచొప్పున నంతయు సిద్ధముచేసితిని. మొన్న నన్ను జేయుమన్న పని యెప్పుడు గావలయునప్పుడ చేసెద. మీయాజ్ఞ కెదురుచూచుచున్నవాఁడ" నని విజ్ఞాపన మొనర్చుకొనెను.

'అయ్యోదను నీకు నే నిట్లు గించెద వేగిరపడకుము. పచ్చికా యలు గోయుటమంచిది కాదుకదా! ఇంక మీరు నిద్రింపుడు, చాల ప్రొద్దుపోయినది అని చెప్పి తక్కినవారి నిద్రపుచ్చి తానును నిదు రించెను.

---

పదియెనిమిదవ ప్రకరణము

మనుష్యునకు మనసున నున్న యభిలాషము దీఱువఱకు నేపనియుండదోచదు. అందసంభవము లగువింతలు జూచునానమనం బున నెలకొనియున్నప్పుడు నరునిమనంబున నభిలాష మెట్లుండునో యనుభవించినవారికే తెలియవలయునుగాని తదితరుల కెత్తెఱుంగున నేఱుగనగు. హరిశర్మ చిత్రభానునియాత్మ జూపుదునని చెప్పినది మొదలతడు ప్రగల్భములు పలికెనో నిక్కువంబు వక్కాణించెనో తెలియగోరి దండపాణి యాదివారమునాడు జేయితిన్నగా నిదుర పోవక నాలుగుజాములకు నాలుగుమాఱులు లేచి తెల్లవారినదేమో యని చూచి యెంతకుందెల్లవాఱ దనివిసిగిల్లొని యెట్టకేలకు గాకులు కూయుసమయమున లేచి కాల్యంబులదీర్చికొని తెల్లవారినది మొదలు మఱునాడు సాయంకాల మెప్పుడగు నని కనిపెట్టుకొని యుండి, సం ధ్యాసమయమున గుహవద్దకుబోయి బ్రాహ్మణునిం జూచి నేటిరేయి రెండుజాములవేళ రానా యని యడిగెను. తప్పక రమ్మని హరిశర్మ యానతిచ్చుటయు దండపాణి వడివడి గృహంబునకుబోయిభోజనము చేసి పోవలసినతావు నిర్జనప్రదేశమగుటచేతను సేవింపబోవుచున్న మనుష్యుడు క్రొత్తవాడగుటచేతను సమయ మర్ధరాత్ర మగుట చేతను గొప్పపదవిలోనున్న పురుషులు దారాపుత్రులనైననమ్మినిర్భ యముగ విహరింపగూడ దనునమ్మిక యతని కుండుటచేతను నక్క

డకుఁ బోయినవెనుక తనస్థితి యెటుబోయి యెటువచ్చునోయని స్వసంరక్షణము కర్తవ్యమని తల నినుపబొమిడికంబు వెట్టి మేన శస్త్రదుర్భేద్యంబగు కవచంబు దొడిగి యనేకరణరంగముల నప్రతిహతముగ సంహార క్రీడగావించి యెన్నండు నెక్కు వోని తనకరకు కత్తినొరలోవైచి పాదరక్షలు దొడిగికొని సంకేతస్థలమునకు బయలు వెడలెను. ఆ స్థానమునకుఁ దానుబోవుట యొరులెఱుంగ కుండవలయునని యతఁడు మొదటనే పట్టణము మాటుమణఁగిన వెనుక బయలుదేఱి రాజవీధిని బోయినపక్షమున నిశాసమయంబుల సంచరించువారు తన్నానవాలు పట్టవచ్చునని శంకించి సందుగొందులదారులం బట్టి నూరుబైటికివచ్చి మెల్లమెల్లన నడుగులు లెక్కబెట్టుకొనుచు గుహావద్దకువచ్చె. అప్పటికి హరిశర్మ సామగానము చేయుచు వ్యాఘ్రచర్మముపైఁ గూర్చుండె. భైరవకాలకంఠులు గుహాద్వారమువద్ద చెరియొకగోడం జేరబడికునుకుపాట్లు పడుచుండిరి దండపాణి పోయి ద్వారమువద్ద నిలిచినతోడనే హరిశర్మచూచి దండపాణి యని పలుకరించి యతఁడు పలికినతోడనే రమ్మని సన్మానించి కూర్చుండబెట్టి కూర్చుండియే నిదురించుచున్న సేవకు నిరువుర లేపి ద్వారముకడ జాగరూకతతో నుండుమని యానతిచ్చెను. అనంతరము హరిశర్మయు దండపాణియు గాశ్మీర రాజువిషయికములగు ప్రసంగములు కొంత తడవు నెఱపినపిదప దండపాణిస్వామీ! అప్రతిహతమగు మీప్రభావమున నామిత్రుని యాత్మను జూచుటకు నామనంబు తత్తరపడుచున్నది. ఈమైదారుదినంబులు నాయభిలాషము నే నెట్టులాపుకొనఁ జాలితినో నే నెఱుంగను కావున నిప్పుడైన నద్దయు జాగు సేయక నావచ్చినపని నిర్వర్తింప వేఁడెదనని యెంతయు నాత్రమునవిన్నవించె. హరిశర్మ వాని యుబలాటమునుజూచి వానితోఁ దాను జెప్పవలసినమాటలు చెప్పుట కదియ లెస్సయగు నదనని వానికిట్లనియె. చిత్రభానుఁడు మృతి

నొంచుటచే వానిశరీరము దగ్ధమైనదని నీ వెఱుంగుదువు. ఆత్మనిరాకార మగుటచే నది నీకుఁ గానఁబడదు. ఇప్పుడు నేను జేయఁగలఁ దేమనిన వానియాత్మ నీతో మాటలాడునట్లు చేసెద. నీపరమమిత్రునియాత్మ నిన్ను గాంచినతోడనే యెట్టికోరికలు కోరునో మన మెఱుంగము కదా! చిరమిత్రుఁడవగు నీవు వానికోరికలను ద్రోసిపుచ్చ రాదు సుమీ! అనవుడు దండపాణి నాబహిఃప్రాణమగు సంగడికాఁడు నా వీనులకు విందగునట్లు పలుకుటయె చాలు. వానికోరికలు నేను నిరాకరింతునే యని ప్రత్యుత్తరము చెప్ప హరిశర్మ వాని యుత్తరంబునకు సంతసించి లేచి చేతులు పైకెత్తి కొన్ని మంత్రముల బఠించి శ్రీపరమేశ్వరుండు నాకిష్టదైవత మగునేని భగవతి మహిషాసురమర్దనికి నే నభిమాన పుత్రుఁడ నేని సత్యసంధుఁడనే నిచిత్రభానుని యాత్మ దండపాణితోఁ బలుకుఁగాక! యని తనయావాహనమును ముగించెను. ముగించిన తోడనే "హా! అన్యాయము అన్యాయము అన్యాయ" మని మూఁడు మాటలు వినఁబడియె. అప్పలుకు లచ్చముగఁ జిత్రభానుని నోట నుండి వెడలినపలుకులట్ల యుండుటంజేసి దండపాణి యద్భుత సంభ్రమంబులు పెనఁగొన చెవులు రిక్కఁబెట్టి మఱల నా ధ్వనినిమిత్తము నిరీక్షించుచుండెను. అంతలో సోమచంద్రుని వివాహము. మాకు నీకుఁగల మైత్రి బాటింపుము. విజయసేనునకు నీకూఁతునిచ్చి పెండ్లి సేయుము. నీయల్లుఁడు రాజు కాఁగలఁడు. అను నాలుగుమాటలు తూర్పునుండి యొకటియు, దక్షిణమునుండి యొకటియు పడమటినుండి యొకటియు, నుత్తరమునుండి యొకటియు, వినఁబడెను. అనంతరము మఱికొన్ని మాటలు దండపాణి వినఁగోర నొక్క పలుకు వినఁబడ దయ్యె, అతఁడు మాటలాడుట చాలించినాఁడని హరిశర్మ దండపాణితోఁ జెప్పెను. దండపాణి స్వామీ! మొట్టమొదట అన్యాయ మన్యాయమని మనకు వినఁబడినమాటల కర్థమేమి యని విప్రు నడిగెను.

బ్రాహ్మణుఁడు మంచిమాటయే నీ వడిగితివి. తన్ను దేశమునుండి వెడలనడచుట యన్యాయమని యతఁడు ముమ్మాటికి నొక్కి పలికె నీవు విజయసేనునిపక్షమున నర్థప్రాణముల ధారవోయవలయు నని నీ మిత్రునికోరిక. అట్లే చేయుదునని యగ్నిసాక్షిగ నీవీ మహోమగుండము నొద్ద ప్రమాణముచేయుము. చేసిన బాసలు నిలిపికొనుము. నీతికి నిలువంబడు మని పురికొల్ప దండపాణి భయాద్భుతముల చేత నావేశింపబడి విజయసేనుని పక్షముననుందునని విప్రుఁడు చేయించిన ప్రమాణము లన్నియుఁ జేసి పెట్టుకొమ్మన్న యొట్టులన్నియుఁ బెట్టుకొనియె ఆశపథంబులు ముగిసినపిదప నాఱేయి యచ్చట జరిగిన వింతమాటలు మఱునాఁ డెక్కడ నెత్తనని దండపాణిచేత హరిశర్మ వెండియుఁ గొన్ని బాసలుచేయించెను. అనంతరము దండపాణి "ఇపుడు రెండు జాములకంటె నెక్కువయైనది. నేనింటికి బోయెదను. మీపునర్దర్శన మెల్లుండి చేయువాఁడ. ప్రస్తుతము నాకు సెలవొసంగుఁ" డనుచు లేచి నిలువ, హరిశర్మయు మంచిదని భైరవకాలకంఠులను వానివెంట కొంతదవ్వు పంపి వారు మరలి వచ్చినపిదప సుఖముగ నిద్రించెను.

దండపాణి గుహ విడచి స్వగృహాభిముఖుఁడై నది మొదలు బ్రాహ్మణ ప్రభావమును గూర్చియుఁ దన కాఱేయి వినంబడిన మాటలఁ గూర్చియుఁ దనలోఁ దానిట్లని వితర్కించుకొనఁ జొచ్చె. "ఈ బ్రాహ్మణునిచేతలు మాయలా యింద్రజాలములా లేక నిక్కువములా? పుట్టిబుద్ధియెఱిఁగి యిట్టివింత లెన్నఁడును గని విని యెఱుంగ చిత్రభానుఁడు నిజముగ మృతినొంది యుండునా? లేక నెందేని బ్రదికి యుండునా? బ్రదికియుండినచో మృతినొందెననియీవిప్రుఁడు రాజులో నేల చెప్పవలయు. కావున తప్పక మృతినొందియే యుండును? అట్లయినచో మృతినొందినవారు మరల మాటలాడుట యెట్లు? ఇతఁ డేపురుషునిచేతనైన మాటలాడించి నన్నువంచించి యుండఁడు కద!

అట్లయిన సరిగ చిత్రభానుని కంఠముతో మాటలాడఁగల పురుషుఁ డెవ్వఁడు దొరకును? మనుష్యుని బోలిన మనుష్యుఁ డుండవచ్చును, గాని యచ్చు గుద్దినట్లంత సరిగా నుండుటరిది. కావున నిది తప్పక బ్రాహ్మణుని ప్రభావమేయై యుండవలయు. ఒకవేళ చిత్రభానుఁడు జీవించియే యుండి యిటవచ్చి నాతోడం బలికినాఁడని మాటవరుస కనుకొందము. అటులైన నాకూఁతు నతనికుమారున కిచ్చి పెండ్లి సేయ నిశ్చయించుకొంటి. కావున హేమచంద్రుని విడిచి చిత్రభానునిఁ జేరవలయు. విక్రమసేన హర్షవర్ధనులు నిశ్చయముగ నర్ధాయుష్కులని యతఁడు చెప్పెగదా; అందుచేత నెప్పటికైన విజయసేనుఁడు రాజుగాక తప్పదు. నాప్రేగుఁదీసి వానిమెడ వేయఁదలంచుకొన్నపుడు వాని సుఖదుఃఖములు నావియు నా సుఖదుఃఖములు వానివియునై యుండుట ధర్మము.'' ఈ వితర్కముచేత పరాయత్తచిత్తుఁడై యతఁడు తనయిల్లు దాఁటి కొంతదూరము పోయి మరల వెనుకకు వచ్చి యిల్లుచేరి పండుకొని గుహాలో జరిగిన వింతలు స్వప్నమునం గాంచుచుఁ గలత నిద్దురవోయెను.

---

## పందొమ్మిదవ ప్రకరణము

ప్రాణనాథునితోడిదే లోకమని నమ్మి మగనియడుగుఁ దామరలు తన కేలుగడయుగ నెంచుకొని జీవయాత్ర గడపు పరమపతివ్రత హృదయేశ్వరుడు ఖిన్నుఁడై విమనస్కుఁడయి యున్నప్పుడు తానట్లే ఖిన్నయై విమనస్కయై యుండుటయు సహజముగాదె కలనయిన వియోగము దలపోయక పరిహాసమున కైనఁ బ్రణయకలహమాడక మితినిలేని చనువులు మేరలేని మమతలు గలిగి రెండుమేను లొక్కమేనగునట్లు కలసిమెలసి పూవుందావియుఁ బోలియున్న దంపతుల్లో

మగడు వేడుకలకు వెలియై యున్నలికమున కునికిపట్టయి యుండుతఱి కులకాంత మనస్థితి యెట్లుండునో యిచట వర్ణింపనక్కఱలేదు. కుమారు లిరువురు తండ్రివెంట గుహకుం జని యచట జరిగినప్రసంగములు తల్లికిం దెలిపినది మొదలు మనసు మనసులో లేక యరవిందాదేవి మొగము వైవర్ణ్యమొంద నేపనిం జేయుక యేసౌఖ్యముం గోరక చింతాక్రాంతచిత్తయై యుండె. దానికిం దోడుగ హేమచంద్రుఁడు రాజకార్యములు చాలవఱకు మంత్రుల కప్పగించుటయు నెచ్చెలుల తోడ తొల్లిటియట్లు కలియక పోవుటయు నాయబారుల కతికష్టమున గాని దర్శనమీయక పోవుటయు నంతఃపుర సేవకుల పరిచర్యల మును పటియట్టు లంతగా నపేక్షింపక పోవుటయు బలుకరించిన సందర్భమున్నను లేకున్నను వేదాంతప్రసంగంబులు నెఱపుటయు మున్నగు మార్పులు రాణి చింతాజ్వరమునకు మఱింత దోహదము చేసెను.

అట్లరవిందాదేవి కొన్నినాళ్ళు వగచి హిమవంతుని వంటి ధైర్యసారము గల మహేంద్రదేవుని కూతు రగుటచే ధైర్యము దెచ్చికొని రాదలంచిన యపాయములను దగు నుపాయములచే నివర్తింపజేయుట యుత్తమజనలక్షణమనియు గాని విచారించుట పామరలక్షణమని తెలిసినొంది యొకనాడు సాయంకాలము మేడ మీఁద నొక్కరిత కూర్చుండి తన చెలికత్తెయు, బుట్టినింటివారు తనకు బ్రాణపదముగ నుండునని యరణ మిచ్చినదియు నెఱజాణలకు జాణతనము నేర్పంగల జాణయు నగు నర్మదను జేరంబిలిచి "ఓసీ! నర్మదా! మీ యయ్యగారున్న తెఱంగు జూచుచుంటివా?" యని యడిగెను. "ఎఱుగకేమి గుహాలో నున్న బాపనదయ్యమును జూచినది మొద లాయన చిత్తము చెడిపోయిన" దని యామె బదులు చెప్పెను. అట్లయిన నెఱిగి యుండియు నీవిన్నాళ్లల యుపేక్ష చేసితివే?" యని రాణి క్రమ్మఱ నడుగ

“నమ్మా! నేనే ముందుగ మహారాజుగారిమాట నెత్తుట మంచిది కాదేమో యని యూరకుంటి” నని వెండియు నామె ప్రత్యుత్తర మిచ్చెను. అట్లైన నావిషయమున నీ వించుక శ్రమపడవలయు నది రెండవకంటివా రెఱుంగకుండ నిర్వర్తింపఁదగినది. అట్లు చేయఁగలవా” యని దేవి యడుగుటయు “నమ్మా! నాకు మీరు పని చెప్పుట నాయం దనుగ్రహము జూపుటకదా.” యని యది బదులు చెప్పెను.

అంతట నరవింద నర్మదను దాపునం గూర్చుండఁ బెట్టికొని సఖీ! మహారాజుగా రెందుచేతనో మనలో లేరు. చిత్తము గుహలోను శరీరము గృహములో నున్నట్లు తోఁచుచున్నయది. ఎంత చనవున్నను మహారాజుగారు సముద్రమువోలె గుణరత్నాకరులయ్యు గంభీరులగుటచే వారి నడుగుటకు నామన సొప్పకున్నది. అఖిల భోగ్యముల విడిచి వైరాగ్యమును బూనవలయు ననియు రాజహంసమునకుఁ దలపు గలిగినది. ఆయన యిచ్ఛానుసారముగ నింట రాజయోగియై యుండవచ్చుఁగాని యర్ధరాత్రముల, నపవేళల, కానిచోటుల నెన్నఁడును ముక్కుమొగ మెఱుంగని విదేశీయులయొద్దకుఁ బోయి యుండఁ దగునా? మహామంత్రము లఁట, పునశ్చరణము లఁట, నిశలఁ జేయవలయు నఁట, బాలకుల మొగంబుల నిది విన్నది మొదలు నామనసు మనసున లేదు. నీ వంతయుఁ జూచుచునే యున్నావు; నీకుఁ జెప్పవలసినది లేదు; కాని కన్నులు మూఁతఁబడవు అన్నము విస మయినది. అభము శుభ మెఱుఁగని బాలకులే తద్దయు బెంగ కొని యున్నారు. ఇంక నామాట చెప్పనేల? జీవితేశ్వరుని చిత్తము నీయపూర్వవైరాగ్యమునుండి తొలగించుటకు నాకొక్కయుపాయము పొడకట్టినది. అది విని నాచెప్పినచొప్పున నీ వొనరింపుము. కాశ్మీరరాజ్య మను మందిరమునకు దృఢస్తంభములు రెండు గలవు. మణివర్మయు, మాధవసేనుఁడు ననుమంత్రులే యా స్తంభములు. వారిరువురు నాకుం బిత్రు

సన్మానములు. మహారాజుగారును వారినట్లే భావింతురు. నన్నిక్కడకుఁ బంపునాఁడు మాయయ్య నాసేమము నిరంతరము కనుఁగొనుమని మణివర్మతో మఱిమఱి చెప్పె. కావున నీవు ముందుగా మణివర్మ వద్దకుఁ బోయి నాప్రణామంబు లెఱిఁగించి నాపడుచున్న యలమట వానికిం దెలిపి పరాయత్తమయిన ప్రభుచిత్తము మఱల నెప్పటిచోట నిలుపుమని చెప్పుము. సంశయస్థితికి వచ్చిన నాయదృష్టమును జక్కఁ జేయు మనుము. మాయయ్య తొల్లి తనతోఁ జెప్పిన పలుకులు జ్ఞప్తికిం దెచ్చికొమ్మనుము. తాను దక్క నొరు లీపనికి సమర్థులు కారనుము. ఇంతియె కాక నీకుం దోఁచిన తెఱంగున సమయోచితముగఁ బలికి కార్యసాఫల్యముఁ జేసికొని రమ్ము; పొమ్ము." అని వీడుకొలుప నర్మద యట్లు చేసెద నని యామెను వీడ్కొని యప్పుడ యొరికిం జెప్పక మణివర్మ మందిరమునకుం జని వానిని సందర్శించి దేవిసన్నిధినుండి వచ్చితి నని వానికిఁ దెల్పి సన్మానితయై వచ్చినపని దెల్పు మని యాతఁడు కోర నిట్లనియె.

"స్వామీ! మహారాజుగారి వైఖరి మాఱిపోవుట మీరును నెఱుఁగుదురు. మారుబైట ముక్కుమూసికొని బకధ్యానము చేయు దొంగలగురువు కపటము కల్ల నెఱుంగని వెఱ్ఱివానిం జేసి మహారాజు చిత్తము నపహరించినాఁడు. ఇఁకమీఁద విత్తము హరించి సంకల్పచిత్తుఁ డగును. రాజుగారు నడిఱేయి నొంటిగ గుహకుఁ బోయి యాటక్కరిబాపనయ్యవలన నేవియో మంత్రములు నేర్చికొనునఁట. అక్కడకుఁ బోయిన నపాయము వాటిల్లునని దేవి శంకించి భీతిచిత్తయై యున్నది. సాధ్వీచిత్తమునకు స్వస్థతఁ దెచ్చుభారము మీపై నున్నదన్నది. ఈకార్యమును నిర్వహించుటకు మీకన్న సమర్థు లెవ్వరు లేరన్నది మీ రేతల్లియుఁ దండ్రియు నన్నది. వేయేల! అనవలసినవన్నియు నన్నది. ఆబాల గుండెబెదరి యున్నది. కావున మీరాపె

ననుగ్రహించి మహారాజుగారి మనస్సునాయుద్యమమునుండి మఱలింపవలయు" అనవుడు మణివర్మ త్రుళ్ళిపడి యిట్లనియె. "ఏమీ! అనుదినము సాయంకాలము హరిశర్మ దర్శనార్థమై పోవుచున్నారని యెఱుంగుదును. కాని యీమంత్రోపదేశవృత్తాంతము వినలేదు ఇది యొకక్రొత్తయూహ యని తోఁచెను. ఏదోయుపాయము కలుగ వచ్చునని నేను శంకించుచున్నాఁడ ఈవఱకే తెఱచుగ గుహకుఁ బోవలదని రాజుగారితోఁ బలుమాఱు చెప్పితిని. ఎంత చెప్పిన నామాట వారు పాటింపరైరి. అయిన మఱలం జెప్పి చూచెద, పట్టి చెప్పుటయె కాదు. ఆయుద్యమము మానుమని గట్టిపట్టు పట్టెద. అరవిందాదేవి నన్నింత వేఁడవలయునా? నేనామెకు సేవకుఁడను. పితృసమానుఁడను. కావున శక్తివంచన లేక యీ విషయంబునఁ బాటుపడుదునని మనవి చేయుము" అనవుడు నర్మద "స్వామీ! నామీఁద మీకుఁ గోపమువచ్చినను సరే కాని రాజుగారిబుద్ధి యీ పనినుండి మరల్చుటయే కాదు. ఈయూరినుండి యీ బ్రాహ్మణపిశాచమును వెడలఁగొట్టింపవలయు" నని పలికి వానివీడ్కొని రాణీసదనంబునకుఁ బోయి యమాత్యుని సమక్షమునఁ జరిగిన వృత్తాంతమంతయుఁ జెప్పి భయము లేదని యామె నూరడించెను.

ఆమఱునాఁ డుదయమున దూరదేశమునుండి కొందఱు వేగులవాండ్రువచ్చి కొన్నివార్తలు విన్నవింప రాజదర్శనమునుఁగోర హేమచంద్రుఁడు మంత్రిసమేతుఁడై యావార్తవినఁదలఁచి మణివర్మను బిలిపించి సగౌరవంబుగఁ గూర్చుండఁ బనిచి వేగులవాండ్రను లోనికి రావించి వారు చెప్పఁదలఁచుకొన్న దంతయుఁ జెప్పుమని యానతిచ్చె, అంతట నాచారులలో నొకఁడు విహంగకుఁడనువాఁ డిట్లు విన్నవించె. "దేవా చెప్పుటకు నాకు నోరురాకున్నది. దేవరవారి సోదరుఁడు యువరాజు చిత్రభానుఁడు హరిద్వారమువద్ద" నని మీఁద

చెప్పలేక కన్నులనీరు బెట్టుకొన్న మంత్రి వాని యభిప్రాయ మెఱింగి యావృత్తాంతము నీవు చెప్పనక్కఱలేదు. అది యిదివఱకే రాజు గారికి విదితము. తక్కినది చెప్పు మని యానతిచ్చుటయు, నాఁ డిట్లు చెప్పెను. "విజయసేన కుమారునకు నర్ధరాజ్యము గావలయునఁట. అది యిచ్చెదరా? లేదా? యనివిదర్భభూళవ రాజులుతద్బాలకుని పక్షమున మనపైదండెత్తి వచ్చెదరని లోకులు చెప్పుకొనుచున్నారు. మీఁద దేవర చిత్తము" అని వాఁ డూరకుండ "దీః. నిజస్థితి దెలియు వఱకు మన మేమియు ననరా" దని హేమచంద్రుఁడును "వచ్చిన రానిండు. అంతమాత్రముచేత భయపడువా రెవ"రని మణివర్మయు పలికి వాని నావలకుఁ బంపి తక్కిన చారులవలన నెన్నియోవృత్తాంత ములు విని వారికందఱకు సెలవిచ్చిరి.

## ఇరువదియవ ప్రకరణము.

పిమ్మట మణివర్మ హేమచంద్రున కభిముఖుఁడై "దేవా! సేవకుఁ డొక్కమనవి చేసికొనదలంచి యున్నాఁడు. ఆగ్రహింపక యవధరింపవలయు. అన్యదేశస్థులు తమదేశమున నేరముచేసి దండనార్హులై యాదండన తప్పించుకొనుటకో యప్పులెఁగ బెట్టుటకో తమకు లేనిగౌరవమును సంపాదించుకొనుటకో స్వదేశమువిడిచిమాఱు వేషములు వైచుకొని యోగులమని జోగులమని మంత్రవేత్తలమని బ్రహ్మణ్యమని వేదవిదులమని తమ్ముఁ దామె పొగడుకొనుచు లోకుల వంచింతురు, అట్టివారిని చిరకాలము శోధించినపిదపగాని జనులు విశ్వసింపరాదు. అన్నదమ్ములనైనఁ దలిదండ్రులనైన రాజులుపూర్ణ ముగ నమ్మి వర్తింపఁగూడదని రాజనీతి శాసించుచుండ నెన్నడెఱుఁ

గనియొక్క విదేశీయుని నమ్మి మీయింట్లో నుంచుకొనుట లోకవిరుద్ధముగ నున్నయది. హరిశర్మ దుష్టుఁ డని నేను జాలను. దుష్టుఁడో కాని శిష్టుడే కాని యెఱుఁగనివారు విశ్వసింపఁ జనదు. పరరాజుల చేత బంపఁబడుచారులుకూడ నొక్కొక్కప్పుడు మనయానుపానులు లోపాటులు నెఱుఁగుటకు భిక్షుక వేషంబులును మునివేషంబులు వేయుట కలదు. జాలిచేత బిచ్చగాండ్రను భక్తిచేత మునిజనంబులను జనులు గౌరవింతురు గావున నట్టివేషములు పొసఁగియుండు. లోకము మూర్ఖబహుళమగుటచే గడ్డములు గాని గుడ్డలు బోడితలలు బూదిపిండి కల్లు తులసిపూసలు మున్నగునవి నరునకు గౌరవముం దెచ్చిపెట్టు. గడ్డము పెంచిన వాడెల్ల యోగి కాఁడు. జందెపుఁ బోగులు ద్రెంపిన వాఁ డెల్ల సన్యాసి కాఁడు; అట్టివారిని మనము చిరకాలము దేశమున నిలువనియరాదు. నిలువనిచ్చిన మెలఁకువతో నుండవలయు. పగలు హరిశర్మవద్దకుఁ బోవుటయే నాకసంగతముగ నుండ మాపులు గూడ మీరు మంత్రోపదేశమునకై వానికడకుఁ బోవుదు రని కర్ణాకర్ణిగ వింటి. ఈపని శ్రేయఃకాములగు మీకుఁ దగదు. ఆయుద్యమము మాని మాభయంబుడుపవలయు నని వేఁడుకొనుచున్నాఁడ. ప్రాజ్ఞులగు మీకు నాదృశులు చెప్పనక్కఱ లేదు కాని "ప్రమాదో ధీమతామపి" యను లోకోక్తినిబట్టి నేను మీకుపదేశించితిని. పురజనులు నంతఃపురజనులు, నేను, నిగమశర్మ మాధవసేనుఁడు మొదలగు మీబాగుఁ గోరుజనంబులు మీచిత్తము నాయుద్యమమునుండి నివర్తింపఁ జేయఁ దలచుచున్నారు. భయంబున మీయెదుటకు రా జంకుచున్నారు. నేను మీకడ నెక్కుడు చనువులు గలవాఁడ నగుటను మీరు మా తప్పుల సైరించు కృపాసముద్ర లగుటను నేను వచ్చితిని. నానోట వెడలిన మాటలు వారియందలిమనవులుగ గ్రహింపవలయునే కాని నాయొక్కనివిగ గ్రహింపవలదు.

అని మంత్రి హితోపదేశముచేసి యూరకుండ నప్పలుకులు సావధానముగఁ జిత్తగించి హేమచంద్రుఁడు మణివర్మచేయి బట్టుకొని "యమాత్యా! నీవు నాకుఁ బితృసముఁడవు. నీవు హితోపదేశము జేయ నే నిందు క్షమియింపవలసిన దేమున్నది? నీవు నాకడనింతకన్న నెక్కుడుచనువులు గైకొనవచ్చును. నీయాలోచనలు మాకు వజ్రకవచంబులు. నీమంత్రములు పరసైన్యంబుల భంజించు యంత్రములు. ఎల్లవిధముల నీబుద్ధి మెచ్చఁదగినదియైనను 'ప్రమాదో ధీమతామపి' యని నీవన్నట్లు నీబుద్ధికే ప్రమాదముగలిగినది. నాచెప్పెడి పలుకులు వినుము. ఈప్రపంచము వినశ్వరము గాని శాశ్వతము కాదు. యుగయుగంబులనుండి నిలిచియున్న హిమాలయమువంటి పర్వతములకును నట్టి పర్వతముల ధరించు వసుంధరకును, నట్టివసుంధరను ధరించు బ్రహ్మాండములకును నాశము గలుగుచుండ నొక్క యణువుతోనైనఁ బోలనియీచర్మభస్త్రి శాశ్వత మయియుండునా? కలకాలము రాజ్యతంత్రములయందె తగిలి యుండవలయునా? ఏనాఁటికయినభోగపరాఙ్ముఖుండను గావలదా? రాజ్యతంత్రములం దగిలి యీవఱకు చేసినదోషంబులు చాలవా? నేను మీకు రాజునై సేవ్యుఁడ నైతిని. నాకు సేవ్యుఁడును రాజులకు రాజును జక్రవర్తులకుఁ జక్రవర్తియు నింద్రుల కింద్రుఁడును, నగ్ని కగ్నియునగు పరమేశ్వరుఁడొకఁడు లేడా? మాచేయు కలుషంబులకు మీరుత్తరవాదులగుదురా? నీవుగాని యరవిందాదేవి గాని తక్కినమంత్రులుగాని నావెంటవత్తురా? ఈపువ్వుదోఁట లీలేజవ్వను లీసిరులు నన్ను రక్షించునా? నేఁ డింట తేఫుమంటనుండువారము కామా? చిత్రభానునిగతి చూడలేదే? ఎట్టి వంగణంబునఁ బుట్టె నెట్టివారిబిడ్డఁడయ్యెఁ నెంతగారామునం బెరిగె. తుదకెట్టులయ్యె? ముక్తికాంత ముందట నరవిందాదేవియేల? ప్రణయవీథములుండ గద్దె లేల? ఉపనిషద్వీథుల విహరించువారికి రాజవీధులేల?

పరమపదమున కరుగఁదలఁచువారికీ పట్టణము లేల? అశాశ్వతపదంబు విడను శాశ్వతపదవికిఁ బోవఁ దలంచు చున్నవాఁడఁ గాని యధమ గతికింబోవుట లేదు. కావున నావిషయమున మీరు విచారింపవలదు. లౌకికవ్యాపారముల విడిచితినని నన్నుఁ గూర్చి మీరువిచారింప జ్ఞాన నేత్రంబు తెఱవ లేక లోకతంత్రంబులం దగుల్కొని యగచాట్లు పడుచున్న వారలని మిమ్ముగూర్చి నేవిచారించెద. అవి యటుండ నిందు, మహానుభావుఁడు హరిశర్మ దుష్టుఁ డని లోకులు చెప్పుకొనుట పాపము మూటగట్టుకొనుట. లోకప్రవాదముల మన మెన్నఁడు నమ్మరాదు. ఒక్కయుదాహరణము చూడుము మాళవేంద్రుఁడగు సుదర్శనుఁడు నాకు రెండవప్రాణమైయుండ నతఁడు నాపై నెత్తిపచ్చు నని లోకమునం బ్రవాదముగలిగె. ఇట్టివింత లుండునా? గగనంబు విరిగిపడనీ సూర్యుఁడు పడమట నుదయింపనీ నాకును సుదర్శనునకుం బగలు జనియింపవు. సుదర్శనునిగూర్చి పుట్టినట్లు హరిశర్మనుగూర్చి కల్లవాడుకలు పుట్టినవి. ప్రాజ్ఞుఁడ వగుచుని వట్టివి నమ్మఁజనదు.

అని రాజు కేవలపారమార్థిక చింతతోఁ బలుకుటయు హరిశ ర్మమీఁదిభక్తి వానికింతుకేనియు సందగింప లేదనియుఁ దనకు వృథాశ్రమయే కానియతఁడు చెప్పినబుద్ధులవలననొందవలసినలాభము హేమచంద్రుఁడు పొంద లేదనియు గ్రహించి మణివర్మ వెండియుఁ గొం డొకసేపు విచారించి రాజు నుద్దేశించి ఇట్లు పలికెను. "దేవా! మీరు హరిశర్మవద్ద మంత్రోపదేశము బడయఁ దలఁతు రేని పడయ వచ్చునుగాని వానిగుహకుం బోవక ఎనకోటకు వానిబిలిపించి యుప దేశముకొండు. మీ కెంతచాటుచోటు కావలయునన్న నంత చాటు చోటు జూపెద. కావలయునన్న నచిరకాలమున నిందునిమిత్తము క్రొత్తమందిర మొండు నిర్మింపఁజేసెద. ఎటులయిన మాకోరిక దీర్చి మమ్మనుగ్రహింపవలయు" అని మనవిచేయ నప్ప హేమచంద్రుఁడు

వానికిట్లనియె. "నీకు నాయెడఁ గల ప్రేమ మహాత్ములయెడ నుండ వలసిన గౌరవమును దగ్గించుచున్నయది. మహానుభావుఁడగు హరిశర్మ యెక్కడ, కించిద్జ్ఞుఁడనై వానిపాదరేణువుల నైన శిరమునఁ దాల్పఁదగని యపవిత్రుఁడ నేనెక్కడ? మీకందరకు నేను రాజునై యుంటి గాని యాయతిరాజునకు నేను సేవకుఁడను. నాగృహంబునకు రమ్మని నేను వాని నడుగఁజాల" అనుటయు మణివర్మ మీరడుగుటకు సందియపడుదురేని మీవెంటవచ్చి వినయంబును భక్తియుఁ గదుర వానిని నేన యడిగెదను. అతఁడు మనకోటకు వచ్చుట కంగీకరించు నేని మీరాయనపలుకుల కడ్డము చెప్పవల" దని వేఁడుకొనెను. హేమచంద్రుఁడును వానిపలుకులువిని కొంచెము విచారించి "సరే! ఈసాయంకాలము హరిశర్మదర్శనార్థము నేను బోవునప్పుడు నీవు నావెంటవచ్చి యామహాత్ముఁడు ప్రశాంతుఁడయి యున్నపుడు వానికలుకవొడముకుండునట్లు భక్తితాత్పర్యంబులు మెఱయ వాని నడుగుము. అతఁడొకవేళ యలుకఁబూనినను రానని విస్పష్టముగ జెప్పినను జిన్నబుచ్చుకొనక నాప్రయత్నమునకు వెండియు విఘ్నములు సేయఁదలఁపక యూరకుండవలయు" నని పలికి మణివర్మరాక కనుమతించి వానినంపి మందిరంబునకుం జనియె.

మహారాజు మందిరమునకు వచ్చినతోడనే యరవిందాదేవి నగ్నిదఁబిలిచి మగనికి మంత్రికిఁ బ్రవర్తిలిన సంభాషణఫలితము దెలిసికొని రమ్మని బంపెను. అదియు మణివర్మకడకుఁబోయి యడుగ నతఁడు జరిగిన వృత్తాంతమంతయుం దెలిపి యించుక ధైర్యముచెప్ప నగ్నిదయు మరల నంతిపురికింజని దేవి కాయుదంత మెఱింగించెను. అదివిని దేవిమంత్రి మాటలు పనిచేసినవని ధైర్యము దెచ్చుకొని సాయంకాలమేమగునోయని భయపడుచుండెను.

సాయంకాలము మణివర్మ రాజమందిరమునకు వచ్చి తనరాక తేని కెఱిఁగింప మహారాజు సంధ్యాకృతములఁ దీర్చికొని మంత్రి సమేతుఁడయి హరిశర్మనద్దకుఁ బోయె. బ్రాహ్మణుఁడు వారిరువురను గారవించి కూర్చుండఁజేసి యేదో సందర్భముదెచ్చి వివాహమును మానుకొని రాజ్యమును విడచిన భీష్మునిచరితంబును రాజ్యంబు తమ్మునికిచ్చి తపోవనంబున కరిగిన దేవాపిచరిత్రంబును వినసొంపుగ నుండునట్లు వర్ణించువారిని శ్లాఘించి రాజుమనంబున కానందము గలిగించెను. ఆకథ లతఁడేల చెప్పెనో రాజు గ్రహింపలేదు గాని మణివర్మ యొక్కనిముసములో గ్రహించెను. హరిశర్మ చేయవలసిన హితోపదేశ మంతయు ముగిసినపిదప మణివర్మ చేతులుజోడించి విప్రునితో నిట్లనియె "మీతో నేనొక్క మనవి చేయవచ్చితిని తప్పులున్న మన్నింపవలయు. మహారాజుగారు మీవద్ద మంత్రముల నుపదేశము కాదలంచుచున్నవారు. మీ యుపదేశము లుభయ లోకతారకము లగుటచే రాజుగారు మేముఁ గడు నదృష్టవంతు లము. కాని రాజుగారు మీగృహకు వచ్చుటకంటె మీరు మా కోటకు దయచేసి యుపదేశము చేయుట చాల మేలని నాకు" అని మఱియు నింక నేదో చెప్పఁబోవుచుండ వానివాక్యము సమాప్తము గాకమునుపే కఱ్ఱదెబ్బ దినిన కోడెత్రాఁచువడుపున కెరలి హరిశర్మ కన్నులు మొగము నెఱ్ఱఁజేసి బిట్టలుకచే నొడలునడఁక నిట్లనియె. "ఏమేమి ? మేము మీగృహమునకు రావలయునుగా ! నాకంత యవసరము లేదు. మీ మహారాజును బలవంతముగ నింటనుండి తీసికొనివచ్చి నాపొట్ట దడుపుకొనుటకై మంత్రోపదేశము చేయుట లేదు. అతఁడు వచ్చి నాపాదములపైఁబడి పరిపరివిధంబులఁ బ్రార్థిం చుటఁజేసి నా జపతపంబులు మానుకొని యీయననిమిత్తమై కొంత కాలము వ్యర్థము చేయుచున్నాఁడను.

ఊరుబైటనే కాని గ్రామములో జనులయింట వసియింపఁ గూడదని మాప్రతిజ్ఞ. అది నీవెఱుఁగవు గాఁబోలు! మేము రాజుల మొగములు నంతిపురముల మొగములు నెఱుఁగ మనుకొంటివి గాఁబోలు. నానోటనుండి మాట వెడలినమాత్రమున కోటాన కోటులు రూకలు కుప్పలు వోయఁగల రాజాధిరాజులు మాకు దాసానుదాసులై యున్నవారు. నీవేమో మహామంత్రినని రాజనీతి విశారదుఁడ నని మాకడ గడుసుపోకడలం బోవఁజొచ్చితివి. ఇవి నీకు నమలశక్యము కాని యినుపగుగ్గిళ్ళుగాని మినుపగుగ్గిళ్ళు కావు. నీయాట లిక్కడసాగిరావు. నీతలఁదన్నినట్టి మంత్రు లనేకుల నేనిది వఱకు చూచినాఁడను. నీకుటుంబమునకు నీ రాజకుటుంబమునకు క్షేమము గోరుదువేని మాకలుకఁ దెప్పింపకుము. మేము తలఁచు కొనము గాని తలఁచుకొంటిమా పట్టణంబులు భస్మపటలంబులు చేయఁగలము; రాజుల బాళ్ళఁ జేయగలము. మాశాపంబులకు మీ చాపంబులు చాలవు. మేము మీమందిరమునకు రాము" అని రాజు వంకఁ దిరిగి "రాజా! నీవింక నీమంత్రి యాలోచనచొప్పున నడువుము. మాకడకింక నీవు రానక్కఱలేదు ప్రసన్నులై మాకుపదేశము చేయుఁడి చేయుఁడి చేయుఁడి మహాప్రభూ! యని ప్రార్థించినవారి కనేకుల కుపదేశము చేయకయే పంపితిమి ఎందుచేతనో నీమీఁద మాకనుగ్రహము కలుగుటచే నిన్ను తరింపఁజేయఁ దలచితిమి! కాని నీమంత్రి నీపాలిటికి శనియై దానిని జెడఁగొట్టె. ప్రస్తుతము మీరు మాయెదుటనుండి పొండు. మీయునికి మాకోపాగ్నిఁ బ్రజ్వలింపఁజేయు" నని పలికి గుహయొక్క లోపలిభాగమునకుం బోయె.

—*—

# ఇరువది యొకటవ ప్రకరణము

అట్లు హరిశర్మ కోపావేశంబున మంత్రిని దూలనాడి రాజుం దిరస్కరించి యవ్వలకుం బోవుటయు మణివర్మ బ్రాహ్మణుని మీఁద మొట్టమొదటినుండియు గౌరవము లేనివాఁడగుటచే వాని పొగరుం బోకడలకుం దగిన ప్రత్యుత్తరము లిచ్చి బుద్ధి చెప్పవలయు నని యొక్కనిముసము తలంచెను; కాని రాజు మొగముజూచి యూరకుండవలసినవాఁడై యావిప్రుఁ డన్నకఠినోక్తులకుఁ జిన్నబోయెను. హేమచంద్రుఁడు హరిశర్మ లేచివెళ్ళిన వెంటనే మణివర్మసమేతుఁడై లేచి నోరువిప్పి యేమనిన నేమి మూఁడునో యని భయమున నెద్దియుఁ బలుకక గుహవిడిచి యవ్వలకు వచ్చి మంత్రింజూచి "నీవు మిక్కిలి యపరాధము చేసితివి. ఇందుచేతనే కదా నేను వాని నడుగవని తొలుదొల్తనే చెప్పితిని. నీ వింటికరుగు చుండుము. నేను బోయి వానిబ్రతిమాలి ప్రసన్నుని జేసికొనివచ్చెద" నని పలుక మణివర్మ "నామూలమున బ్రాహ్మణునకు దేవరవారిమీఁద కూడ నలుక వొడమినది. నాదుర్వినయమును దేవరవారు మన్నింపవలయు" నని ప్రార్థించెను. హేమచంద్రుఁడు మంత్రి వినయంబునకు సంతసించి "మణివర్మా! ఇందు నీనేరము లేదు. అది యొకానొక వేళావిశేషము. ఆచీవాట్లు నన్ను బెట్టినవి గాని నిన్ను బెట్టలే దనుకొనుము. నీ విందుకు చిన్నబుచ్చుకొనవద్దు. నీవరుగుచుండుము నీవెంటనే నేవచ్చెద" నని యూరడించి వగపుడిపి వాని నింటికంపి తాను క్రమ్మర యోగికడకుఁ బోయి యతని పాదములపయిం బడి క్షమింపుమని పలుతెరంగులఁ బ్రార్థించి మఱియెన్నఁడు తనవెంట మంత్రిని దీసికొని రానని ప్రమాణము చేసి వాని యనుగ్రహంబునకుం బాత్రుఁడై తన మంత్రోపదేశమునకు ముహూర్తముం బెట్టుమని వేఁడెను. రాజు వినయంబునకు భక్తికి హరి

శర్మ యంతరంగమున మెచ్చి వానితప్పు సైరించి మంత్రోపదేశంబునకు నొక్కపుణ్యదినరాంబు నేర్పరచి సగౌరవంబుగ రాజు నింటికిఁబనిచె.

హేమచంద్రుఁ డింటికిం బోవునప్పటికి మాధవసేనుఁడు రాజు రాక కెదురు చూచుచు మందిరద్వారము కడ గూర్చుండి యతఁడు వచ్చినతోడనే లేచి నమస్కరించి "స్వామీ! మాళవరాజు వద్ద నుండి యొకదూత వచ్చి యున్నాఁడు. అతఁ డిప్పు డూరుబైట గుడారములలో బసచేసి తనరాక మనకుం దెలియఁబంపె. మీఁద దేవరచిత్త" మని మనవి చేసికొనెను.

అప్పలుకులు విని హేమచంద్రుఁడు వేగులవాండ్రు చెప్పిన దంతయు నిక్కవం బగునా యేమి? అయిన నేమి నీవును వజ్రపాణియు తేపుదయమునఁ బోయి వానిని సబహుమానముగఁ దోడ్కొని రండు. అని చెప్పి వానిం బుచ్చి యంతిపురికిం జనియె. అతఁ డంతిపురిఁ జేరినతోడనే నర్మద రాణివాసనతిం బూని మణివర్మ కడకుఁ బోయి హరిశర్మకడ జరిగిన యావద్వృత్తాంతమువిని తన దేవికి విన్నవించె. ఆ యుదంతము వినినపిదప దేవి నిశ్చేష్టయై పాన్పుపైఁ జతికిలంబడి యేదో యుపాయము రాజకుటుంబమునకు రానున్నదని విచారింప జొచ్చెను.

మఱునాడు రేపకడ మాధవసేనుఁడు వజ్రపాణిం దోడుకొని కొందఱు పరిజనులు వెంటరా నగరమునకు దక్షిణభాగమునందు విడిసియున్న మాళవదూత సన్నిధికిం బోయి తనరాక నెఱిఁగించె. మాళవదూతయగు విశారదుఁడు కాశ్మీరరాజ ప్రతినిధుల కెదురుగా వచ్చి గౌరవించి తన గుడారమునకుం దీసికొనిపోయి కూర్చుండఁబెట్టి తనపేరు విశారదుఁ డని చెప్పివచ్చి వారి నామధేయము లడిగెను. అంతట మాధవసేనుఁడు నన్ను మాధవసేనుఁ డందురు; నే నిక్కడ

మంత్రులలో నొకఁడను. ఈతనిపేరు వజ్రపాణి వినియుందురుగదా! మీరు దండపాణి యను చండశాసనుఁ డొకఁడు కాశ్మీరసైన్యమున కధిపతియైయున్నవాఁ డని, అతని తమ్ముఁడే యితఁడు. హేమచంద్ర మహారాజుగారు మిమ్ము సహాయార్థముగఁ దోడుకొని రమ్మని యాన తిచ్చినారు. కావున మీరు దయచేయవలయునని చెప్పెను. విశారదుఁ డందుకు సమ్మతించి తన పరిజనులను బయనముగ రమ్మని సెలవిచ్చి తా నొకగుఱ్ఱమెక్కి వజ్రపాణి మాధవసేనులతో వెడలెను. పట్టణంబునకు వచ్చినపిదప మాధవసేనుఁడు వారి నొకవిశాలమందిరమున విడియించి కావలసిన సరకుల నంపి వలయుసేవకుల నప్పగించి యింటికిఁ జనియె.

ఆ యతిథులక్షేమము విచారింపఁదలంచి వజ్రపాణి కొండొకసే పచ్చట నిలిచి వారు వచ్చినపని యేమని యడిగి విజయసేనుని పక్షమున వచ్చినట్టు సేవకులలో నొకనివలన విని వానితో మెల్లగ నిట్లనియె "ఓయీ! కర్పూరసుందరి యెచ్చట నున్నది? ఆమెకు వివాహమైనదా? మీరు విజయసేనుని పక్షమున వచ్చినవారగుటచే నామె సంగతి మీకుఁ దెలియక పోదని తలంచెద" నని పలికెను. ఆ సేవకుఁడు వజ్రపాణి మాటలు విని కళవళముపడి యేమొరంగతి దెలియనివాఁడు వోలె తెల్లఁబోయి పెండ్లియైనను గాలేదు. కాదు కాదు; ఈనడుమ నయిన దని విన్నా నని యుత్తరము చెప్పెను. వాఁ డిచ్చిన ప్రత్యుత్తరము విని వజ్రపాణి మిగుల కలఁత నొంది వానిని మఱికొంత గదిచి యడుగ నారంభింప నడిగినకొలఁది వాఁడు మిక్కిలి తడబడి యసందర్భములగు నుత్తరముల నీయఁజొచ్చెను. అంతలో ప్రధానమంత్రి యగు మణివర్మ మాళవదూతం జూడవచ్చి మునుముందు వారి పరిజనులను గుఱ్ఱములను జూచి యవ్వల విశారదునితో మాటలాడుటకుఁ బోయెను. వజ్రపాణియు వానిఁ జూచి సేవకునితో సంభాషణము మాని వికలచిత్తముతో నింటికిఁ జనియెను.

మణివర్మయుఁ దనరాక విశారదునకుఁ దెలిపి వానిచేత సమ్మానితుఁడై కూర్చున్నపిదప విశారదుఁడు తన వచ్చినపని సంగ్రహముగఁ దెలిపి రాజదర్శనము చేయింపుమని వేఁడె. అట్లే చేయింతునని ప్రత్యుత్తరము చెప్పి మణివర్మ విదర్భ మాళవరాజుల దేశముల గూర్చియుఁ బరిపాలనముల గూర్చియు ననేకాంశము లడిగి విశారదుఁడిచ్చిన ప్రత్యుత్తరములకు సంతృప్తి నొందక వానివద్ద సెలవుగైకొని యింటికిఁ బోవుచు దారిలోఁ దనలో నిట్లుస వితర్కించెను. "ఏమిది? ఈతని మాటలు రూపమును జూడ గొప్పవానివలె కానఁబడుఁడు. పరిజనులు బిచ్చగాండ్రపగిది నున్నారు. గుఱ్ఱములు మహారాజుల లాయములోనివట్లు కనఁబడవు. అయినను వేసబాసలఁ బట్టి యెవని గూర్చియు దురభిప్రాయమును దెలుపరాదు." అట్లు లనుకొని గృహంబునకుఁ బోయి భోజనాదికములఁ దీర్చి జాముప్రొద్దున్నపుడు మణివర్మ మహారాజువద్దకుఁ బోయి మాళవదూతకు దర్శనమిచ్చి సందేశము వినవలయు నని కోరెను. మంత్రిపలుకులు విని హేమచంద్రుఁడు మున్ను చారులు చెప్పినట్లు విజయసేనుని పక్షము బూనియే సుదర్శనుఁ డీరాయబారము మన కంపెనా? యని యడిగెను. "విశారదుఁడు తనపని నాకు సవిస్తరముగఁ జెప్పలేదు; కాని సంగ్రహముగఁ జెప్పెను. పని యదియే" యని మంత్రి విన్నవించెను. ఆ నుడువులు విని హేమచంద్రుడు నిట్టూర్పువిడిచి మనోవైకల్యము నెమ్మనమ్మునఁ దోఁప నమాత్యునితో నిట్లనియె.

"అయ్యా! రాజ్యములు దుఃఖహేతువులు గదా! భానుఁడు పదమటఁ బొడిచినఁ బొడనువచ్చు. మిన్ను విఱిగిపడినఁ బడ వచ్చుఁగాని నాకును సుదర్శనకును బగలు జనింప వని మున్ను నీతో నంటిఁ గదా! రాజ్యంబు కతంబునం గాదె కల్పనైన నాయందు ద్వేషబుద్ధి వహింపని సుదర్శనునకు నేను క్రోధహేతువునైతిని. మాళవరాజువంటి

సత్పురుషుఁడు మహీమండలమునఁ గలఁడే? అట్టియోగ్యునకు నలుక దెప్పించిన నాబ్రతుకేల? విజయసేనున కర్ధరాజ్యమిమ్మని కదా వారు సందేశమంపిరి. వానితండ్రికి నేనొనర్చిన యపకారమే చాలును. తండ్రిలేని యాబిడ్డకు వెండియు నేను గీడు సలుపుదునా? అతఁడు నాబిడ్డలలో నొకఁడు. నాకు ముప్పురుకుమారు లనుకొని రాజ్యము మూఁడుభాగములు చేసి పంచెద. మాళవరాజునకుఁ బెదరి నేనిచ్చుట లేదు. విజయసేనునిమీఁద నాకుఁగల కూరిమిఁబట్టియే యిచ్చెద. ఈయకున్న విదర్భమాళవరాజులు మనపై దండువిడియుదురు. ఒక వేళ యుద్ధములో మనము గెలిచినను చేరువచుట్టములను జిరమిత్రులను జంపుకొని నెత్తుటికూఁడు దినుట యెట్టిపాడి? కావున వారు కోరునట్లు రాజ్యము నిచ్చెదనని నీవు దూతతోఁ జెప్పుము. అడిగినట్టులీయఁ దలంచుకొంటి గాన సందేశము నేను విననక్కర లేదు. నీవు పోయి విశారదునిసందేశము విని నాపలుకులు వానితోఁ జెప్పి మాళవరాజుతో మనకుఁ గల మైత్రి చెడకుండ జేయుము. అందుకు వారొడంబడరేని వారిచిత్తము వచ్చినట్లు చేయుమనుము''అని చెప్పి సత్వరము మణివర్మను బొమ్మని తొందర పెట్టెను. మణివర్మయు రాజుపలుకులు రాజనీతి విరుద్ధములై కేవలవైరాగ్య ప్రతిపాదకములై యుండుటం జేసి యాపలుకు విశారదున కెఱిఁగింప నిష్టములేనివాఁడయ్యుఁ బ్రభుశాసనము నిర్వర్తింపవలయునని నిశ్చయించి ప్రభురాయబారమును దీర్పవలసిన పెత్తనము దనతలపై నిడుటచే నది యెట్లయినం జెడఁగొట్టుట కేర్పఱచుకొని మాధవసేనుని వెంటఁబెట్టుకొని విశారదుని విడిదికిం జనియె.

రాజదర్శనలాలసుఁ డగు విశారదుఁడు మణివర్మను జూచి మహారాజుగారు నన్నెప్పుడు రమ్మని యానతిచ్చిరని యడిగెను. ''మహారాజుగారిప్పు డవ్యవస్థచిత్తులై యున్నారు. కావున రాయ

చారము మీవలన విని దానికిం దగిన ప్రత్యుత్తరములఁ జెప్పుమని నన్నే నియోగించినారు. మీసందేశార్థము లాయన యెఱుఁగుదురు. దానికిం దగిన ప్రత్యుత్తరములఁ గొన్ని చెప్పుమని నన్ను నియోగించిరి. కావున మీరు శ్రమపడి రానక్కరలేదు. మీసందేశార్థములు నాకు విన్నవింపుఁడని మణివర్మ వానికి బదులుచెప్పెను. "రాజుగారు మాసందేశము వినినను మీరు వినినను మాకొక్కటియె నాకు మీ మహారాజుగారు దర్శన మీయఁబోవుట మాళవరాజు నగౌరవించుట యేమోయని నేను దలచెదను. అయినను వారు వీరు చిరమిత్రులు సమానబలవంతులు. వారిచిత్తము. ఇదే నాసందేశము వినుఁడు" మాళవేంద్రుడు హేమచంద్రున కిట్లు విన్నవించుచున్నాడు. చిత్రభాను పుత్రుడు విజయసేనుడు కడుదీనుఁడై విదర్భనున్నాడు. అతని కర్థరాజ్యము పంచియిచ్చుట న్యాయము. పసివానియెడ పాడి దప్పుట పాపహేతువు. రాజ్యము పంచకూడదని మీ రందురేని విజయసేనుఁడు నీకొడుకులకన్న వయసున బెద్దయగుటచే వానిని యువరాజుం జేయునది. ఈ యిరుపద్ధతులకు మీరు సమ్మతింపరేని మాళవసైన్యంబులే విజయసేనుని గద్దె నెక్కింపగలవు. ధర్మమునకు దూరములై లోకాచారమునకు విరుద్ధములై మోటుతనముతో నిండిన యీపలుకులు చెవిని బడినతోడనే మణివర్మ మనస్సు మహాకోపపరవశమయ్యె. గంభీరుఁడగుటచే నయ్యలుక నట్టిటో దాచి దూతతో నిట్లనియె.

"విజయసేనుఁడు విక్రమసేన హర్షవర్ధనులవంటి కుమారుడే యని భావించి వానికి మూడవవంతు రాజ్యము నియదలచినారు. విజయసేనుని యువరాజుం జేయుట యసంభవము. ఇది సమ్మతము గాదేని మాళవసైన్యంబులే వానిని గద్దెకెక్కించుగాక!" అనవుడు విశారదుడు మహాకోపముతో బెద్దకేకలు వేయుచు మాకు మూడవవంతు నీధవనంతు నక్కఱలేదు. మాకర్థ రాజ్యము కావలయు. అది మీ

రియ్యనొల్లరుగావున మేముపోవుచున్నార మనికూర్చున్నచోటునుండి లేచెను. మణివర్మయు మాధవసేనుఁడును గూడ పీఠమునుండి లేచి వానివలన సెలవు నైనఁ బుచ్చుకొనక గృహంబులకుఁజనిరి. అమ్మఱునాఁడు విశారదుఁడు సపరివారముగ శ్రీనగరమువిడిచిపోయెను. మణివర్మమఱునాఁ డుదయమున రాయబార మంతయు రాజునకు సవిస్తరముగ విన్నవించెను. హేమచంద్రుఁడు తప్పు మాళవరాజుదే యని తలంచి కాఁ దలంచినది కాక మానదు. మనుష్య ప్రయత్నమువ్యర్థమని కర్మ సిద్ధాంతమును నమ్మియుండెను.

---

## ఇరువది రెండవ ప్రకరణము

హేమచంద్రుఁడు మంత్రోపదేశం బగుదినంబు సమీపించిన కొలంది యరవిందాదేవియొక్కయు మణివర్మప్రముఖులగు సమాత్యులయొక్కయు గుండెలు తత్కథజ్ఞప్తికి వచ్చినప్పుడెల్ల తటతటఁ గొట్టుకొనఁజొచ్చెను. తనకు మంచితరుణోపాయము దొరికిన దను సంతసమున రాజు మొగము వికాసవంతముగుచుండఁ దనకు మరణోపాయము సమీపించుచున్నదని యరవిందాదేవి మొగమువిన్నఁదనమును దాల్పజొచ్చెను. హరిశర్మ తనకుఁ బరమమిత్రుఁడని రాజు తలంపఁ బరమశత్రుఁడని లోకులు తలంచిరి. హరిశర్మవలనఁ గాశ్మీర దేశమునకు నీక్రింది రెండునష్టములలో నేదే నొకటి సంభవింపవచ్చునని ప్రజలు, సేవకులు, రాజబంధువులు భయపడిరి. హేమచంద్రుఁడు హరిశర్మ గురూపదేశముల విని విరాగియై సంపదలను బాసి సౌఖ్యముల రోసి యాలుబిడ్డల కెడమై యడవుల కేగి జనవచ్చు. కాకయున్న కపట బ్రాహ్మణుఁడు పన్నినయురులం దగుల్కొని ప్రాణముల నైన విడువవచ్చు. ఈభయంబు శ్రీనగరముననున్న ప్రతి మనుజుని హృదయమున

నెలకొని యున్ననొక్కఁ డేని తేని డాసి నోరు దెఱచి చెప్పజాలఁ డయ్యె. ఈమహారాజుబుద్ధి యెంతలో చెడిపోయిన దనువారు, మన మందఱము తొల్లిట చేసినదోసమె యీబ్రాహ్మణరూపంబున నవతరించి యిక్కడ కరుదెంచెననువారు, నిన్నఁడు ద్రోసివేయనిమణివర్మ మాటలు గూడ పెడచెవినిబెట్టుటచే నేదియో మూఁడక తప్పదనువారు, మనశక్తి యేమగు ననువారును, దైవనియోగ మెట్లో యట్లు జరుగుననువారు నై ప్రజలు కలవళముపడఁ జొచ్చిరి. అంతలో మంత్రోపదేశమునకు హరిశర్మ యేర్పఱచిన పుణ్యదినము వచ్చెను. ఆ దినమున హేమచంద్రుఁడు రేపకడనిద్ర మేల్కాంచి కాల్యకరణీయములందీర్చుకొనిస్నాతుఁడై పగలెల్ల నుపవాసముండి సాయంకాలము గుహాకుంబ్రయాణమయ్యెను. పరమనిష్ఠాగరిష్ఠుఁడై రాజతంత్రముల విడిచి కేవలపరమార్థచింత చేఁ దనమేలు గోరువారు పెట్టిన మొఱలు వినక యుపాయస్థలమునకుఁ బోఁ దలఁచిన హేమచంద్రునిఁ జూచి చంద్రునిజూచిన యరవిందయట్లు నరవిందాదేవి మొగము శోభావిహీనమయ్యె. మణివర్మ తత్సమయమున రాజువద్దకుఁ బోయి విషణ్ణహృదయుఁడై తనవైకల్యము మొగమునందుఁ గానంబడ "దేవా! మీరు గుహలో నుపదేశ మగుచుండ మే మందఱు మీవలనుండి మీసేమ మరయుచుండెదము. ఇందుకైన మీరు సమ్మతింపవలయును" అని వేడుకొని రాజు "మణివర్మా! ప్రశాంతమగు బ్రాహ్మణసమాజమున నీ వపాయమును శంకింపవలదు. నాకేభయమును లేదు. మీరు శ్రమపడి నానిమిత్తముండనక్కఱలే"దని ప్రత్యుత్తరముజెప్పెను. ఆవేల మాటలువిని మణివర్మయుఁ దక్కినమాప్తులు విన్నబోయి యూరకుండిరి. అంతట హేమచంద్రుఁ డొక్కఁడు గుహకుఁబోయి తనరాకకెదురు చూచుచుండిన హరిశర్మంగాంచి యతివినయముగ నమస్కరించి "అఖండసచ్చిదానందప్రాప్తిర" స్తని యతనిచే దీవనఁ బడసి

కూర్చుండెను హేమచంద్రుఁడు వెలలేని జలతారు పట్టుపంచెగట్టి యమూల్యములగు సేలువ నొంటఁ గప్పుకొనియుండెను. హరిశర్మ ముందుగ రాజుం బిలిచి "రాజేంద్రా! నీ యమూల్యవస్త్రముల విడిచి యీ నారచీరలఁ గట్టుకొనుము శిరస యీ హోమగుండము నందలి బూడిద మొగమున, నుదరమునఁ జేతులఁ బూసికొను" మని యానతిచ్చెను. అతని నోటమాట వెడలుటయె తడవుగ మహారాజు తన వెలలేని వలువలు విడిచి నిజముగ వెలలేని నారగుడ్డలఁ గట్టుకొని బూడిద మేసం బూసికొని కూర్చుండెను. అప్పుడు హరిశర్మ వాని మొగమువంక తేఱిచూచి సంతుష్టహృదయుఁడై "రాజా! యిప్పుడు నీ వేసము యోగాభ్యాసమున కనుకూలముగ నున్నది. రాజయోగి యనుశబ్దము నీయందు సార్థకమయ్యె" నని యించుక హెచ్చరించి యొక తాటియాకు మీఁద నదివరకె తాను వ్రాసియుంచిన శ్లోకమును రాజునకుఁ జూపి చదువుమని వానిచేతి కిచ్చెను. అప్పుడు హేమచంద్రుఁడు క్రింది శ్లోకమును జదివెను.

శ్లో॥ నివాసః కైలాసః పరమసుహృదాఢ్యో ధనపతిః।
నిషంగో రత్నాంభోనిధి రమరభూభృద్ధనురపి।
జనానాం వైరాగ్యం ప్రథయితు మజస్రం పురహరో।
వ్యభూద్భిక్షుర్యస్సః పరమపురుషః పాతు భువనం॥

శ్లోకము జదువుట ముగిసినతోడనే హరిశర్మ రాజా! దీని యర్థము జెప్పెద వినుమని యిట్లు చెప్పెను. మహేశ్వరునకు వెండికొండ నివాసస్థానము. కుబేరుఁడు ప్రాణమిత్రుఁడు. అమ్ములపొది రత్నాకరము. విల్లు మేరుపర్వతము ఇట్లు. మహదైశ్వర్యసంపన్నుడయ్యు జనులకు వైరాగ్యము నేర్పుట కొఱకే యెల్లప్పుడు భిక్షుకుఁడై యెవఁడు కాలము బుచ్చుచున్నాఁడో యా పరమపురుషుఁడగు పురహరుఁడు లోకమును రక్షించుఁగాక! రాజా! నీవును శంకరుని

వంటి వాఁడవే. అతఁడు మహేశ్వరుఁడు. నీవు మహీశ్వరుఁడవు. మహా దైశ్వర్యములు వానికి నీకు సమముగఁ గలవు. అతఁడు కుమార సమేతుఁడు. నీవు కుమారసమేతుఁడవు అతఁడు వెండికొండపై నుండు నీవు వెండికొండలవంటి తెల్లని మేడల నుందువు. అతనిది ధవళమూర్తి ధవళకీర్తి. అతఁడు మహాదుర్గాభిరాముఁడు. నీవును మహాదుర్గాభిరాముఁడవు. ఎన్ని సంపదలున్నను శంభునిచందమున నీవును సంపదల విడచి ప్రజలకు వైరాగ్యము నేర్పుటకు విరాగివై యుండుట యుచితము "యథా దేవ స్తథా భక్తః" దేవుఁడెట్లుండునో భక్తుఁడట్లేయుండ వలయుఁగదా! నీవు మహేశ్వరభక్తుఁడ వగుటంజేసి మహేశ్వరు మార్గము ననుసరించుట యుచితము. కావున నపారమగు సంసారము మీఁద కాంక్షవిడిచి భవరోగ చికిత్సకుఁడగు నభవుని నాశ్రయింపుము నేను గొన్నినాళ్ళ క్రిందట మహేశ్వరపంచక మని పేరుబెట్టి యైదు శ్లోకములు రచించితి. అవి వినినమహాపండితులందఱు వానిపాకము ద్రాక్షాపాకమనియు శైలిమనోహర మనియు భావము సుబోధక మనియు నన్ను గొనియాడి వ్రాసికొని పఠించిరి. మహాదేవుఁడు నేను రచించిన శ్లోకములకు సంతసించియే కాఁబోలు నేఁడు వానిని నూఱు మాఱులు చదివినతోడనే నాకు సాక్షాత్కరించె. ఆశ్లోకంబులు నీకుం జెప్పెద. నీవు వానిని చక్కఁగ వల్లించి యనుదినంబుఁ బఠింపు చుండుము. గాన నీకుఁ గడులగ్గగు. ఆ శ్లోకము లివి.

శ్లో॥ గజేంద్ర కృత్తిః కమనీయశాటీ।
కపాలమాలా ఘనహారవల్లీ।
శ్మశానభూమి ర్వసతిశ్చయస్య।
తం దేవదేవం సితతం భజేహం॥

శ్లో॥ మురాంతక ప్రాణసఖం పురాంతకం।
స్మరాంతకం పావనమంతకాంతకం।

గజాంతకం దుష్టదితిప్రజాంతకం।
అఘాంతకం దక్షసుఖాంతకం భజే॥

శ్లో॥ చతుర్వేదఘోటం శరచ్చంద్రజూటం।
త్రిలోకైకపాలం దిశాచక్రచేలం।
జ్వాలాఫాలనేత్రం జగద్వ్యాప్తగాత్రం।
సురారాతిభంగం శుభాంగం భజేహం॥

శ్లో॥ త్రివేదసారం త్రిజగత్ప్రనాశకం।
త్రిమార్గగామండియూర్ధ్వమండలం।
త్రిశూలపాణిం త్రివేంద్రవందితం।
త్రిలోచనం తం త్రిగుణాత్మకం భజే॥

శ్లో॥ రజతభూధరకూటనివాసినం।
కనకభూమిధరేంద్రధనుర్ధరం।
నిరుపమాష్టవిభూతివిరాజితం॥
నిరతమాదిమభిక్షుముపాస్మహే॥

హరిశర్మ మొదటఁ జదువుమని యిచ్చిన శ్లోకమును వెనుక జదివిన యైదుశ్లోకములును విని చదువుకొని యర్థమరసి మహానంద భరితుఁడయి హేమచంద్రుఁడు గురువును నుద్దేశించి "స్వామీ! మీ కవనంబులు మనస్తాపశమనంబులు మీమాటలు తేనెతేటలు, అనంటిపండులు చేతికిచ్చిన చందంబున శ్లోకములు జదివినతోడనే భావములు తేటపడుచున్నవి. మాటల మార్దవంబుఁ, నల్లిక జిగిబిగి, యర్థగాంభీర్యము నింతింత యని చెప్ప నలవికాదు ఈవఱ కెందఱి కవనంబులో వినియుంటిని గాని యవి యీరీతిం జెఱకుఁగట్టలట్లుండక చొప్పదంట్లయట్లు చప్పగ నున్నవి. ఇట్టి శ్లోకములం జదివి యాహ్వానంబుఁ జేసిన పరమేశ్వరుఁడు ప్రత్యక్షముగాక యేమగును? ఇట్టి మధుర గంభీర భాషణములతో నీవఱకు శంకరు నెవరు ప్రార్థించి"

రని కొనియాడి శ్లోకము లొక తాటియాకుపై వ్రాసి పలుమారు
చదువుకొని మురియు చుండెను.

అటులుండ హరిశర్మ హేమచంద్రునిం బిలిచి "నీకు నేను మం
త్రోపదేశము చేయవలసిన సమయమువచ్చినది. కావున నీవిప్పుడు నీ
సామ్రాజ్యముమీఁద, పురముమీఁద, నంతిపురముమీఁద, నాలు
బిడ్డలమీఁద, నాప్తమిత్రులమీఁద ననురాగము ద్రోసి చిత్తంబు పర
మేశ్వరాయత్తముఁ జేసి నిస్పృహుఁడవై, నిశ్చలుఁడవై, నిర్మలుఁడవై,
సావధానుఁడవై యుండుము. సాయుజ్యమోక్షము. సామ్రాజ్యము
కాఁగ, కైలాసపురము గాపురము కాఁగ, ప్రమథగణంబులాప్తమిత్రులు
కాఁగ ముముక్షులలోఁ జక్రవర్తివై యుండెదవు. పరమపావనము,
ముక్తిప్రదాయకమునగు మహామంత్రము నే నీకుపదేశించెదను అది
పరమగోప్యముగ నుంచవలయును. నాయాన లేక నెన్నఁడు నెవ్వరికి
నీవది యుపదేశింపరాదు. అక్షరలక్షయగునట్లు దానిని పునశ్చరణముఁ
చేయవలయును. అట్లుపునశ్చరణముఁ జేయుచున్నప్పుడు భక్తవత్సలుఁ
డగు పరమేశ్వరుఁడు నీభక్తిం బరీక్షించుటకుఁ బెక్కువేషములతో నటకు
వచ్చును. ఒకప్పుడు మనుష్యుఁడు నడచిన ట్లలుకు డగును వేఱొక
యప్పుడు ఖడ్గపాణియై యెవ్వరో చుట్టుప్రక్కలనున్నట్లు కానఁబడును.
ఒండొకయపుడు మృతినొందిన నీచుట్టములు నీ ముందట నడఁచినట్లు
తోఁచు. ఒకప్పుడు భయమున మేను ముచ్చెమటలు పోయును. ఎంత
పిఱికిదనము తోఁచిన నెంత యధైర్యము కలిగిన నీమనస్సు చలింపఁ
గూడదు; జంకకూడదు; వెనుకకుం దిరిగి చూడఁ గూడదు; కూర్చున్న
తావునుండి లేవఁగూడదు; ఎవ్వరిని బిలువఁ గూడదు. ఇం దేనిబంధన
మతిక్రమించినను మంత్రసిద్ధి గాకపోవుటయె కాక వెనుక జేసిన
పునశ్చరణ ఫలమంతయుఁ జెడును. పునశ్చరణ మిరువది యొక్క
రాత్రు లీగుహలోన జరుగవలయు. ఆ దినముల యందుఁ బగలు

భుజింపరాదు. ఇట్లు చేయుదువేని నీకు కైవల్యము కరతలామలకము. ఇందుశేఖరుడు నీయింటి బంటు. ప్రమథగణంబులు నీకు పాలేరుతనము జేయువారు. ఇక దగ్గఱకురమ్ము. ఇదిగో మంత్రము చెప్పుచున్నాను. నేనన్నమాట మరల నీవనుము. అని యొక మహామంత్రము జెప్పి మూడుమాఱులు రాజుచే దాని ననిపించెను.

---

## ఇరువదిమూఁడవ ప్రకరణము

మనుష్యునకు మనోవైకల్యమును దెచ్చుటలో మతావేశము వంటిది వేఱొకటి లేదు. బాలకుడయిన విశ్వసింపజాలని యసంభవములను మతావేశపరవశుఁ డగునపుడు మహావిద్వాంసుడు సైతము నమ్మును. మున్ను దాను గౌరవించు పెద్దలయెడ గౌరవము చెడును. హేతువిచారణము చేసి యన్యమతములో నుండు మంచి గ్రహింపవలయునన్న యాశక్తి నశించును. మానవుడు మతమునిమిత్తము స్వసౌఖ్యమును విడుచును. ఈపై నుదహరించిన వాక్యములకు హేమచంద్రుడే తార్కాణము. చిన్ననాఁటగోలె తన మేలుగోరి పనిచేయు మణివర్మ ప్రముఖులగు మంత్రులమాటలు దలకెక్కనయ్యె. అగ్నిసాక్షిగ దన్ను బరిణయమై సుఖదుఃఖముల దనకే సమానముగ ననుభవింపవచ్చిన యరవిందమొఱలు నిరర్థకములయ్యె. అవియటుండ హంసదూలికాతల్పములపై శయనించునా? కుమారుడు రాత్రి చేయవలసినన్నిసార్లు మంత్రపునశ్చరణము చేసి యది ముగిసినపిదప నిద్రకులోనై యుత్తరీయము కటికి నేలం బఱచుకొని భుజాదండము తలగడగ జేసికొని పండుకొనియె. వేళకు భోజన మమరకపోయెనా యొక్కనిముసమైన దాళఁజాలక దఢదఢలాడు నాసుకుమారుడు దినమెల్ల

నిరాహారుడై యుండె. ఇటులుండుటకెల్ల మతాభిమానమె కారణము కదా!

హేమచంద్రు డీరీతిని గుహాయందు గొంతసేపు జాగరముచేసి యథావిధిగ మంత్రపునశ్చరణము సేయుచుండ నట గృహమందు నరవిందాదేవియుఁ బతినామస్మరణము సేయుచు నొక్క నిముసమయిన నిదురవోవక తెఱచినకన్ను తెఱచినట్లయుంచి యేగడియ కేమివార్త తెలియునో యని యడలుచు స్వల్పధ్వనికైన నులికి పడుచు దనలో దానిట్లని విచారించె 'దైవమా! ఏమిపాటులు నీవు మాకేర్పఱచి యుంటివో యెఱుగకున్నను కారణముండియో లేకయొ భయముమాత్రము పడుచున్నాము. నీనిర్ణయము జరుగుచున్నది. నీ నిర్ణయముచేత నేకదా మెత్తనిపాన్పుల శయనించు మహారాజు నేలఁ బండుకొనుటయు నాకలికోర్వలేని సుకుమారు లుపవసించుటయు మొదలగు నద్భుతములు పొడముచున్నవి. ఆ మేనెంత కందినదో కదా! జాగరముచేత నేత్రము లెంత యెఱ్ఱబడినవో కదా! ఆ ప్రాణ నాథుఁ డాఁకలిచే నెంత తహతహ పడుచున్నదో కదా! ఓ కాత్యాయనీ! కాళీ! మహారాజీగండము గడచి బయలుపడునేని నీకొక మహాలయము గట్టింతు. పుట్టెడు కుంకుమపూజ చేయింతు. సద్బ్రాహ్మణులకు వేయిగోవులను దానమిప్పింతు.'' అని అనేక విధంబుల విచారించుచు నిష్టదేవతను బ్రార్థించుచు నెప్పుడు తెల్లవాఱు నెప్పుడు తన ప్రాణవిభుఁడు కంటఁబడునని ప్రభాతమును నిరీక్షించుచుండ నంతలో నాలవజాము కోడికూత వినంబడియె. మణివర్మయు మాధవసేనుడును నిద్రలేచి రాజగృహంబునకు వచ్చి రాజునిమిత్త మెదురు చూచుచు ద్వారములయొద్ద నిలిచియుండిరి. హేమచంద్రుడు పెందలకడ మేలుకాంచి హరిశర్మవద్ద సెలవుగైకొని గుహవిడిచి నిజగృహంబునకు ఒకనమయి వచ్చె. వచ్చు

చుండ మహారాజును మార్గమధ్యమునఁ బౌరులనేకులుచూచి మహానందభరితులై "యదిగో మహారాజు నిరపాయముగ గృహమునకుఁ బోవుచున్నాఁడు. హరిశర్మయేదో మహాపకారమును జేయునని భయంపడి మనమందఱము వానిని నిష్కారణముగ నిందించి పాపము మూటఁగట్టుఁకొంటిమి చెక్కుచెదరక మనప్రభువు మనకుఁ దక్కినాఁడు. మహాతపశ్శాలురగు బ్రాహ్మణోత్తములు నిర్నిమిత్తముగ నిటువంటి రాజునకు నపకారము నేలచేయుదు" రని యొకరితో నొకరు చెప్పుకొనిరి. మేలుజలతారువలువలు, బంగరునగలు, రత్నహారములు దాల్చక పట్టినాగచీరలు గట్టుకొని యామహాభోగి జోగిచందమున నిల్లుసేర మణివర్మయు మాధవసేనుఁడు మొదలగు నాప్తులందఱునువొల్లి తల్లి పంపున నిల్లువిడిచి వల్కలములుగట్టుకొని కాఱడవులఁ గాఁపురముసేయఁబూనిన శ్రీరామచంద్రుని విరటుని కొల్వుకూటమునకుఁ గంకభట్టువేషమునఁబోయిన ధర్మరాజును బ్రత్యక్షముగఁ జూచినట్టు భావించి ఖిన్నమనస్కులైరి. హేమచంద్రుఁడు ద్వారమునద్దఁ దన నిమిత్తము కనిపెట్టుకొనియున్న మంత్రులను బలుకరించి యంతఃపురికిఁ జనియె.

అతఁడు లోనికిం జనినపిదప మాధవసేనుఁడు మణివర్మతో మెల్లగ "మిత్రమా! మహారాజుగారు కుశలముగ నిల్లుసేరుటం జేసి మనము భయము విడిచిపెట్టవచ్చునని తోఁచుచున్నయది" యని పలుక మణివర్మ మనోవిచారమును సూచించు మందస్వరముతో "నిల్లలుకగానే పండుగ కాదుగదా. ఈకుశలము కుశలమా? ఇరువదియొక్కదినములు నిరపాయముగఁ గడపవలయు. బ్రాహ్మణుడీయూరు విడిచి పోవలయు నప్పుడు రాజుగారు సురక్షితులని మనము నమ్మవలయు. అంతవరకు నాకు ధైర్యము లే"దని చెప్పి మాధవసేనునితోఁ గలసి కార్యాంతరములమీఁదఁ బోయెను.

అరవిందాదేవియుఁ గుమారులు హేమచంద్రునిఁ గనుంగొని యింతింత యనరానిమహానందమునొందిరి. దారపుత్రుల మొగములు దీనములై యుండుటఁ గనుగొని హేమచంద్రుఁడు వారిని దగ్గఱకుఁ బిలిచి లాలించి తనకపాయము లేదనియు విచారింపవలదనియు నెన్నియో భంగులం జెప్పి నిరువదియొక్క దినంబులు నిరువదియొక్క గడియలట్లు వెళ్ళఁబుచ్చి వత్తునని దృఢంబుగఁ బలికి మరల నెప్పటియట్లు రాత్రి గుహకుఁ బోయి మంత్రము పునశ్చరణము జేసి మఱునాఁడుదయమున నింటికివచ్చెను. అట్లిరువదిదినములు గడచెను. ఇరువదియొకటవనాఁ డుదయము నరవిందాదేవి మగని వ్రతసమాప్తి దాదాపుగ నైనదని యెంతయు సంతసించి యారాత్రియొక్క రాత్రియుఁగూడ నెట్టటో కడచిన తోడనే తనమ్రొక్కులు దీర్పవలయునని నిశ్చయించి మంచిగోవులు వేయు తెప్పించి సిద్ధముగనుంచుమనియుఁ గుంకుమ మేలైనది తెప్పింపుమనియు మంత్రికి సన్నదచే వర్తమానము పంపి తద్విషయప్రయత్నములనుండెను.

—♦—

## ఇరువదినాలుగవ ప్రకరణము

ఇరువదియొకటవనాఁడు హేమచంద్రుఁ డెప్పటియట్లు సాయంకాలము నియమితుఁడై యేకాంతంబుగ గుహకుం జనియె. ఇరువదిదినముల నుండి సరిగా భోజనము చేయకపోవుటచేతను మాపులు తిన్నగ నిదురపోకపోవుటచేతను వాని శరీరము కృశించి మొగము వెలవెలఁబాఱి చూపరకు విచారము గలిగించుచుండెను. గుహకుఁ జనినపిదప హరిశర్మ వాని నెప్పటియట్లు సన్మానించి యిట్లనియె "రాజా! ఈయిరువదిదినంబులు దైవభక్తిచే నీవు గడుశ్రమనొందితివి. ఈరేయి నీవు

జాగరూకతతోఁ, గడపుదువేని నీకిష్టము గట్టెక్కు; కాని యన్నిదినములలో నిదియే గడ్డుదినము. నీకుపదేశింపఁబడిన మంత్రప్రభావముచేత మహేశ్వరుఁ డనేక రూపములఁ దాల్చి నీమనోనిశ్చలత శోధించును. అప్పుడు నీవు జంకుదువేని మిగుల నపాయము వాటిల్లఁగలదు. ఈ మాటలు నీకిదివరకే చెప్పియుంటిని. నీయందుఁగల ప్రేమాతిశయమున మరల జ్ఞప్తికిఁ దెచ్చితిని." అని హరిశర్మ పలుకుటయు హేమచంద్రుఁడు "స్వామీ! అపాయము వాటిల్లినను నాకుఁ విచారము లేదు. ఈశ్వర సేవాసక్తుఁడనై యుండి మేను విడుతునేని నాకంతకన్న" భాగ్యముగలదే! శోధించుటకైనను సరే బాధించుటకైనను సరే యీశ్వరుఁడు నాకుఁ బ్రత్యక్షమైనచో నాకదియే చాలు" నని నిశ్చింతతోఁ బలికి గురువు ననుమతిఁబడసి బద్ధపద్మాసనస్థుఁడై వ్యాఘ్రాసనాసీనుఁడై జపమాలఁ జేతఁ బుచ్చుకొని పునశ్చరణ నారంభించెను. అతఁడు పునశ్చరణ మారంభించినతోడనె హరిశర్మ యచ్చోటు విడిచి యొండుకడకుఁ బోయెను. భైరవకాలకంఠులు రాజున కాపూఁటఁ గానఁబడనే లేదు. ప్రపంచమంతయుఁ గాఢచీఁకటులు గ్రమ్ముకొనియుండుటచే భగవంతుఁ డిచ్చిన కన్నులు నిరర్థకములయ్యెను. చుట్టుప్రక్కల కొండలలోనుండి నక్కలు తోఁడేళ్ళు మొదలగు జంతువుల కూఁతలె కాని మనుష్యుల ధ్వని యెక్కడనాఁడు వినఁబడవయ్యె. ఎందుచేతనో హరిశర్మ హోమగుండమందలి యగ్నినిగూడ నాఁటిరేయి యార్పివేసెను. నాఁటిరేయి తెల్లవాఱువఱకు పునశ్చరణము చేయవలెనని సంకల్పించుకొని హేమచంద్రుఁడు పరమనిష్ఠుఁడై కూర్చుండెను.

రెండుజాముల రాత్రియైనపిదప నొక మనుష్యుఁడు తనయడుగుల చప్పుడెవరికైన వినఁబడునేమోయను భయమున నలుకుడుగాకుండ నడచుచు మెల్లమెల్లగ గుహను జేరెను. దాగిచూచుటకు రెండుకన్నులను దప్ప దక్కిన శరీరమంతయు నతఁడు కంబళముతోఁ గప్పుకొనెను.

గుహం చేరినతోడనె వానిచంకనున్న వస్తువేదో రాతిగోడకుఁదగిలి టక్కుమని చప్పుడయ్యెను. ఆధ్వని హేమచంద్రుని చెవులంబడియెఁ గాని తపోవిఘ్నముగు ననుభయముచేతను వెనుకకుఁదిరిగి చూడఁ గూడదని గురువానతిచ్చుటచేతను దనవ్యాపారము నతఁడువిడువక నిశ్చలుఁడై యుండెను. అంతలో మనుజుఁడిట్టటు నడచినయలుకుడు వానికి శ్రవణగోచరమయ్యెను. అప్పుడించుక భయమున వానిమేనంత యు నొక్కసారి వడఁక వెంటనే ధైర్యముదెచ్చికొని భగవానుఁడగు శంకరుఁడు తన్నుశోధింప వచ్చియుండఁబోలునని యదురుబెదురు లేక మఱింతగాటముగఁ బునశ్చరణము సేయనారంభించెను. అంతలో నెవఁడో యొకఁడు సన్నని దీపముబట్టుకొని గుహకు దూరమున నొక నిముసమునిలిచి వెంటనే యవ్వలకుంజనెను. క్రొత్తగా గుహంజొచ్చిన వానిని హేమచంద్రుఁడుచూచుటకు వీలు లేకపోయెనుగాని యాదివ్వె వెలుఁగున నాక్రొత్తవాఁడు హేమచంద్రునకు వెనుకప్రక్కనుండి వానియునికి నంతయు సరిగఁ గనిపెట్టుటకు వీలుగలిగె. అప్పుడానూతన పురుషుఁడు చంకక్రిందనున్న ఖడ్గమునుదీసి తపోనిష్ఠుఁడగు హేమచంద్రుని శిరస్సు నొక్కయేటునం దెగవేసె. పునశ్చరణసంఖ్య లెక్కించుటకు మడిచిన వ్రేళ్లు ముడిచినట్లె యుపవ్యాసనము వేసిన కాళ్ళు వేసినట్లె యుండ శిరస్సు బంతివడువున నగిరి రెండుగజములదూరము నఁబడియె. చిమ్మిలిగొట్టములనుండి వసంతము వచ్చుతెఱఁగునఁ గంఠనాళములనుండి క్రొన్నెత్తురు ప్రవాహములుగఁ బైకివచ్చి యాస్థలమంతయుఁ దడిపె. ఆక్రొత్తమనుష్యుఁడీ దారుణకృత్యమును నిర్వర్తించి తత్క్షణమె యచ్చోటువాసి యెందేని జనియె. హరిశర్మగాని భైరవకాలకంతులుగాని యచ్చటఁ గనంబడరైరి.

—*—

## ఇరువదియైదవ ప్రకరణము.

"హృదయేశ్వరా! హృదయేశ్వరా! మీబాలక మింతపాడు వారిన దేమి? ఎందుపోయెద రెందుపోయెదరు, నిలుఁడు నిలుఁడు" అని యరవిందాదేవి కలవరించుచు నిద్రలోనించుక యేడ్చెను. అది విని నర్మద నిద్రాసక్తయగు దేవిని మేలుకొలుపఁ దలపండుకొన్న తావువిడిచి పోవుచుండునంతలో నరవింద శోకాశ్రుపూరితములగు కన్నులతో కళవళము పడుమనసుతో మేల్కాంచి "నర్మదా! నర్మదా! సత్వరమునవచ్చి నన్ను కౌఁగిలించుకొనవే! అబ్బబ్బా! యెంత పాడుకల గంటినే! అదేమో నాయొడలు వడఁకుచున్నదే" యని డగ్గుత్తికతో బలికెను.

అమ్మాటలు ముగియునప్పటికి నర్మదయును దేవి సమీపమునకు బోయి "అమ్మా! భయములేదు. ఇదిగో నేవచ్చితిని" యనియామె మీఁదఁ జేయివైచి యించుక దట్టి యప్పటికిని మేను వడఁకుటదీరమి నందిటంబట్టి కౌఁగిలించుకొని కాలోచితములగు కొన్నిపలుకులు బలికి యామె నూరడించి కొంతతడవైన పిదప "నమ్మా! మీకింత భయము గలిగించిన యాస్వప్నమెట్టిదో నాకెఱింగింపఁగలరే!" యని యడిగెను. "నర్మదా! ఒక్కనిముసము తాళి చెప్పఁగలను. ఇంకను నా మనసు మనసులో లేదు. గుండె చెదరియున్న" దని కొండొక సేపూరకుండి యించుక భీతిఁ దొలఁగి లేచికూర్చుండి యమ్మగువ నర్మదతో నిట్లనియె. "నర్మదా పుట్టిబుద్ధియెఱింగి యింతటిపాడుకల నేనెన్నఁడుఁ గనలేదే. అది వెండియుం దలఁపునఁ దోఁచిన నాశరీరము కంపించునని తోఁచు. అందుచే నది సంగ్రహముగా నీకుఁ దెలిపెద కన్నుమూసి కునికినచో నేదుస్స్వప్నములు వచ్చునోయను భయమున నిదురవోవక యే నలుగెలంకులు జూచుచు మేలుకొంటి. మహారాజుగారు గుహా

కుంబోవుట ప్రారంభించినది మొదలు నేటిదనుక నిద్రాహారములు సరిగ లేమి బడలికచే నెటనుండియో మాయనిద్రవచ్చి మైకము గ్రమ్మినట్లు కన్నులు మూసివైచె. తిన్నగా కన్నులుమూసితినో లేదో వెంటనే చిన్నకునుకపట్టె, సరిగాఁబట్టినదో లేదో వెంటనే, యీ పాదుకల గాంచితిని. మహారాజుగారు శరీరమునిండ నూనె పూసికొని నల్లని వస్త్రములు గట్టుకొని కోటవిడిచి యెక్కడికో పోవుచున్నట్లు కలఁగంటిని. అబ్బా! మరల నా మేనువడంకుచున్నదే'' యని నర్మదమెడఁ గౌఁగిలించుకొని మరల నిట్లని చెప్పఁదొడంగెను.

''అప్పుడిది యేమివాలకమని పలికి నేనాయన పయనమును వారింపఁదలంచితిని. నా మాటలకాయన ప్రత్యుత్తరమునే యొసంగక జాలినించుచూపుల నావంకఁ జూచుచు యథేచ్ఛంజనిమెనఁట'' అని తన కథ తుదముట్టఁ జెప్పకమునుపే రెండవకొడుకగు హర్షవర్ధనుఁడు నాన్నగారు! గుహకుఁబోవల''దని కలవరించె. ఆ బాలకుని కలవరింత విని యాకాంత మతింతచింతాభరముచేఁ గుంది నర్మద నుద్దేశించి వెండియు నిత్తెఱంగున భాషించె. 'మాచితే నర్మదా! బాలకుఁడు నయిత మెట్లు కలవరించుచున్నాఁడో ఈ కలవరింతకు నీ స్వప్నములకు నేదో ననర్థమున్నదని నేను భయపడుచున్నదానను. చెడ్డకలలు మూఁడదలఁచిన కీడులచాయలని స్వప్నవేదులువచింతురు. ఆకలగన్నది మొదలు నాకదుపు చేయివెట్టి కలఁచినట్లున్నది. మనసునిప్పులం బొరలినచందమున నున్నది. ఉపద్రవంబను మహాసముద్రము కన్నులకుఁ గట్టినట్లగపడుచున్నది. ఈకల యన్నికలలవంటిది కాదు. ఎన్ని సారులు స్వప్నమును గాంచలేదు. ఎన్నఁడైన చిత్తమింతయుత్తలపాటు నొందెనే, యని కుమారులిరువురిమీఁద జేయివైచి రెండు కన్నులనుండి రెండుబాష్పబిందువులు రాలగద్గదకంఠముతో నాచిన్ని యున్నల యదృష్టము లెట్లున్నవో యని యవ్వలఁ బలుకలేక యూరకుండెను.

ఆ స్వప్నవృత్తాంతము విని యామె తత్తరపాటు జూచి నర్మద సహజముగ గంభీరస్వభావ యయ్యు హృదయదార్ఢ్యము గలిగి యా దేవి యుత్తలపాటును శాంతిపరచుటకు లేని ధైర్యముం దెచ్చుకొని యల్లన నిట్లనియె. "అమ్మా! కలలునిక్కంబులగునా? ఒకప్పుడు స్వప్నములో నెంతటి యసందర్భములయినం జూచుచుందుము కదా! ఒకనరుండు తాను మృతినొందినట్లు తనశవమును నరులు మోసికొని పోవుచుండ వారితోఁదాను మాట్లాడినట్లు కలగాంచు. అది యసంభవము కదా? కలలోవచ్చిన యాపద లాపదలా? సంపదలు సంపదలా? పగలెల్ల మన స్వపదార్థముమీఁదఁ దగిలియుండు నా పదార్థము గూర్చియే స్వప్నములు వచ్చుచుండు. మహారాజుగారిం గూర్చి మీరు కడుభయపడుచుండిరి గావున మీభయమున కనురూపములగు స్వప్నములే వచ్చుచున్నవి, కలలో నైన హేమచంద్ర మహారాజుగారి కాపదరాదు."

అనవుడు నామాట తన మనంబునకుఁ బరమానందదాయకమగుటచే నయ్యంగవింద, నర్మదా! యింతమాట బుట్టి నీనోటి వాక్యమున రాజుగారు చెక్కుచెదరక నాకన్నులకుఁ గానఁబడుదురేని నీ నోటినిండఁ గలకండంబులు బెట్టెదను, నీమేను బంగారముతో నింపెదను. అంతభాగ్యము నాకబ్బునా? నర్మదా! ఏమయినను సరే నాబొంది యిచ్చట నున్నది గాని యాత్మ యిట లేదు. ఇపు డెంత రాత్రి యైనదో చూచి నాకును రాజ్యలక్ష్మికిని బితృప్రాయుఁ డగు మణివర్మ కడకు నీవుపోయి నాకన్న కలయును నాయున్న యునికియు నన్నుబాడవిన వెరపు తెఱంగు నాతనికిఁ దెలిపి కతిపయ పరివారములఁ దోడ్కొని గుహావద్దకుఁ బోయి మహారాజుగారిస్థితి నరసి కుశలవార్త నాకు బంపుమని చెప్పవలయు. ఎన్నివిధముల నివారించుకొన్నను మనసు కీడునే శంకించు చున్నది గాని శుభమును శంకించుట లేదు.

తన సహాయమే రాజకుటుంబమునకు వజ్రకవచ మనుము. రాత్రి యని బద్ధగింప వల దనుము. ఈరాత్రి గడపితి మేని యాపద గడపితి మనుము. తత్క్షణమ చను మనుము. త్వరపెట్టుము.

నర్మదయు నట్లగా యని యాక్షణమ లేచి యొకదివ్వె చేతం బూని బంటుతనము గల యిరువురుబంట్లను దనకు సాయము జేసికొని మందిరము వెడలి ప్రతి కవాటమువద్ద నున్న యారెకులు నడితేయిం దనపోకకు, గారణంబు ననేక ప్రశ్నంబులు వేసి యడుగ వారి కందఱకుం దగు ప్రత్యుత్తరంబుల నిచ్చుచుం గోట దాంటి రాజవీథిం గొంత దవ్వుపోయి మంత్రియగు మణివర్మ గృహంబునకుంజని ద్వారమువద్ద నిలిచి తానెఱింగిన సేవకు నొక్కని నెలుంగెత్తిపిలిచెను. పిలుచుటయు సేవకుండు బండనిద్దురలోనుండి మేల్కొని తలుపుం దీయకపోవుటచే మేడమీందనున్న మణివర్మయే యామెపిలుపునకుం బలికి సేవకుని లేపి తలుపుం దీయించి యంతటి యర్ధరాత్రమున నంతఃపురపరిచారిక తన యింటికివచ్చుటకు నుత్కృష్ట మయినకారణముండవలయు నని యది తెలిసికొనుటకు వేగిరపడి మేడమెట్లు దిగివచ్చి "నర్మదా! రాజుగారికిం గుశలమా? అంతఃపురమున నద్భుతమ్ము లెవ్వియు లేవుగదా? ఇట్టిసమయమున నీవు నాకడకు రాం గత మేమి? యని గుక్కతిరుగకుండ నొకమాట వెంట నొకమాట వచ్చునట్లడిగెను. నర్మద యానుడువులు విని "దేవా! అంతఃపురమున నద్భుతములు లేవు. దేవిగారు దుస్స్వప్న మొకటిగాంచి మహారాజుగారి సేమమునుగూర్చి సందియము నందుచున్నారు. కలలు నిక్కువంబులుగావని నే నెంత ధైర్యము చెప్పిన నామె నిలుచుటలేదు. ఆయుధహస్తులగు కొందఱు పరిజనుల వెంటబెట్టుకొని సింహగిరివద్దకు మిమ్ము బొమ్మని వేడుకొనుటకు నన్ను బంపిరి. ఆమె యిప్పుడు మతిలేక యున్నది. ఆమె ప్రార్థనమున కనుగుణంబుగ మీరు వర్తింతురేని నే సత్వరింబ యామె సమక్ష

మునకుఁ జనియెద. ఈసమయమున నేను దాపున లేకున్న నామె చింత యినుమడించు. మీఁద దేవరచిత్త" మని చేతులు జోడించి వానియెదుట నిలిచెను.

మణివర్మ తచ్చరిత్రము విని తలయెత్తి యాకసమువంక చూచుచు, నొక్కనిముస మాలోచించి "సర్మదా! దేవిగారి యానతి చొప్పున నిప్పుడే కొంతపరివారము దీసికొని యానెలవునకుఁ బోయి రాజుగారి కుశలవార్త తనకుఁ దెలియపఱచెదనని చెప్పుము. నామనస్సును సందేహావశమగుటచేత నేను నిమురవోవక నీవు వచ్చునప్పటికి మేల్కని యిట్టట్టు దిరుగుచుంటిని. ఈవిషయమున దేవిగా రెంత భయపడుచున్నారో నేను నంత భయపడుచున్నవాఁడను. ఇదిగో నేనిప్పుడే దండపాణిమాధవసేన ప్రముఖులను దోడ్కొని యచటికిఁ బోయెద. నీవంతిపురి కరుగు" మని యానతిచ్చి యొక సేవకునిం బిలిచి యోరీ! "నిగమశర్మను, మాధవసేనుని, దండపాణిని తత్క్షణమ నాకడకుం దోడ్కొని ర" మ్మని పంపెను.

అనంతరము సర్మదయు మణివర్మవద్ద సెలవు గైకొని మరల నంతిపురి కరిగి మంత్రివచనంబులు రాజపత్నికింజెప్పె. అన్నేలత చన్న కొన్నిగడియలలో మంత్రియానతి మాళిదాల్చి మాధవసేనప్రముఖులు వచ్చి తమ్ము రావించినకారణమడిగి తెలిసికొని మహారాజుగారికిమఱి యొకభయ మేదియు లేక పోయినను దేవిగారి హృదయసంతాపము బాపుటకై సింహగిరికిఁ బోవలసినదే యని నిశ్చయించి మెఱియల వంటిబంట్లు ముప్పదుగురు విచ్చుకత్తులు దాల్చి తమవెంట నంటి వచ్చునట్లానతిచ్చి మణివర్మతోఁగూడ బయలు దేఱిరి. అంతఱి మనస్సులు భయశంకాకులితము లగుటచేత నడచునప్పుడు వారొకరితో నొకరు తఱచుగ మాటలాడికొనలేదు. దండపాణిమాత్రము నడుమనడుమ పరమేశ్వరా! మహారాజు దీర్ఘాయుష్మంతుఁడగునట్లుచేయుము

మని వేడఁజొచ్చె. అందఱు జేరి సింహాగిరికిఁ బయనమగునప్పటికి సరిగ జాము రాత్రియైన లేదయ్యెను. మంత్రిగృహమునుండి సింహాగిరి సమీపమునకుఁ బోవునప్పటికి మూఁడుగడియలరాత్రి యుండె. కాఁపువాండ్రు భుజములపై నాగళ్లు వేసుకొని పొలములకుఁ బోవుచుండిరి. పట్టపగలు పరపురుషుల మొగంబులు చూడనొల్లని పేదపడంతులు దిగుడుబావులకు, నూతులకుఁ, జెఱువులకుఁ, బోయి చీఁకటిచాటున పానీయంబులు తెచ్చికొనుచుండిరి. జననిందలకు వెఱచిన విటజనంబులు తెల్లవారకుండ మేలుకాంచి వదలలేక వదలలేక ప్రియజనంబును వదలి పోయి నిదుర లేమి కూరుకొనిపోవుకన్నులతో తడబడు పాదములతో తూలియాడు మేనులతో నొరులు తమ్ము గుర్తింపకుండ ముసుంగులు వైచికొని గృహాభిముఖులగుచుండిరి. దూరప్రయాణీకులు రాత్రి యావీట విడిసినపాంథులు ముందుపల్లె యెండ యెక్కకుండఁ జేరవలయు నని పెందలకడ మేలుకాంచి యిష్టగోష్ఠులు చెప్పుకొనుచు పయనము వెడలిరి. రాత్రి జరిగిన హృదయదారుణ వృత్తాంతమునకు నెంతయు విలపించుచున్నవో యన పులుంగులెలుంగులెత్తి కూయఁదొడంగె. రేయి యెందేని యథేచ్ఛంబుగఁ జరియించి చేయరాని దౌర్జన్యములఁ జేసి పగలు గృహంబులలో డాఁగి యెవ్వరికిం గానబడకుండఁగోరు దుర్జనులచందంబున పాములు మొదలగు దుష్టజంతువులు పుట్టలలోఁ దూఱఁజొచ్చె. నక్షత్రంబులు మందమందకాంతులు గలవై క్రమక్రమంబున నంతరింపఁ జొచ్చె.

---

## ఇరువదియాఱవ ప్రకరణము

మణివర్మ మాధవసేన ప్రముఖులతో గుహాసమీపమునకుం బోయి తన యనుచరులం జూచి "మనమందఱము కట్టకట్టుకొని యొక్కసారి యక్కడకుఁ బోవరాదు. మహారాజుగారు నిష్ఠలో నుందురు. మన సందడిచే వారికి మనశ్చాంచల్యము కలుగవచ్చు. కావున మీరీ చెట్టుక్రింద నిలువుడు నేను బంటు నొక్కని వెంటగొని స్థితినరసి వచ్చెద"నని వారి నచ్చట నిలిపి కాగడా తెచ్చిన మనుష్యుని, బంటు నొక్కని వెంటకొని యడుగులచప్పుడు గాకుండ నడిచి గుహాద్వారమువద్దకుం జని బంటుం బిలిచి "ఓరీ! లోపల మహారాజుగా రున్నారేమో కాగడా వెలుగునం దొంగిచూడు"మని యానతిచ్చెను. బంటు చిత్తమని మెడలోనికిం బెట్టి చూచి "స్వామీ! నేల యంతయు నెత్తురుతోఁ దడిసినట్లు గనఁబడుచున్న" దని భయమున గద్గదకంఠుఁడై పలికెను. ఏమీ! నేల నెత్తురుతోఁ దడిసెనా? యని మణివర్మ మాధవసేన ప్రముఖులం దోడ్కొని రమ్మని బంటునంపి ధైర్యహీనతచేత దేహబలము సడల నిలువ సత్తువ లేక యొక శాఖిపైఁ గూర్చుండె.

అంతలోఁ దక్కిన పరివారము వచ్చుటయు మణివర్మ, దండపాణి మాధవసేననిగమశర్మలఁ బిలిచి "నాకుఁ గాళ్ళాడకున్నవి. నన్ను లోపలికిఁ గొనిపొం"డని యాముగ్గురి సహాయమున గుహం జొచ్చె. చొచ్చి చూచునప్పటికి కాగడా వెలుగున నేల యంతయు వసంతము జల్లిన ట్లలుముకొనిన నెత్తురిలో శిరోహీనమై పడియున్న హేమచంద్రమహారాజు మొండెము, మొండెమునకు బారెడు దూరమునఁ బడియున్న శిరస్సు వారికన్నులకుం గానఁబడియె. కానఁబడుటయు మణివర్మ మ్రాన్పడియె. నిగమశర్మ నిశ్చేష్టుఁడయ్యె.

మని వేఁడఁజొచ్చె. అందఱు జేరి సింహగిరికిఁ బయనమగునప్పటికి సరిగ జాము రాత్రియైన లేదయ్యెను. మంత్రిగృహమునుండి సింహగిరి సమీపమునకుఁ బోవునప్పటికి మూఁడుగడియల రాత్రి యుండె. కాఁపువాండ్రు భుజములపై నాగళ్లు వేసుకొని పొలములకుఁ బోవుచుండిరి. పట్టపగలు పరపురుషుల మొగంబులు చూడనొల్లని పేదపడంతులు దిగుడుబావులకు, నూతులకుఁ, జెఱువులకుఁ, బోయి చీఁకటిచాటున పానీయంబులు తెచ్చికొనుచుండిరి. జననిందలకు వెఱచిన విటజనంబులు తెల్లవారకుండ మేలుకాంచి వదలలేక వదలలేక ప్రియజనంబును వదలి ఱేయి నిదుర లేమి కూరుకొనిపోవు కన్నులతో తడబడు పాదములతో తూలియాడు మేనులతో నొరులు తమ్ము గుర్తింపకుండ ముసుంగులు వైచికొని గృహాభిముఖులగుచుండిరి. దూరప్రయాణికులు రాత్రి యాపీట విడిసిన పాంథులు ముందుపల్లె యెండ యెక్కకుండఁ జేరవలయునని పెందలకడ మేలుకాంచి యిష్టగోష్ఠులు చెప్పుకొనుచు పయనము వెడలిరి. రాత్రి జరిగిన హృదయదారుణ వృత్తాంతమునకు నెంతయు వలపించుచున్నవో యన పులుంగులెలుంగులెత్తి కూయదొడంగె. రేయి యెందేని యథేచ్ఛంబుగఁ జరియించి చేయరాని దౌర్జన్యములఁ జేసి పగలు గృహంబులలో డాఁగి యెవ్వరికిం గానబడకుండఁ గోరు దుర్జనులచందంబున పాములు మొదలగు దుష్టజంతువులు పుట్టలలోఁ దూఱఁజొచ్చె. నక్షత్రంబులు మందమందకాంతులు గలవై క్రమక్రమంబున నంతరింపఁ జొచ్చె.

## ఇరువదియాఱవ ప్రకరణము

మణివర్మ మాధవసేన ప్రముఖులతో గుహాసమీపమునకుం బోయి తన యనుచరులం జూచి "మనమందఱము కట్టకట్టుకొని యొక్కసారి యక్కడకుఁ బోవరాదు. మహారాజుగారు నిద్రలో నుందురు. మన సందడిచే వారికి మనశ్చాంచల్యము కలుగవచ్చు. కావున మీరీ చెట్టుక్రింద నిలువుఁడు నేను బంటు నొక్కని వెంటఁగొని స్థితినరసి వచ్చెద"నని వారి నచ్చట నిలిపి కాగడా తెచ్చిన మనుష్యుని, బంటు నొక్కని వెంటఁగొని యడుగులచప్పుడు గాకుండ నడిచి గుహాద్వారమువద్దకుం జని బంటుం బిలిచి "యోరీ! లోపల మహారాజుగా రున్నారేమో కాగడా వెలుగునం దొంగిచూడు"మని యానతిచ్చెను. బంటు చిత్తమని మెడలోనికిం బెట్టి చూచి "స్వామీ! నేల యంతయు నెత్తురుతోఁ దడిసినట్లు గనఁబడుచున్న"దని భయమున గద్గదకంఠుండై పలికెను. ఏమీ! నేల నెత్తురుతోఁ దడిసెనా? యని మణివర్మ మాధవసేన ప్రముఖులం దోడ్కొని రమ్మని బంటునంపి ధైర్యహీనతచేత దేహబలము సడల నిలువ సత్తువ లేక యొక రాతిపైఁ గూర్చుండె.

అంతలోఁ దక్కిన పరివారము వచ్చుటయు మణివర్మ, దండపాణి మాధవసేననిగమశర్మలఁ బిలిచి "నాకుఁ గాళ్ళాడకున్నవి. నన్ను లోపలికిఁ గొనిపొం"డని యాముగ్గుర సహాయమున గుహం జొచ్చె. చొచ్చి చూచునప్పటికి కాగడా వెలుగున నేల యంతయు వసంతము జల్లినట్లలుముకొనిన నెత్తురిలో శిరోహీనమై పడియున్న హేమచంద్రమహారాజు మొండెము, మొండెమునకు బారెడు దూరమునఁ బడియున్న శిరస్సు వారికన్నులకుం గానఁబడియె. కానఁబడుటయు మణివర్మ మ్రానువడియె. నిగమశర్మ నిశ్చేష్టుఁడయ్యె.

మాధవసేనుఁడు మతిలేక వెంగలిచూపులఁ జూచె. దండపాణి దడదడ వడంకె. వారిస్థితి చూచి తక్కిన పరిజనంబు కళవళము నొందె. అట్లు లొక్కనిమేషము భ్రమానుపడియుండి క్రొన్నెత్తురులు చూచుట చేతఁ జెదరి చీఁకటులు గ్రమ్మినకన్నులు దెరచి "యిఁ కేమున్నది? మన మహారాజు నేలపాలయ్యె. హా! మహారాజా!" యనిమూర్ఛిల్లెను. సేవకు లందఱు హాహాకారములఁ జేయ గుహ ప్రతిధ్వను లెసెంగెను. మణివర్మ నూరడించుటకు దండపాణిప్రముఖులు నెత్తురుఁగోనం జదికిల బడిరి, మాధవసేనునకుఁ గన్నులనీరు కాల్వలై పాఱఁజొచ్చె. నిగమ శర్మ మేను ముచ్చెమటలం బోసె. పరిజనము లొక్కరొక్కరుగ లోనికి వచ్చిరాజనిం గాంచి నెత్తినోరు గొట్టుకొనువారు, రొమ్ము మోదుకొనువారు తల దాళ్ళం గొట్టుకొనువారు; నిలువలేక యున్న రని చదికిలఁబడువారు; హరిశర్మం దిట్టువారు నైయుండిరి. అప్పుడు నిగమశర్మ మిక్కిలి గడుసుదనము లేనిచ్ఛాందసుఁ డగుటచే యాఁడు దానివలె వెక్కి వెక్కి యేడ్చుచు నిట్లనియె. "అయ్యయ్యో! యీ యుపద్రవంబున కంతకుఁ గారణము నేనే. హరిశర్మ మేఁకవన్నె పులి యని యెఱుంగ! వానిమహిమలు వేయినోళ్ళం బొగడి మహారాజు గారి ప్రాణము తీయించితిని. దురాత్మా! హరిశర్మా! ఎంతపనిజేసితి విరా? బ్రాహ్మణుఁడ వనుకొంటిని గాని కటికవాఁడ వనుకొనలేదు. ఓ బ్రహ్మదేవుడా! నీ వెంత యవివేకివి. సృష్టిమొదలుకొని నేటివరకు నీవింతటి మహారాజు నెప్పుడు సృజింపలేదు. నీతలగొట్ట నీచేతిలోని పని కావున నిర్నిమిత్తంబుగా నొక్కనిముసమందు నిరుపమానగుణ రత్నాకరుని నేలపాలు జేసితివి. మరల నిట్టిరాజును నీజన్మమధ్యమందు నీవు సృజింపఁగలవా? ఇంతకు పూర్వజన్మకృతమగు పాపమిట్లున్నది. ఎవ్వారేమి చేయగలరు!" అని వగచుచుండ మాధవసేనుఁడు మహారాజు మొండెమువంక దిరిగి "హా మహారాజా! నీవు లేకపోవు

టచే శ్రీకరంబు నిరాధారమయ్యె. సరస్వతి నిరాలంబయయ్యె.
పండితప్రకరము నిరాశ్రయమయ్యె. భృత్యజనము నిర్గతికమయ్యె.
వసుంధర నిరాభరణమయ్యె. రాజకులము నిస్సారమయ్యె. దారా
పుత్రులు నిర్భాగ్యులు. ప్రజలు నిర్భాగ్యులు, మంత్రులు నిర్భాగ్యులు
నై యుండ వారికి నీ వెట్లుదక్కుదు''వని పరిపరివిధంబుల విలపించు
చుండ నంతలో మణివర్మ మూర్ఛనుండి లేచి ''మాధవసేనా!
హేమచంద్రా స్తమానమయ్యె. విబుధుల కింక గడుపునిండ నన్న
మైనను దొరకకుండెను. ఇంక చిత్రభానుం డుదయించి యగ్నిశిఖలం
బోలు తన కరములచేతఁ బ్రజలను మంగలములోఁబెట్టి వేచినట్టు
వేచు. ఈపని చిత్రభానుఁడు చేయించియుండు. వాఁడు చచ్చినమాట
వట్టిది 'పాపీ చిరాయు' వనుమాట నిజము. ఇంత దుష్కార్యము
సంకల్పించియుండ వాఁడేల చచ్చు? పయోముఖ విషకుంభ మగు
నీ హరిశర్మ యీ దురాత్మునిచేఁ బ్రేరితుండై వచ్చి తలపెట్టిన
కార్యంబు చేసిపోయె.

ఆ దురాత్ముని మొగంబు చూచినది మొదలు వాఁడు విశ్వాస
నీయుండు గాఁడనియు, నాతనివలన నపాయంబు తప్పక నగుననియు
బలుతెఱంగుల నే మొరలు పెట్టుకొన్నను నాపాలిట లేయనఘుని చెవుల
కెక్కినవి కావు. ఇంతకు కాలంబు గ్రోసికొని వచ్చుచుండ నాపలుకు
లెప్పగిదిని పథ్యంబులగును? అతిదారుణ మగు నీవార్త నరవింద
కెత్తెరంగునఁ దెల్పుదు? నేను భర్తృకుశలవార్త దన కెఱిగింతునని
ప్రాణ్పటిడాసతో నున్న యమ్మహాదేవి యీ యప్రియంబువిని జీవించునే!
ల్లి మఱియొక భంగియైనచో నోరెరుంగని యీబాలకులు బ్రదుకు
దురే? ఏమి మూఁడనున్నదో యెవ్వఁడెఱుంగు? అయ్యయో!
పథ్యమలోక మందారవృక్షము మంటిపాలయ్యె. ఇంక కవిసమూ
హంబులు యాశలుడుగవలె. అధిక తేజోరాశి యైన సూర్యబింబ

మస్తమించె. కాశ్మీర మంధకారబంధురం బగు; దురాచారులగు నిశాచరులు విచ్చలవిడిం జరియింపవచ్చు. శత్రుమదగజంబుల గుండె లవియఁజేయు రాజసింహంబు కడతేఱె. క్రూరసత్త్వవృద్ధి గానవచ్చెడు కాఁబోలు!''అని విలపించుచుండ దండపాణి కన్నీరు వస్త్రాంచల మునం దుడుచుకొని ''హా రాజహంసమా! నీవు లేకునికి జన సమూహంబు శోభావిహీనమైయుండు మీరు లేని శ్రీనగరంబు సింగము లేని యడవి. శీతాంశుఁడు లేని యాకసము. దైవోపహతుల మగు మాకు నీవంటి నృపుఁడు దక్కునే''యని వగచి తనవంతు దుఃఖము గూడ చెల్లించి తక్కినవారితో సమానుఁడయ్యె. మణివర్మయుం గొండొకసేపు బిట్టు వగచివగచి కొంతవడి కించుక యూరడిల్లి మాధవసేనుని చేయిపట్టుకొని ''మిత్రమా! మొదటినుండియు గార్య ములు మన తలంపు నందునటచే నేదివచ్చినను మన కిరువురకుం దప్పదు. నీవంతఃపురమునకు గ్రక్కున యరిగి మనరాకకై నిలుప రాని యాత్రముతో నిరీక్షించుచుండు సరవిందాదేవికి ఘోరవార్త విన్నవింపవలయు. నేనుఁ దక్కంగల పరిజనంబు లిట నుందుము''మని పలుకుటయు మాధవసేనుఁడు వెండియు దుఃఖావేశ పరవశుఁడై యమాత్యా! రాజశాసనంబునం బోలె నీయానయు నాకు మన్నింప దగినదే కాని పిడుగువంటి యీదుర్వార్త యరవిందముకంటె నెక్కువ సుకుమారి యగు నరవింద కెట్లు విన్నవింతు? కంటికి నే నగపడిన తోడనే యాదేవి నాకెదురుగ వచ్చి మహారాజు కుశలియే యని యడిగిన నేనేమని చెప్పుదు? ఈకథ చెప్పుటకు నాకు నోరెట్లు లాడు? మంగళవార్త తెలియఁగింపవలసిన నోట మరణవార్తలు దెలుప వలసిన చ్చెనే! ఆకార్యంబు నేఁ జేయనోల్ల. మీరు రండు మీవెంట నేను వచ్చెద''నని వినయముతో విన్నవించెను.

మాధవసేనుని మనస్సు మిక్కిలి మెత్తనిదనియు నతఁ డట్టి కఠినవార్తలు దెలుపఁజాలఁడనియు మణివర్మ యెఱిగి యుండుటచేఁ

దానే యమ్మాధవసేనుని వెంటఁబెట్టుకొని బోవఁ దలంచి కండపాణిని నిగమశర్మను గుహలో రాజకళేబరసంరక్షణనిమిత్తము నిలిపి వారికి సాయముగఁ దక్కిన పరివారము నుంచి యిరువురబంట్లు వెంటఁగొని బయలు దేఱి గుహ విడిచి రాఁ గాళ్ళాడక యొకసారి నిలిచి బ్రాహ్మణుఁడా! యెంతపనిచేసితివిరా? యని యొకమాఱును హా! రాజా, రాజా! నీవంటి యుత్తమోత్తమున కెంతటిగతి ప్రాప్తించెనని వేఱొక మాఱును, నయ్యయో! ఆబిడ్డలమొగ మెట్లు చూతునని యింకొక మాఱును మనసుపోయిన తెఱంగున మఱఁగుచు నోటికి వచ్చినవిధమున నుడువుచు రెండడుగులు నడిచి మరల వెనుకకు వచ్చుచుఁ గొంతసేపు పిచ్చివానివిధమునఁ జరియించి యెట్టకేలకు సాగిపోయెను.

అట మణివర్మ సమక్షమునుండి నర్మద మరల నంతఃపురికిఁ బోయి పడకగదిద్వారముననే నిలిచి తనరాక బ్రతీక్షించుచున్నదేవిం గనుంగొని యమాత్యుఁడు గుహవద్దకుఁ బోవ సమకట్టెనని యామె కెఱిఁగించి యించుకతడ వామెచిత్తమును శాంతింపజేసెను. కాని యెంతతడవు వేచియున్నను మగనివార్తలు తెలియకుండుటచే నిముసమొక్కజామైనట్లు కనఁబడి కాలమామెకు మిక్కిలి భారమాయెను. ఒక్కసారి కూర్చుండు; వేఱొకసారి కూర్చుండ లేక పన్నుండు; ఇంకొకసారి యెద్దియుం దోఁచక ద్వారము దరి పోయి నిలుచు; మఱియొకసారి మణివర్మ వచ్చుచున్నవాఁడేమో చూడవే యని నర్మదను కొన్నియడుగులదూర మంపు, ఎప్పటికి నయ్యమాత్యుని దర్శనముకాక పోవుటచే విసిగి యొకతూరి యాదేవి నర్మదతో బాష్పాకులితయై "యోసీ! ప్రాణనాథున కపాయ మేదైన జరగి యుండదుకదా? లేనిచో నింతతడవేలనే? ఏమొ కాని నామనసు నా మనసునే నమ్మకున్నదే! ఈక్షణము మహారాజుగారు వచ్చి నాకన్నుల యెదుట నిలిచి నాయులమట దీర్చిన యెంత బాగుండును. వారు

రానక్కఱలేదు. కుశలవార్త కాకిచేతఁ జెప్పిబంపినను నాకుం జాలును.'' అనుచు మనోగత మైనదుఃఖమునకు వచోరూపక మైన యాకారము నొసంగుచుండ నంతలో రెండవకొడుకగు హర్షవర్ధనుఁడు మేలుకాంచి కన్నులు నులిమికొనుచు లేచి కూర్చుండి యొడలు విరుచుకొని కన్నులదెఱచి చెక్కునచేయి వెట్టుకొని యొక చోచేష్టలు దక్కి బంగరుబొమ్మవలె కూర్చున్న తనతల్లిని జూచి దిగ్గున పాన్పుదిగ్గి యొడిలోఁ గూర్చుండి ''యేమమ్మా! నీ విప్పుడు మేలుకొని యుండుటకుఁ గారణమేమి? నీవు విచారించుచున్నట్లు కనఁబడుచున్నదాన వేమి? నాన్నగారివార్త యేమయినఁ దెలిసినదా? అమ్మా! అయ్యో! పండుకొవేమే నీవిన్నాళ్ళవలె లేవేమి? అది యేమో నాకుఁ జెప్పవే! నాతో చెప్పుట కేమే; నర్మదా! ఏమే మాయమ్మ యిట్లున్నది? కారణము నీవైనం జెప్పవే!'' అని పరిపరి విధంబుల నడిగి వారిరువురు తనమాటల కుత్తరం బొసంగకపోవుటయుఁ దల్లికన్నులనుండి తన ప్రశ్నంబుల కుత్తరంబువోలె బాష్పంబులు రాల్చుటయు వీక్షించి యతఁడు జిన్నవోయి లేచి నిద్రించుచున్న విక్రమసేనునికడకుం బోయి, అన్నయ్యా! అన్నయ్యా! ఒకసారి లెమ్మని మీఁదఁ జెయివైచి తట్టెను. అనుజుని కరస్పర్శ మగుటతోడనే విక్రమసేనుఁడు మేలుకాంచి యందఱు జూచియే మేమి! మీరందఱు మేలుకొని యున్నా రేమి? తమ్ముఁడా! అమ్మ యిట్లున్న దేమి? నర్మదా! నీవు నట్లుంటి వేమే? యని వేర్వేర నందఱ నడుగ నాతనికి నర్మద యిట్లనియె.

అమ్మగారు మీనాయనగారిమీఁద నొకపాడుకల గని విచారించుచున్నారు. ఆయనకుశలవార్త నరయుటకు సింహగిరియొద్దకు మణివర్మప్రముఖు లరిగి యున్నారు. వారింకను రాకపోవుటచే నీమె యాందోళము మఱింత హెచ్చినది. ఇదియే విచారకారణము. అని యెఱిఁగించుటయు హర్షవర్ధనుఁడు ''ఇదియా కారణము. నేనెంతయడి

గిన నా కెవరుం జెప్పరై రేమే? అన్నయ్యా! మనమిద్దరము సింహ
గిరి కిప్పుడే పోయి నాయనగారివార్త స్వయముగా నరసి వత్తమురా''
మ్మని పిలువ నౌనౌను పదపద యని విక్రమసేనుఁడు పాన్పుడిగ్గె.
అయ్యిరువురయుత్సాహముం జూచి సహజముగ వారు సాహసులౌట
యెఱిఁగినదగుటచే నరవిందాదేవి చివాలున లేచి యిరువుర జెరియొక
చేతం బట్టుకొని ''నాకులదీపములారా! చాలు మీసాహసములు.
నాదినములు మంచివి కావు గడపదాఁటి మీరు రావలదు జనవద్దు.
సింహకిశోరములవంటి మీరుండ మీతండ్రిగారికి భయమేమి యుండు.
ఇంతకు మణివర్మ యీపాటికి వచ్చుచుండు'' నని పలికి యాకుఱ్ఱల
యుత్సాహంబు నివారించి కూర్చుండఁబెట్టె. అంతలో మనుష్యులునడ
చిన చప్పుడు శ్రవణగోచరంబగుటయు నంతఱు ద్వారమువద్దకుంజనిరి.

---

## ఇరువది యేడవ ప్రకరణము

అప్పుడు తెల్లవాఱుచుండె. కాకులు కావుకావు మని కూఁయ
జొచ్చెను. పోవుచున్న చీఁకటుల, మెల్లమెల్ల వ్యాపించుచున్న వెలుఁ
గుల; నడుమనడుమ మనుష్యుల మొగములు స్వల్పప్రయత్నముతో
గుర్తించుటకు వీలుగ నుండెను. కోటసమీపమునకుఁ వచ్చినతోడనే
యా యమాత్యుల కిరువురకు మనోధైర్యంబులు జారిపోయె. మొగం
బులు వెలవెలఁబోయె. నడచుటకుఁ గాళ్లాడ వయ్యె. ఊర్పులు నిడుద
లయ్యె, అచ్చట నేది చూచిన వారికి మహారాజే జ్ఞప్తికి వచ్చె.
రాజభటులు వారి వాలకముం జూచి భయపడి యేదియో మూఁడిన
దని యొండొరులతోఁ జెప్పుకొనసాగిరి. ఆ మంత్రు లిరువు రెట్టెటో
కోట జొచ్చి యనేకకక్ష్యాంతరంబులు గడచిగడచి వంచిన తలలతో

బాష్పాకులితములై మార్గమును జూడరాని కనులతో మందమందము లగు నడకలతో నొత్తమడఁచిన నడుగగ సముద్రతరంగమువలె నుబికి యుబికివచ్చు దుఃఖముతో నంతఃపుర సమీపమునకు వచ్చుచుండ ద్వారముకడ నదివఱకే చేరియున్న విక్రమసేనుఁ "డదిగో మాధవ సేనుఁ"డని వ్రేలితోఁ జూపెను. అదిగో మణివర్మ యని నర్మద పలికెను. ఆపలుకులు వినినతోడనే యరవిందాదేవి తెప్పవాల్పక వారివంక తప్పక చూచి, చేష్టలు దక్కి తలలువంచి కట్టబొమ్మలవలెకదలు వారి వాలకములు తనకుం దృప్తికరముగ నుండకపోవుటచే, రాజకుటుంబోజ్జీవక మగు శుభవార్త వినంబడునో పిడుగుతునుకవంటి యశుభవార్త వినంబడునో యని సందిగ్ధమునకు, భయంబునకు లోనై భయ మను గొప్పబరువుతో నిండిన తన దేహమును నరఁటికంబములవంటి కాళ్ళు భరింపజాలమి నిలువలేక గోడకుం జేరఁబడి కూర్చుండెను. బాల్యచాపలంబునకు భయంబు తోడుసూప హర్షవర్ధనుఁడు తనయంతరంగంబున నెలకొన్న యాత్రము నిలుప లేక విసవిస నడచి వచ్చుచున్న మంత్రుల కెదురుగాఁ బోయి మణివర్మ చేయిబట్టుకొని "మానాన్నగారు కుశలముగ నున్నారా? ఏమి చేయుచున్నారని" యడిగెను.

అడుగుటయు జాలిగొలుపు బాలునిపలుకులు ములుకులై నాట దుఃఖజలముతో నిండినమణివర్మమనస్సు కడవచిల్లివడియెనో యున్నట్లు రెండుకన్నుల కొలఁకుల నుండియు వేఁడికన్నీళ్ళు దొరఁగి బాలుని మస్తకమున కభిషేకము చేయఁజొచ్చెను. వేడికన్నీళ్లు తలఁదడుపుటయు వేఁడినిట్టూర్పులు మొగమునకు సోఁకుటయు నిట్టూర్పుల కతమున కడుపు మాటిమాటికి నుబుకుటయుఁ దనయడిగినప్రశ్నము కుత్తరము లేకపోవుటయుఁ జూచి బాలుఁడు హర్షవర్ధనుఁడు తెల్లబోయి నిలిచెను అంతలో విక్రమసేనుఁడు పరుగెత్తుకొని మంత్రికడకుఁ బోయి 'అయ్యా! తండ్రిగారిం దోడ్కొని రాక మీ రొంటిగ వచ్చితిరేల?' అని

మఱియు నేదో పలుకఁబోవుచుండ మణివర్మ దుఃఖపరవశుఁడై "హా మహారాజ" యని నేలపయిం బడి మూర్ఛిల్లె. "నాయనా! మీ తండ్రిగారి కుశలవార్త నెఱిగించునట్టి పుణ్యము మేము చేసికొన మైతి" మని బాష్పరోదనము చేసి మఱేమియు మాటలాడనోపక మాధవసేనుఁడు నేలం జదికిలఁ బడియె.

అమాత్యులదారుణవచనము లనెడు మేఘగర్జనములు వినఁ బడినతోడనే మందిరమున దుఃఖవర్షము గురిసెను. అరవిందాదేవి హా హృదయేశ్వరా! యని యొక్క కేక వైచి మూర్ఛిల్లెను. నర్మద దేవి పాదములయొద్దఁబడి యేడ్వసాగెను. తండ్రివార్తయుఁ దండ్రి యవస్థయు నెఱింగి బాలకులిరువురు వెక్కి వెక్కి యేడ్చుచు లోనికిం జని స్మృతిమెఱుంగక పడియున్న తల్లికడకుఁ బోయి రెండుప్రక్కలఁ జేరియొకరు గూర్చుండిరి. పిదప నంతఃపురమందలి సేవకు లందఱు హా! చంద్రమహారాజా యని యాక్రందనము చేసిరి. వారల రోదనంబులు విని యారెకులు మొదలగు కోటకాపరులు వినువారిగుండె లవియు నట్లు మిన్ను ముట్టున ట్లెలుఁగెత్తి విలపించిరి. కోటలోని కళవళమును బట్టి మహారాజుమరణవార్త యానోటనుండియానోటంబడి నగరమెల్ల నిముసములో వ్యాపించెను. వ్యాపించుటయుఁ బ్రజలుహాహాకారములు జేయువారు, హరిశర్మం దిట్టువారు. పానుపులపైనుండి దగ్గనలేచు వారు, పరుండినవారి కీవార్త జెప్పుచు లేపువారు, తోఁచక యిం డందు దిరుగువారు, తొట్రుపాటున పనులు మఱచువారు, తప్పుడుగ వచ్చినవారి కావార్తఁ జెప్పువారు, చెప్పవచ్చినవారి గ్రుచ్చి గ్రుచ్చి ప్రశ్నలడుగువారునై పలుతెఱంగుల నుత్తలపాటు పడఁజొచ్చిరి. అంగనలు ప్రాతఃకాల గృహకృత్యములు మాని గుంపులుగూడి కన్నుల నీరు పెట్టుకొనుచు నొండొరుల నమ్మా యక్కా యని పిలుచు కొనుచు నింక నరవిందాదేవి బ్రదుకదనికొందఱు, కళారాశియైన యా

మొగమునకు బ్రహ్మవైధవ్య మెక్కడ వ్రాసెనో యని కొందఱు, దైవముకంటెకి పేలగింజయుం బెద్ద యయ్యెనని కొందఱు, దేవినోచిన నోములన్నియు నేమయ్యెనే యని కొందఱు, మంచివారికి దినములు కావని కొందఱు, దైవరీతియిట్లున్నది, యేమికరినన నేల యని కొందఱు దోఁచినబోలికం బలుకజొచ్చిరి. పురుషు లనేకులు ప్రభాతకృత్యములు నెఱవేర్పక యే రాజకళేబరము గనుంగొనుటకు సింహాగిరి వంకకుంజనిరి. కొందఱు సత్వరంబున కార్యంబులం దీర్చి యాప్రదేశమునకుం జనిరి.

అట మణివర్మయు మూర్ఛనుండి తెలివిదెచ్చుకొని సంతతధారగఁ గన్నీరు కారుచుండఁ బ్రక్కను గూర్చున్న మాధవసేనుని జూచి గద్గదకంఠముతో "మిత్రమా! రాజపుత్రు లేరి? దేవియవస్థ యెత్తెఱంగున నున్నది? ఎత్తెఱంగున నున్న దని యడుగ నేల? మగపులుఁగు నెడబాసినయాఁడులకుముకి తెఱఁగున నల్లుకొన్న ప్రాపు బాసిన తీఁగలాగున నిరాధారమైయున్నది కాఁబోలు. నన్నొకసారి దేవి సన్నిధానమునకుం గొంపోవుడు పూర్వపుమహారాజుగారి కాలపు వాఁడనైన నేను ముందుగా కడతేఱక యీ ఘోరవార్త వినుటకు దేవికి వినుపించుటకుఁ గాబోలు నిరుడు పుట్టకురోగము వచ్చి బ్రదికితిని. హేమచంద్రుని నా చేతులతో నెత్తియాడించితిని. ఇప్పటికి సరిగ ముప్పదిమూఁడేండ్లయినఁ జెల్లలేదు. వచ్చెడుదశమికి ముప్పదిమూడవయేడు నిండును. ఇంతలోనే యీమహాత్మునకు నూరేండ్లు నిండినవి. తండ్రియగు విక్రమసేనుఁడు మరణకాలమున నన్ను బాన్పుకడకుఁ జేరంబిలిచి తనచేత నా చేయిపట్టుకొని "హేమచంద్రుఁడు నీవాఁడు కానినావాఁడు కాఁడు. రాజ్యము గొప్పది. వయసుచిన్నది. పగతురనేకులు; బుద్ధిసంపన్నుఁడవగు నీవె యాతనికి సప్తాంగములట్లు పనిచేసి నేనున్నప్పటియట్లవానిచే రాజ్యంబు జేయింపవలయునని నా చేతిలోఁ

జేయి వైచి వాని నప్పగించె. అప్పగించినందుకు నే నిప్పు డామహారాజును జేతులార మృత్యుదేవత కప్పగించితి. ఈవిషయమునఁదక్క నన్యవిషయముల నెందు నాగీచినగీటు దాఁటి యెఱుంగఁడు. ఏమైన నేమి తుద కిట్లనియెఁ గదా. న న్నాయమ్మకడకుం దోడ్కొనిపొ" మ్మని వేఁడుకొనియెను. మాధవసేనుఁడు డగ్గుత్తికతో "నయ్యా! దేవియవస్థ యతిదీనముగ నున్నది. నీవు మూర్ఛిలినతోడనే దేవియుహా! ప్రాణేశ్వరా! యని మూర్ఛిల్లి చైతన్యము లేక పసిఁడిబొమ్మ తెఱంగున లోనం బడియున్నది. తండ్రిచావు నిప్పు డిప్పుడే విని గుండెలు చెదర బెంగటిల్లి యున్న బాలకులిద్దరు తల్లి యేమగునో యని యామెకిరుప్రక్కలఁ జేరి తల్లిని కన్నీటితో స్నానము చేయించుచున్నారు. ఆతల్లిబిడ్డల దురవస్థం జూడ నాకడుపు చుమ్మలుచుట్టుచున్నది. నీ వది చూచి సహింపఁగలవే? ఐన నటు పోఁ దలఁతు వేని పోవుదము ర" మ్మని పలికెను.

అనవుడు మహీపతి "మాధవసేనుఁడా! యెంత వెఱ్ఱివాఁడవు. అంతటి మహారాజుశరీరమును రెండుతునక లైనయవస్థలోఁ జూచి యింకను బ్రతికియుండిన ఱాతిగుండెవారము మనము తల్లిబిడ్డలయవస్థఁ జూచి సహింపఁజాలమే? పదపద న న్నటకుం గొనిపొ" మ్మని పలికెను. పలుకుటయు మాధవసేనుఁడు వానిని లేవనెత్తి మెల్ల మెల్లగ దేవియున్న నెలవునకుం గొంపోయెను. అట్లిరువురు నరవింద యున్న గదికిఁ బోయి యొకచోటఁ జదికిలఁబడి చేష్టలు దక్కి పడియున్న రాజపత్నిని, రెండుప్రక్కలఁ జేరి విలపించుకుమారులను, పాదపద్మములను దనయశ్రుజలములతోఁ బూజించుచున్న సర్వదను జూచి యవగతధైర్యు లయి యాఁడువాండ్రం బోలె 'బావు'మని యేడ్చిరి. ఆయిరువురప్రలాపంబు వినినతోడనే బాలకులు సర్వదయు వావిడిచి

విలపించిరి. మణివర్మకొండొక సేపున కించుక శాంతించి "ఆహా! అరవిందా! మహాదేవి! అరవిందవాసిని యగునాదిలక్ష్మి యైన నెంచఁ దలఁచితివేని నంకలు గలవు కాని నీకు లేవు. నాఁడు స్వయంవర కాలమున సకలమంగళాలంకారములతో నిండియుండి మాపిన్నరాజునకు పట్టపుదేవివయి మాకెల్ల రాణివై మెఱుపుదీఁగయట్లు చూడ్కులకు మిఱుమిట్లుగొలుపు నిన్నుఁ జూచినకన్నులతోడనే నేఁడునీదురవస్థం చూడవలసివచ్చె. నాచిన్నియన్నలారా! రాజపుత్రులారా! మీ కెంత దశవచ్చె"నని విలపించుచుండు నంతలో నరవిందాదేవి కించుకస్మృతి తెలిసెను. అది యెఱుంగక నర్మద పలవరించుచున్న మణివర్మనుద్దేశించి స్వామీ! మహారాజుగారి నిశ్చితవార్త యేమి యని డగ్గుత్తికతో నడిగెను. ఆమె ప్రశ్నము విని మణివర్మ "నర్మదా! యేమిచెప్పుదు. హరిశర్మయో వానిప్రేరణంబున నేదురాత్ముఁడో ఖడ్గముతో మహారాజుగారిని వధియించి" యనివాక్యము సమాప్తము చేయకమునుపే యప్పుడే మెలఁకువ దెచ్చికొన్న దేవి 'హా హృదయేశ్వరా' యని యొక్క కేక వైచి వెండియు మూర్ఛ నొందెను. నర్మద చేతులతోఁ దలయు రొమ్ము మోఁదుకొని రోదనము చేసెను. బాలకు లిరువురు దుఃఖావేశముచేతను భయముచేతను గడగడ వడంకు చుండుటచే మణివర్మ యొకనిని మాధవసేనుఁడొకనిని జేరఁదీసియొడిలోఁ గూర్చుండఁ బెట్టుకొని బిగ్గ కౌఁగిలించికొనిరి. తక్కిన దాసీజనంబు మూర్ఛిల్లిన దేవికూడ మృతినొందు ననుభయంబున శీతలజలంబులు పన్నీరు దెచ్చి తెలివి దెప్పించుట కామెపైఁ జల్లనారంభించిరి. అట్లు కొంత తడవు శైత్యోపచారములు నెరపినపిదప నరవిందాదేవి చైతన్యము గలదయి తెలివిందెచ్చికొని యిత్తెరంగున విలపింపఁ దొడంగె. "అయ్యో! చెలులారా! ఏల యీశైత్యోపచారములఁ జేసి నాకుం దెలివి తెప్పించెదరు! నాకు మరల స్మృతి రాకుండుప్రయత్నములుచేసి

యెన్నఁడు న న్నెడబాయని మహారాజుగారి సన్నిధికి నన్నుఁగూడఁ బంపుఁడు. విడిపోయిన దంపతులను గలుపుటయే కదా చెలిమికత్తెయలు చేయవలసినపని. ఇంతకాలంబు మీరు నాకు మిక్కిలి యలంకరించి భర్తృసన్నిధికిం బంపువారు. నేఁడు నాపై యెప్పటిస్నేహముంచి యట్లు సేయుఁడు. నర్మదా! నీవయిన నామాట వినవేమే. ఆ జగదేకవీరు నా ప్రసన్నవదను నాగుణరత్నాకరుఁ బాసి నిమేషమైన నే నుండఁగలనే? హా హృదయేశ్వరా! నావంటి పాపాత్మురాలికి మీవంటి సర్వగుణసంపన్నుఁడు దక్కునే? నాపై మీకింత యాగ్రహం బేల కలిగె? ప్రణయంబున కైన మీపై నలిగి యెఱుఁగ. పరిహాసంబున కయినను నొప్పించి యెఱుఁగ. కలనైన మీపాదసేవ మఱచి యెఱుఁగ. ఇట్లనన్యశరణ్యయగు నన్ను నే కతంబ యిందు విడిచిపోవుట పాడికాదు. ఈ మాయహరిశర్మ మీ కెక్కడ దాపురించె. శుద్ధస్ఫటికమువంటి మీ మనస్సును మలినాత్ముడగు నాబ్రాహ్మణుఁడు కలంచివైచి యింత తెచ్చె. నే నెందఱిచేతనో యెన్నివిధంబులనో చెప్పించినను వానిమాటలనియెడు నురులనుండి తప్పించుకొని మీరీవలఁ బడఁజాలరయిరి. ఆ కుశాగ్రబుద్ధి యెందరిగెనో! ఆ శాస్త్రజ్ఞాన మేమయ్యెనో! ఆధర్మసూక్ష్మవేదిత్వ మేడ నడుగంటెనో! ఆ బ్రాహ్మణుఁ డఱచేతిలో వైకుంఠము చూపుటచే వాని మాయలఁ జిక్కి త్రాఁచుపాములు పూలదండలని నమ్మి శరీరంబు బాసితిరి. కుమారులారా! నేను మందభాగ్యురాల నైనను మీ రూపురేఖావిలాసములం బట్టి మీ రదృష్టవంతులనుకొంటి మీ పూర్వజన్మపుణ్య మయినఁ దండ్రిగండము గాచుననుకొంటి. అయ్యో! తండ్రిలేని బిడ్డలయితిరే. బ్రదికియుఁ బ్రయోజనము లేనిదానను నేను బోయి బంధుజనపారిజాతము, మానినీ మన్మథావతారము విద్వజ్జన విబుధమణి యగు నా మహారాజు బ్రదుకరాదే. ఇంతకు నా నోచిన

నోములపంట యిటులున్నది. దైవోపహతులకు శుభంబులు గలుగునే! ఏనాఁడు మహారాజు మంత్రోపదేశంబు కా నిశ్చయించుకొనెనో యానాఁడె నాకు నా ప్రభువునకుఁ దీరెనని నిశ్చయించుకొంటి. ఆ బ్రాహ్మణుని మాయమాటలలో నేమి పటుత్వమున్నదో కాని వానితో మాటలాడినపిదప నా హృదయేశ్వరుఁడు నాతో నొకనాఁడయిన దిన్నగా మనసిచ్చి మాటాడలేదు. కనువిచ్చి చూడలేదు. హాయిగా నిదురింపలేదు. సుఖముగా భుజింపలేదు. పితృసమానుఁడయిన యీ మణివర్మ మాటయిన వినలేదు.'' అని చివాలున లేచి బారెడుదూరమునఁ గూర్చుండిన మణివర్మ కడకుం జని యతని పాదములపయిం బడి ''తండ్రీ మణివర్మ! మా మామగారు నీకుం జేతిలోఁ జేయివైచి యప్పగించిన పుత్రప్రాయుఁడగు నీరాజును బ్రాహ్మణున కప్పగించి వచ్చితివే! నిన్నుఁ బితృప్రాయముగఁ జూచు మీ మహారా జేఁడి? నానోములపంట యేఁడి? కాశ్మీరరాజతిలక మేఁడి? నాముద్దుల చందమామ యేఁడి? నా కళ్యాణమూర్తి నింక చూడదలఁచుకొనలేదే! తండ్రీ! కడసారి నా కాతని దర్శనము చేయింపుము. ఆయనను మున్ను వసియించు నంతఃపురమునకుఁ గడసారి రప్పింపుము ఇదియే నేను మహోపకారముగ నెంచుకొనియెద'' యని యంగలార్చుచుఁ బలికిన దయనీయంబులగు నామె వచనంబులు విని మణివర్మ యావలఁచిన ట్లఱచి దుఃఖించుచుఁ దన యడుగులకడ నున్న యమ్మహాదేవి చేతులఁ బట్టుకొని ''తల్లీ! నేను తాయిలాగున బ్రదికియుండి నవమదనుఁడయిన నీప్రాణనాథుని చేతులార బ్రాహ్మణున కప్పగించి చంపించిన మహాపాతకుఁడను, నేను నీ కేమి సాయంబు జేయఁగలవాడను. నేఁటి కాలమునకు నీకు మగనిశవమును జూపుటయే మహోపకారము చేయుటగ నెంచికొనవలసిన యవస్థ వచ్చినది. నాతల్లి దారుణ

మరణము చెందిన భర్తృకళేబరమును జూచి నీవు సహింపఁజాలవు. కావున నా విజ్ఞాపన మాలించి యీ విషయమున గట్టిపట్టు పట్టకు" మని వేఁడుకొనియె.

రాణి యాపలుకుల నంగీకరింపక "అమ్మా! ఈవార్తఁ విని బ్రతికినదానను భర్తృదేహమునుజూచి బ్రతుకఁజాలనే? బంగరుబరిణలో వజ్రమును దాఁచినట్లు బ్రహ్మ నామెత్తనిదేహమున వజ్రపుగుండె చేసిపెట్టినాఁడు. కావున నమహాత్ముని టుకుఁ దెచ్చిన సరియే లేక నన్నటకుం గొంపోయినను సరియే" యని యూఁతని యొడిలో నున్న హర్షవర్ధనుని, మాధవసేనుని యొడిలో నున్న విక్రమసేనుని జేరిచెుక చేతఁ జేరఁదీసి కౌఁగిలించుకొని "బిడ్డలారా! మీకెంతగతి వచ్చెరా!" యని దుఃఖావేశమున నెంతేయు మూర్ఛిల్లె. అంత మణివర్మ ప్రక్కనున్న మాధవసేనుని జూచి "మిత్రమా! ఈదేవి మహారాజు మొగము కడసారి చూడక మానదు. చూపనియెడ పోవుట మున పట్లంగూడ దుర్ణయమగును. కావున తెలియచుగా మహారాజుగా రెక్కు బంగరు బల్లకి మోయించుకొని సింహగిరికిఁ బోయి దానిలో శరీరముం బెట్టించికొని" యని యర్థోక్తిగఁ జెప్పి కడమపలుకులు పలుకలేక "హా హేమచంద్రమహారాజా! నిన్ను గురించి నేనొంతటి దారుణ వచనములు పలుకవలసివచ్చె" నని కొలఁకులనుండి కారు బాష్పములు కనసరసిన మీసములపైఁ బడి తనుపరోదనము చేసెను. మాధవసేనుఁడును గన్నీరు త్తరీయాంచలమునఁ దుడుచుకొని సరే యని భటులఁ బిలిపించి పల్లకి మోయించుకొని సింహగిరికిఁ జనియె. అప్పు డంతఃపురపరిచారకులు మునుపటియట్లు మూర్ఛిల్లిన దేవికి శైత్యోపచారములు చేసిరి. చేయఁ జేయ కొండొకవడి కాదేవి తెలివిం దెచ్చికొని మగని సుగుణంబులం దలంచియుఁ దనదైన్యంబు

తలపోసియు బిడ్డల దిక్కుచూలినతనంబునూహించి దైవనిర్ణయమును జింతించియుఁ బరిపరివిధంబులఁ బలవించుచు నయ్యో! ప్రాణనాథుని మృతకళేబరముచూచి సైరింపగలనే యని యొకమాఱును బల్లకి వచ్చుట కింతయాలస్యమేల కావలయు; సత్వరముతోడి తెండని యొకమాఱును మతిలేనిదియుంబోలె నుడువుచు నుండె. కొప్పు వీడుట చేఁ జీకాకు పడిన పెన్నెఱులు చిక్కువడిన హారములు కన్నీటం గరఁగినకాటుకలు వడకుచున్న యవయవములు గలిగి వివర్ణమై మనోజ్ఞతను బాసిన యామెదేహమును చూచి పరిచారకులు చెలికత్తియలు దేవి యింక జీవింప దని తమలో దాము చెప్పుకొనిరి. అంతలో మాధవసేనుఁడు నిగమశర్మ సమేతుఁడయి యంతిపురికి వచ్చి పల్లకి వచ్చినదని మణివర్మతోఁ జెప్పి దానివెంట వచ్చినవందల కొలఁది పురజనుల కోటగుమ్మమువద్ద నిలిపి రానీయవద్దని దండపాణి నచ్చట నుండ నియమించి మెల్లగ పల్లకిలోనికిం దెప్పించె.

పల్లకిఁ జూచినతోడనే నర్మద దేవి యేమిసాహసము చేసికొనునో యని భయపడి యామె యంతికంబున నుండె. పల్లకి దింపి బోయ లవ్వలికిఁ జనుటయు నర్మద తలుపులు రెండుతీసి రెండుతునియలయిన రాజదేహముం గనుంగొని హా! యని గుండె మోఁదుకొని "దేవీ! ఇదిగో మహారాజుగారు. చంపినదురాత్ముఁడు తలద్రెవ్వనేసినాఁడు. కాడయూఁడిన తామరపువ్వట్లు నేలఁ గూలినచంద్రబింబమట్లు తల వేఱయి యుండున్నయది"యని యామెం గౌఁగిలించుకొని హేమచంద్రుని కళేబరముం జూపెను. చూపుటయు నయ్యరవింద రక్తసిక్తమయి ధూళిధూసరితమయి భయంకరమయి యున్నమగని మొగమునుచూచి మేనం జేతులునైచి హా హృదయేశ్వరా! యని వాని నక్షస్థలముపై మూర్ఛిల్లెను. మాధవసేనుఁడు రెండవప్రక్క

పల్లకి తలుపులం దెఱచి బాలకుల నావంకకుం గొనిపోయి తండ్రిం జూపెను. విక్రమసేనుఁడు జనకునిం జూచుచు మాధవసేనునియొడిలోనుండెను గాని హర్షవర్ధనుఁడు తన్ను నిగమశర్మ ప్రముఖు లెంత పట్టుకొన్న నాఁదుగక తండ్రిమీఁద నేపడి యేడ్వఁ జొచ్చె. అంతలో నరవింద వెండియుం దెలివి దెచ్చుకొని యుత్తెఱఁగున విలపింపఁజొచ్చె

"హా హృదయేశ్వరా! హా జగదేకవీర! హా రసికాగ్రగణ్య హా కాశ్మీరరాజవంశజలధిచంద్రమా! హా నాభాగ్యరాశీ! నే నరవిందను. మీపరిచర్యనిమిత్తమై వచ్చితి. ప్రాణేశ్వరా! కనువిచ్చిచూడవేమి వీఁడె హర్షవర్ధనుఁడు మీగారపుకొడుకు. మీనిమిత్తమైవావిడిచి యేడ్చుచున్నవాఁడు. వానినెప్పటియట్ల నెత్తుకొని బిగ్గగౌఁగిలింపవేమి? ఏడువవలదని వానిని వారింపవేమి? వాఁడు విక్రమసేనుఁడు నీతొలిచూలిపట్టి. వానినైనం దేరచూడవేమి? అల్లవారే మంత్రులు వారితో రాచకార్యంబులు యోచింపవేమి? ఇది ప్రాతఃకాలము మంగళతూర్యధ్వనులు వైతాళికులపాటలు వినఁదగినసమయమున మారోదనంబులు మీకు మంగళనాదంబు లయ్యెనే. మీ కులగురువగు నిగమశర్మ దీవింపవచ్చె. లేచి నమస్కరింపకుండుట ధర్మమా? ఓసి నర్మదా! మూసికొనియున్న యీకన్నులుచూడనీయక యెప్పటియట్ల నిద్రించుచున్నట్లు తోఁచెడిని. మొగముమీఁద మృతిపొందిన జాడ తోఁచుట లేదు. మున్ను జరాసంధుని మేనిభాగములు గలియఁ జేర్చినట్లు పుణ్యాత్ము లెవ్వరైన తమప్రభావముచేత నీశిరస్సు నీదేహముతో జేర్చి బ్రదికింపరాదే! ఓ వేల్పులారా! నెలవేల్పులారా! ఈమహారాజు వేదవేదాంగవిదుఁడు. నిత్యసత్యనిరతుఁడు. ధర్మపరావతారుఁడు. మీ కవశ్యము రక్షణీయుఁడు. మీమహిమంబులం జూపి యీతనిం గావరాదే! దేవతలు మందభాగ్యుల కుపకారము సేయుదురే"

అని యిట్లు లామె విలపించుచుండ మణివర్మ కొంతతడవు తానును బిట్టువగచి పిదప మాధవసేను నన్వాలకుం బిలిచి "మహారాజున కగ్నిసంస్కారంబు సేయవలయు, ఇప్పటికి దాదాపుగ జాము ప్రొద్దెక్కినది. కాఁబట్టి చెండి యను నేనుఁగుపై నంబారి వేసి సముచితాలంకారములు చేయింపుము. మహారాజునకు మనము చేయఁగలిగిన కడపటియుపచారము గౌరవము నిదియేకదా" యని చెప్పి వాని నావలకుఁ బంపి లోనికిం జని హర్షవర్ధనుని తండ్రి మేనుమీఁది నుండి యావలకుఁ దిగిచి దేవి కభిముఖుఁడై "అమ్మా! చిరకాలప్రవర్ధితమైన మీ స్నేహలత తెగినది. ఎంతవగచిన, వగపున కంతముండదు. మీ రించుక యూరడిల్లి మహారాజుగారికి నేము చేయఁగల కడపటి సపర్య చేయుటకు మా కనుజ్ఞ నీయవలయు" నని గద్గదకంఠముతో విన్నవించెను. విన్నవించుటయు నరవిందమణివర్మ నుద్దేశించి "తండ్రీ దైవంబు చేసినది గాక నీచేతులార నీవు నన్ను మగని కెడబాపుదే ఐనను నన్నెవ్వ రెడబాపఁగలరు? చంద్రుని విడిచి వెన్నెల యుండదు మేఘమును విడిచి మెఱుపుండదు. సూర్యునివిడచి ఛాయయుండదు, అట్లే నేనును భర్తను విడువఁజాల. ఆచితియే నన్ను హృదయేశ్వరుని కడకుఁ గొంపోవు విమానమగును. అగ్ని దేవుఁడు సంధానకర్తయగును. సహగమనము పతివ్రతాలక్షణము సహగమనము మా కులాచారము సహగమనము చేయక చిన్నవోయిన యీ మేడలుమిద్దెలు నంతిపురములు తల్పములు చూచి నేను సహింపఁగలనే? మహారాజు తిరిగిన చోట్లు మఱువగలనా! ఏది చూచిన హృదయేశ్వరుఁడు జ్ఞప్తికి వచ్చు సహగమనంబునకు నాకనుజ్ఞ నొసంగుము." అని యొత్తి పలుకుటయు దండ్రి లేని వెలితికిం దోడు తల్లి లేని వెలితికూడ సంభవించు నని భయపడి హర్షవర్ధనుఁడు తల్లి యున్నకడకుం జని యామె కంఠము గౌఁగిలించుకొని "యమ్మా నీవును మమ్ము విడిచి పోవుదే" యని

రోదనము చేసెను. అది విని జాలినొంది నర్మద మణివర్మ మాధవ సేనుఁడు నిగమశర్మ తక్కిన పరిచారకులు చుట్టుం జేరి బిడ్డల మొగము చూచియైన నట్టి మహాసాహసము చేయవలదని దేవిని వేడుకొనిరి. అతిప్రయత్నమున నెట్టకేల కామె తన సాహసకృత్యమును మాను కొనియె. మణివర్మ రాజకళేబరము నటనుండి తోడ్కొనిపోవయత్నించు చుండ నదియెఱింగి దేవి చివాలున లేచి భర్తయున్న పల్లకికిమూఁడు సారులు ప్రదక్షిణము చేసి పాదముల స్పృశియించి కన్నుల నద్దుకొని "సర్వేశ్వరా! కోటిజన్మములకయిన నాకు హేమచంద్రుని భర్తగాఁ జేయుము" అని చేతులెత్తి నమస్కరించి యేనుఁగు సిద్ధముగ నున్న దని మాధవసేనుఁడు మణివర్మతో మెల్లగఁ జెప్పుచుండ విని యో మహారాజా యని నేల మూర్ఛిల్లెను.

---

## ఇరువదియొనిమిదవ ప్రకరణము.

"ఇదియే మంచిసమయము. ఈ దేవి మూర్ఛనుండి లేచె నేని మహారాజుకళేబరము నిటనుండి యావలకుఁ గొనిపోవుట మిక్కిలి కష్టము. కావున నీమెకు దెలివి రాకమున్నె పల్లకి నవ్వలకుం గొం పోయి కళేబరము నేనుఁగుమీఁదం బెట్టించు టొప్పదే" యని మణి వర్మ మాధవసేనునితోఁ బలికెను. "అదియే యుచిత మని నేనును దలంచుచుంటి" నని మాధవసేనుఁడు ప్రత్యుత్తర మిచ్చి యేనుఁగు సిద్ధముగ నున్నదో లేదో చూచుటకై స్వయముగఁ బోయి చూచి వచ్చి మణివర్మకది విన్నవించి పల్లకి నేనుఁగుకడకుం గొనిపొమ్మని సేవకుల కాజ్ఞాపించెను. పల్లకి నెత్తుటకు బోయలువచ్చినతోడనే మణి వర్మ విక్రమసేన హర్షవర్ధనులను నర్మదవద్దకుం గొంపోయి "నర్మదా!

తల్లికిఁ దెలివివచ్చువఱకు బాలకుల జాగరూకతతోఁ జూడుము. తెలివి వచ్చినపిదప నీవిలాసముచే నెండియు దేవిని మూర్ఛిల్లఁజేయక ధైర్యము చెప్పి సాహసములపొంత బోవనీయక కాపాడు'' మని చెప్పి వారి నప్పగించెను. అంతలో బోయులు పల్లకి నెత్తుటయు బాలకులు రోదనముచేయుచు నర్మదం గౌగలించుకొని "యోసీ! బోయులు పల్లకి నెత్తుకొనిపోవు చున్నారు. మమ్ముఁగూడా నేనుఁగు వద్దకుదీసికొని పోయి యింకొకసారి నాన్నగారిని జూపవే'' యని దయనీయంబుల వేడుకొనిరి. ఈనడుమ పల్లకి యూవలకుంబోయె.

అంతట మణివర్మ మాధవసేనుని నిగమశర్మను దనకడకుం బిలిచి "మనము మహారాజుగారి కుత్తరక్రియలు చేయవలయుఁగదా! జ్యేష్ఠకుమారున కుపనయన మైనది. అతనిచేత నుత్తరక్రియలు మనము చేయింపఁ దగునా? లేదా? యని శంకించు చున్నాను. బాలుఁ డగుటచే నింతశంకింప వలసె. ఇందు మీ యభిప్రాయమే మని యడుగుటయు నిగమశర్మ మంత్రికిట్లనియె. ఉపనీతుండైన జ్యేష్ఠపుత్త్రుఁడుండ నితరు లుత్తరక్రియలు సలుపరాదు. బాలుఁడైనను దప్పదు. ఉపనయనమైనతోడనే కర్మాధికారము వానియందు సంక్రమించినది. అనవుడు మాధవసేనుఁడు వాని పలుకులు యుక్తియుక్తములనియె. మణివర్మయు వానిపలుకుల నాదరించి లోకాచారము నతిక్రమించుట పాడిఁగాదని నర్మదయొద్దనున్న విక్రమసేనుని చేయిబట్టుకొని వత్సా! తండ్రిఋణము దీర్పవలసిన సమయము వచ్చినది. లెమ్మని శోకగద్గదుఁడై, పలికి వానిని లేవఁదీసి వెంటఁ బెట్టుకొని యేనుఁగు కడకుఁ బోయెను. హర్షవర్ధనుఁడు తనయన్నను మణివర్మ కొంపోవుట జూచి తన్నుఁగూడ నవ్వలకుం దోడ్కొనిపొమ్మని కొంతసేపు నర్మదను వేఁడుకొనెను. దేవి నెంతమాత్రము విడువవల దని మణివర్మ నియోగించుటచేత నర్మద వానినివ్వలకుం గొనిపోవదయ్యె.

అంతలో నరవిందాదేవి మూర్ఛనుండి మేలుకాంచి కన్నులు దెఱచి చూచి పల్లకి యచ్చటలేమి మరల దుఃఖవివశయై "నర్మదా! ఎంతపని జేసితివే? నేను మే నెఱుంగక పడియున్నప్పుడు నాప్రాణనాథు నొరులునాకన్న బ్రాము తీసికొనకబోవుచుండ నిన్నుగానట్టునూరకుంటి వటే. ఇంత ద్రోహము చేయుటకు నీకు నే నేమి విషము పెట్టితిని? నాకును మహారాజునకును మీరు శాశ్వతవియోగము గలిగించితిరి కదా. ఏకచారవిందంబులమిసిమి మెచ్చనియా దివ్యసుందరవదనంబు జూచుభాగ్యము నాకీజన్మమధ్యమున లేదుగదా? హృదయరంజకమై మనోవ్యథల దప్పుంగజేయు ద్రాక్షామధురములగు నవ్వచనములు వినునదృష్టము నాకీజీవితమున లేదుగదా? ప్రాణప్రతిష్ఠగలిగిన బంగారు బొమ్మవంటి యాశరీరముగొను పుణ్యమింక నాకు నెన్నడు లేదుగదా? అహాహా! యెన్నడు స్వయంవరముజరిగెనో, యెన్నం డాయన చెట్టఁబట్టితినో, యెన్నఁడు కాఁపురము చేసితినో, యెన్నఁడు సుఖపడితినో, యన్నియు స్వప్నవార్తలయ్యెను. అయ్యో! ఆయనను జూచి యెంతకాలమూ యైనట్లున్నదే! ఎంతవిశాలవక్షమే, ఎంత వెడఁదకన్నులే! ఎంతసొగసు దేహమే! ఆశరీర మగ్నిపాలు చేయుదురఁటే. ఆరూపము మంటగలుపుదురఁటే! అట్టిజగన్మోహనమూర్తి నిప్పులపాలగుచుండ నెంతమంది గొరరసి నాపాఁడుమేనిమీఁద మీ కెంత సురభిమానమున్నదే! మహారాజు సుఖముల ననుభవించు నపుడు వానితోఁగలసి యవ్వారిగా సౌఖ్యంబులందేఁటుటకేకాని వాని కష్టంబుల ననుభవించుటకు నేను నోఁచుకొనినైతిని. హంసతూలికా తల్పములమీఁద నాతనిసరసను మున్ను గులుకుచుఁ బండుకొంటిని. నేఁడు చితిమీఁద వానిసరసను బండుకొనుటకు నేఁబోవనైతి. ఆమహా భాగ్యుని భుజముమీఁద నాభుజమునైచికొని యుద్యానవనములవిహ రించితినిగాని నేఁడు శ్మశానమునకుఁబోవుచున్న యాతనినసనుసరింప

నొల్లకుంటి. నేనెంత కృతఘ్నురాలనో చూచితివే! ప్రాణములెంత తియ్యనివో కదే! నాయనా! హర్షవర్ధనా! నీయన్నయేడీ! హా! తెలిసినది తెలిసినది, జనకునకు బరలోక క్రియలు నిర్వర్తించుటకు నా చిన్నియన్న యరిగెంగాఁబోలు. హా మహారాజా! నీకెంతలోఁ దిలోదకంబులపై భ్రాంతివోడమె కడుపారఁగని పెంచినకొడుకువలనన పేక్షించునుపకార మగ్నిసంస్కారమే కదా, నావిక్రమసేనునకు బండ్రెండుసంవత్సరములు దాఁటకమునుపే యున్నిపాట్లు సంభవించె" నని వెచ్చనూర్చుచుఁ బలుతెఱంగులవిలపించుచు నెడనెడ మిన్నకుండి నర్మదతో భర్తృగుణంబుల నుగ్గడించుచు హర్షవర్ధనుని జేరఁదీసి కౌఁగిలించుకొనుచు వలసినప్పుడు వగచుచు దుఃఖపరవశయై యుండెను.

అంతట నక్కడ మణివర్మ విక్రమసేనునిందోడ్కొని కోట సింహద్వారమువద్దకుంబోయి నిగమశర్మకప్పలకు నప్పగించెను. అంతయు సిద్ధమగువఱకు నిగమశర్మ రాజపుత్రుని వేఱొకచోఁ గూర్చుండఁబెట్టి దుఃఖోపశమనంబు చేయుచుండెను. సేవకులు చండియను నేనుఁగును ద్వారమువద్దనిలువఁబెట్టి యోయలంకారముసేయక మీఁద నీలిగుడ్డలుకప్పి యామీఁద శవదహనమునిమిత్తమేర్పడిన ప్రాఁతయంబారింబెట్టిరి. అప్పటికి పురవాసులు వేనవేలచ్చటఁ జేరి యుండిరి. అంబారీయమర్చినపిదప మావటీఁడు కూర్చుండుమని సన్నచేయ నేనుగువాని చెప్పినట్లుచేసెను. అప్పుడు పల్లకి నేనుఁగు సమీపమునకుఁ దెప్పించి మాధవసేనుఁడు రాజకళేబరము జాగరూకతతో నంబారిలోఁ బన్నుండఁబెట్టించి వెలలేనిపట్టుసేలువమీఁదఁ గప్పించెను. ఆవిధముగానున్న హేమచంద్రునిశరీరముంచూచి యచ్చటఁ జేరిన జనులందఱు హా! మహారాజా హా! మహారాజా!' యని గుండెలు మ్రోదుకొని బొమ్మకులితలోచనులై దురపిల్లిరి.

చిరకాలమునుండి యాదివాణమును గనిపెట్టుకొనియున్న సేవకులు వృద్ధులు, బాలురు, పురుషులు, స్త్రీలు, పెద్దపెట్టున రోదనము చేసిరి. పట్టణమునందున్న మగవారందఱు నష్టాదశవర్ణములవారు నాఁటిదినము చ్చుటనేయుండిరి. అంతయు సిద్ధమైనవెనుక నిగమశర్మ విక్రమసేనునిస్నానము చేయించి పవిత్రవస్త్రములుగట్టించి యగ్నిహోత్రము చేతికిచ్చి యేనుఁగుముందట నిలువంబెట్టెను. ముస్నఖిలపౌరజనులకు నయనాభిరామమై యుండునట్టి యాతని సుందరమూర్తి పితృకర్మ కుచితమగు వేషమునుధరించి యుండఁజూచి పౌరులలో ధైర్యసారముగలవారు సయితము శోకవిహ్వలులై వలవలయేడ్చిరి అంతయు నాయత్తమైనవెనుక నేనుఁగును నడుపుమని చెప్పుటకు నోటమాటరామి మణివర్మమావటీనికి సన్నచేసెను. మాధవసేనుఁడు మణివర్మ, దండపాణి, వజ్రపాణి, బాలుఁడగు విక్రమసేనునకు నలప్రక్కలనుండి మెల్లమెల్లగ నడునసాగిరి. శోకభారమున నడువలేక యున్న విక్రమసేనుని నిగమశర్మపట్టుకొనినడిపింపఁజొచ్చెను. ఏనుఁగవెనుక వందలకొలఁది బ్రాహ్మణులుచేరి స్వస్తిజెప్పుచు వెంటబోయిరి తక్కినపౌరులేనుఁగునకు ముందును వెనుకను నిరుప్రక్కలను హాహాకారములు సేయుచు విధినిదూఱుచు హరిశర్మం దిట్టుచు తన దురదృష్టము నెన్నుకొనుచు శవమునసుసరించిరి. పౌరాంగనలు నాఁడు పాయిలలో నిప్పైనవేసికొనక ద్వారముల యొద్దను గవాక్షముల యొద్దను మేడలున్నవారు మేడలమీఁదనుమిద్దెలున్నవారుమిద్దెల మీఁదను నిలిచి కడసారి తమ ప్రోలికదర్శనముచేసికొని యొండొరులతో "అమ్మక్కా! మున్నిమహారాజు పగవారినోడించి జయదుందుభుల మ్రోయ పట్టపుటేనుఁగునెక్కి యూరేగుచుండచూచిన మన కన్నులే యాయన శవమూరేగుచుండ చూడవలసివచ్చె. ఈ మహారాజెంత ప్రజానురంజకుఁడో యిసుకచల్లిన రాలకుండునట్లు దట్టముగనున్న

యీ జనబాహుళ్యమే చెప్పుచున్నయది. పురమందున్న స్త్రీపురుషుల యంతఃకరణములన్నియు నీమహారాజు తనయంబారీలో వేసికొని శ్మశానమునకుం బోవునట్లు తోఁచుచున్నయది. ఈజనముంజూడఁ బురమంతయు నీయనతోఁ బోవునట్లున్నది. పాపమీమణివర్మకు దినములు గడచినవికావుగదా! అయ్యయో! విక్రమసేనునిజూడవే! పున్నమచందురునివంటి చక్కనయ్యకు నెంతపాడువేసము వేయవలసి వచ్చినదే'' యని బహువిధంబులఁ దమలోఁదాము భాషింపఁ జొచ్చిరి. అంతట నమ్మహాజనము శ్మశానమును డాయుటయు నిగమశర్మమంచి గంధముతోడఁ జితిపేర్పించి రాజశరీరము నేనుఁగుమీఁదనుండి దింపించి యచ్చితిపైఁ బెట్టించెను. అప్పుడు ప్రకృతిజనులందఱుఁ గడసారి తమతేనిం చూచి చేతులుమోడ్చి నమస్కరించిరి. భూనభోంతరము మారుమ్రోయునట్లెలుగెత్తి యేడ్చిరి. విధ్యుక్తముగ నచ్చటనిర్వర్తింపవలసిన కర్మలన్నియు నిర్వర్తించిన వెనుక నిగమశర్మ రాజదేహంబుపై నారతికర్పూరంపుటచ్చులు పఱపించి నేతితోఁ జితియంతయుఁ దడిపించి పిమ్మట విక్రమసేనునిచేత నగ్నిసంస్కారంబు చేయించె. అంత పవిత్రమైన దేహము సాధారణముగాఁ దనకులభింపదని కాఁబోలు నగ్నిహోత్రుఁడు దరికొల్పుటయెతడవుగ వాని దేహము నాహుతిజేసికొని క్షణములో భస్మావశేషము చేసెను. దహనాంతరము మణివర్మ ప్రభృతులు విక్రమసేనుని వెంటఁబెట్టుకొని పౌరులు వెంటననుసరించి రానగరాభిముఖులైరి. క్రమక్రమంబునఁ బౌరులు తమయిండ్లకుం జనిరి. విక్రమసేనుండును, మణివర్మ ప్రభృతులతో నంతిపురికరిగి మనోదహనము చేత మిక్కిలిగాసిపడుచున్న తల్లిం గాంచి యామెం గౌఁగిలించికొని కొండొకసేపువగచి యమాత్యుల యూరడింపులకతమున నూరడిల్లియుండె. ఆసాయంకాలము మణివర్మ మాధవసేనుఁడు మొదలగు మంత్రులను దండపాణి మొదలగు సేనాపతులను నిగమశర్మ మొద

లగు వైదికులను రావించి వారలతో "దేశమరాజకముగ నుండఁ గూడదుకదా? కావున హేమచంద్రుని స్థానమున జ్యేష్ఠతనయుఁడగు విక్రమసేనునిం బ్రతిష్ఠించి యతఁడు యుక్తవయస్కుఁడగువఱకు మనలో నెవ్వఁడయిన నొకఁడు సంరక్షకుఁడుగ నుండవలయు" నని పలికెను. అనవుడు నందఱు విక్రమసేనుఁడే కాశ్మీర దేశాధిపతియనియు మణివర్మయే వానికి సంరక్షకుఁడుగ నుండవలయు ననియు నైకకంఠ్యముగఁ బలికిరి. ద్వాదశరాత్రంబులు గడపి సముచితంబుగ నుత్తరక్రియలు జరపి విక్రమసేనుఁడు పైతృకఋణమునుండి విముక్తుఁడయినపిదప మంత్రులు వానికి బట్టాభిషేకముచేసి విక్రమసేనుఁడు కాశ్మీర దేశాధిపతియని యెల్లచోటులఁ జాటంబంచిరి. హేమచంద్రుఁడు దాల్చిన కిరీటంబు మాత్రమే ధరియింపక విక్రమసేనుఁడు వానిరూపమును సద్గుణంబులును ధరించుటచేఁ బ్రకృతిజనులు హేమచంద్రుఁడే బాలుఁడై తమ్ము బరిపాలింప వచ్చెనని తలంచిరి; కాని క్రొత్తఱేఁడుగ నెంచక యతఁడైన దీర్ఘాయుష్మంతుఁడై యుండుగాక యని దీవించు చుండిరి.

—*—

## ఇరువది తొమ్మిదవ ప్రకరణము

హేమచంద్రుని మరణవార్త కారుచిచ్చు చందంబున దేశమంతట వ్యాపించెను. ఆ మహీపాలునకుఁ బగవారు లేనేలేరు. లౌకిక వ్యవహార ధర్మములచేత వానికిం గిట్టనివా రెప్పట్టున నుండినవారు సైతము గుణగ్రహణ పారీణులై హేమచంద్రుని యకాలమృతిచే మధ్యమలోకమునకుఁ దీరని వెలితి ప్రాప్తించెనని పలికి వగవ, వాని మేలుబడికి లోఁబడి వాని పాలనంబను చల్లనివెన్నెలలోఁ గొన్నినాళ్లు

సుఖించి వాని పుణ్యచరిత్రంబను నమృతంబు చెవులనెడి దోయిళ్ళతోఁ జుర్రి కన్నులకలిమి సఫలముగ వాని చక్కఁదనంబును వేమాఱుగాంచి యానందించిన ప్రకృతిజనంబులు పిడుగుంబోలిన రాజుమరణవార్త విని తొలుదొల్త నమ్మక యొండొరుల నడిగికొని తగినదృష్టాంతముల మీఁద నాకఠోరవార్త విశ్వసించి తమతమపనులు ముట్టక యన్నము దినక నీరు ద్రావక నిదురవోవక మరపిల్లిరని చెప్పిన సందతిశయోక్తి యొక్కింతయు నుండదు. కొందఱు ప్రకృతిజనంబులు ఱేని మరణవార్త నమ్మక దానియాథార్థ్యముం గనుఁగొనఁదలఁచి బత్తెములు కట్టుకొని శ్రీనగరంబునకుంబోయి నిజస్థితి నెఱింగిరనుట కవిచాతుర్యము కాదు. ప్రతి పల్లెయందుఁ బ్రతి పట్టణమందు జనులు ఱేని దుర్మరణము విని శోకించి దశరాత్రంబులు మైలపట్టి విక్రమసేనుఁడు చేసిన తెఱంగునఁ దమ యోపినకొలఁది యుత్తరక్రియలు చేసిరనుట సత్యమునకు దవ్వుగాదు. కొందఱు తండ్రిఁబోయిన బాలురకరణి వగచిరి. కొందరు తల్లి లేని పిల్లల తెఱఁగునఁ దల్లడిల్లిరి. కొందరు కాశ్మీరదేశము వాసయోగ్యము కాదని పరదేశములకుం బోయిరి. వేయేల ? దేశమంతట శోకదేవత విహరించిన ట్లుండెను. సిరియు సౌఖ్యము హేమచంద్రునితోడనే పోయినట్లు కానబడెను. మగని మరణానంతర మరవిందాదేవి నవవైధవ్యదుఃఖభారముచే గ్రుంగి మానసంబునఁ బతిచరణారవిందములె నిలిపి ధ్యానించుచుఁ జెలికత్తెలతోనైన సరిగ ముచ్చటింపక మణివర్మతోనైన మాటాడక మందిర మరణ్యముగ నాహారము విసంబుగ దినంబులు గడపఁజొచ్చెను. విక్రమసేనుఁడు బాలుఁడయ్యు మణివర్మయు మాధవసేనుఁడు చూపినత్రోవను బోవుచు బంధుజనంబునకును బ్రకృతిజనంబునకును నిష్టుఁడై మెలంగుచుండెను.

అట మాళవేంద్రుఁ డగు సుదర్శనుఁ డొకనాఁడు మంత్రులు సామంతులు మిత్రులు పరిజనంబులు పరివేష్టింప నిండుకొలువు దీర్చి

యుండ నొక బ్రాహ్మణుఁడు సింధునదీతీరవాసుఁడు పుణ్యక్షేత్రములు సేవింప దక్షిణాపథంబునకుఁ బోవుచు మార్గమధ్యమున నుజ్జయినిలో నున్న మహాకాళేశ్వరుని సేవింపవచ్చి యద్దేవు నారాధించి యనేక మహాపండితులచేత నలంకృతమైన రాజసభ యెటులుండునో చూడ నభిలషించి కొలువుకూటమున కరుదెంచెను. సుదర్శనుఁ డాబ్రాహ్మణునిజూచి సగౌరవంబుగ రావించి యుచితాసనంబున గూర్చుండఁబెట్టి వానినామము స్వదేశనామము రాకకుం గారణము నడిగి తెలిసికొని యుత్తరదేశమండలి విశేషంబులు చెప్పుమని యడిగెను. ఆభూసురుఁడు "వేగులవాండ్రనియెడు విశాలనేత్రములతో నెల్లదేశములయందలి వృత్తాంతములఁ జూచుమీకు నేను గొత్తవార్తలు విన్నవింపఁ గలనే? ఐనను మీకు నేనొక్కవార్త నెఱిఁగించెద. అదిమీరు వినినదై యుండవచ్చును. మీకంతఱకుఁ బ్రాఁతదై యుండవచ్చును. నామట్టు కది మిక్కిలిక్రొత్తదై మనస్సున దహించుచున్నది. ఆవార్త యిది. కాశ్మీరదేశాధీశ్వరుం డగు హేమచంద్రమహారాజు రమారమి రెండు మాసములక్రిందట దారుణమరణము నొందెను. అతని తమ్ముఁడు చిత్రభానుఁడు వానికిఁ దొలుదొల్త కొండొకద్రోహము గావించి సోదరునిచే నింటనుండి వెడలనడువంబడి యీయక్కసు మనసులోఁ బెట్టుకొని సోదరుం గడతేర్చినాఁ డని లోకులు చెప్పుకొనుచున్నారు. ఇంతకన్నఁ జెప్పవలసిన వార్తలెవ్వియు లే"వని పలికెను. బ్రాహ్మణునినోట నుండి వెడలిన యీయక్షరములు సభాసదుల వీనులకుఁ జురుకు చురుకునఁ నాటెను. "హా మిత్రమా" యని సుదర్శనుఁడు గద్దెకుం జేరంబడి కన్నీరు విడిచెను. దేవసింహుఁడు మొదలగుపండితులు కటకటా! యని చెవులు మూసికొనిరి. మంత్రులు సీ! వాఁడు దనుజుఁడుగాని యనుజుఁడు కాఁడనిరి. తక్కినసభాసదులు విస్మితులై

"హా! యెంతపని పుట్టె"నని విచారింపఁదొడఁగిరి. వృద్ధులగు బంధు జనంబులు సుదర్శన మహారాజును మెల్లగ నూరడింపఁ జొచ్చిరి. అట్లు కొండొక తడవు విచారించి సుదర్శనుఁడు తన యుత్తరీయపు కొంగునఁ గన్నీరు తుడుచుకొని సభాసదుల నుద్దేశించి యిట్లనియె.

"సభాసదులారా! నామిత్రుఁడు జగద్రంగమునఁ దనవంతు నాటక మాడి నిష్క్రమించినాఁడు. అతనిచరిత్రలోఁ గడపటియంకము ముగిసినది. మహానటుఁడను మహాకారుఁడను, మహాపాఠుఁడనైన నేను వెనుకంబడియున్నవాఁడ. కాశికానగరమున నేనును హేమచంద్రుఁడును విద్యాభ్యాసము చేసితిమి. నామిత్రుని నేఁ గొనియాడఁ గూడదు కాని యతనిపాండిత్యమును జూడఁ బదినాల్గువిద్యలురక్తమాంసములతో గూడిన శరీరమును దాల్చి భూలోకమునకు వచ్చెనేమో యని తోఁచును. సముద్రమునకైన మేర యుండవచ్చునుగాని వాని మంచితనమునకు మేర లేదు. మర్త్యలోకమున నేకపత్నీవ్రతస్థుఁ డెవ్వఁ డన్న హేమచంద్రునే చెప్పవలయు, రాజకులమున సత్యవ్రతుం డెవ్వఁడన్న హేమచంద్రునే యెన్నవలయు. విలు విద్దియయందుఁ బరశురాముని ద్రోణాచార్యుని గలపించు నేర్పరి యెవ్వఁ డన్న హేమచంద్రునే పేర్కొనవలయు. పలుమాట లేల? సద్గుణంబులముద్ద యెవ్వఁడనిన హేమచంద్రుని పేరెత్తవలయు. అహాహా! ఎంతవాఁడు మృతినొందెను. ఓమృత్యువా! నీకు మంచిచెడ్డలు లేవు గదే. ఎంతెంతవానినైన నీవొక్క నిమేషంబునఁ గబళింతువు కదా! అవును. మనుష్యుడు చెడిపోయిన పదార్థములను భక్షింపక మంచివస్తువులనే తినునట్లు నీవును దురాత్ములపొంతఁబోక మంచివారినే మ్రింగుచుందువు. ఓప్రపంచమా! అంత వాఁ డస్తమించినను నీవెప్పటి యట్లుంటివి గదా! ఓమిత్రమా! హేమచంద్రా! ప్రియమిత్రుఁడగు నన్ను

బాసిపోవ నీమన సెట్టులొప్పెనయ్యా! మనయిరువుర నెయ్యమును స్థిరముగా నిలుపుటకు నీతో వియ్య మందవలయునని యున్నది. కాని మామకరందున కిచ్చి పెండ్లిచేయుటకు నీకాడుపిల్లలు లేరు గదా యని పలుమారు విచారించితిని. ఆయనురాగం బెందుబోయె! అక్కచెల్లెండ్రుగఁ గాశ్మీరమాళవదేశంబులుండు నని భావించితి. అక్కకుఁ వైధవ్యము ప్రాప్తింపఁ జెలియ లేమి యుత్సాహంబు గలిగి పెంపొందఁగలదు? మిత్రరత్నమా! నీవు పోననాకుం గుడిభుజంబు పడిపోయె. ఈశరీరంబుతో నేనింక నిన్నుఁజూడఁ జాలను కదా!'' యని క్రమ్మర బాష్పపూరితలోచనుఁడయి వగవఁ జొచ్చెను.

క్రొత్తబ్రాహ్మణుఁడు, సత్యమిహిరుఁడు మొదలగు నాస్థాన పండితులు రాజుం బెక్కువిధముల సమాశ్వాసించి మరణంబు ప్రకృతి యనియు శరీరంబు లస్థిరంబు లనియుఁ జెప్పి పూర్వగ్రంథములనుండి యనేకోదాహరణంబులఁ జూపిరి. సుదర్శనునకు దుఃఖముపశమిల్లిన పిదప క్రొత్తబ్రాహ్మణుఁడు సెలవు గైకొని చనియెను. రాజును మన స్థిమితము లేక నాఁటికి కొలువు చాలించి యంతిపురి కరిగెను. కుసుమకోమలి యను కర్పూరమంజరి హేమచంద్రుని మరణవార్త విని యెట్టి సాహసము చేసికొని యేమగునో యని నెమ్మనంబునఁ దద్దయు భయంపడుచు మకరందుఁడు తండ్రి చెలికాని చావునకు మిక్కిలి వగచెను.

అట విదర్భానగరంబున నొక్కనాఁడు సాయంకాలము రాజవాహనమహారాజు తనపూవుఁదోటలో విహారము చేసిచేసి యలసి యొకతిన్నెపైఁ గూర్చుండెను. నలుప్రక్కల నలువురు సేవకులు చేతులుజోడించుకొని ఱేనియాజ్ఞలఁ బ్రతీక్షించుచు నిలిచి యుండిరి. అప్పు

డె సూర్యాస్తమయ మగుటచేఁ బూఁదోఁటయెల్ల. గనుచీఁకటిగనుం
డెను. రాజవాహనుఁడు తిన్నియమీఁద వెనుకకుఁ జేరఁబడి కూర్చుం
డిగారాబుకూఁతు రగునిందుమణియు, ముద్దులమనుమఁ డగువిజయ
సేనుఁడు మనుమరాలగు కర్పూరమంజరి యనదలయి తనయింటనుండు
టయు నల్లునివార్తఁ లించుకేనియుఁ దెలియకపోవుటయుఁ దలంచి
వారలు సుఖంచునుపాయ మేది యని విచారించుచుండెను. అంతలో
నొక భటుఁడు కడువేగంబున నచ్చోటికి వచ్చి సేవకు నొక్కని
బిలిచి ''యల్లునివద్దనుండి భటుఁడు వచ్చినాఁ డని మహారాజుగారితో
విన్నవింపు'' మని చెప్పెను. వల్లెయని యాసేవకుఁడు వానిరాక విన
యమున రాజవాహనున కెఱిఁగించె. అల్లునితావునుండి భటుఁడువచ్చె
నని వినినతోడనే విదర్భరాజు చివాలున లేచి కూర్చుండి 'యేఁడి
భటుఁడేఁడి' యని భటునివంకఁ జూచి ''యోరీ! మాచిత్రభానుఁడు
కుశలియై యున్నాఁడా?'' యని మిక్కిలి యాత్రముతో నడిగెను.

''స్వామీ! మీయల్లునకుఁ గుశలమే. ఆయన మూఁడుదిన
ములలో విదర్భకురానై యున్నారు. ప్రస్తుతము గొప్పదుఃఖములో
నుండుటచే మనస్స్థిమితము లేక పరితపించుచున్నవారని యాబంటు
ప్రత్యుత్తర మిచ్చెను. రాజవాహనుఁ డావచనము లాలకించి యదిరి
పడి మఱింత యాత్రముతో ''గొప్పదుఃఖములో నున్నాఁడా? ఏమి
దుఃఖము. అతఁ డిప్పు డెచ్చోట నున్నవాఁ డెచ్చోట నున్నావాఁ''
డని యడిగిన మాటరెండుసారు లడిగెను. అప్పుడా భటుఁడు విదర్భ
రాజున కిట్లనియె, ''దేవరవారిప్రశ్నముల కన్నిఁటికి నుత్తరములు
మీయల్లుఁడంపిన యీజాబునందుఁ గలవు. కావున దానిం జిత్తగింప
నవధరింపుఁ'' డని యొకచీటి వాని కిచ్చెను. అంతలో సేవకుఁడొకఁ
డుపోయి దీపము గొనితేర దానివెలుఁగున రాజవాహనుఁ డాజా
బిట్లని చదివెను.

స్వస్తిశ్రీ రాజవాహనమహారాజుగారికి మీయల్లుఁడు చిత్రభానుఁడు నమస్కరించి వ్రాయు మనవి. నాఁడు నాకుటుంబమును మీకడ నిలిపి విదర్భ విడిచి తీర్థయాత్రాపరుడనయి బహుపుణ్యనదుల స్నానము చేసి యనేక తీర్థముల సేవించి హరిచరణధ్యానము జేసికొనుచు గాలము బుచ్చుచుంటి. అట్లు తిరుగుచు, బదిదినముల క్రిందట నేను కురుక్షేత్రమునకు వచ్చితిని. అచ్చటనుండ మాయన్నగారు హేమచంద్రమహారాజుగారు దారుణముగ మృతినొంది రని ఘోర వార్త వింటి. అది మొదలు నాకుం జిత్తస్థిమితము లేదు. మీదర్శనము చేసినంగాని యపారమైన యీమనఃపరితాపము శాంత మొందదు. కావున మూఁడునాలుగుదినములలోఁ మీపాదసందర్శనము చేయువాఁడను. ఇందుమణికి విజయసేనునకు ముఖ్యముగఁ గర్పూరమంజరికి మాయన్న వార్తలు మెల్లమెల్లగ నెఱిగింపవలయు. ఈలేఖ తెచ్చిన వాఁడు నాప్రియసేవకుఁడు పింగళుఁడు, నేవచ్చునఱకు విదర్భాపురమున నుండువాఁడు.

ఇట్లు విన్నవించు మీవిధేయుఁడు,

చిత్రభానుఁడు.

ఆలేఖం జదువుకొని విదర్భరాజు శ్రద్ధయు జాలినొంచి "హరి హరీ! పాపము హేమచంద్రుఁడు దారుణముగ మృతినొందెనా? కట కటా! రాజులకు దిన దినము గండమేకదా! పురాకృత కర్మఫలం మనుభవింపక యెవరికి తప్పును? ఓయీ పింగళుఁడా! చిత్రభానుఁడు వచ్చునఱకు నీవిటనే యుండుము" అని రాజవాహనుఁడు పూదోఁట విడిచి యభ్యంతరమందిరంబునకుఁ జని పుత్రిక యగు నిందుమణిని బిలిచి యాలేఖ యామెకుఁ జదివి వినుపించి కర్పూరమంజరి కావార్త గడు నేర్పుతో నెఱింగింపవలయు నని చెప్పెను. ఇందుమణి కర్ణకఠోర

మగు నావార్తవిని వికలచిత్తయై నిలుచుటకు శక్తిలేక కూర్చుండి హేమచంద్రునిగూర్చి తద్దయు వగచి కర్పూరమంజరి కావార్త యీ రాత్రి యెఱిఁగింపవలదని పరిచారకులతోఁ జెప్పెను, చిత్రభానుని పుత్రుఁడగు విజయసేనుఁడు రాజవాహనుఁడు జాబు చదువుకొనుచుండ దాపుననుండి వినసేవకులలో నొకనివలనఁ బెదతండ్రి మరణవార్తవిని ఖిన్నుడై చిన్నవోయి యుద్యానవనములో మల్లికాచంద్రికలతోఁ గలసి కూర్చుండిన కర్పూరమంజరివద్దకుఁ బరుగుపరుగునఁ బోయి "అక్కయ్యా! పెదనాయనగారి నెవ్వరో చంపినారఁట! విన్నావా" యని యడిగెను. అడుగుటయుఁ గర్పూరమంజరి "ఏమీ ఏమీ! పెదనాయనగారు మృతినొందినారా! అయ్యో! అయ్యో!" యని కసుగందిన పూలదండచందంబున విలాసముతప్పి మల్లికయొడిలోఁ బడి మూర్ఛిల్లెను అది చూచి చంద్రిక తత్తరపడి దాపుననున్న దిగుడుబావియొద్దకుఁ బఱుగెత్తి దోసెడు చన్నీళ్ళు దెచ్చి బాలిక మొగమునం గొట్టి "యమ్మా! యూరడిల్లు యూరడిల్లు" మని యొక యరటియాకుతో విసరనారంభించెను. అంతలో విజయసేనుఁడు తనయవస్థ జూచి భయము ద్విగుణముకాఁగా విసవిసం బఱుగెత్తి తల్లికడకుఁ బోయి కన్నీళ్ళతో సోదరీవృత్తాంతము దెలిపెను. ఆదేవియుఁ దనకుమార్తెకుఁ బెదతండ్రిపైఁ గల ప్రేమాతిశయ మెఱిఁగినది గావున బిడ్డ యేమగునోయని దిగులుపడి యచ్చోటు తనకుఁ జూపుమని విజయసేనుని వెంటబెట్టుకొని బయలుదేరెను.

అంతలోఁ దెలివి వచ్చుటయుఁ గర్పూరమంజరి దుఃఖపరవశయై చెలిమికత్తెలతో నిట్లనుచుఁ జెప్పి విలపించెను. "సఖులారా! ఎంతటిరా జస్తమించెనే! నామీఁద పంచప్రాణములు నిలుపువాఁడు కద; నన్ను నేల నడుపనియ్యలేముకదా? కనుటయే మాయయ్య

వాతయ్యెఁ గాని నన్ను పెంచిన దాయనయేకదా! మేము శ్రీనగరము బాసి వచ్చినపుడు నన్ను తనవద్ద నుంచుకొని యతఁడు మాయయ్య నెంత బ్రతిమలాడెనే! కాని మాయయ్య పరాభవము నొందిన వాఁడు గావున దాని కియ్యకొనఁడయ్యె. ఎన్నఁదలంచిన రఘురామున కైన వంకలు గలవు. హరిశ్చంద్రున కయినఁ గొఱఁతలు కలవు. ధర్మరాజునకైనఁ దప్పులుకలవు. కాని మా పెదతండ్రి కేవంక లేకొఱఁతలే తప్పులు లేవు. చంద్రమామకుఁ జల్లదనంబు నైజగుణం బైనట్లు మంచితనంబు నా పెదతండ్రికి నైజగుణంబు, పుష్పంబులకుఁ గోమలత్వంబు నైజగుణం బైనట్లు దయామయత్వంబు నా పెదతండ్రికి నైజలక్షణంబు, కారుమబ్బుల కయాచితముగ జలదానంబు సేయుట యెట్లు స్వభావంబో నా పెదతండ్రికిఁ గూడ దానగుణం బట్టి స్వభావంబు. ఆలోకైక పూజ్యుని వధించుట కెవనికి చేతులాడెనో! ఏ దురాత్ముఁడు మహాపాతకంబున కొడిగట్టి శాశ్వత నరకకూపమునం బడ సాహసించెనో! అతనిఁ గాసి బ్రదుకుటకన్న వానికడ కేగుటొప్పదే. బ్రదికినన్నాళ్ళు రాజకులమున కెంతవన్నె దెచ్చెనే! బంధుమిత్రుల నెల్లఁ గాపాడెనే! ప్రజల నెల్లు పాలించెనే! మా దయదృష్టమున మాయయ్యకు నతనికి రవరవలు పొడమెను గాని లోకుల కెల్ల నతఁడు మంచివాఁడె; ఈదుఃఖమునకుం దోడు నామనంబునం దొక భయము పుట్టుచున్నది. ప్రాఁతపగలచేత నీయకార్యమును మా తండ్రియే చేసినాఁడని లోకు లెట్టు లందురో యని నామనంబు శంకించుచున్నది, అట్టినింద మహాజనకునకు రాకపోవుఁగాక! నన్ను జేరదీసి యెత్తుకొనిన నా తండ్రిహస్తములు సోదరరక్తమున మలినములు గావని నే దలంచెద." అని మఱి యేదో యనబోవుచుండ నిందుమతి విజయసేనునితో నచ్చోటికిపోయి కొన్ని యడుగులదూరమున నుండియే "చంద్రికా! బిడ్డకుఁ దెలివి వచ్చినదా" యని

యడిగెను. వచ్చిన దని ! ప్రత్యుత్తర మిచ్చునంతలోన యాదేవి కూఁతురకడకుం బోయి కూర్చుండి బిడ్డా! స్మృతి వచ్చినదాయని యడిగి చేయి పట్టుకొనెను. బాలిక బదులు పలుకలేక కన్నీరు సోనలై ప్రవహింప వెక్కి వెక్కి యేడ్చె. ఇందుమణియు విజయసేనుఁడు కర్పూరమంజరితోఁ గలిసి హేమచంద్రుని కొఱకు కన్నీళ్ళు విడిచిరి. అనంతరము రాజవాహనుఁడు మనుమరాలు మూర్ఛిత యైన దనియుఁ దనకూఁతురు కూఁతుం జూడ నుద్యానవనమున కరిగిన దనియుఁ విని యాతోఁపునకుఁ దాను స్వయముగఁ బోయి విలపించుచున్న యాసడతులను విజయసేనుని మృదువచనంబుల నూరడించి యంతిపురమునకు గొనిపోయెను.

---

## ముప్పదియవ ప్రకరణము

వెనుకటి వృత్తాంతము జరిగిన నాలవనాఁడుదయమునఁ గరటకుఁడు విదర్భాపురమునకుఁ బోయి మునుముందుఁ బింగళుని గాంచి యనంతరము రాజవాహనుని సందర్శించి నాఁటిసాయంకాలము చిత్రభానుఁడు పురప్రవేశము జేయు నని విన్నవించెను. విన్నవించుటయు విదర్భరాజు దుఃఖితుఁడైన యల్లు నెదుర్కొని తోడితెచ్చుటకుఁ దన కుమారుని మంత్రులలో నొకనిని నియోగించి వారితోఁ గొంత పరివారము నడువం బనిచి యావార్త నిందుమణికి విజయసేనునకుఁ గర్పూరమంజరికి వీనులవిందుగ ముందుగఁ దెలియజేసి జామాతరాక కెదురుచూచు చుండెను. పంపఁబడిన పరివారము దారి జూపుటకుఁ గరటకపింగళుల ముందిడుకొని రెండుక్రోసుల మేర చని యచ్చట విడిసి మధ్యాహ్నము చిత్రభానునిం గాంచి మామగారి పంపున వచ్చినట్లు తెలిపెను. చిత్రభానుండు మఱఁదితో జాలసేపు ముచ్చటింపక

మంత్రితోఁ బలుమాటలాడక పరిజనంబును బలుకరింపక చిన్నవోయి ధూళిధూసరమైన మేనితో బందుగులు తెచ్చిన పల్లకి నెక్కెను. ఆసమయమున నాతనితో నొక బ్రాహ్మణుఁడు పదుగురు సేవకులుఁ గూడ నుండిరి. విదర్భరాజు కుమారుఁడు మంత్రియు బ్రాహ్మణుని గుర్తుపట్టి పలుకరించి రొక యందలము నెక్కించిరి. ఆపరివారము సాయంకాల మగునప్పటికి పట్టణము జేరెను. రాజవాహనుఁడు మేడ దిగివచ్చి యల్లుని సన్మానించుటకు సోపానములమీఁద నిలిచి యుండెను. చిత్రభానుఁడు పల్లకి దిగి మామకడకుం బోవ నావృద్ధరాజు వానిం గౌఁగిటఁ జేర్చి "వత్సా! నీసోదరమరణంబు నాసోదరమరణంబు వలెనున్నది. చుట్టములు కానివారికైన మనోదాహముసేయువానిమరణము కేవలము సోదరుఁడ వగు నిన్ను బరితపింపజేయుట యాశ్చర్యమా? అయిన నీశ్వరాజ్ఞ దాఁట నలవికాదుగదా" యని యాశ్వాసించెను. చిత్రభానుఁడు దుఃఖముచేత మాటలాడనోపక తలవంచి కన్నీరువిడుచుచు నిలువఁబడెను. మామ యల్లుని కన్నీరు తన యుత్తరీయపుటంచునఁ దుడిచి యిందుమణి మొదలగువారిని జూడ వానిని మేడమీఁదికిఁ గొనిపోయెను.

అక్కడ కుమారుఁడు గుమార్తెయు నిరుప్రక్కలనుండ నిందుమణి యొకచో నిలిచి యింటిపట్టుఁగక చాలకాలము పరదేశములఁ దిరిగి వేళకన్నపానాదు లరసి యిడువారు లేక కడుడస్సి యానెలఁతకుఁ దోడగు భ్రాతృమరణముచేతం గడుచిక్కి శల్యమైయున్న మగనిం జూచి బాష్పోద్గమముచేత మితిలేని తన మనస్తాపము నెఱింగించెను. కర్పూరమంజరియు విజయసేనుఁడును దండ్రి నాలింగనము జేసికొని విలపించిరి. చిత్రభానుఁడు వారికన్నీరుఁదుడిచి యాలుబిడ్డలతో నిట్లనియె. "సోదరవియోగమున నేనిపుడు దుఃఖపరవశుఁడనై యున్నాడను. వీరు కూడ మిక్కిలి యడలదారకొనినచో నేను బ్రతుక

జాలను. మీరు బెంగగొందు రనుభయమున నేను దుఃఖమంతయు దిగమ్రింగి ధైర్యము చిక్కబట్టి పైకి గంభీరభావము దాల్చి నాలోనే దిగ్రుల్లు చున్నాఁడను, ఇంక మీరు హేమచంద్రుని గూర్చి నా యెదుట విలపింప వలదు'' అని వారినంతఃపురికి వీడుకొలిపి తన్ను పరామర్శింప వచ్చినబంధుజనులను బలుకరించి తనతోవచ్చిన బ్రాహ్మణుని దోడి తెమ్మని సేవకుల కానతిచ్చెను. ''చిత్త'' మని వారరిగి యా విప్రుందోడితెచ్చిరి. చిత్రభానుఁడు వానినిసగౌరవముగఁ బిలిచి తనప్రక్కం గూర్చుండబెట్టుకొని విదర్భరాజువంకఁ దిరిగి ''మామా! మీ కీ విప్రపుంగవుం జూచిన జ్ఞాపక మున్నదా? ఈయన పేరు రుద్రభట్టు. మాళవేంద్రుని మంత్రియగు కేసరితో నీమహాత్ముఁడుమున్నొకసారి యిటకు వచ్చి మీ చేత సత్కారములం బడసి మీ కుపకారము జేసినాఁ డనునెపమున సుదర్శనునిచే నవమానితుఁడై సర్వస్వము గోల్పోయి యిపుడు దారపుత్రుల నెడబాసి యిడుముల బడుచున్నవాఁడు. నాయదృష్టవశమున నాకీమహాత్ముని సందర్శనము దొరకినది. చూచుకొన్నది మొదలు మా కొండొరులపై ననురాగమతిశయిల్లినది. మహాదుఃఖసాగరమును నేనీమహాత్ముఁ డను తెప్పచే నీఁదితిని. ఈయన సాంగత్యము లేనిచో నేనెంతకాలము క్రిందటనో మృతినొంది యుందును.'' అనవుడు రాజవాహనుఁడు తేఱి చూచి ''ఔనౌను. నే నీయనను జూచినట్లు జ్ఞప్తికి వచ్చినది. సజ్జనుఁడగుటచే నీకకారణబంధు వయ్యె'' నని బదులు చెప్పెను. ప్రియమిత్రుఁడుతన్ను బలుతెఱంగులఁ గొనియాడుచు విదర్భరాజున కెఱిఁగింప దా నూరకుండుట భావ్యము కాదని రుద్రభట్టు రాజవాహనునితో నిట్లనియె.

''మహారాజా! మీదర్శనము నాఁటికినేఁడు క్రమ్మఱ లభించె, నిమ్ము వీడ్కొనిపోయిన పిదపనాయవస్థయంతయు మాఱినది. కీడులో

మే లన్నట్లు మాళవరాజుమైత్రి పోయినను హిమంతునియల్లుని బోలు మీ యల్లునిమైత్రి నాకు లభించినది. మీ యల్లుడు లోకముతోడి పాటి మనుష్యుఁడుగాఁడు. ఆయన నెట్టయెదుట నుంచుకొని నేనుగొని యాడరాదు గాని యాతనిం బోలుగుణవంతుఁడుండు టరిది. మీ యదృష్టమున మీయింటియల్లుఁడయ్యె. అతని గుణసంపద నెన్నుట కొక్కయుదాహరణ చాలును. వేయుమాట లక్కఱలేదు. అన్న యతిక్రూరుఁడై కొండెములు విని నెనరొకింతయులేక దారపుత్రసమేత ముగఁ దన్నింటనుండి వెడలనడచినను వాని దుర్మరణము విని యీ తఁడు పడుపరితాప మింతింతగాదు. మనసులో దీర్ఘక్రోధము పెట్టు కొని సోదరమరణమునకు మహానందము నొందవలసిన యవస్థలో నుం డియు నింతగా దురపిల్లునతఁ డొక్కఁడే కానఁబడు చున్నవాఁడు. నా మాటలు మీరు నమ్ముదురో నమ్మరో కాని మీయల్లుఁ డొకనాఁటి రేయి సోదరమరణదుఃఖముచేతఁ బరవశుఁడై నేఁ బండుకొనఁగాఁ జూచి యాత్మహత్య జేసికొనఁబోయెను. ఈతనిసాహసము నే నెఱిఁగిన వాఁడనే కావున నేనేళ కేమి తెగువ చేయునో యని పండుకొనియుఁ మేలుకొని యుండి సమయము గుర్తెఱిఁగి యాదారుణకర్మను మాన్పితిని.'' అని తెలుప రాజవాహనుఁడు మిక్కిలి సంతోషము జెంది రుద్రభట్టుహస్తములం బట్టుకొని ''దేవా! మీరు నాపుత్రికకుఁ బతిబిక్షమును బెట్టిరి. మీఋణమును దీర్పఁజాల'' నని కృతజ్ఞతను దెలుపు వాక్యములఁ బలుకుచుండఁ జిత్రభానుఁడు వారిమాటల కడ్డమువోయి 'అయ్యా! వెనుకటివృత్తాంతమును దలపెట్టకుఁడు. ప్రస్తుతము కర్తవ్యమేమో నా కుపదేశింపుఁడు శ్రీనగరమునకుఁ బోయి తండ్రిలేక దురపిల్లు నాయన్నబిడ్డల నొకసారి కన్నులారం జూచి వారి నొకసారి బిగియారఁ గౌఁగిలించికొని యేడ్చినం గాని నాయుల్లమట తీరదు. అన్న నాకనిష్టుఁ డయ్యె గాని పసికూన లగ్గు

వన్నబిడ్డలేమిచేసిరి? అదియునుంగాక మావిక్రమసేనుఁడు క్రొత్త వాఁడు బాలుఁడు రాజ్యము గొప్పది. మంత్రులు దుర్మార్గులు. బాల రాజును బొమ్మపగిది నాడించి వారు రాజ్యమును దురవస్థకు దెచ్చి బిడ్డలప్రాణముల కపాయము గావింతు రనిభయపడుచున్నాను. నేఁ బోయి వారి కిష్టమగు నేని సంరక్షకుఁడనై యుక్తవయసు వచ్చిన పిదప వారిరాజ్యము వారికప్పగించి మరల వత్తు ఇష్టము లేదేని చూచి యూరక వత్తు. ఎంతపగయున్నను దండ్రిపోయినపుడు వారిని చూడక యుండుట భావ్యము కాదు. ప్రేగుసంబంధ మగుటచే నాకనురాగము పోవకున్నది. ఇందుకు మీరేమి చెప్పెద" రని యడుగ రాజవాహ నుఁడును గక్కినవారును వానిబుద్ధినే మెచ్చి యట్లు చేయు మని యుపదేశించిరి. బంధుజనంబు తన యభీష్టమున కనుగుణముగా నుప దేశము చేయుటయుఁ జిత్రభానుఁడు సంతసించి మూఁడుదినంబులు విదర్భాపురంబున నుండి ప్రాఁతనెచ్చెలులఁ జుట్టములగూడ సుఖంబున బ్రొద్దులు పుచ్చి నాలవనాఁడు కాశ్మీరమునకుఁ బయనమయ్యెను. అల్లుఁడు తగుపరివారముతోఁ బోవకున్న నపాయము వాటిల్లు నని రాజవాహనుఁడు తనబలములో మెఱియలవంటి మున్నూరుగురు బంట్లనేరి యుగ్రసేనుఁ డనుసార్థకనామధేయుఁ డగు సేనాపతిని వారికి నాయకునిగ నేర్పఱచి జామాత వెంటఁ బొమ్మని యానతిచ్చెను. రుద్ర భట్టు, కరటకుఁడు, పింగళుఁడు, ధీరుఁడగు నుగ్రసేనుఁడు వెంటరాఁజి త్రభానుఁడువిదగ్భనగరమువిడిచి శ్రీనగరమునకుఁబయనమైపోయెను.

---

## ముప్పదియొకటవ ప్రకరణము

అది గ్రీష్మకాలము. సమయము ప్రాతఃకాలము. అస్తమించి నాఁడస్తమించినాఁడని లోకు లందఱు చెప్పుకొన్నట్లు తేజోవిహీనుఁ

డై నిరాలంబుఁడై దుఃఖమహాసముద్రమున మునిగి యేకొండలనడు మనో తిరిగితిరిగి భాను డెల్లవారు "వీని చరిత్రము చిత్రమైనది. ఇతఁడు నిశ్చయముగఁ జిత్రభానుఁ" డని తలపఁ దెల్ల తెర జిమ్ముకొని వచ్చునటుఁడువోలె మంచుగవిసెనఁ గెమల్చుకొని యుదయించె. ఉదయించిన తోడనే వాని తేజము నలుదెసల వ్యాప్తమయ్యె. వ్యాప్తమగుటయు నతఁడు క్రమక్రమంబున నధికుఁడై చుట్టు ప్రక్కలదేశమంతయు నాక్రమించి పర్వతములకు వృక్షములకు జిత్రవర్ణముఁ గలిగించి చిత్రభానుశబ్దము సార్థకము చేసికొనియె. ఆతనికాప్తులై పరమ భక్తులైన జనులు శరీరములనిండ రక్తచందనములుపూసికొని విధివిధానముగఁ బూజలు నమస్కారములుచేసి మంత్రముచేతను బద్యగద్యములచేతను స్తుతియించి తమ మనోరథసిద్ధి జేయుమని ప్రార్థించిరి దుర్నిరీక్ష్యమై దుస్సహమైన వాని తేజమున కోడి కన్నెత్తి వాని జూడ లేక సుకుమారు లగుస్త్రీపురుషులు మందిరంబునడంగియు లతాగృహంబులం డాఁగియు స్వశరీర సంరక్షణము జేసికొని "కటకటా! బంగారము వంటి చంద్రుఁ డస్తమించుటయు నస్తమించినాఁ డనుకొన్న యీ చండశాసనుఁడు మరలఁ దలసూపుటయు మనదోసంబుగాని వేఱొకటికాదు. ఇంతకుగాలవశమున వచ్చు నాపదలకు మన మేమిచేయఁ గల" మని ఖేదపడఁజొచ్చిరి. వేదపురాణకథలలోఁ జెప్పబడిన సూర్యవర్ణనము నెఱింగినవిద్వాంసులు వారికియథావిధిగ నర్ఘ్యప్రదాన మొసంగి క్షణక్షణము చిత్రమై గానుపించువాని బింబమును తెప్ప వాల్పక చూచి "ఆహాహా! చిత్రభానునిమహిమ నేమని కొనియాడఁగలము? ఈతనిరథమునకుఁ జక్ర మొకటియేకదా! ఆ యరదము నీడ్చునవి పలురంగులు గలగుఱ్ఱము లేడు. ఆయశ్వములం గట్టుపగ్గములు త్రాచుబాములు పోవునట్టిదారి చూత మన్న నిరాధారమైన యాకాశము. ఆరథముం దోలువాడు తొడలు లేనివాఁడు.

పోవలసిన దూర మపారము. ఉపకరణములఁబట్టి చూడ వానిసాయ
మున నీమహాత్ముఁడు ప్రతిదినము గగనమండల మతిక్రమించుటకు
వీలు లేదు. కావున నీతనియందుఁ గలయద్భుత తేజమే యీతండు
చేయుపనికి సాధనమయ్యెను. నిరాధారు లైనవారుసయితముసహజ
ముగఁ దేజోవంతములైన పక్షమునఁ బేరునకుమాత్రము కొన్నియుప
కరణముల స్వీకరించి విజయము నొందుదురుగదా'' యని భావమునం
దలపోయఁజొచ్చిరి.

అట్టిసమయమున మణివర్మ యుదయకాలకృత్యములం దీర్చి
కొని తన మేడమీఁద నొకపీఠముపైఁ గూర్చుండి యేదో యోచిం
చుచుండ గవాక్షపు సందులనుండి చిత్రవర్ణములు గలభానుని కిరణ
ములు మొగమునకుం గన్నులకుం దాకి యించుక వేదన గలిగించె.
కిటికీ తలుపులు మూయుమని సేవకుని బిలిచి యానతిచ్చెను. ఆపరి
చారకుఁడు తలుపులు మూసి యజమానునియెదుట నిలిచి 'దేవా!
పేరుగ్రసేనుఁడఁట! కాపురము విదర్భాపురమఁట! వచ్చినది మీ
దర్శనార్థ మఁట సెలవగు నేని వానిం దోడి తెచ్చెద'' నని వినయము
తో విన్నవించెను. ''ఏమీ! కాపురము విదర్భాపురమా! పేరుగ్ర
సేనుఁడా! నానిమిత్తము వచ్చెనా! సరె తోడ్కొనిర''మ్మని యాతఁ
డానతిచ్చెను. చిత్తమని సేవకుఁడు బోయి యాగ్రొత్తపురుషునిం
దోడ్కొని తెచ్చె నల్లనై పొడవై దృఢమై యున్న యాపురుషుని
శరీరముదీర్ఘబాహువులును పెద్దఫాలమును వెడఁదరొమ్మును జూచినతో
డనే మణివర్మ యెదురువోయి వానిందోడి తెచ్చియొకపీఠమునఁ గూ
ర్చుండఁబెట్టిగౌరవించి కొండొకతడ వూరకుండిమెల్లగనిట్లనియె. ''విద
ర్భనాథుఁ డగు రాజవాహన మహారాజుగారికొలువరు లగుమీకుస్వా
గతము. నాకడకుమీరు వచ్చినకారణ మేమి? ఆనృపాలుఁడు పంపె

నో మీరు స్వయముగ వచ్చితిరో తెలియఁగోరుచున్నాఁడ''నని యడిగెను. అడుగుటయు నుగ్రసేనుఁడు వాని కిట్లనియె. ''మంత్రిశిఖామణీ! విదర్భరాజు నన్ను దూతగాఁ బంపలేదు. రాజవాహన మహారాజు యల్లుఁడు చిత్రభానుఁడు సోదరవియోగమునకుఁ జాలఖిన్నుఁడై యన్నబిడ్డలను మిమ్మును జూచిపోవ వచ్చినాఁడు. ఆయనతోఁగూడ విదర్భరాజు నన్ను బంపినాఁడు. చిత్రభాను. డీనగరము వెలిగుడారములలో సపరివారముగ నున్నవాఁడు. పురము ప్రవేశించి సోదరపుత్రులం జూడ నభిలషించుచున్నవాఁడు. అప్పటికిని మీ యనుజ్ఞ వేఁడు మని నన్ను బంపినాఁడు. ఇదె నావచ్చినపని.''

అనవుడు మణివర్మ ''ఏమీ! చిత్రభానుఁడు జీవించియున్నాఁడా? హారిద్వారమువద్ద నతఁడు మృతినొందెనని హేమచంద్రమహారజుగారు జీవించియున్నపుడె మేమందఱ మొక్కవార్త వింటి'' మని యాశ్చర్యముతో నడిగెను. అప్పలుకులువిని యుగ్రసేనుఁడువచ్చియు రానిచిఱునవ్వు మొగమునఁ దోఁప ''నమితలోకానుభవముగల మీకు నేను జెప్పవలయునా? అన్నదమ్ములకువరవలు పొడముటచే న దేసందుగఁ జేసికొని రాజున కామాటలు మనఃప్రీతికరములనుకొని కిట్టనివారట్లు చెప్పియుందురు. అంతేకాని చిత్రభానుఁడు మృతినొందలేదు, మృతినొందిన సోదరునిమిత్త మతఁ డొందు చింతయింతింత యని చెప్పనలవికాదు. అన్నకుమారులను వదినెను దక్కిన చుట్టములను జూచిపోవ నతఁడు వచ్చినాఁడు. అన్నదమ్ములకుఁ గల ప్రాతపగలు మీరు తలంపవద్దు. ఉత్తములకు విరోధము స్థిరముగా నుండదు. అదియును గాక చిత్రభానునిమాటయే కఠోరముగాని మనసు మృదువు, కావున వాని రాకకు మీరు సమ్మతింపవలయునని వేఁడుచున్నాఁడ''నని పలికి యతఁడేమి యుత్తరము చెప్పునో విను

టకు వానివంకఁ గన్నులు నిగిడ్చి చూడఁదొడఁగెను. మణివర్మ యప్పలుకులు సమగ్రముగ నాలకించి తలయూఁచి కొంతతడ వాలోచనచేసి యిట్లని వచియించె. "ఉగ్రసేనుఁడా! మా రాజకుటుంబమునకుఁ జిత్రభానునకు గల పరస్పరసంబంధ మెట్టిదియో నీవెఱుఁగుదువు చిత్రభానుని రాకయు వానిపోలికయుఁ దక్కిన మంత్రులకు సేనాపతులకుఁ జిన్నరాజునకుఁ రాజమాతకుఁ దెలిపి మేమందఱము గలిసి విచారించి తేపుదయమున మీకుత్తరము బంపువాడ. నేనొక్కడనే మాటచెప్పుటకు వలనుపడదు తేపటివఱకు నగరము వెలుపలనె చిత్రభాను నుండుమనుము" అనుడు వల్లెయని యుగ్రసేనుఁడు లేచి వానికడ సెలవుగైకొని తన నివాసమునకుఁ బోయెను.

ఉగ్రసేనుఁడు గుమ్మము దాఁటిపోయినది మొదలు మణివర్మ మనసు మనసులో నుండదయ్యె. ఒక పరియాయము పీఠముమీఁద నుండి చివాలున లేచినిలుచును. నిలిచి నిలిచి యిట్టట్టు దిరుగును. తిరిగితిరిగి మరల పీఠమునఁ గూర్చుండును. కూర్చుండి పలు తెఱంగుల యోచింపుచుండును. "ఈదురాత్ముని మరల నగరములో నడుగు పెట్టనీయ వచ్చునా" యని యొకసారి తలంచును. "రానీయునిచో నతఁడు దండువిడిసి మనకెగ్గుసేయఁడా" యని యొకమాఱూహించును. ఎన్నివిధముల విచారించినను వాని కేయుపాయంబును బాలుపోవమి యావిషయమే తరచితరచి మరలమరలఁ జింతించి యెట్టకేల కీక్రింది విధమునఁ గృతనిశ్చయుఁడయ్యెను. ఏమయినం గానిమ్ము. చిత్రభానుండు నిశ్చయముగ హేమచంద్రునిం జంపిన మహాపాతకుఁడు. కావున నామాట చెల్లునేని వాఁడు శ్రీనగరము మరల బ్రవేశింపక పోవునట్లు చేసెద. అట్లు కృతనిశ్చయుఁడైనపిదప స్నానముచేసి భోజనముగావించి యానాఁడు పెందలకడ రాజనగరునకుంబోవ సమకట్టి

యరద మెక్కి సత్వరము యచ్చోటికిం బోయెను. పోయి ప్రధాన పురుషు లగు దండపాణి వజ్రపాణి మాధవసేన ప్రముఖులును నిగమశర్మలను తక్కిన రాజబంధువులను బిలిపించి వారిం గలియఁగట్టుకొని బాలరాజగు విక్రమసేనుని సన్నిధికిఁ జనియెను. విక్రమసేనుఁడు వారలనందఱ సగౌరవముగ నాదరించి యుచితాసనములఁ గూర్చుండ నియమించి యందఱి నొక్కసారి రావించిన మహాకార్య మేమని యడిగెను. అందఱు మణివర్మవంకఁ జూచిరి. రాజకుమారునిదృష్టియుఁ బ్రత్యుత్తరము నిమిత్తము మణివర్మమీఁదనే పడెను. అంతట మణివర్మ తనపీఠము నించుకముందఱకు జరపుకొని మరల నందఱ నుద్దేశించి యిట్లనుచుఁ బలుకఁదొడంగెను. "రాజేంద్రా! మిక్కిలి యవసరమగు నొకవిషయమును జర్చింపదలచి వీరలనందఱ మీసమ్ముఖంబునకు రావించితి. మిత్రులారా! ఈ విషయము పరమగోప్యమైనది. అందఱము కుమారరాజుగారి మేలు గోరువారమె కావున నిచ్చట జరిగెడు చర్చ లీమందిరము దాఁటి యావల వ్యాపింపఁగూడదు. నా చెప్పబోవునంశము మీరు చక్కగ విచారించి మీమీ యభిప్రాయముల మర్మము లేక వెల్లడిచేయుఁడు. చిత్రభానుఁడు మృతినొందెనని మున్ను మనము వింటిమి కదా. అతఁడు జీవించియున్నాఁడట! సోదరమరణమునకు మిక్కిలి శోకించుచున్నవాఁడట! అన్నబిడ్డలను వదినెను జుట్టములను దానొకసారి చూచి పోవలయునని వచ్చినాఁడట! ఊరుబైట గుడారములలో నున్నాఁడట! పురప్రవేశమునకు మన యనుమతి వేఁడుచున్నవాఁడట! వానితో వచ్చిన విదర్భరాజు సేనాపతియగు నుగ్రసేనుఁ డనువాఁడు వాని పంపున వచ్చి వానిమనోరథము నా కెఱిఁగించె. కావున వాని పూర్వచరిత్రము జ్ఞప్తికిఁ దెచ్చుకొని మన ప్రస్తుతస్థితి నెంచుకొని మీరుం దోఁచిన పోలిక హితము నుపదేశింపుఁడు.

చిత్రభానుఁడు సజీవుఁడై యున్నవాఁడని వినినతోడనే దండపాణి మొగము తెలివొందెను. వజ్రపాణి మనసు హెచ్చరికతో నుండెను. ఈ యుభయుల ముఖ మనోవికాసములను మణివర్మ తక్కతక్కినవారు గ్రహింపలేరైరి. "అయ్యో! మరల వచ్చినాఁడా" యని నిగమశర్మ గుండె కొట్టుకొనెను. అతఁడు మనలం జూచి పోయినంత మాత్రమున మనకేమి నష్టముండు" నని విక్రమసేనుఁడు మణివర్మతో ననియె. 'చూడవలసిన దేమో యిదివఱకే చూచినాఁడు. అన్నగారి మరణము చూడలేదా? ఇంకను జూచుట కేమున్నది' అని మాధవసేనుఁడు పలికెను. అప్పుడు నిగమశర్మ మరల నేదియో యనఁబోవుచుండ నంతలో దండపాణి యందుకొని 'అనుమాన బలముచే దోషారోపణము చేయుటయె కాని చిత్రభాను దౌష్ట్యముఁ బ్రత్యక్షముగఁ జూచినవారు లేరు. సోదర వియోగమున మిక్కిలి పొగిలిపొగిలి ప్రేమాతిశయమున సోదరపుత్రులఁ జూడఁదలఁచిన చిత్రభానుని రానీయక పోవుట మనకు న్యాయముకాదు. సోదర వియోగమున వానిమన సెంత కుందుచున్నదో యతని హృదయ మెంత దుఃఖాగ్నిని మండుచున్నదో యెవ్వ రెఱుంగుదురు? కావున వానిని రానియ్యవచ్చునని నా యభిప్రాయమని పలికెను. వజ్రపాణియు దనయన్నయగు దండపాణి మార్గము ననుసరించి చిత్రభానునిరాక కనుమతించెను. నిగమశర్మ "మీకందఱకు నేది యిష్టమో నాకు నదియే యిష్ట" మని చెప్పెను. ఎవ్వ రేమనుకొన్నను సరే చిత్రభానుఁడు మున్ను దాఁటిపోయిన కోటగుమ్మము మరల దాఁటి లోనికి రాఁగూడదు. ఇదియే నా యభిప్రాయ" మని మాధవసేనుఁడు పలికెను. 'మాయమ్మగారి మనసేతెఱగున నుండెనో తెలిసికొనుట యుచిత" మని విక్రమసేనుఁడు పలికెను. అంతట మణివర్మ యుత్సాహావశమున బీఠముననుండి లేచి తన ముసలిమేను గంపింపఁ గోపముతో నిట్లనియెను. "దండపాణీ!

చిత్రభానుని దౌష్ట్యము ప్రత్యక్షముగఁ జూచినవారు లేరంటివిగదా! అతని నిటకు రావించితిమా దుండగములు ప్రత్యక్షముగఁ జూడఁ గలము. మీరే మనుకొన్నను సరే; హేమచంద్రుని గడతేర్చిన మహాపాతకుఁ డతఁడే యని నాయభిప్రాయము. సోదరునిగూర్చి యతఁడు పొక్కుచున్న వాఁడా? కటికివానికి జాలియుండు నేని, వజ్రమునకు మెత్తదన ముండు నేని, వేమునకుం దియ్యదన ముండు నేని వానివద్ద సుగుణముండును. వానిని గృహప్రవేశము చేయించుట మమ్ము స్వర్గపుర ప్రవేశము చేయించుటయే; వానిని రానిచ్చుట మృత్యుదేవతను రానిచ్చుట; వానిని నమ్ముట పెద్దపులినోటఁ దలనిడుట; వానిని మన కడఁ బెట్టుకొనుట, పామును మెడఁజుట్టుకొనుట. దుష్టునకు దూరముగ నుండవలయు ననుమాట నిజముగుటంజేసి మనము వానిని పరిత్యజింపవలయును. నరకివేయఁబడిన కొమ్మను మరలఁ బెట్టిన కెన్నఁడయిన నదుక వచ్చునా? అట్లె కుటుంబమునుండి విడిపోయిన వానిని మరలఁ గలుపుకొనుట యసంభవము. కావున జాలినొందక, మోమోటపడక, భీతి జెందక చిత్రభానునిరాక నిరాకరింపుఁడు.

"మహారాజుగారు సెలవిచ్చినట్లు తల్లిగారిమతము తెలిసికొనుట కర్తవ్యము కావున నోసంగమశర్మా! పురోహితులగుమీరు రాజమాత సన్నిధికిం జని యద్దేవికి నాపలుకులు దాసశాస్త్రిప్రముఖుల వచనములు సరిగ విన్నవించి యామె యిష్టము ననుసరించి కార్యనిశ్చయము జేయుఁడు. ఆమె మఱందిరాక కనుమతించినచో మీరు పోయి తేపుదయమునఁ జిత్రభానుని దోడ్కొనిరండు. అనుమతింపదేని మేమందఱ మనుమతింప లేదని వానితోఁ జెప్పిరండు. ఇదియే నా చేయవలసిన హితోపదేశ" మని పలికి కూర్చుండెను. అంతట సాయంకాలమయ్యెను. విక్రమసేనుఁడు సంధ్యాకాలకృత్యములు దీర్చుట కభ్యం

తర మందిరమునకుం బోవఁ దలఁచి పీఠమునుండి లేచి "మీయందఱి పలుకులు వేరు వేరుగ నాయమ్మకు విన్నపించి యామె యిష్టముం బట్టి కార్య నిశ్చయముం జేసెదను. మీరింక గృహముల కరుఁగుఁ" డని సెలవిచ్చి యంతిపురికిం జనియె.

—*—

## ముప్పది రెండవ ప్రకరణము.

మరునాఁడు చిత్రభానుఁడు రేపకడ మేలుకాంచి భానుఁడు పొడుపుగొండమీఁద నుదయించకముందె ప్రాతఃకాలకృత్యంబులు నేఱవేర్చుకొని గుడారంబునం గూర్చుండి తన రాకం గూర్చి మణివర్మ ప్రముఖులెట్లు నిర్ణయించిరో తెలియక యనేకవిధంబుల మనంబునఁ దలపోయుచుండ నంతలో నుగ్రసేనుఁడును గాలకృత్యంబులఁ దీర్చుకొని యాతనికడకు పోయెను. పోవుటయుఁ జిత్రభానుఁడు వానిం జూచి "యుగ్రసేనుఁడా! మన కేమాటయుం దెలియకపోవుటకుఁ గారణ మేమి? మణివర్మ యేమనియెను? ముఖలక్షణంబులబట్టి చూడ నతఁడు మనకార్యంబు దెసఁ బ్రసన్నుఁడై యుండినట్లు నీకుం దోఁచెనా? మన యెడ ద్వేషము బూనినట్లు కానబడెనా? మణివర్మ బుద్ధికుశలత యసాధారణము. ఆవులించినవారి ప్రేవులు లెక్కపెట్టును. ఇంతకు మనతలంచినపని యేమగునని నీబుద్ధికిం దోఁచుచున్నది. ఇందు నెఱవేఱితిమా" అని వాక్యము సమాప్తము చేయకముందె యుగ్రసేనుఁ డందుకొని "దేవా! మణివర్మ ముఖవైఖరి మనకు భాగ్యసూచకము కాదు. దండపాణి మొదలగువారు మాత్రము మనకనుకూలు రగుదురా? ఎట్లయిన మనకార్యము కష్టసాధ్యము కాని సులభసాధ్యము కా" దని యుత్తరమిచ్చెను. "మిత్రమా! దండపాణి నాకుఁ జిన్న

నాఁటి మిత్రుఁడు కాని మాయన్నకుం గడుఁగూర్చు. నే నొక్కరహస్యము జెప్పెద. అది నీమనస్సుననే యుండవలయు. నిన్నరేయి మీరందఱు నిద్రించినపిదప నిదురరామి నేమియుఁ దోచక నేనీగుడారమున నిట్టటు దిరుగుచుంటి. అప్పుడు గుడారముగుమ్మమువద్ద కావలియున్న పింగళకుఁడు నాకడకొక క్రొత్తమనుష్యునిం దోడ్కొని వచ్చి "దేవా! దండపాణి మీకడ కీతనిం బంపె. దేవరవారితో నీత డొకమాట మనవిచేయ సెలవు వేఁడుచున్నాఁ" డని వానిని నాయెదుటఁ బెట్టెను నేనును సంభ్రమసంతోషంబులు మల్లడిగొన నప్పురుషునిజూచి దండపాణి సేమమడిగి వచ్చినపని దెలుపుమంటి. అప్పురుషుఁడు నలువంకలు జూచి "క్రొత్తవా రెవ్వరును లేరుగద! ఈమనుష్యుఁడు మనవాఁడే కద." యని యడిగి క్రొత్తవా రెవ్వరును లేరనియుఁ బింగళకుఁడు నాపరిజనుఁడే యనియు నే బదులు చెప్పినపిదప నిట్లనియె, "దేవా! కాశ్మీరరాజసేనాపతి దండపాణి మీదర్శనము చేయఁ జాల కుతూహలపడుచున్నవాఁడు. రేపురాత్రి రెండుజాములవేళ నిక్కడకు వచ్చి మిమ్ము దర్శింపఁ గోరుచున్నాఁడు. మీఁద దేవరచిత్త"మని యూరకుండెను. అప్పలుకులు విని నేను గడుసంతుష్టుఁడనై "వానిజూడ నేనును మిక్కిలి యుబలాట మందుచున్నవాఁడ. తప్పక రేపటిరేయి రమ్మనుము. వానిరాకకే నెదురు చూచుచుండెదనని చెప్పి వాని నంపితిని. వానిరాక నేను, బింగళకుఁడు మాత్ర మెఱుఁగుదుము. దీనింబట్టి దండపాణి నాకనిష్టుఁడుగ నుండఁ డని యూహించెదను. వజ్రపాణి నే నిక్కడ నున్నపుడె మాకర్పూరమంజరిపై మనసు నిలిపియుండినవాఁడు కావున వానికి నాయెడ నధికానురాగము గలదు" అని పలికి వెండియుం గొంత పలుకఁబోవుచుండఁ బింగళకుఁడు వారిని సమీపించి "దేవా! రాజపురోహితుఁడు నిగమశర్మ మీదర్శనార్థము వచ్చియున్న వాఁ" డని విన్నవించెను. "వాని సత్వరమే ప్రవేశపెట్టు" మని చిత్రభానుఁడు సెల వొసంగుటయుఁ బింగళ

కుఁడు పోయి నిగమశర్మం బ్రవేశపెట్టి తాను బ్రహ్మణ ద్వారము కడకుం జనియెను.

ఆ బ్రాహ్మణుఁడు గుడారమునం దడుగు పెట్టినతోడనే చిత్రభానుఁడుపీఠమునుండి లేచియెదురుగాఁజని వానిపాదములకు సాష్టాంగదండప్రణామము గావించెను. నిగమశర్మ వానిభక్తికిఁ దద్దయుమెచ్చి "దీర్ఘాయురస్తు, కల్యాణమస్తు" అని దీవించి వంగి చేతులతో వానిని లేవనెత్తెను. అంతఁ జిత్రభానుఁడు వానిం దోడ్కొని యొకపీఠమునం గూర్చుండఁబెట్టి సువర్ణపాత్రముతో నిర్మలజలంబును దెప్పించి వెండి పళ్ళెరమున నాబ్రాహ్మణునియడుగు లుంచి కడిగి యయ్యుదకంబు శిరంబునం జల్లుకొని ధన్యోస్మి ధన్యోస్మి యని యిట్లుపలికెను. "మహాత్మా! మీయడుగులనీరు చల్లుకొనుటంజేసి తాపంబుతీఱె. రాఘవులకు వశిష్ఠుఁడట్లు, పాండవులకు ధౌమ్యుఁడట్లు, మీరు మాకుఁబురోహితులు. మిమ్ముఁ జూచుట మాయన్నం జూచినట్లున్నది. అరవిందాదేవికిని విక్రమసేనహర్షవర్ధనులకుంగుశలమే కదా! హేమచంద్రా! నీ వెంతలో మాకు దూరుఁడ వయితివి" అనుచుండగనే రెండుకన్నుల నుండి బాష్పములు దొరఁగుటయుఁ దల వంచికొని మాట లాడలేక యతఁ డూరకుండెను. హేమచంద్రుని దలంచి చిత్రభానుఁడు కన్నీరు పెట్టుకొనినతోడనే నిగమశర్మమనస్సునుగరుఁగ నయనములుబాష్పాకులితములయ్యెను. ఉగ్రసేనుఁడే వారిరువురను సమయోచితవచనముల నూరడించె. అప్పుడు చిత్రభానుఁ డుగ్రసేనుని పలుకులందే వెండియు నిగమశర్మ నుద్దేశించి "స్వామీ! మీరాకకుం గతంమెద్ది. మీమంత్రిగారు నావిన్నపము నేమిచేసె? అహాహా! కాలిమహాత్మ్యము! నాయన్న బిడ్డలను నేను జూచుటకు, నాస్వనగరము నేనుబ్రవేశించుటకు మణివర్మసెలవు గావలసి వచ్చెఁ గదా" యని నొచ్చుకొను

చుండ నిగమశర్మ చిత్రభానున కిట్లనియె. కుమారా! దేవియుం బాలకులుఁ గుశలముగ నున్నారు. అరవిందాదేవియు విక్రమసేనుఁడును నిరాశయు నీవచ్చినపనియు విని తేపుదయమున నిన్నంతిపురికిఁ బిలువుమని నన్ను బుత్తెంచిరి. చూచి పోవుటవలన నష్టమేమి యని విక్రమసేనుఁడు పలికె. వైరములు శాశ్వతముగఁ గాఁపుర ముండునా? అన్నబిడ్డలంజూడవలయు నని యాతనిమన స్సెంతతత్తరపడుచున్నదో! పాపము! రానిండని యరవిందాదేవి వచించె" అతఁడు పలుకఁదలఁచిన పలుకులు సమాప్తము గాకమునుపే చిత్రభానుఁడు నడుమ నడ్డము వచ్చి మీమంత్రులే మనిరని యడిగెను. అనవుడు నిగమశర్మ "యెవ్వ రేమనిన నేమి. నీవు తేపుదయమునఁ బురప్రవేశము గావింపుము. నీ కిది సమ్మతమని నే నచ్చటివారితో విన్నవింప వచ్చునా" యని పలికెను.

తనరాకకు నరవిందావిక్రమసేనులు సమ్మతించి రని వినినతోఁడ నేచిత్రభానునిమనస్సు వర్ణనాతీతమైనయానందమునొందెను. ఆతఁడాయుబ్బుపైకిఁ దోఁపకుండ మిక్కిలి యడంచుకొని "యట్లే విన్నవింపవచ్చును. కుమారవిక్రమసేనుఁడు దల్లియును నాకుఁ జాల యుపకారము చేసిరి. నన్ను మాయన్నబిడ్డలం జూడనిచ్చుట కాశ్మీరరాజ్యమున కభిషిక్తుని జేయుట. ఆఁడుది యైనను వదినె దూరమాలోచించినది. విక్రమసేనుఁడు బాలుఁ డయ్యు బుద్ధికిం బెద్దయయ్యె. తేపు ప్రాతఃకాలమునఁ దప్పక నే నటకు వచ్చెద. మీ రింక వేంచేయుఁ" డని ప్రణామము చేసెను. నిగమశర్మయుఁ జిత్రభానుని యొద్ద నుగ్రసేనునియొద్ద సెలవు గైకొని పురమునకుం జనియె.

నిగమశర్మ తనసన్నిధి బాసినది మొదలు చిత్రభానుఁడు "సూర్యాస్తమయ మెప్పుడగును? ఎప్పటికి రెండుజాములరాత్రి యగును?

ఎప్పుడు దండపాణి నన్ను గలిసికొని మాటలాడు" నని తత్తరపడుచు నన్యచింత విడిచి తదేకాసక్తుండై గడియగడియకుం బ్రొద్దుచూచుచు నిముస మొక్కయేండుగాఁ గడపఁజొచ్చెను. అట్లుండ నెట్టకేలకు సాయంకాలమయ్యె. భానుఁడు మరుఁగునకుం బోయి విశ్రమించుచుండినను జిత్రభానుఁడు విశ్రమింపక యెంతో వేగముతో భోజనముచేసి సమస్త పరిజనంబును నిద్రబుచ్చి కరటకపింగళుల గుడారముయొక్క ద్వారమున నిలిపి రుద్రభట్టుసమేతుండై దండపాణినిమిత్త మెదురుచూచుచు నొకపీఠమునం గూరుచుండె. అపుడు రెండుజాములరాత్రి యయ్యె. చిత్రభానుఁడు మాటిమాటికిఁ బీఠమునుండి లేచి గుడారమువెలుపలికిఁ బోయి "కరటకా! యతనిజాడ కనఁబడుటలేదా? పింగళకా! పదియడుగులు పోయి చూచి రమ్ము. రాఁడా యేమి?" యనిపలు తెఱంగుల భాషించుచు సేవకుల నడుగుచుఁ జిత్తస్థిమితము లేక తిరుగులాడుచుండెను. ఒకసారి రుద్రభట్టుం బిలిచి "స్వామీ! ప్రశ్నచూడుఁడు. మనకోపున కతఁడు వచ్చునో రాఁడో చెప్పు" డని యడిగెను. అతఁడును గ్రహచారము చూచి వ్రేళ్ళు మడచి నక్షత్రములు చూచి లెక్కపెట్టి కార్యమగు నని చెప్పెను. అంతలో నొక మనుష్యుఁడు తలనిండ ముసుఁగుబెట్టుకొని చేతి దుడ్డుకఱ్ఱపూని గుడారము సమీపమునకు వచ్చెను. అసందడి కనిపెట్టి పింగళకుఁడు క్రొత్తపురుషుని జూచి "స్వామీ! మీ రెవ్వరు? లోనికి రాఁగూడదురా" యని యడిగెను. "నే నెవ్వఁడనైన నీ కేఁదుకు? నీశక్యమగు నేని నన్నుఁ జిత్రభానునికడకుం గొనిపొ" మ్మని యప్పురుషుఁడు బదులుచెప్పెను. ఆ యిరువుర సంభాషణము దూరమునుండి విని చిత్రభానుఁడు సత్వరము బయటికి వచ్చి యప్పురుషుని సమీపించి "దండపాణీ" యని మెల్లఁగఁ బిలిచి "నేనే" యని యతఁ డుత్తరము చెప్పినతోడనే వాని నచ్చటనె బిగ్గఁగవుంగిలించుకొని చేయిపట్టుకొని లోనికిం దీసికొనిపోయెను.

గుహాగారములో దీపపువెలుతురున రమారమి రెండుసంవత్సరములక్రిందట నెడబాసిన యామిత్రులిరువురు నొండొరుల మొగంబులఁ బరిశీలించి చూచి యానవాలుపట్టి తనవిదీర నింకొకసారి కౌఁగిలించుకొనిరి. అనంతరము చిత్రభానుఁడు దండపాణిని పీఠముపై గూర్చుండఁబెట్టి ''మిత్రమా! నీదేహస్పర్శచేత చిరకాలవియోగతాపముకూడ కొంతవఱకుఁ దీఱినది. ఇది కడుసుదినము. మిత్రమా! నాఁడు నిన్ను నేఁ బాసినది మొదలు నేఁటివఱకు నేఁ దిరుగనియడవులు, దూఱనిగుహాలు, పడనికష్టములు లేవు ఇఁక నాకష్టములు గట్టెక్కె ననినిర్ధైర్యము గలిగినది. నిన్ను చూచుకొని నేను సోదరవియోగమును మఱచుచున్నాఁడ'' నని ప్రీతిపూర్వకభాషణంబు లాడెను. దండపాణియు మిత్రునకుఁ దీసిపోవక యిట్లనియె ''చెలికాఁడా! నీవులేని యీరెండేండ్లు రెండుయుగములుగఁ గడపితిని. నాబొంది శ్రీనగరమునను, నాయాత్మ నీయెడను నిలిపి కాలము గడపితి. నీవు కుశలివై మరల నీవిధంబున మాకనులకు విందుసేయుదువని కలనయినఁ దలంప లేదు. మిత్రుఁడా! నిన్ను రెండు మూఁడుమాటలడుగవలయునని యభిలాష గలదు. వీఁడిట్లు సాహసించి యడుగునే యని నామీఁద గినుకఁ బూనక ప్రత్యుత్తరములు చెప్పవలయు. నీవు హరిద్వారమున మృతినొందితి వని హరిశర్మ యనునొక బ్రాహ్మణుఁడు హేమచంద్రునితో విన్నవించె. ఆమహారాజు నీనిమిత్తమశ్రుజలంబులు విడుచుచునే పరలోకంబునకుం బోయెను. నీపైనసత్యమరణవార్త లెట్టుపుట్టె? మహారాజుమరణమునకు నీవే కారణుఁడవనియు హరిశర్మప్రేరణంబున నీవో, నీపనిచినహంతకులో మహారాజుం గడతేర్చి రనియు లోకులు చెప్పుకొనుచున్నారు. ఇం దేమైన సత్యము

కలదా? మిత్రుఁడను నాకడ నెద్దియు దాఁచక హృదయపేటిక దెఱచియున్న దున్నట్లు పలుకుము. నేను నీవాఁడనె కాని యన్యుఁడ గాను. మిత్రులహృదయములు రహస్యరత్నములు దాఁచందగిన యినుపపెట్టెలుకదా !''

అనవుడు చిత్రభానుఁడు వచ్చియురాని నవ్వొకింత నవ్వి, ప్రియసఖా! అడిగితివి గానఁ జెప్పెదవినుము. ''నేను హరిద్వారము వద్ద మృతినొందితినని ప్రవాదము పుట్టించినవాఁడు మణివర్మ. మా యన్నగారి మనస్సు గలఁచి యా ధర్మస్వరూపుని జంపినవాఁడు మణివర్మ. మాయన్నతోఁ జెప్పరాని కొండెములు చెప్పి నన్ని వీటి నుండి వెడలనడచినవాఁడు మణివర్మ. మా కులవృక్షనిర్మూలనము జేయు పురుగు మణివర్మ. మాకుఁ బ్రక్కలోఁ బాము మణివర్మ. వానినినమ్మి మాయన్న మరణముఁదెచ్చుకొనియె. నావది నెయే నా సోదరునితో నామీఁద బలుకొండెములుచెప్పి నాకింతపాటు గలిగిం చినదని నే నిన్నినాళ్ళుఁ దలంచుచుంటిగాని యరసిచూడ మణివర్మయే దీనికిం బ్రధానకారణమని యిప్పు డెఱింగితిని.''

''నిన్ను దేశమునుండి వెడలనడచి మహారాజును జంపించిన మణివర్మ కేమిలాభ''మని దండపాణి వానిసంభాషణము నడుమ నాపి యడిగెను. అడుగుటయుఁ జిత్రభానుఁడు ''దండపాణీ! లోకవ్యవహార విదుఁడవగు నీకిది తెలియకపోయెనా ? రాజుంజంపించినచో రాజ కుమారులు బాలురు గావున వారిపేరుపెట్టి తానే కాశ్మీరరాజ్య మంతయు నేలవచ్చు. నేనిక్కడనే యుండినపక్షమున రాజుం జంపించి నను వానికి లాభముండదుకదా? విక్రమసేనుఁడు పెద్దవాఁడయి రాజ్యభారము పూనినవానిందని చేతికీలుబొమ్మవలె నాడింపవచ్చు.

మంత్రులు రాజులయెడలఁ జేయుచుండగను లెన్నియోకలవు, రాజ
కుటుంబమును నాశనముచేసి కాశ్మీరసింహాసన మెక్కవలయునని
మణివర్మ మనసార దలపోయుచున్నట్లు నేనిచటనున్నపుడె వినియుంటి.
పలుమాఱులు నేనీమాట మాయన్న కెఱిగింపఁదలచితిగాని మాకిరువు
రకు మనస్పర్థలుండుటచే నది నాపన్నుగడగా నెంచునే కాని యతఁడు
సత్యముగా గ్రహింపఁడని యూరకుంటి. మణివర్మయు హరిశర్మయుఁ
దోడిదొంగలు. ఆశర్మ వర్మలిరువురుంగలిసి యీ దుష్కర్మ మొన
ర్చిరి" అనుచుండ దండపాణి మరల వానిమాట కడ్డమువచ్చి
"మిత్రుఁడా! హరిశర్మ మణివర్మ ప్రేరణంబుననే యీ ఘోర
కృత్యము చేసియుండునేని హరిశర్మకు నియ్యం దిష్టముండదుకదా!
అతఁడు నిన్నుంగూర్చి యెంతయు విచారించె. నీయందు పక్షము
పూని నీకు సాయము చేయుమని నన్నుం బురికొల్పె. నీయాత్మచేత
నతఁడు మాటలాడించె. మణివర్మ కాపుఁడైనవాఁడు నీయెడ నిట్లు
మైత్రిజూపుటకుఁ గారణమేమి" యని యడిగెను. అతనిహృదయమున
గాటముగ నాటిన యీ సందేహం దీర్పఁ జిత్రభానుఁ డిట్లనియె.
"ఓయి వెఱ్ఱివాఁడా! నేను బ్రదికియుండగాఁ జచ్చితినని బొంకి నా
యాత్మచేత మాటలాడించెదనని డంబములు కొట్టినవాఁడు దొంగ
గాక మునియగునే! నాయోపాయములు పన్ని నిన్న త్తెఱంగున
మోసపుచ్చె. వాఁడు నాయెడ ననురాగము జూపుటయు మణివర్మ
పన్నిన పన్నుగడయే. నీవును నేనును బాల్యస్నేహితుల మగుటచే
నామీఁద నీ కెంత యనురాగమున్నదో పరీక్షించుటకు మణివర్మ
హరిశర్మచేత నట్టి పలుకులు పలికించి యుండవచ్చు. వాని పలుకు
లకు మోసపోయి నీవు నాపైఁగల యనురాగముం బ్రకటించితివి
కాఁబోలు. మామంత్రి నీమీఁద నొకకన్ను వేసియే యుండును,"

అద్భుతమగు నా వృత్తాంతము నాకర్ణించి దండపాణి మొట్టమొదట నది నమ్మజాలక వెనుక తనయెదుట జరిగినవిషయముల జ్ఞప్తికిఁ దెచ్చుకొని చిత్రభానునిమాటలను వానితోఁబోల్చి చూచుకొని తుట్టకేలకు దనమిత్రునిమాటలే తన కెక్కుడు విశ్వాసము గలిగింపఁ గొండొకసేపటి కిట్లనియె. "చెలికాడా! ఇంతకాలము నేను హేమచంద్రుని నీవ కడతేర్చితివని దురభిప్రాయము పడియుంటి. ఇప్పు డది నామనంబుననుండి తొలంగె. నీవు చెప్పినది నిజము. మణివర్మ నన్ను సరిగా నమ్ముటలేదు. నామీఁద వాని కేదో యనుమాన మున్నది. నేను నీవాఁడను. నిన్నటి సభలో రాజు నెదుట మణివర్మ నిన్ను చేసిన నింద లిన్ని యన్ని యని చెప్పఁ జాలము. అధికార గర్వముచేత వాఁడు మిక్కిలి విఱ్ఱవీఁగుచున్నాఁడు. మన మిరువురముం గలిసి వానిగర్వ మడంపవలయు. నేను నీవిచ్చట నుండునట్లు జాగ్రత్తపెట్టెద" నని యూరకుండుటయు నంతవఱ కేమియు బలుకక మౌనముద్ర వహించిన రుద్రభట్టు లేచి "మీస్నేహబంధ మంత కంతకు దృఢ మగుగాక! మీ యిరువుర మనోరథములు సఫల మగుఁగాక! భక్తవత్సలుఁడు పరమేశ్వరుఁడు మీకుఁ దోడ్పడుఁగాక" యని యాయిద్దఱికుడిచేతులం బట్టుకొని యొకరిచేతిలో నొకరి చేయివేయించి రహస్యములు వెలిపుచ్చకుండున ట్లొండొరులనిమిత్తము ప్రాణములయిన విడుచునట్లు వారిచేఁ బ్రమాణములు చేయించెను.

అట్లిరువురును శపథములు గైకొన్నపిదప దండపాణి చిత్రభానునివంకఁ జూచి "సఖుఁడా! నేను వచ్చినప్పటినుండి నిన్నడుగఁ దలఁచు చున్నాఁడను. శరీరము దాల్చిన బ్రహ్మతేజ మట్లున్న యీ మహాత్ముఁ డెవ్వఁడు? పోలిచూడ హరిశర్మ మొగము, నీయన మొగము నొక్కలాగున నున్నది. మనుష్యులం బోలిన మనుష్య

ఉండకపోదురా? ఈతఁ డతఁడు గాఁడని తలంచెద. ఈయన యెవ్వరో నా కెఱింగింపవలయు" నని యడిగెను. చిత్రభానుఁడు "మిత్రుఁడా! యీతఁడు మనకుఁ బరమాప్తుఁడు బ్రాహ్మణుఁ" డని వారికి బదులు చెప్పె. అంతలో రుద్రభట్టు దండపాణిని జూచి "నాయనా! నేను హరిశర్మనుగాను. కాని నాకును హరిశర్మకును ముఖలక్షణంబుల నేల పోలిక కలదో కాలాంతరంబున మీకు నే నెఱింగించెద" నని పలికి విరమించెను. అంతట జాముకోడి కూయుటచే దండపాణి సత్వరముఁ బోవలయునని చిత్రభానుని వీడ్కొని యెప్పటియట్లు ముసుఁగు బెట్టుకొని స్వగృహమునకుఁ జనియె.

---

## ముప్పది మూఁడవ ప్రకరణము

చిత్రభానుఁడు మఱునాఁ డంతిపురమునకు వచ్చునని యరవిందాదేవి నిగమశర్మవలన విని వాని నెదుర్కొని సంభావించుటకుఁ బ్రవేశము నడపుటకు మణివర్మను రమ్మని వర్తమాన మంపెను. ఆ వర్తమానమువిని మణివర్మ తన రాణి కీక్రిందిసందేశ మంపెను. "అమ్మా! మీరు నిప్పులం జొరఁబడుమన్నఁ జొచ్చెద. ఏట దిగుమన్న దిగెద. విషము ద్రావుమన్నఁ ద్రావెద. కాని చిత్రభాను నెదుర్కొని సంభావింపఁజాల. నేను జీవించియుండఁగాఁ జిత్రభానుఁడు మరలఁ బురప్రవేశము జేసినాఁ డన్న యపకీర్తియే నాకుఁజాలు. కావున నన్ను క్షమియించి యీకార్యమునకు నొరుల నియోగింపవలయు."

ఆసందేశము విని యరవిందాదేవి సందిగ్ధమనస్కయై సత్వరము మాధవసేనుని రావించి మణివర్మ పంపిన సందేశ మెఱిగించి వెండియు నిట్లనియె. "ఆర్యా! చిత్రభానుని రాకకు నే ననుమతించుట మొగ

మాటను చేతఁగాని ప్రేమచేతఁగాదు. అది నీవు నెఱుంగుదువు మఱి వర్మకీకార్యం బింత యనిష్టముగా నుండునని నే ననుకొనలేదు. ఇప్పుడు కర్తవ్య మేమి? రావలదని చిత్రభానునకు వర్తమాన మంపుదునా? మొదట రమ్మని పిదప వద్దనుట వెనుకటి క్రోధాగ్నిని నేయి వేసి మంటచేయుట, పండుకొన్న త్రాచును లేవఁగొట్టుట కావున జేయఁదగు దాని నుపదేశింపుము." అనవుడు మాధవసేనుఁ డించుక విచారించి "తల్లీ! మొదట వానిరాక కనుమతి నియ్యనే కూడదు. ఇచ్చినపిదప వెనుఁదీయఁ గూడదు, ప్రవేశంబు నే నడిపెద. కానున్నది కాక మానదుకదా" యనిపలికి యామెచేత ననుజ్ఞాతుఁడై వాని ప్రవేశంబునకుఁ గావలసినయత్నంబు చేసి గృహంబునకుఁజనియె.

అట్లు దండపాణి గుడారము విడిచి చనునప్పటికి జాము రాత్రి మాత్రమే యుండుటచేఁ జిత్రభానుఁ డటమీఁద నిద్రవోక మిగిలిన కాలము రుద్రభట్టుతో బ్రసంగించుచుఁ గడపెను. అంతలోఁ దెల్ల వాఱుటయు నా రాజకుమారుఁడు సమయకృత్యములు నిర్వర్తించి స్నానము జేసి సంధ్యావందనము గావించి పార్థివలింగపూజ యొనర్చి రుద్రభట్టుపాదములకు నమస్కరించి దీవనలు వడసి పయన మయ్యెను. అంతలో నిగమశర్మ కోటనుండి యొక్కరథము దోలించుకొని చిత్రభానుని నెలవునకుం జని యయ్యరద మధిష్ఠించి రాజమందిరమునకు రానోపు నని యారాజకుమారుని బ్రార్థించెను. చిత్రభానుఁడు నట్లె యని తేరునెక్కి నిగమశర్మ సమేతుఁడై పురముఁ బ్రవేశించెను. ప్రవేశించుటయు బురజనంబులు వానింజూచి విస్మితులై వానిరాక యశుభసూచకమని భావించిరి. పురాంగనలుకొందఱు రథముమీఁద బోవు వారి నామధేయములు పురుషులనడిగి తెలిసికొని యసంతుష్టులై 'యమ్మక్కా! యిది యేమమ్మా; రాజకుటుంబము నిప్పు లోడిలోఁ

గట్టుకొన్నట్టు మరల నీరాజకుమారకునిఁ దెచ్చిపెట్టుకొనియె. వాని మొగములోనున్న క్రూరభావమును వెలిబుచ్చుచున్నట్లే భయంకరముగనున్నది. వానికన్నులును వాని మనోమాలిన్యమును దేటపఱచునట్లున్నయవి. కటకటా! రాజకుమారుఁ డేమికానున్నవాఁడో కదా!'' యని తనలోఁ దాను చెప్పుకొనసాగిరి. అంతఁ గొంతసేపటికి రథము కోటసమీపమునకుఁ బోవుటయు నిగమశర్మయుఁ జిత్రభానుఁడు గ్రిందికిం దిగి సింహద్వారమువైపు నడచిరి. రథావతరణంబు జేసిన యారాజకుమారుని గని యదినఱకే వానినిమిత్త మక్కడ నరవిందాదేవిశాసనంబున వేచియున్న మాధవసేనుఁడు, దండపాణి, వజ్రపాణి, వానికెదురుగావచ్చి సమ్మానించిరి. 'చిత్రభానునకు స్వాగత' మని మాధవసేనుఁడు పలికెను. యువరాజున కనంతాభ్యుదయములు కలుఁగుఁగాక యని దండపాణివచియించె. 'మీరాయాగమనము శుభారంభముగుఁగాక' యని వజ్రపాణినుడివెను. అనవుడు ''లోకైకపూజ్య యగుమా వదిన మేలుతలంపులచేత నాకు మరల మిమ్మందఱ సందర్శించు మహాభాగ్యమబ్బె'' నని చిత్రభానుఁడు పలికి వారు ముందునడువ సింహద్వారముదాఁటి లోనికిం జనియె. చని కొన్నియడుగులు నడచి తననడుచుదారి కిరుగెలంకులఁ బారఁజూచి పూర్వస్మృతిగలిగి మాధవసేనుని జూచి జాలిగ మరల నిట్లనియె ''అయ్యా! ఈకోటం జొరకమునుపు నే నెపుడు కోటలో రెక్కలు గట్టుకొని వ్రాలుదునా యని యువ్విళ్ళూరుచుంటిగని ప్రవేశించినదిమొదలు నాకడుగైన సాగుటలేదు. ఏమిచెప్పుదు నా యవస్థ! కోటగుమ్మము దాఁటినతోడనే నామనస్సునకు మాయన్న హేమచంద్రమహారాజునాఁటి జ్ఞప్తికివచ్చెను. ఈ ముంగసాలలు, నిలయములు, నియోనుంగులు, నీసైనికనివేశములు, నీపసులకొట్టములు మొదలగు సమస్తప్రదేశములు మాయన్ననే తలఁపునకుఁ దెచ్చుచున్నవి. చేరలం గొలువఁదగిన వెడఁదకన్నుల

తోడను, నిరంతరమగు చిఱునవ్వుతోడను, విశాలమగు ఫాలముల తోడను, నేనుఁగుదంతపుంబలకలవంటి చెక్కులతోడను త్రిలోక సుందరమగు నాతని ముఖమండలము, పోతబోసిన బంగారువిగ్రహము వంటి వానియాకారము నాకిప్పుడు కన్నులఁ గట్టినట్లగపడుచున్నది. ఇపు చూచినప్పుడే నా మనస్సంతి దుఃఖానలంబున మఱుగుచుండ నా యన్నబిడ్డలను, వదినెను, జూచినప్పుడు దుఃఖమును నే నెట్లు భరింపఁ జాలుదునో తెలియకున్నాఁడ.'?

అని రెండు నేత్రములనుండి జారిన బాష్పబిందువులను దన యుత్తరీయాంచలమునఁ దుడుచుకొని మాధవసేనుసమీపమునఁ జేయి వైచి మెల్లగ నడచుచుండె. మాధవసేనుఁడు వానిదుఃఖమును జూచి యది నిజమయిన మనఃపరితాప మని నమ్మక తనలో "నీ వెంతకయిన సాహసుడవురా, చేతులారి నతిఘోరములు చేయుటకుఁ గల్లబొల్లి యేడ్పు లేడ్చుటకు నీవే తగుదు" వని యనుకొని ప్రకాశముగా "మృతినొందిన వాని కొఱకు విచారించుట పగిలిపోయినకుండకొఱకు వగచుట. కావున నూరకుండు" మని సమాశ్వాసించెను. 'సోదరస్నేహ మెంతకుఁ జాల' దని దండపాణి పలికెను. దుఃఖితునిమనస్సు దుఃఖితుఁడే యెఱుఁగును. కాని పైవారి కెఱుంగ నలవి కాదు గదా యని వజ్రపాణి యూరడించెను. అట్లు సంభాషించుచు మెల్లమెల్లన నడచి యనేకకవాటంబులు దాఁటి వారు కొలువుకూటముం జేరిరి. నిగమశర్మ రథము దిగినతోడనే, చిత్రభానుని బాసి యంతఃపురమున కరిగి మఱఁది వచ్చిన వార్తనామె కెఱింగించి విక్రమసేనహర్షవర్ధనులను వెంటఁబెట్టుకొని యదివఱకే కొలువుకూటమునకు వచ్చియుండెను.

కొలువుకూటంబు జూచినతోడనే చిత్రభానునిదుఃఖవార్ధి మరియాద నతిక్రమించి పొంగిపొరల నతఁడు మాధవసేనునితో నిత్తెఱం

గున( జెప్పుకొని విలపించె. "అయ్యో! నేనెంతో మందభాగ్యు(డను, మున్ను మాయన్న విదేశమునుండి వచ్చినరాయబారులు, బ్రహ్మసమానులగు వేదవేత్తలు, శేషుని ధిక్కరించుపండితులు, తనయాస్థాన కవీంద్రులు, మంత్రులు, సామంతులు, మిత్రులు బంధుజనులుపరివేష్టించియుండ( బేరోలగంబుండగా( జూచినయాకన్నులతోడనే యీశూన్యసభాభవనంబు జూడవలసె. ఈకొలువుకూటంబు కాదె శారదాదేవికి రంగస్థలంబు, ఈసభామంటపము కాదె చతుష్షష్టివిద్యారత్నములకు గని. ఈసభామంటపము కాదె కవిజనంబులమనోరథములు పంటపండు శాలిక్షేత్రము. అయ్యో! యిది యెంతచిన్నవోయె. ఎంతశోభావిహీనమయ్యె" నని దుఃఖాతిశయముచే నడువజాలక యొక్కచో( జదికిల(బడి యొక స్తంభమునకు( జేరబడి కూర్చుండి విలపింప(జొచ్చె. దండపాణియు( వజ్రపాణియు వాని కిరుగెలంకుల( గూర్చుండి యతి(డు నేల(బడకుండ సంరక్షింప(జొచ్చిరి. నూధవసేను(డు వానిని విశేషముగా నూరడింపక "విషాదము గతజలసేతుబంధనము గదా" యని యొకటిరెండుసారు లనియె. అంతలో నిగమశర్మ రాజకుమారుల నిరువురం దోడ్కొని వచ్చి యయ్యో! వీరె నీయన్నకుమారులు విక్రమసేనహర్షవర్ధను లని వారిం జూపించెను. నిగమశర్మ యట్లనినతోడనే బాలకు లిరువురు పినతండ్రిపాదములకు నమస్కరించి నిలువంబడిరి. చిత్రభాను(డు వారిప్రణామములకు బ్రత్యుత్తరములుగ దీవనలేమియు నొస(గకయె "నాతండ్రులారా! రండు రం" డని తన రెండుచేతులతో. వారి( జెరియొక హస్తమునం బట్టుకొని చెరియొక తొడపై( గూర్చుండ( బెట్టుకొని దుఃఖపూరితమనస్కు(డై యేమియుం బలుకనోపక మొగమున గుడ్డవేసికొని కొండొకసేపు బిట్టుగ దుఃఖించెను. అదివఱకు తమతండ్రిమాట క్రమక్రమంబుగ మఱచుచుండిన యాబాలకులు పినతండ్రి దుఃఖము

చేతఁ బితృవియోగము జ్ఞప్తికిం దెచ్చికొని వలవల యేడ్చిరి. అంతట మాధవసేనుఁడు నిగమశర్మ వారిం డాసి యిద్దఱుఁ జెరియొకరిమీఁదఁ జేతులు వేసి వగవవలదని కొన్నిమాటలఁ జెప్పి యూరడించిరి. చిత్రభానుఁ డంతలో దండపాణివజ్రపాణులసమాశ్వాసవచనములం దేరి యించుకధైర్యముఁ దెచ్చుకొని బిడ్డలం గౌఁగిలించుకొని యిట్లు విచారించెను. నాచిన్ని యన్నలారా! మీ రెంత మందభాగ్యులయిరో నేను నంతియ మందభాగ్యుఁడను. తండ్రి లేక మీరు, తండ్రివంటి యగ్రసోదరుఁడు లేక నేను, యావజ్జీవము విలపించునట్లు బ్రహ్మ మనలలాటమున వ్రాసి యుండె. అంతటి సోదరుండు నావంటిమందభాగ్యునకుఁ దక్కునా? నాదుఃఖము పరమాత్ముఁ డెఱుఁగును. నే నెఱుంగుదును. నన్నాతడు ప్రమాదవశమున మనపురము వెడల నడచినను నాకు విషాదము లేదు. ఏలయన నే నెక్కడనున్నను నాకు గొడుగులాగున మాయన్న యుండెఁగదా యని ధైర్యముతో బ్రదుకుచుంటి. ఇంక నాకు దిక్కెవ్వరు? నన్ను మాయన్న యవ్వలకుం ద్రోలెనని నాకుఁ గోపము లేదు. తండ్రివెనుక తండ్రియంతవాఁడు; నన్ను దండించుటకు గారవించుటకు నతనికి స్వాతంత్ర్యము గలదు. బిడ్డలారా! మీవంటి కుమారరత్నములఁ జూచి యానందించుభాగ్యమాతనికి లేదు. నాకు సోదరుఁడనియే కాదు నే విచారించుచుండుట; లోకములో నంతటి గుణవంతుఁడు లేఁడు. అంతటి దయావంతుఁడు లేఁడు. అంతటి సత్యవంతుఁడు లేఁడు. మాయన్నను దారుణమరణంబు నొందించిన దురాత్ములెవ్వరో నే నెఱుంగుదును. వారలందఱు తెప్పల మచిర కాలములో నే యనుభవింతురుగాక! ఇట్టి బాలకులం దండ్రిలేని బిడ్డలుగఁ జేసిన యాదురాత్ముల కేమి దుర్గతులున్నవోకదా! ఎంతవిచారించిన నేమిఫలము! మాయన్న నాకుఁ గానఁబడఁడుగదా! ఈ బాలకులకుం దండ్రిదొరకఁడుకదా! అయ్యో

నిగమశర్మా! పూజ్యురాలైన మాపదినెసన్నిధికి నన్ను దోడ్కొని పొమ్ము. ఒక్కనమస్కార మామెకుం జేసివచ్చెద. ఈ యవస్థతో నున్న యాదేవిని నేఁజూడఁజాలకున్నను దప్పునా? ఆమె నన్ను చూడ ననుగ్రహించునేని నే నటకు వచ్చెద'' అనవుడు నిగమశర్మ మాఱుపలుకక లేచి సత్వరముగ లోనికింబోయి యొక్కనిమేషమున మరలివచ్చి దేవిం జూడవచ్చునని చిత్రభానునకుం జెప్పెను. చిత్రభానుఁడును మెల్లగ లేచి నిగమశర్మమీఁద జేయివైచి నడువలేక నడచుచు "అయ్యో! నేనామె వదన మెట్లు చూతును? నీలోత్పలములవంటి యా విశాలనేత్రములు బాష్పపూరితములై యుండును గాఁబోలు! పరమపవిత్రచరిత యగు నీదేవి కింత దురవస్థ కలుగుటకేమికారణమో! ఇఁక పూర్వజన్మకృతమై యుండవలయు''నని విచారించుచు నరవిందాదేవి యున్నగదిఁ బ్రవేశించెను. ప్రవేశించిన తోడనే భర్తృవియోగ దుఃఖభారవినమ్రయై కళావిహీనమైన మొగముతోను, జిక్కి సగమై నగలు లేనిశరీరముతోడను, బాష్పధారాపూరితములైన కన్నులతోడను దలవంచుకొని కూర్చుండిన యాదేవి వానికిఁ గనఁబడియె. కనంబడుటయుఁ జిత్రభానుఁడు ముందుకు సాగి నడువఁజాలక యచటనే చదికిలంబడి హాతల్లీ! కాశ్మీరరాజ్యలక్ష్మీ! హా పరమపవిత్రచరిత్రా! హా లోకైకపూజ్యా! నీ కెంతదురవస్థ ప్రాప్తించె, నాకన్ను లెంతిపాపముఁ జేసికొనియె. ఓ మాలదైవమా! నీవు దయాశూన్యుఁడ వనుమాట నేఁడు స్పష్టమైనదని కొంత వగచి యొకనిమేష మూరకుండి మరల నిట్లనియె.

"తల్లీ! మాయున్ననిమిత్తము నీవెంత కుందుచుంటివో నేనును నంతయె కుందుచుంటి. నన్నుఁగూర్చి కిట్టనివాండ్రు చెప్పినపలుకులు నీవు పాటింపవలదు. నీకు ముగ్గురుకుమారులు లున్నవారనుకొనుము. అందు జ్యేష్ఠుఁడు చిత్రభానుఁడు. తక్కినవారు విక్రమసేన హర్షవర్ధ

నులు. నేను, నీతోడికోడలిందుమణియు, నీగారాబుకూఁతురు కర్పూర మంజరియు, నాకొడుకు విజయసేనుఁడు, మిమ్ముఁ గండఁ జూచిపోవలయు నని సంకల్పించుకొంటిమి. మగవాఁడ నగుటచే నే నించుక ధైర్యము బూనియుంటిగాని నీచెలియలుంగూఁతురు పట్టశక్యముగాక యున్న వారు. ఎప్పుడువచ్చి యిక్కడ వ్రాలఁగలుగుదుమా యని వారు మిక్కిలి తత్తరపడుచున్నవారు. వారి నిక్కడికి రప్పించుటయు వారు వచ్చువఱకు నేనిందుండుటయు మీకిష్టమగు నేని యట్లు చేసెద. కాదేని యీక్షణంబ పోవువాఁడ. నన్నుగురించి మీరును లోకము నెట్లనుకొన్నను నాయన్నబిడ్డలవిషయమున నాకుంగల ప్రేమదైవ మెఱుంగును. ప్రేగుసంబంధము పొమ్మన్న బోవునా ? సోదరునిమరణ వార్త వినినదిమొదలు బాలకులిద్ద ఱేమైరోయని నాపడిన పరితాప మింతింత కాదు. నన్నుఁ గూర్చి నే జెప్పుకొనుట భావ్యము గాదు. ఇప్పు డిక్కడ నాయునికిచేత మీమనోవేదన మతిశయ మగునట్లు తోచుచున్నది. ప్రస్తుతము నేను సెలవుగైకొని మరల దర్శనము చేయువాఁడ'' నని లేచి దూరమునుండియే చేతులు జోడించి యామెకు నమస్కరించి గది విడిచి యావలకుఁ బోయెను.

అరవిందాదేవి చిత్రభానుఁడు వచ్చినది మొదలు గది విడుచు వఱకు వంచినతల యెత్తక మొగమునఁ జేయిపెట్టుకొని ప్రవాహ ములై పాఱు కన్నీళ్ళు తుడుచుకొనక మఱుఁదిమాటలకుఁ బ్రత్యుత్త రము చెప్పక యొక్కమచ్చునే విలపించెను. చిత్రభానుఁ డీవలకు వచ్చి యన్న కుమారులను మరల కౌఁగిలించుకొని ముద్దుబెట్టుకొని మాధవసేన ప్రముఖులను వీడ్కొని మున్నెక్కిన యరదము నెక్కి తన గుడారమునకుఁ బోయెను.

# ముప్పది నాలుగవ ప్రకరణము

చిత్రభానుఁడు కోటవిడచి పోయినతోడనే మాధవసేనుఁడు
ప్రధానమంత్రియగు మణివర్మకు యువరాజ సందర్శనమును గూర్చి
తెలియఁ జేయుటకు వాని గృహమునకుఁ బోయెను. మణివర్మ వానిని
సత్కరించి యువరాజు రథము దిగి కోటలోఁ బ్రవేశించినది మొదలు
కోట విడుచువఱకు జరిగిన వృత్తాంత మంతయుఁ బూసగ్రుచ్చినట్లు
చెప్పుమని మాధవసేను నడిగెను. మాధవసేనుఁడు తూ, చ, తప్ప
కుండ నావృత్తాంతము సవిస్తరముగా నెఱింగించి పిదప నిట్లనియె.
ఇందు ముఖ్యముగా మన మాలోచించవలసిన యంశములు మూఁడు
నాల్గున్నవి. తన యన్న నెవరో చంపిరఁట. ఆదురాత్ములు తత్ఫల
మచిరకాలమున ననుభవింతురఁట. తన యాలుబిడ్డలు దేవిం జూడ
వత్తురఁట. వారు వచ్చువఱకుఁ దా నిక్కడ నుండునఁట. అన్నబిడ్డల
మీఁద దనకుం బ్రేమ పొమ్మన్నం బోదఁట. సోదరమరణవార్త చెవి
సోకు టాదిగా బాలకు లెట్లు బ్రదుకుదురో యని తనకు మిక్కుటం
బగు మనఃపరితాపము కలిగెనఁట. పూర్వోత్తర సందర్భములంబట్టి
యీమాట లరసిచూడ నీతని కేదో దుష్టసంకల్ప మున్నట్లు తోఁచు
చున్నది. "మిత్రమా! నీవు చూడలేదు. కాని వాని కల్లబొల్లి
దుఃఖములు, వాని దుర్వినయములు వాని తియ్యని మాటలు, విన్న
వారు వాఁడు నిర్దోషియని తలంపకపోరు. నాటక మందు వేసగాఁడు
తన పాత్రమును జక్కగాఁ బ్రయోగించుట కభినయించినట్లె యీ
కుటిలుఁడు కూడ నెంతో నటన చేసెను. దీని కిప్పుడు ప్రతిక్రియ
యేమి" యని పలుకుటయు మణివర్మ యాతని మాట లాలకించి
"దేవి యాతని మాటల కేమి ప్రత్యుత్తర మిచ్చి"న దని యడి
గెను. "వంచినతల యెత్తక దేవి కన్నీరు విడచెనే కాని మఱుఁదిం

బలుకరింప లేదు. వాని పలుకులకు బదులు చెప్పలేదు. వాని నుండుమన లేను. వెళ్ళునన లేను. ఉండగలిగి నంతనే పచ్చాట నతఁడుండి నురల వచ్చునట్లు చెప్పిపోయె" నని మాధవసేనుఁడు ప్రత్యుత్తర మిచ్చెను.

అది విని సుశివర్మ తలయెత్తి మీఁదికిం జూచి యించుక యోచించి "మిత్రుఁడా! మనగనిజఁపి మొగసాలకుఁబోయి మొరలెత్తిన దన్న మాట నేఁటికి నిజమగును. భాతృద్రోహియైన యీదురాత్ముఁడు తనయన్నమరణ మితరుల కెవ్వరికో యారోపింపఁ దలఁచుచున్నాఁ డని నేనూహించెద. ఆలుబిడ్డల నిచ్చటికిఁ బిలిపింపఁ దలంచుట నీయూర నతఁడు నివాసము చేయఁదలఁచుటయే. ఇది యాతనిభవిష్యచ్చరిత్రమున కుపోద్ఘాతము. బిడ్డలయెడ ననురాగము జూపుటయు, వారి సేమముఁగోరిన ట్లభినయించుటయు, మనపై నాతఁడు స్వకపోలకల్పితముగా రచియింపఁబూనిన నిందానాటకమునకుఁ బ్రస్తావన. ఏమన మేమయినను నాకు విచారము లేదు. కాని వీఁడు తన కుటిలోపాయములను వలఁగోఁ దగిలించి దేవిని, రాజపుత్త్రుని నేమిసేయునో యని విచారించుచున్నవాఁడ. రాజు యుక్తవయస్కుఁడు కాని బాలుఁడగుట చేతను, సందర్శనచేయునది కౌటిల్య మెఱుఁగని శుద్ధస్ఫటికమువంటి యాఁడు దగుటచేతను, బ్రతిక్రియ తగినట్లు చేయ వీలు లేదు. ఇది యిట్టిదని చెప్పుట తప్పు, చెప్పకుండుట ముప్పు. ఏమైనంగాని మిమ్ము కార్యభారము మనతలపై నున్నది. కావున మనము హితోపదేశము జేయక పోవుటతప్పు. ఈనటికే చెప్పవలసిన దంతయు మనమూఁదుగోఁ జెప్పినారము. చర్విత చర్వణ మైనను సరే నీవు పోయి దేవింగాంచి మఱఁదిని శ్రీనగరము నుండి సాఁగదోలుటకు మన కలుమతి నిమ్మని వేఁడుము. చిత్రభానుఁడు ప్రకటశత్రుఁడై చేయఁదలచిన ఘాతలు సంపూర్ణముగఁ బాలు ద్రాగింపఁ జాలము.

కాని వేఁడుకొని విసము ద్రావింపవచ్చు ననుసామెత సార్థక మగు ననుము. తన యాజ్ఞ యగునేని కార్యము మించకుండ వానిని సాగఁ దోలఁగల మనుము. దూర మాలోచింపు మనుము. పై మెఱుంగుల చేత మోసపోవలదనుము. కుమారుల సేమము జూచుకొమ్మనుము. మిత్రులెవ్వరో శత్రులెవ్వరో చక్కఁగా నరయుటకు సమయమిదే యనుము. సత్వరంబ చను మని పలికి పీఠమునుండి తాను లేచి తత్క్షణము మాధవసేనుని రాజమందిరమునకుఁ బంపెను. అట్లు మాధవసేనునిం బంపి యెప్పటికిని మనస్థిమితము లేక మణివర్మ తన మాటలకు దేవి యే మనునో యనియుఁ గార్యసరణి కత్తియంచు మీఁది నడకవలె నుండుటచే నెటువోయిన నెటువచ్చునో యనియుఁ జింతించుచు నిట్టటు దిరుగుచు వేగముగ నడచుచున్నాఁడో లేదో యని మాధవసేనుని పోయిన దారిం జూచుచు మిక్కిలి కళవళము పడఁజొచ్చెను.

చిత్రభానుఁడు కోట విడిచి యరద మెక్కి తన నెలవునకుం జని వికసించినముఖపద్మములతో, సంతుష్టమైన హృదయముతో గుడారముఁ బ్రవేశించెను. రుద్రభట్టు వాని యాగమనము నిరీక్షించుచు నతనిం జూచినతోడనే "మిత్రుఁడా! ప్రథమప్రయత్నము మంగళముగాఁ బరిణమించెనా? విశేషము లెవ్వియును లేవుగదా! విలాసవంతమైన నీ ముఖవైఖరియే కార్యపద్ధతి వ్యాఖ్యానమయి యున్నది సుమ్మా!" యని యెదురుగావచ్చి బహూకరించెను. హితాభిలాషియైన యా బ్రాహ్మణుని పలుకులు విని చిత్రభానుఁడు "దేవా! మీ యాశీర్వచనమునఁ బ్రథమసందర్శనము శుభోత్కరముగా నున్నది. మనము తలపెట్టిన కార్య మింక నిర్విఘ్నముగ సాగునని శుభసూచనలు పొడగట్టుచున్నవి" అని పలికి తాను గుడారము విడిచి మరలఁ జొచ్చువరకు జరిగిన యావద్వృత్తాంతము వాని కెఱిఁగించెను. ఆ

వృత్తాంతము విని రుద్రభట్టు మిక్కిలి సంతసించి చిత్రభానుని బహూకరించి "మిత్రమా! మనము తఱచుగా దండపాణిం గలిసికొనుచుండవలయును. కలిగినఁ గార్యసిద్ధి వానివలననే కలుగవలయును" ననియుపదేశించిన "నిజము నిజము మీరు లెస్సగాఁ బలికినారు. అతఁడు తలంచిన నెంతపనియైన నగు" నని చిత్రభానుఁడు చెప్పి పిదప భోజనప్రయత్నము చేసెను.

మణివర్మ మితిమీఱినయుత్తలపాటుతోఁ దనమేడమీఁదఁ జిచ్చిపాఁడువోలె తిరుగు మాటిమాటికి మాధవసేనుఁడు వచ్చుచుండ నేమోయని వీధివంకఁ జూచుచుఁ గొంతసేపు గడపునప్పటికిమాధవసేనుఁడు రెండుమూఁడుసారు లిట్టటుం దిరుగుటచేతఁ గడు డస్సిన మేనుతో నుస్సు రస్సురని యాయాసపడుచు వచ్చి మేడయెక్కి మణివర్మను సమీపించెను. మణివర్మ మిక్కిలి యాత్రముతో "దేవి యేమన్నది? దేవియేమన్న"దనియడిగెను. మాధవసేనుఁడుబిక్క మొగముపెట్టి "మిత్రమా! నిరర్థకములగుసంభాషణలు చెప్పక సారాంశములఁ జెప్పెదవినుము. దేవి తోడికోడలినిఁ గర్పూరమంజరిని జూచునుబలాటము పడుచున్నది. అంతవఱకు మఱఁది యిచ్చటనే యుండువాఁడఁట! అనంతరము వానిని వెడలఁగొట్టుటకు మనకు సర్వాధికారమిచ్చునఁట, ఇదియే జరిగినకార్యనిశ్చయ"మని యెఱిఁగించెను. అప్పలుకులు విని మణివర్మ కార్యసరణి చక్కఁజేయు నాశలన్నియు నడుగంటిన వని దేవిమూర్ఖత్వమునకు వగచి మూఁడఁదలంచిన యాపదలం దలంచి భయపడి యిట్లనియె. "వినాశకాలే విపరీతబుద్ధిః" యనువాక్యము, "స్త్రీబుద్ధిః ప్రళయాంతకః" అను లోకోక్తి నేఁడు సార్థకములైనవి. మనము దైవముమీఁద భారమువైచి యూరకుండ వలసినదే.

మొదటిభాగము సమాప్తము.